
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 167
బుధవారం 6-9-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'


సమరానికి మన సైన్యమిదే
వన్డే ప్రపంచకప్‌కు భారత జట్టు ప్రకటన.. కేఎల్ రాహుల్‌కు చోటు - 14లో


హర్ట్ చేసేలా మాట్లాడలేను
ఐదేళ్ల తర్వాత తెరపై కనిపించబోతున్న అనుష్కతో ప్రత్యేక ఇంటర్వ్యూ - 14లో


కక్ష్య దూరం మరోసారి పెంపు
ఆదిత్య-ఎల్1 ఉపగ్రహానికి రెండోసారి కక్ష్య దూరం పెంపు ప్రక్రియను ఇస్రో విజయవంతంగా పూర్తి చేసింది.
వివరాలు 6లో ▸


జిల్ బైడెన్‌కు కరోనా
అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సతీమణి జిల్ బైడెన్‌కు కరోనా సోకింది. ఆమెకు స్వల్ప లక్షణాలే ఉన్నాయని వైట్‌హౌస్ తెలిపింది.
వివరాలు 6లో ▸


ఉదయనిధిపై చర్యలు తీసుకోండి
సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి వ్యాఖ్యలను నిరసిస్తూ మాజీ జడ్జీలు, ఉన్నతాధికారులు సీజేఐకి లేఖ రాశారు.
వివరాలు 6లో ▸


శశికళకు వారెంట్ జారీ
లంచమిచ్చి జైలులో విలాస సౌకర్యాలు పొందారనే ఆరోపణలపై శశికళకు 'లోకాయుక్త' నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.
వివరాలు 16లో ▸

ఫ్యాక్ట్ చెక్
అభివృద్ధి అంటే పక్క రాష్ట్రాలతో పోలికా?

- రాష్ట్రంలోనే ఇంతకు ముందు ఏమి జరిగింది, ఇప్పుడేం జరుగుతోందో తెలియదా?
- బాబు బండారం బయటపడుతుందనే పక్క రాష్ట్రంతో పోలిక
- బాబు హయాంలో అన్నదాత సుఖీభవ కింద ఎంతిచ్చారు రామోజీ?
- 46.76 లక్షల మందికి రూ.1,765.29 కోట్ల పెట్టుబడి సాయమే బాబు ఇచ్చింది
- వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో సగటున 52.57 లక్షల మందికి రూ.31,005 కోట్ల సాయం
- గోతాలు, కూలీలు, రవాణా ఖర్చుల కింద ఎకరాకు రూ.10 వేలు భరిస్తోన్న ప్రభుత్వం
- గ్రామ స్థాయిలో ఎరువుల పంపిణీ ద్వారా రైతులకు బస్తాకు రూ.20 నుంచి రూ. 30 మేర ఆదా.. దేశం గర్వించదగ్గ రీతిలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం

16 లో

బాబు బంగ్లాకే ముడుపులు..
మళ్లీ ఆ ముగ్గురే
అమరావతి కాంట్రాక్టుల తరహాలోనే 'స్కిల్' స్కామ్.. సూత్రధారి చంద్రబాబే

- 'సీమెన్స్'కి తెలియకుండా ఆ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మాయ
- కాగితాలపై రూ.3,300 కోట్ల ప్రాజెక్టును చూపించి మోసం
- ప్రభుత్వ వాటా పేరుతో డిజైన్ టెక్ కంపెనీకి నిధుల మళ్లింపు
- నకిలీ ఇన్వాయిస్‌లతో డ్రా చేసి పార్థసానికి అందించిన యోగేశ్
- వాటిని హైదరాబాద్‌కు తరలించి బాబు పీఏస్‌కు అందించిన మనోజ్
- ఆ కొల్లగొట్టిన నిధులు చివరకు చేరింది చంద్రబాబు నివాసానికే!
- మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తా, బాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌లకు సిట్ నోటీసులు
- విచారణకు హాజరు కావాలని ఆదేశం.. 'స్కిల్' కుంభకోణం కేసు దర్యాప్తు వేగవంతం



సాక్షి, అమరావతి: తీగ లాగితే డొంకంతా కదులుతోంది! ముడుపుల చిట్టాలన్నీ చంద్రబాబు బంగ్లాకే దారి తీస్తున్నాయి!! అమరావతిలో తాత్కాలిక నిర్మాణాలు, టిడ్కో ఇళ్ల కాంట్రాక్టుల్లో ప్రజాధనాన్ని లూటీ చేసిన వ్యవహారంలో ఆదాయపన్ను (ఐటీ) శాఖ తీగ లాగితే... చంద్రబాబు కనుసన్నల్లో సాగిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణం పునాది బయటపడుతోంది. కుంభకోణాలు వేర్వేరైనా కొల్లగొట్టిన ప్రజాధనాన్ని
మిగతా 3వ పేజీలో ▶

దర్యాప్తు చేపడితే.. బాబు, చినబాబు జైలుకే!
ఐటీ నోటీసులపై ఈడీ సుమోటోగా దర్యాప్తు చెయ్యొచ్చు
న్యాయవాది, కార్పొరేట్ న్యాయ నిపుణుడు వెంకటరామిరెడ్డి
3 లో

ప్రతి ఓటరూ ఆధార్‌తో లింక్!

- దొంగ ఓట్ల నివారణకు అదే ఏకైక మార్గం
- ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లను అరికట్టవచ్చు
- సీఈవో ముఖేష్‌కుమార్ మీనాకు వైఎస్సార్‌సీపీ బృందం విజ్ఞప్తి
- జాబితాలో అవకతవకలను సీఈవో దృష్టికి తెచ్చిన పార్టీ బృందం
- సీఈవో సానుకూలంగా స్పందించారన్న మాజీ మంత్రి పేర్ని నాని
- ఓటర్ల జాబితాలో అక్రమాలు గత సర్కారు నిర్వాకాలేనని ధ్వజం
- వాటిని సరిచేస్తుంటే ఓటమి భయంతో చంద్రబాబు గగ్గోలు
- గజదొంగను సమర్థిస్తూ ఎల్లో మీడియా కథనాలు

2 లో





బంగాళాఖాతంలో అల్పపీడనం
నేడు ఛత్తీస్‌గఢ్ వైపు పయనించే అవకాశముందన్న వాతావరణ శాఖ
రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు రోజుల పాటు వర్షాలు
మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని తుపాను హెచ్చరికల కేంద్రం సూచన
- వివరాలు 2లో

తెరపైకి భారత్..!
ఇండియా పేరును మార్చేందుకు కేంద్రం యత్నం



- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో తీర్మానం ఆమోదించే అవకాశం
- 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' పేరిట ఆహ్వాన పత్రికలు
- ఈ నెల 9వ తేదీన జరిగే విందుకు జీ20 నేతలకు ఆహ్వానం
- ప్రధాని నరేంద్ర మోదీ సర్కారుపై ప్రతిపక్షాల ఆగ్రహం
- 'ఇండియా' కూటమిని చూసి మోదీ భయపడుతున్నారని ఎద్దేవా
- 'భారత్'ను తుడిచిపెట్టేయడానికి కొత్త ఖిల్జీలు, కొత్త మొఘల్ రాజులు పుట్టుకొచ్చారు.. విపక్ష నాయకులపై బీజేపీ మండిపాటు

నచ్చిన పేరుతో పిలుచుకోవచ్చు
2016లో సుప్రీంకోర్టు స్పష్టీకరణ
6 లో

దేశం పేరు మారితే ఆ వెబ్‌సైట్లకు కష్టాలు
తమ పేరులో .ఇన్ కలిపి ఉన్న వెబ్‌సైట్లకు ఎదురుకానున్న ఐడెంటిటీ సమస్యలు

విద్యపై ఖర్చు రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడి



- టీచర్లపై పని ఒత్తిడి పెరగకుండా ప్రయత్నిస్తున్నాం.. జీతాలు ఇవ్వకుండా ఏ ప్రభుత్వమూ ఉండదు
- సాంకేతిక కారణాలవల్లే ఆలస్యం
- 7–8 తేదీల్లో జమచేస్తాం.. డిసెంబర్ కల్లా వర్సిటీల్లో పోస్టుల భర్తీ: మంత్రి బొత్స సత్యనారాయణ
- విశాఖలో ఘనంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం.. 196 మందికి అవార్డుల ప్రదానం

10 లో

త్వరలో ప్రొఫెసర్ పోస్టుల భర్తీ



- చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే 16 వర్సిటీల్లో శాస్త్రీయ పద్ధతిలో పోస్టుల హేతుబద్ధీకరణ
- మొత్తం 3,480 పోస్టులు మంజూరు
- విశ్వవిద్యాలయాలు, ట్రిపుల్ ఐటీల్లో కలిపి 3,295 పోస్టుల భర్తీ
- వర్సిటీలవారీగా త్వరలో నోటిఫికేషన్
- ఒకే పోర్టల్ నుంచి వివిధ వర్సిటీలకు దరఖాస్తుకు చాన్స్
- బాబు 14 ఏళ్ల పాలనలో ఒక్క పోస్టూ భర్తీ చేయలేదు

- వివరాలు 2లో

ఇవాంజూత



భీమవరంలో మరో పుంగనూరు
డ్రోన్లతో గాలించి.. టీడీపీ రాళ్ల దాడి!


వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీపై రాళ్లు విసురుతున్న టీడీపీ కార్యకర్త


టీడీపీ మూకల దాడిలో గాయపడిన కానిస్టేబుల్ శ్రీనివాస్

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై టీడీపీ మూకల దాష్టీకం.. అడ్డుకోబోయిన పోలీసులపైనా దాడి
- తీవ్రంగా గాయపడ్డ కానిస్టేబుళ్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు
- దళితులు నివసించే ప్రాంతంలో పచ్చమూకల దారుణకాండ.. నేరుగా పర్యవేక్షించిన చింతమనేని
- ఇళ్లలో ఉన్నా వెంటాడి రాళ్లు, కర్రలతో దాడి

- వివరాలు 10లో

క్లుప్తంగా...

132 మంది వైద్యులకు ప్రమోషన్‌లు

సాక్షి, అమరావతి: డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో పనిచేసే 19 స్పెషాలిటీల్లో 132 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు అసోసియేట్ ప్రొఫెసర్‌లుగా ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. పాథాలజీ, సైకియాట్రీ విభాగాల్లో అత్యధికంగా 15 మంది చొప్పున వైద్యులకు ప్రమోషన్ లభించింది. అనస్తీషియా, జనరల్ సర్జరీల్లో 13 మంది చొప్పున, ఫార్మకాలజీలో 10 మంది, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్‌ల్లో 8 మంది చొప్పున ప్రమోషన్‌లు పొందారు. వివిధ స్పెషాలిటీల్లో మిగిలిన వైద్యులు ఉన్నారు. ప్రమోషన్‌లు పొందిన వీరందరికీ కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లిచ్చింది.

35 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 35 మంది డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారికి డీఆర్వో, ఆర్డీవో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లుగా పోస్టింగ్‌లు ఇచ్చారు. పలువురిని తదుపరి పోస్టింగ్ ఇచ్చేవరకు సాధారణ పరిపాలన విభాగానికి అటాచ్ చేశారు. ప్రధానంగా 14 జిల్లాలకు డీఆర్వోలను నియమించారు. శ్రీకాకుళం జిల్లాకు ఎం.గణపతిరావు, విజయనగరం జిల్లాకు ఎస్‌డీ అనిత, విశాఖ జిల్లాకు కె.మోహన్ కుమార్, ఏలూరు జిల్లాకు ఎం.వెంకటేశ్వర్లు, పశ్చిమ గోదావరి జిల్లాకు జింకా ఉదయ్ భాస్కర్, ఎన్టీఆర్ జిల్లాకు ఎం.శ్రీనివాస్, కృష్ణా జిల్లాకు పి.వెంకటరమణ, నెల్లూరు జిల్లాకు కె.లక్ష్మీశివజ్యోతి, అనంతపురం జిల్లాకు ఎస్.రాజశేఖర్, తిరుపతి జిల్లాకు పెంచల కిశోర్, చిత్తూరు జిల్లాకు టి.పద్మావతి, అనకాపల్లి జిల్లాకు బి.దయానిధి, కర్నూలు జిల్లాకు కె.మధుసూదనరావు, బాపట్ల జిల్లాకు ఏవీఎస్ఎన్ మూర్తి డీఆర్వోలుగా నియమితులయ్యారు. ఎస్.శ్రీనివాసమూర్తిని సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా నియమించారు.

10వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ పొడిగింపు



ఏలూరులో నీలిశెట్టి కుమారికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కుమారి

సాక్షి, అమరావతి: ఈ నెల అవ్వాతాతలకు ఇచ్చే పింఛన్ల పంపిణీ 10వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. సాధారణంగా ప్రతి నెలా 5వతేదీ వరకు మాత్రమే ఈ పంపిణీ కొనసాగుతుంది. ఈ నెల (సెప్టెంబర్ 1 నుంచి) పంపిణీ గాను ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 64,04,458 మంది లబ్ధిదారులకు రూ. 1,764.83 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. 1వ తేదీ తెల్లవారుజాము నుంచే మొదలు పెట్టి మంగళవారం కూడ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల పింఛన్ల పంపిణీ కొనసాగించారు. 5 రోజులుగా 63,14,608 మందికి రూ.1,739.87 కోట్లు పంపిణీ చేశారు. మొత్తం లబ్ధిదారుల్లో 98.60 శాతం మందికి పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

జాతీయస్థాయిలో ఉత్తమ బ్యాంక్‌గా కేడీసీసీబీ



పద్మావతిని సత్కరిస్తున్న బ్యాంక్ సిబ్బంది

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (కేడీసీసీబీ) జాతీయ స్థాయిలో ఉత్తమ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌గా ఎంపికైంది. రాష్ట్ర సహకార బ్యాంక్‌ల జాతీయ సమాఖ్య 2020–21వ ఆర్థిక సంవత్సరానికి గాను కేడీసీసీబీని ఉత్త మ బ్యాంక్‌గా ఎంపిక చేసిన సందర్భంగా మంగళవారం విజయవాడ బందర్ రోడ్డు లో ని బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతిని సిబ్బంది సత్కరించారు. పద్మావతి మాట్లా డుతూ.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రూ.43 కోట్ల లాభాన్ని ఆర్జించి రూ. 10,152 కోట్ల టర్నోవర్‌తో దేశంలోని అతి పెద్ద బ్యాంకుల్లో ఒకటిగా నిలిచిందని చె ప్పారు.

హైదరాబాద్‌లో కుండపోత

సాక్షి, హైదరాబాద్: కుండపోతగా కురిసిన వర్షం హైదరాబాద్‌లో మంగళవారం బీభత్సం సృష్టించింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. ఇళ్లు, అపార్ట్‌మెంట్లలోకి వరద నీరు చేరింది. రోడ్లు చెరువులను తలపించాయి. పలుచోట్ల కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వరద ఉధృతిలో కొట్టుకు పోయాయి. ప్రధాన రహదారులపై మోకాలి లోతు నీళ్లు చేరాయి. హైదరాబాద్ శివార్లలోని గుండ్లపోచంపల్లి మైసమ్మగూడ లో ప్రైవేటు హాస్టళ్లను నిర్వహిస్తున్న 15 అపార్ట్‌మెంట్లు జల దిగ్బంధమయ్యాయి. విద్యార్థులంతా హాస్టళ్లలో చిక్కుకుపోవడంతో భయాందోళన వ్యక్తమైంది. అధికారులు ప్రొక్లెయినర్ల సాయంతో హాస్టళ్లలోని విద్యార్థులను బయటికి తరలించారు.

త్వరలో ప్రొఫెసర్ పోస్టుల భర్తీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉన్నత విద్యను అత్యున్నతంగా తీర్చిదిద్ది, విద్యార్థులను అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశ్వవిద్యాలయాల్లో బోధన ప్రమాణాల పెంపుతో పాటు పలు సంస్కరణలు తెచ్చారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో శాశ్వత పోస్టుల భర్తీకి కూడా సంకల్పించారు. ఇందుకోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలకు అనుగుణంగా వర్సిటీల్లోని ప్రతి డిపార్ట్‌మెంట్‌లో ఒక ప్రొఫెసర్, రెండు అసోసియేట్, నాలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఉండేలా ఏకీకృత హేతుబద్ధీకరణ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ప్రకారం 16 వర్సిటీల్లో 3,480 పోస్టులను మంజూరు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 474 ప్రొఫెసర్, 859 అసోసియేట్ ప్రొఫెసర్, 2,147 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయి. రాష్ట్రంలోని వర్సిటీలు, ట్రిపుల్ ఐటీల్లో 3,295 పోస్టుల భర్తీకి ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వర్సిటీల్లో 2,635 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులతో పాటు ట్రిపుల్ ఐటీల్లో 660 ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ల పోస్టుల భర్తీని ఒకే రిక్రూట్‌మెంట్‌లో చేపట్టనుంది. ఏపీపీఎస్సీ ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి స్క్రీనింగ్ టెస్టు నిర్వహించనుంది. ఇందులో ఉత్తీర్ణులైన అభ్యర్థులతోపాటు ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ అభ్యర్థులకు కూడా వర్సిటీలు ఇంటర్వ్యూలు చేసి, ఎంపిక చేస్తాయి. త్వరలోనే ప్రత్యేక పోర్టల్‌లో వర్సిటీల వారీగా నోటిఫికేషన్లు జారీ కానున్నాయి. అభ్యర్థులు వాటిని చూసుకొని నచ్చిన వాటికి పోర్టల్ ద్వారానే దరఖాస్తు చేసుకోవచ్చు. తద్వారా సమయం ఆదాతో పాటు దరఖాస్తు రుసుము తగ్గుతుంది. వర్సిటీల్లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వారికి ఏడాదికి ఒక మార్కు చొప్పున గరిష్టంగా 10 మార్కుల వెయిటేజీని ప్రభుత్వం కల్పిస్తోంది.

ఒక్క పోస్టు కూడా భర్తీ చేయని చంద్రబాబు

చంద్రబాబు పాలనలో ఏనాడూ వర్సిటీలను పట్టించుకోలేదు. ఒక్క పోస్టునూ భర్తీ చేయకపోగా వర్సిటీల్లో కుల రాజకీయాలను ప్రోత్సహించి భ్రష్టుపట్టించారు. గత ఎన్నికలకు ముందు హడావుడిగా పోస్టుల హేతుబద్ధీకరణకు కమిటీని నియమించారు. యూజీసీ నిబంధనలను గాలికొదిలేసి, అనుయాయులకు మేలు చేసేలా అశాస్త్రీయ పద్ధతిలో హేతుబద్ధీకరణ చేశారు. వర్సిటీలను సంప్రదించకుండా, వాటి అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా పోస్టులను ఇష్టం వచ్చినట్టు మార్చేశారు. కొన్ని చోట్ల అవసరానికి మించి ఎక్కువ పోస్టులు చూపించారు. కొందరికి లబ్ధి చేకూర్చేందుకు పోస్టుల స్థాయి తగ్గించేశారు. వర్సిటీ యూనిట్‌గా కాకుండా సబ్జెక్టులవారీగా పోస్టులను హేతుబద్ధీకరించడంతో చాలా మంది నష్టపోయారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పూర్తిగా విస్మరించారు. ఈ అవకతవకలతో నష్టపోయిన వారు కోర్టుల్లో కేసులు వేశారు.

పనిభారం, కేడర్ నిష్పత్తి ప్రకారం..

సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత వర్సిటీల పునరుజ్జీవానికి చర్యలు చేపట్టారు. కోర్టు కేసులు పరిష్కారమయ్యేందుకు కృషి చేశారు. అనంతరం వర్సిటీల్లో యుద్ధ ప్రాతిపదికన పెద్ద ఎత్తున శాశ్వత పోస్టుల భర్తీని చేపట్టారు. వర్సిటీల్లో పని భారం, కేడర్ నిష్పత్తికి అనుగుణంగా ఫ్యాకల్టీని ప్రభుత్వం హేతుబద్ధీకరించింది. ఇందుకోసం జేఎన్‌టీయూ–అనంతపురం మాజీ వీసీ ప్రొఫెసర్ కె.లాల్ కిషోర్ అధ్యక్షతన ఐదుగురితో సలహా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వర్సిటీల్లో అన్ని విభాగాల పనితీరును పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి, యూజీసీ నిబంధనల ప్రకారం ఉండాల్సిన పోస్టులపై మార్గదర్శకాలను రూపొందించింది. వర్సిటీలతో సంప్రదింపులు జరిపిన అనంతరం విభాగాలవారీగా పోస్టుల హేతుబద్ధీకరణకు సిఫారసు చేసింది.

ఈ పోస్టులు తప్పనిసరి

బోధన పోస్టులతోపాటు ప్రతి వర్సిటీలో అకడమిక్ నాన్ వెకేషన్ పోస్టులు తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. అసిస్టెంట్ డైరెక్టర్/ డిప్యూటీ డైరెక్టర్/ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ డైరెక్టర్, అసిస్టెంట్ లైబ్రేరియన్/డిప్యూటీ లైబ్రేరియన్/వర్సిటీ లైబ్రేరియన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, నాక్ గుర్తింపులో కీలక భూమిక పోషించే ఐక్యూఏసీ డైరెక్టర్, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ పోస్టులు తప్పనిసరిగా భర్తీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

హేతుబద్ధీకరణ అనంతరం విశ్వవిద్యాలయాల్లో పోస్టులు..

వర్సిటీ	ప్రొఫెసర్	అసోసియేట్ ప్రొఫెసర్	అసిస్టెంట్ ప్రొఫెసర్	మొత్తం
ఆదికవి నన్నయ (కాకినాడ ఎంఎస్ఎన్, తాడేపల్లిగూడెం క్యాంపస్‌తో కలిపి)	18	33	77	128
ఆచార్య నాగార్జున	34	65	147	246
ఆంధ్ర(ఏయూ)	111	201	414	726
బీఆర్ అంబేడ్కర్	15	27	67	109
ద్రవిడియన్	13	22	45	80
కృష్ణా (నూజివీడు పీజీ సెంటర్‌తో కలిపి)	16	29	63	108
రాయలసీమ	16	29	68	113
శ్రీకృష్ణదేవరాయ	35	65	168	268
శ్రీపద్మావతి మహిళా	26	52	109	187
శ్రీ వెంకటేశ్వర	53	100	269	422
అబ్దుల్ హక్ ఉర్దూ	12	19	36	67
విక్రమ సింహపురి (కావలి క్యాంపస్‌తో కలిపి)	23	42	82	147
యోగి వేమన (ప్రొద్దుటూరు ఇంజనీరింగ్ క్యాంపస్‌తో కలిపి)	36	61	126	223
సాంకేతిక వర్సిటీల్లో..				
జేఎన్‌టీయూ అనంతపురం	14	24	96	134
పులివెందుల క్యాంపస్	6	12	63	81
కలికిరి	6	14	61	81
జేఎన్‌టీయూ గురజాడ (విజయనగరం)	9	15	68	92
గిరిజన క్యాంపస్ కురుపం	5	10	56	71
జేఎన్‌టీయూ కాకినాడ	19	26	74	119
నరసరావుపేట క్యాంపస్	7	13	58	78

రాష్ట్రంలో కొత్తగా ఐదు మెడికల్ కళాశాలలు

- అతి త్వరలో ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా ప్రారంభం
- మంత్రి విడదల రజిని వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఐదు వైద్య కళాశాలలను సీఎం వైఎస్ జగన్ అతి త్వరలో ప్రారంభిస్తారని ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అధికారులను ఆదేశించారు. మంగళగిరిలోని వైద్య శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఉన్నతాధికారులతో మంత్రి రజిని సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. వైద్య కళాశాలలతో పాటు, పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్, విజయవాడలో డయాగ్నస్టిక్ సెంటర్, కడపలో మెంటల్ కేర్ హాస్పటల్, కర్నూలులో స్టేట్ క్యాన్సర్ సెంటర్ ఇలా అన్ని ఆస్పత్రులను అతి త్వరలో ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. వైద్య రంగం బలోపేతానికి ఏకంగా రూ.16వేల కోట్లకుపైగా నిధులను తమ ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రారంభం సీఎం జగన్ సంకల్పానికి ఫలితమేనని చెప్పారు. కొత్త వైద్య కళాశాలల్లో విద్యార్థులకు ఏ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతి చోట విద్యార్థుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి, డీఎంఈ డాక్టర్ నరసింహం, వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ బాబ్జీ, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం



సాక్షి, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని ఒడిశా, ఉత్తర కోస్తాంధ్ర తీరాల వద్ద మంగళవారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టానికి 7.6 కి.మీ. ఎత్తులో విస్తరించి నైరుతి వైపునకు వంగి ఉంది. ఈ అల్పపీడనం బుధవారం దక్షిణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ దిశలో పయనించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మంగళవారం తెలిపింది. మరోవైపు ఉపరితల ద్రోణి అల్పపీడన ప్రాంతం నుంచి ఆగ్నేయ ఉత్తరప్రదేశ్ వరకు కొనసాగుతోంది. వీటన్నిటి ప్రభావంతో రానున్న రెండు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. బుధవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలకు ఆస్కారం ఉందని ఐఎండీ తెలిపింది. మంగళవారం అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, అనకాపల్లి, పల్నాడు, కాకినాడ, ఎన్టీఆర్, నంద్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. కాగా.. అల్పపీడనం, ఉపరితల ద్రోణి, ఆవర్తనాల ప్రభావంతో గంటకు 40–45 కి.మీ., గరిష్టంగా 55 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులెవరూ రానున్న మూడు రోజులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించింది.

రిజిస్ట్రేషన్ల సులభతరానికే కార్డు-2.0

- కొత్త సాఫ్ట్‌వేర్‌లో దస్తావేజుల తయారీ నుంచి అపాయింట్‌మెంట్ బుకింగ్ వరకు వెసులుబాటు
- గంటల తరబడి కార్యాలయాల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండదు
- ఈ–సైన్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్‌పై బ్యాంకుల అభ్యంతరాలు అపోహ మాత్రమే
- విష ప్రచారాన్ని ప్రజలెవ్వరూ విశ్వసించొద్దు
- డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఎలాంటి నష్టం జరగదు
- మీడియాతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రామకృష్ణ



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న రామకృష్ణ

దొండపర్తి (విశాఖ దక్షిణ) : ప్రజలకు సులభతర, సురక్షిత రిజిస్ట్రేషన్ సేవలు అందించాలన్న లక్ష్యంతోనే కార్డు–2.0 సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రామకృష్ణ తెలిపారు. నూతన దస్తావేజుల రిజిస్ట్రేషన్ విధానం కార్డు–2.0పై ఉన్న అపోహలను తొలగించేందుకు మంగళవారం ఆంధ్ర యూనివర్సిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. నూతన విధానం, సాఫ్ట్‌వేర్ పనితీరు, దాని ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 1999లో అప్పటి అవసరాలకు తగినట్లుగా రూపొందించిన రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌ను ఇప్పటికీ వినియోగిస్తున్నామని చెప్పారు. అయితే, రిజిస్ట్రేషన్ల విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులు, ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకుని వాటన్నింటికీ చెక్‌పెట్టి, మెరుగైన, సులభతరమైన రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు సరికొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెండువేల గ్రామాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, త్వరలోనే మరో రెండువేల గ్రామాల్లో సేవలు ప్రారంభించేందుకు ఏర్పాట్లుచేస్తున్నామని చెప్పారు. ఈ కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా సులువుగా దస్తావేజుల తయారీ నుంచి రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వేచి ఉండే పరిస్థితి లేకుండా ముందుగానే అపాయింట్‌మెంట్ స్లాట్ బుక్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ప్రధానంగా చిన్న చిన్న కారణాలతో దస్తావేజులను సబ్‌రిజిస్ట్రార్ తిరస్కరించే అవకాశం ఉండదని ఐజీ వివరించారు.

ప్రయోగాత్మకంగా 23 చోట్ల..

ఈ కార్డు–2.0ను ప్రయోగాత్మకంగా 23 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలుచేస్తున్నట్లు చెప్పారు. ఇందులో నిషేధిత భూములు, స్టాంప్ డ్యూటీ విలువ, మార్కెట్ విలువ, డాక్యుమెంట్ జనరేషన్, సులువుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఆటో మ్యుటేషన్ ఇలా అన్ని సేవలను ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. ఇప్పటికే ఆయా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నూతన విధానం ద్వారా అందిస్తున్న సేవలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని.. ఎటువంటి ఫిర్యాదులు, ఇబ్బందులు తలెత్తలేదని ఐజీ రామకృష్ణ చెప్పారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించి సాఫ్ట్‌వేర్‌ను అందుకు అనుగుణంగా మార్పులు చేస్తామన్నారు.

విష ప్రచారాన్ని నమ్మొద్దు

ఇక కార్డు–2.0పై కొంతమంది మిలిటెంట్ తరహాలో విషప్రచారం చేస్తున్నారని వాటిని ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్, ఈ–సైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను తనఖా సంస్థలు, బ్యాంకులు అంగీకరించవన్నది తప్పుడు ప్రచారమని కొట్టిపారేశారు. అలాగే, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్–2000 వచ్చిన తరువాత ఈ–సైన్ ద్వారా ప్రజలు దస్తావేజుల మీద సంతకాలు చేయవచ్చని తెలిపారు. ఈ నూతన విధానం ద్వారా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల డబుల్ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట పడుతుందన్నారు. అదే విధంగా డాక్యుమెంట్ రైటర్ల ఉపాధి దూరమవుతుందనడంలో నిజంలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి ఓటరూ ఆధార్‌తో లింక్!

దొంగ ఓట్ల నివారణకు అదే ఏకైక మార్గం



రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి వినతిపత్రమిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతి ఓటరునూ ఆధార్‌తో అనుసంధానం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) ముఖేష్‌కుమార్ మీనాకు మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) విజ్ఞప్తి చేశారు. దీనివల్ల దొంగ ఓట్లను పూర్తిగా నివారించడంతోపాటు ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లు ఉండకుండా అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. మంగళవారం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో సీఈవో ముఖేష్‌కుమార్ మీనాను మాజీ మంత్రులు పేర్ని నాని, వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, కైలే అనిల్‌కుమార్, పార్టీ నేత దేవినేని అవినాశ్‌తో కూడిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం కలిసింది. ఓటర్ల జాబితాలో అవకతవకలపై ఫిర్యాదు చేసిన అనంతరం మాజీ మంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. చాలా చోట్ల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని, ఒకే ఫోటో లేదా ఒకే పేరు, ఒకే ఓటర్ ఐడీతో చాలా ఓట్లు ఉన్న విషయాన్ని సీఈవో దృష్టికి తెచ్చామన్నారు. ఒక మనిషికి ఒకే ఓటు ఉండాలని వైఎస్సార్‌సీపీ కోరుకుంటోందన్నారు. ప్రతి ఓటరునూ ఆధార్‌తో అనుసంధానం చేయాలన్న తమ విజ్ఞప్తిపై సీఈవో సానుకూలంగా స్పందించారని తెలిపారు.

అక్రమాలు టీడీపీ సర్కార్ నిర్వాకాలే..

ఓటర్ల జాబితాలను ప్రభుత్వం మార్చేస్తోందంటూ గత 15 రోజులుగా ఈనాడు, ఆంధ్రజ్యోతితోపాటు టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. 2017, 2018, 2019 ఓటర్ల జాబితాలు ఎలా ఉన్నాయి? ఇప్పుడు 2023లో ఓటర్ల జాబితా ఎలా ఉందనే విషయాన్ని సీఈవోకి ఉదాహరణలతో సహా తెలియచేశాం. పేరులో చిన్న మార్పు, అడ్రస్‌లో చిన్న మార్పుతో ఒకే మనిషికి రెండు, మూడు ఓట్లు ఉన్నాయి. అలా 59,18,631 ఓట్లు ఉన్నట్లు 2019 ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఇవాళ 2023 జాబితాను చూస్తే పేరు, చిరునామాలో చిన్న మార్పులు, ఫోటోల మార్పుతో.. ఒకే మనిషికి రెండు మూడు చోట్ల దాదాపు 40 లక్షల ఓట్లు ఉండగా.. తెలంగాణ, ఏపీలో రెండు చోట్లా ఓట్లున్న వారు దాదాపు 16.59 లక్షల మంది ఉన్నారు.

- 9,242 ఇళ్లలో 20 నుంచి 30 ఓట్ల వరకు ఉండగా 2,643 ఇళ్లలో 31 నుంచి 40 ఓట్ల వరకు ఉన్నాయి. 1,223 ఇళ్లలో 41–50 ఓట్లున్నాయి. ఇంకా 1,614 ఇళ్లలో 51–100 వరకు ఓట్లున్నాయి. 386 ఇళ్లలో 101–200 ఓట్లున్నాయి. 96 ఇళ్లలో 201 నుంచి ఏకంగా 500 వరకు ఓట్లున్నాయి. 14 ఇళ్లలో 501 నుంచి 1,000 ఓట్ల దాకా ఉన్నాయి. ఇవన్నీ 2019 ఓటర్ల జాబితాలో కూడా ఉన్నాయి. ఇక ఏ డోర్ నెంబరూ లేకుండా ఎక్కడెక్కడ ఎన్ని ఓట్లున్నాయో కూడా సీఈవోకు వివరించాం. 2019లో కూడా ఆ ఓట్లపై చర్యలు తీసుకోవాలని మేం కోరినా అప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వీటన్నింటిపై సమగ్ర దర్యాప్తు జరిపి ఓటర్ల జాబితాను సవరించాలని సీఈవోను కోరాం.

నాడు కళ్లు మూసుకున్నావా రామోజీ?

- ఒకే డోర్ నెంబరుతో 500 ఓట్లున్నాయని ఈనాడు

డూప్లికేట్లనే తొలగించామని సీఈవోనే చెప్పారు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దొంగ ఓట్లను గుర్తించి 2020లో 1,85,193 ఓట్లను తొలగించింది. 2021లో 1,11,076 ఓట్లు, 2022లో 11.23 లక్షల ఓట్లు వెరసి మొత్తం 14 లక్షలకు పైగా దొంగ ఓట్లను తొలగించారు. డూప్లికేట్ ఓట్లు, ఒకే ఫోటో ఉన్న ఓట్లకు సంబంధించి 10,52,326 ఓట్లను తొలగించినట్లు సీఈవోనే స్వయంగా మీడియాకు చెప్పారు. ఒకవేళ మేం దొంగ ఓట్లను చేర్పిస్తే ఇలా తొలగిస్తామా?

రామోజీరావు మమ్మల్ని నిందిస్తున్నారు. 2019 ఓటర్ల జాబితా ప్రకారం విజయవాడ సూర్యారావుపేట పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తే కడియాల వారి వీధి పేరుతో ఉన్న డోర్ నెంబర్‌లో 2019లో కూడా 500 ఓట్లు ఉన్నాయి. మరి ఆ ఆషాఢభూతి ఇప్పుడు కొత్తగా ఓట్లు చేర్చారని మాపై ఆరోపణలు చేస్తున్నారు. పాపాలు చేసింది వారైతే నిందలు మోపేది మాపైనా?

- రేపల్లెలో ఎడాపెడా దొంగ ఓట్లున్నాయని ఒక పేపర్‌లో రాశారు. నిజానికి అది 2019 నాటి ఓటర్ల జాబితా. అప్పుడే అవకతవకలు చేశారు. ఒకే డోర్ నెంబర్‌లో 148 ఓట్లు న్నాయి. జర్నలిస్టుల ముసుగులో కుల పత్రికలు తప్పుడు వార్తలు రాస్తున్నాయి. ఆ అవకతవకలన్నీ 2019 ఓటర్ల జాబితాలో ఉన్నాయి. మరి ఆనాడు ఎందుకు వార్తలు రాయలేదు?
- పార్వతీపురం నియోజకవర్గంలో సున్నా నెంబర్ ఇంట్లోనూ వందల సంఖ్యలో ఓటర్లు ఉన్నారు. మరి ఆనాడు మీకు ఇవేవీ కనిపించలేదా? ధృతరాష్ట్రుడిలా రామోజీకి కళ్లు కనిపించలేదా?
- 2019లోనే ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయి. అప్పుడే మేం వాటిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. వాటిని ఇప్పుడు మేం సవరిస్తుంటే దొంగ ఓట్లు చేరుస్తున్నామంటూ నిందిస్తున్నారు.

జాబితాలో పెరిగిందెక్కడ?

రాష్ట్రంలో 2019 జనవరి నాటికి 3,98,34,776 మంది ఓటర్లు ఉండగా 2023 జనవరి నాటికి 3,97,96,678 మంది ఓటర్లున్నారు. మరి అలాంటప్పుడు మేం కొత్తగా ఓటర్లను ఎక్కడ చేర్పించినట్లు? మేం నిజంగా ఆ పని చేసి ఉంటే ఓటర్ల సంఖ్య పెరగాలి కదా? గజదొంగ చంద్రబాబు దొంగతనాలు చేసి నీతికథలు చెబుతున్నాడు. ఓటమి భయంతో మాపై ఆరోపణలు చేస్తున్నాడు. ప్రజలను కాకుండా కుట్ర రాజకీయాలను నమ్ముకున్న చంద్రబాబును సమర్థిస్తూ ఈనాడు, ఆంధ్రజ్యోతి తప్పుడు వార్తలు రాస్తున్నాయి.

ఆ నీచ రాజకీయం బాబుదే..

రాష్ట్రంలో 2019 ఓటర్ల జాబితాలే ఇవాల్టికి కూడా కొనసాగుతున్నాయి. ఆ లోపాలను సవరించమని మేం కోరుతున్నాం. దొంగ ఓట్లను చేర్చడం.. అవతల పార్టీ ఓట్లను తొలగించడం చంద్రబాబుకే అలవాటు. తప్పుడు మార్గాల్లో గెలవాలని ప్రయత్నించడం ఆయనకు ఆనవాయితీ.

- తెలంగాణకు చెందిన బీజేపీ నేత బండి సంజయ్ కూడా మమ్మల్ని విమర్శిస్తున్నాడు. చంద్రబాబు కోసం ఆయన పని చేస్తున్నారు. ఎందుకీ దిక్కుమాలిన రాజకీయాలు?
- నాడు టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే అంటే 2015 జనవరి నాటికి 22,76,714 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. మరో ఏడాదిలో అంటే 2016లో 13,00,613 మంది ఓటర్లను తొలగించారు. 2017లో మరో 14,46,238 మందిని తొలగించారు. అలా మూడేళ్లలో టీడీపీ హయాంలో మొత్తం 50,23,565 మంది ఓటర్లను జాబితాల నుంచి తొలగించారు.
- సేవామిత్ర అనే యాప్ ద్వారా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను గుర్తించి వారందరినీ ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. దానిపై మేం పోరాడాల్సి వచ్చింది. కోర్టులు, కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించి ఆ ఓట్లను తిరిగి చేర్పించే ప్రయత్నం చేశాం.

క్లుప్తంగా...

చంద్రబాబు, లోకేశ్‌లు ఇద్దరూ దొంగలే: కొండా



సాక్షి, అమరావతి: చంద్రబాబు, లోకేశ్‌లు ఇద్దరూ దొంగలేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజధాని అమరావతిలో కేవలం రెండు చిన్న పనుల్లోనే రూ.118 కోట్లను చంద్రబాబు ముడుపులుగా దండుకున్నారని.. ఈ దందాలో లోకేశ్ సూత్రధారిగా వ్యవహరించారని తెలిపారు. ఈ వ్యవహారంలో ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులపై అటు చంద్రబాబుగానీ ఇటు లోకేశ్‌గానీ నోరుమెదపడం లేదని మండిపడ్డారు. గతంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎవరూ ఏమీ అనకున్నా తన భార్యను అవమానించారంటూ మీడియా ముందు గుక్కపెట్టి ఏడ్చినట్టే ఇప్పుడు కూడా తనకు ఐటీ నోటీసులు వచ్చాయంటూ మీడియా ముందుకొచ్చి ఏడ్చే దమ్ముందా? అని చంద్రబాబును ప్రశ్నించారు. నీ తండ్రి ఎలాంటి అవినీతికి పాల్పడలేదంటూ ఐటీ శాఖపై పరువునష్టం దావా వేసే దమ్ముందా? అంటూ లోకేశ్‌ను ప్రశ్నించారు.

చంద్రబాబుకు ఐటీ నోటీసుపై స్పందించను

- పురందేశ్వరి



సాక్షి, అమరావతి: చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసుల జారీపై స్పందించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నిరాకరించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఐటీ శాఖ నోటీసు ఇవ్వడం అన్నది ఓ సాధారణ అంశం (జనరల్ ఇష్యూ) అని, అటువంటి వాటిపై స్పందించనన్నారు. విద్యుత్ కోతలకు సంబంధించే మాట్లాడతానని చెప్పారు. రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ వినియోగం మేరకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ సమయంలో సమీక్షలు నిర్వహించాల్సిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ పర్యటనలకు వెళ్లడం బాధాకరమని చెప్పారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పురందేశ్వరి పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు.

అవినీతి అనకొండ చంద్రబాబు

నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు

సాక్షి, అమరావతి: 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకొనే చంద్రబాబు అతి పెద్ద అవినీతి అనకొండ అని, సీబీఐ లోతైన విచారణ జరిపి చంద్రబాబు చేసిన అవినీతిని నిగ్గుతేల్చాలని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అమరావతి రాజధాని పేరుతో రూ.లక్షల కోట్లకు పైగా అవినీతి జరిగిందని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.370 కోట్ల దోపిడీ జరిగిందని పేర్కొన్నారు. అనేక మార్గాల్లో షెల్ కంపెనీల ద్వారా లక్షల కోట్లు కొట్టేసిన చంద్రబాబు విషయంలో జనసేన అధ్యక్షుడు పవన్ ఎందుకు నోరుమెదపడంలేదని ప్రశ్నించారు. అవినీతి డబ్బును దత్తపుత్రుడు పవన్‌కు, పచ్చ మీడియాకు వెదజల్లుతున్నాడని వరప్రసాదరావు ఆరోపించారు.

బీసీ బిల్లు, మహిళా బిల్లు ప్రవేశపెట్టాలి: ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీ బిల్లు, మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవం సందర్భంగా దేశంలో జరిగిన అభివృద్ధి గురించి పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు కేంద్రమంత్రులు ప్రకటించారన్నారు. అయితే 76 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత ఈ దేశంలోని 56 శాతం జనాభా గల బీసీ కులాల బతుకులు ఎలా బాగుపడ్డాయో, బాగుపడటానికి ఎలాంటి చర్యలు తీసుకున్న అంశాలపై కూడా పార్లమెంట్‌లో చర్చ జరగాలని కృష్ణయ్య కోరారు. ఈ మేరకు ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీ బిల్లు, మహిళా బిల్లులో మహిళలకు సబ్ కోటా కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 21న చలో ఢిల్లీకి పిలుపునిచ్చారు.

తెలంగాణ

తేలియా రుమాల్.. ఇక దునియా కా మాల్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు ప్రత్యేకమైన ''తేలియా రుమాల్''ఇకప్రపంచ ఖ్యాతి సంపాదించనుంది. అరుదైన ఈ హస్తకళా విశేషం జీ–20 శిఖరాగ్ర సమావేశాల్లో భాగం కానుండటమే దీనికి కారణం. 8 నుంచి 10 వరకూ ఢిల్లీ సమీపంలోని గురుగ్రామ్‌లో జీ–20 శిఖరాగ్ర సమావేశాలు జరగనున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా భారతీయ హస్తకళల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో తెలంగాణ హస్తకళా ఉత్పత్తి అయిన తేలియా రుమాల్ కూడా ఉండటం విశేషం. డబుల్ ఇక్కత్ డిజైన్ కలిగిన ఈ రుమాల్ ఎరుపు, నలుపు, తెలుపు రంగుల్లో లభిస్తుంది.

దర్యాప్తు చేపడితే.. బాబు, చినబాబు జైలుకే!

ఐటీ నోటీసులపై ఈడీ సుమోటోగా దర్యాప్తు చెయ్యొచ్చు

ఎన్నికల కమిషన్, విజిలెన్స్ కమిషన్ కూడా విచారణ జరపవచ్చు

పీఎంఎల్ఏ, ఫెమా, ఆర్‌బీఐ, కంపెనీ చట్టాల కింద కేసు నమోదుకు అవకాశం

- ప్రజాప్రాతినిధ్య చట్టం కింద కూడా దర్యాప్తునకు చాన్స్
- 2019 తర్వాత వచ్చినవే ఆ రూ.118.98 కోట్లు అయితే..
- 2014 నుంచి ఎన్ని వేల కోట్లు కొల్లగొట్టారో?
- ఇదంతా తెలియాలంటే.. నిష్పాక్షిక దర్యాప్తు అవసరం

'సాక్షి'తో న్యాయవాది, కార్పొరేట్ న్యాయ నిపుణుడు వెంకటరామిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ఆదాయపు పన్ను శాఖ ఇచ్చిన నోటీసులపై దర్యాప్తు సంస్థలు విచారణకు స్వీకరించి నేరం రుజువైతే బాబుతో పాటు ఆయన తనయుడు చిన్నబాబు కూడా జైలుకు వెళ్లాల్సి వస్తుందని ప్రముఖ న్యాయవాది, కార్పొరేట్ న్యాయ నిపుణుడు వెంకటరామిరెడ్డి తెలిపారు. ఐటీ నోటీసులపై ఈడీ సుమోటోగా దర్యాప్తు చేపట్టవచ్చన్నారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం, ఫెమా, ఆర్‌బీఐ, కంపెనీ చట్టం, ప్రజాప్రాతినిధ్య చట్టం మేరకు ఎన్నికల కమిషన్, విజిలెన్స్ కమిషన్ లాంటి దర్యాప్తు సంస్థలు కూడా కేసు నమోదు చేయొచ్చని వెల్లడించారు. పూర్తి ఆధారాలు, సాక్ష్యాలను ఐటీ శాఖ నోటీసుల్లో పేర్కొందని.. ఇవి నిజమేనని తేలితే చంద్రబాబు, లోకేశ్ జైలుకు వెళ్లాల్సి వస్తుందన్నారు. పేదల ఇళ్ల నిర్మాణం పేరిట రూ.వేల కోట్ల విలువైన కాంట్రాక్టులను అప్పగించి భారీ మొత్తంలో దోపిడీకి చంద్రబాబు వేసిన స్కెచ్‌ను, అందులోని అవినీతిని ఆదాయపు పన్ను శాఖ బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. డొల్ల కంపెనీల ద్వారా రూ.వందల కోట్లు స్వాహా చేసినట్లు, బాబుకు ఎవరి ద్వారా, ఏ కంపెనీ ద్వారా ఎంతెంత అందింది.. తదితర వివరాలను ఆధారాలతో సహా ఐటీ శాఖ వెల్లడించింది. దీనిపై వెంకటరామిరెడ్డి 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక విషయాలు వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

తప్పించుకునే యత్నమెందుకు?

ఓ రాజకీయ పార్టీకి అధ్యక్షుడిగా, మాజీ సీఎంగా చంద్రబాబు ఐటీ శాఖ నోటీసులకు బాధ్యతగా వివరణ ఇవ్వాలి. నేరమేమీ చేయనప్పుడు ఐటీ శాఖ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తప్పించుకునే యత్నం ఎందుకో చెప్పాలి. వారడిగిన దానికి సమాధానం ఇవ్వకుండా.. అసలు తనకు నోటీసులిచ్చే అధికారమే లేదని బాబు పలుమార్లు లేఖ రాయడం చూస్తుంటే నేరం చేసినట్లు భావించాల్సి వస్తోంది. సెక్షన్–127 ప్రకారం నోటీసులిచ్చే అధికారం ఉందని ఐటీ అధికారులు స్పష్టంచేశారు. నేరుగానైనా కావొచ్చు.. తన అనుచరుల ద్వారానైనా కావొచ్చు.. రూ.118.98 కోట్లు బాబుకే అందాయని ఐటీ వివరాలతో సహా కుండబద్దలు కొట్టింది. 2023, ఆగస్టు 4న చంద్రబాబుకు ఐటీ అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులో అదే నెల 11న తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలన్నారు. దీనిని నేరుగా బాబు నివాసమైన ప్లాట్ నంబర్ 1310, రోడ్ నంబర్ 65, జూబ్లీహిల్స్ ఇంటికి పంపారు. ఆయన వద్ద సరైన వివరణ ఉండి ఆ రోజున హాజరై చెప్పి ఉంటే.. ఈ రోజు తలదించుకోవాల్సిన పరిస్థితి వచ్చేదికాదు. కనీసం ఎప్పుడు హాజరై వివరణ ఇస్తారో కూడా చెప్పడంలేదని ఐటీ శాఖ నోటీసుల్లో పేర్కొనడం చూస్తుంటే అందులోని అంశాలు పూర్తి వాస్తవమేనని స్పష్టమవుతోంది.

బోగస్ కంపెనీలు సృష్టించి..

మనోజ్ వాసుదేవ్ పార్థసాని, ఐదు కంపెనీల వాళ్లు ఇచ్చిన మెటీరియల్ పేపర్లు, బాబు పీఏ శ్రీనివాస్‌ను పరిచయం చేసిన ముగ్గురు ఇచ్చిన స్టేట్‌మెంట్లు ఐటీ శాఖ తన నోటీసుల్లో పేర్కొంది. ఆ ముగ్గురు భారత్, దుబాయ్, ఇతర చోట్ల నుంచి నగదు తెచ్చి ఎవరెవరికి ఇచ్చారో కూడా ఉంది. తాము కాంట్రాక్టులు తీసుకుని.. ఎన్నికల నిధుల కోసం ఖర్చుపెట్టేందుకు టీడీపీకి ఇచ్చినట్లు స్టేట్‌మెంట్‌లో వెల్లడించారు. నోటీసుల్లో కూడా నగదంతా షాపూర్‌జీ పల్లోంజీ నుంచి చంద్రబాబుకే అందినట్లు ఉంది. షలక, అన్నై (ఎక్సెల్ ఫ్రమ్ వినయ్ నంగాలియా) నుంచి రూ.33,76,18,207, ఎవరెట్ అండ్ నయోలిన్ (షీట్ ఫ్రమ్ విక్కీ మొబైల్) నుంచి రూ.50,43,00,000, పోర్ ట్రేడింగ్ నుంచి రూ.9,42,00,000, హార్డ్‌రిటన్ షీట్ (లక్‌స్టోన్ అండ్ కో) నుంచి రూ.10,23,00,000, దుబాయ్ నుంచి రూ.15,13,95,000లు చంద్రబాబుకు అందాయని.. ఇందులో రూ.118.98 కోట్లను మాత్రం ఆదాయంలో చూపలేదని కంపెనీల వారీగా వివరాలు వెల్లడించింది. షాపూర్‌జీ పల్లోంజీ నుంచి నగదును తీసుకునేందుకు ప్రైవేట్ డొల్ల కంపెనీలు, బోగస్ కాంట్రాక్టులు సృష్టించారు. బోగస్ కంపెనీలు, బోగస్ కాంట్రాక్టులు, బోగస్ నామినేషన్లు అంటూ.. 'బోగస్' అనే పదాన్ని ఐటీ శాఖ తన నోటీసుల్లో స్పష్టంగా పలుమార్లు పేర్కొంది. సెక్షన్ 132(4), 5(బీ) కింద మనోజ్ స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. ఆయన కూడా అదంతా వాస్తవమేనని సంతకం పెట్టారు. స్టేట్‌మెంట్లు ఇచ్చిన వారు చంద్రబాబు, అతని పీఎస్ పేరుతో పాటు లోకేశ్ పేరును వెల్లడించారు. విక్కీ అనే వ్యక్తి ద్వారా లావాదేవీలన్నీ జరిగినట్లు, నేరుగా చంద్రబాబు కూడా కొన్ని చెప్పినట్లు ఐటీ తన నోటీసుల్లో పేర్కొంది.

అరెస్టు చేసి.. దర్యాప్తు చేపట్టవచ్చు..

ఇప్పటికే ఐటీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీచేసినా చంద్రబాబు నుంచి సరైన సమాధానం రాలేదు. ఒకవేళ సమాధానం ఇచ్చినా సంతృప్తి చెందని పక్షంలో పెద్దఎత్తున జరిమానాలు విధించవచ్చు. 25 శాతం అదనపు పన్నుతో పాటు వడ్డీ కూడా విధించవచ్చు. నేరం జరిగినట్లు తేలితే.. రూ.118.98 కోట్లకు 300 శాతం అంటే రూ.356.94 కోట్లు వసూలుచేసే అవకాశం కూడా ఉంటుంది. అంతేకాదు.. అరెస్టుచేసే అధికారం కూడా ఉంటుంది. దుబాయ్ నుంచి కూడా నగదు అందడం.. పలు కంపెనీల నుంచి డబ్బు స్వీకరించడం.. క్విడ్ ప్రో కోతో పాటు మనీలాండరింగ్ కిందికి వస్తుంది. దీంతో ఈడీ కూడా సుమోటోగా దర్యాప్తు చేయాల్సి వస్తుంది. ఈడీనే కాదు.. పీఎంఎల్ఏ, ఫెమా, ఆర్‌బీఐ, కంపెనీ చట్టం, ప్రజాప్రాతినిధ్య చట్టం మేరకు ఎన్నికల కమిషన్, విజిలెన్స్ కమిషన్ లాంటి దర్యాప్తు సంస్థలు కూడా కేసు నమోదు చేయవచ్చు. అంతేకాక.. సీబీసీఐడీ కూడా దర్యాప్తు చేపట్టవచ్చు.

2019 తర్వాతవే ఆ రూ.118.98 కోట్లు..

ఇక 2019 తర్వాత వచ్చినవే ఆ రూ.118.98 కోట్లు అయితే.. మరి 2014 నుంచి ఎన్ని డొల్ల కంపెనీలు నెలకొల్పారు.. ఎన్ని వేల కోట్లు ప్రజాధనం కొల్లగొట్టారు.. పూర్తిస్థాయి దర్యాప్తు జరిగితే కానీ ఈ కుంభకోణం వివరాలన్నీ బహిర్గతం కావు. ఇదంతా ప్రజల డబ్బు. దీనిపై ప్రజలెవరైనా కోర్టు ద్వారా నిష్పాక్షిక దర్యాప్తు కోరవచ్చు.

ఎల్లో మీడియాకు ఏమైంది?

- మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ధ్వజం
- బాబుకు ఐటీ నోటీసులపై వార్తలేవి?
- వామపక్షాల నోరు ఎందుకు పెగలడం లేదు?
- మరిదిని రక్షించేందుకు పురందేశ్వరి యత్నాలు



సాక్షి, అమరావతి: ఆదాయపు పన్ను శాఖ జారీ చేసిన నోటీసులతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కప్పను మింగిన పాములా నోరుమెదపడం లేదని మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఎద్దేవా చేశారు. తన తండ్రి నిప్పు అని పదేపదే చెప్పుకునే లోకేష్‌కు గొంతు పెగలడం లేదన్నారు. లోకేష్‌కు సైతం ముడుపులు చేరాయనే విషయం ఐటీ శాఖ నోటీసులతో స్పష్టమైందన్నారు. 2014–19 మధ్య చంద్రబాబు పాల్పడిన అన్ని అక్రమాలపై విచారించాలని ఐటీ శాఖను కోరారు. చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్ ఇంట్లో 2020లో ఐటీ శాఖ జరిపిన సోదాల్లో రూ.రెండు వేల కోట్లకుపైగా ముడుపులు తీసుకున్నట్లు వెల్లడైందన్నారు. చంద్రబాబు, లోకేశ్‌లను అరెస్టు చేసి, విచారించాలని డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

- సీఎం జగన్ ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీతో సమావేశమైన ప్రతి సందర్భంలోనూ బల్ల కింద నక్కి విన్నట్లుగా తప్పుడు కథనాలను ప్రచారం చేసే ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, టీవీ 5 నాయుడు ఇప్పుడెందుకు స్పందించడం లేదు? చంద్రబాబుకు ఐటీ నోటీసుల జారీపై ఆ మీడియాలో వార్తలేవి? ప్రశ్నించడానికే పార్టీ పెట్టానని చెప్పుకునే దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ దీనిపై కనీసం ట్వీట్ కూడా ఎందుకు చేయడం లేదు.. చంద్రబాబు తీసుకున్న లంచాల్లో తమ వాటా బయట పడుతుందని వీరు భయపడుతున్నారా?
- చంద్రబాబుకు ఐటీ నోటీసులపై వామపక్షాల నోరు ఎందుకు పెగలడం లేదు? సీపీఐ నారాయణ, రామకృష్ణ ఏమైపోయారు? అప్పులు చేశారని సీఎం జగన్‌ను విమర్శిస్తున్న బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షురాలు పురందేశ్వరి మరిదిని రక్షించేందుకే స్పందించడం లేదా? బంధువులే కావాలో ప్రజల పక్షాన నిలబడతారో ఆమె తేల్చుకోవాలి. వీరంతా ఎందుకు స్పందించడం లేదో ప్రజలంతా గమనిస్తున్నారు.
- అమరావతి రాజధాని అనేది ఓ బూటకం. తెర వెనుక జరిగిందంతా లంచాలు, భూదందా, కమీషన్ల దందానే అని రైతులు తెలుసుకోవాలి. వంద గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు కొట్టుకుపోయినట్లు ఎన్నో దోపిడీలు, మోసాలు చేసిన చంద్రబాబు పాపం పండింది. చంద్రబాబుకు ఒళ్లంతా అవినీతి మచ్చలే. అవి ఎంత కడిగినా పోవు.

యాంత్రీకరణకు పెద్ద పీట వేస్తే అభాండాలా?

- గ్రామ స్థాయిలో యంత్ర సేవా కేంద్రాలు
- తక్కువ అద్దెకు సన్న, చిన్నకారు రైతులకు యంత్ర పరికరాలు
- చంద్రబాబు హయాంలో అంతా అవినీతే
- నేతలు చెప్పిన చోటే, చెప్పిన రేటుకే కొనాల్సిన దుస్థితి
- జగన్ సీఎం అయ్యాక అన్ని అధికారాలూ రైతు సంఘాలకే
- అవసరమైన యంత్రాన్ని నచ్చిన కంపెనీది కొనుక్కునే వెసులుబాటు
- సబ్సిడీ కూడా రైతు సంఘాలకే చెల్లింపు
- 10,444 గ్రామ, 492 క్లస్టర్ స్థాయి యంత్ర సేవా కేంద్రాలు
- 6,362 ట్రాక్టర్లు, 492 కంబైన్డ్ హార్వెస్టర్లు వినియోగంలోకి
- 31,356 ఇతర యంత్ర పరికరాలూ అందుబాటులోకి
- 2021 జనవరి నుంచి 3.5 లక్షల మంది రైతులకు సేవలు
- 9.5 లక్షల ఎకరాల్లో యంత్రాల వినియోగం
- ఆర్బీకే స్థాయిలో కిసాన్ డ్రోన్స్ ఏర్పాటుకు సన్నాహాలు
- త్వరలో రైతులకు టార్పాలిన్స్, స్ప్రేయర్లు


అయిదో ఏడాది
ఇంతే సంగతులు..!

సాక్షి, అమరావతి : వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి, అన్నదాతకు వెన్నుదన్నుగా నిలుస్తోంది వైఎస్ జగన్ ప్రభుత్వం. ఇందులో భాగంగానే వ్యవసాయ యాంత్రీకరణకు పెద్ద పీట వేస్తోంది. గ్రామ స్థాయిలోయంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి సన్న, చిన్నకారు రైతులకు ఆధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తెస్తోంది. అయినా లేనిపోని అభాండాలు వేయడం, ప్రభుత్వంపై బురద జల్లడమే ఈనాడు పనిగా పెట్టుకుంది. యంత్ర పరికరాలపై మరో అబద్ధాల కథనాన్ని అచ్చేసింది.

చంద్రబాబు ప్రభుత్వంలో వ్యవసాయ యాంత్రీకరణ కొన్ని ప్రాంతాలకు, కొంత మంది రైతులకు మాత్రమే పరిమితమయ్యేది. అందులోనూ అనేక అవకతవకలు, అవినీతి. చంద్రబాబు ప్రభుత్వం 2014 – 2019 మధ్య కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీలు) పరిమిత సంఖ్యలో మాత్రమే ఏర్పాటు చేసింది. రుణ సహాయానికి రైతులే బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఎక్కడా పారదర్శకత లేదు. అవినీతి, ఆశ్రిత పక్షపాతంతో ఈ పథకం నడిచింది. ట్రాక్టర్లు, ఇతర యంత్రాల కొనుగోలులో రైతులకు ఏ సంబంధం ఉండేది కాదు. ఎక్కడ ఏది కొనాలో టీడీపీ ప్రభుత్వ పెద్దలో, ఆ పార్టీ నాయకులో, వారి అనుయాయులో చెప్పేవారు. రేట్లు కూడా వారే నిర్ణయించేవారు. రైతులు దీనికి కట్టుబడి ఉండాల్సిందే. సబ్సిడీని నేరుగా డీలర్లకే అందజేసేవారు. దీనివల్ల పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందని, తెలుగుదేశం పార్టీ నేతలు పెద్ద మొత్తంలో ప్రజాధనాన్ని జేబుల్లో వేసుకొన్నారని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి.

వైఎస్ జగన్ ప్రభుత్వం వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చు తగ్గించి, దిగుబడి పెంచి తద్వారా నికర ఆదాయం పెంచడానికి వ్యవసాయ యాంత్రీకరణ అవసరం అని గుర్తించింది. గ్రామ స్థాయిలోనే రైతులందరికీ యంత్ర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్రామాల్లో ఆర్బీకేలకు అనుబంధంగా ఐదారుగురు రైతులతో ఏర్పాటు చేసిన రైతు సంఘాల ద్వారా వైఎస్సార్ యంత్ర సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు 10,444 గ్రామ స్థాయి, 492 క్లస్టర్ స్థాయి యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో రూ. 1052.42 కోట్ల విలువైన యంత్ర పరికరాలను సమకూర్చింది. వీటికి సబ్సిడీ రూ. 366.25 కోట్లు ప్రభుత్వమే భరించింది. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 6,362 ట్రాక్టర్లు, 492 కంబైన్డ్ హార్వెస్టర్లు, 31,356 ఇతర యంత్ర పరికరాలను తక్కువ అద్దెకు రైతులకు అందుబాటులోకి తెచ్చింది. 2021 జనవరి నుండి ఇప్పటివరకు 26 జిల్లాల్లో 3.5 లక్షల మంది రైతులు ఈ కేంద్రాల ద్వారా యంత్ర సేవలు పొందారు. వీరు 9.5 లక్షల ఎకరాల్లో యంత్రాలను వినియోగించారు.

యంత్ర సేవ పథకం కింద రైతు సంఘాలకే పరికరాల ఎంపిక, కొనుగోలు బాధ్యతలను అప్పగించింది. అంతా పారదర్శకంగా జరుగుతోంది. గ్రామాల్లో పంటలకు కావలసిన, బాడుగకు డిమాండ్ ఉన్న పరికరాలు ఈ సంఘాలే ఎంపిక చేసుకొంటాయి. అంతే కాదు.. నచ్చిన కంపెనీల నుంచి యంత్రాలను కొనుక్కొనే స్వేచ్ఛ కూడా సంఘాలకు ఇచ్చారు. వీరికి డీసీసీబీ, జాతీయ బ్యాంకుల ద్వారా ఎలాంటి పూచీకత్తు లేకుండా 50 శాతం రుణం మంజూరు చేశారు. అవగాహన, జవాబుదారీతనం పెంచడానికి, పథకం అమలులో పారదర్శకత కోసం సబ్సిడీ మొత్తాన్ని నేరుగా సీహెచ్‌సీ రైతు సంఘాల ఖాతాలకు జమ చేశారు. దీనివల్ల రైతులు వారికి అవసరమైన యంత్రాలను నాణ్యత, మన్నికను పరిశీలించి మరీ కొనుక్కొంటున్నారు. ఈ యంత్ర సేవా కేంద్రాల సేవలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆర్బీకేల్లో కూడా ప్రదర్శిస్తున్నారు. ఇందుకోసం రైతాంగాన్ని ఆర్బీకేల ద్వారా రైతు సంఘాలకు అనుసంధానిస్తున్నారు. స్థానికంగా ప్రైవేటుగా యంత్ర పరికరాలకు వసూలు చేస్తున్న అద్దెకంటే తక్కువ ధరకే గ్రామ వ్యవసాయ సలహా మండలి ద్వారా అద్దె నిర్ణయిస్తున్నారు. రైతులు వారి గ్రామంలోనే కాకుండా, మండలంలో ఏ కేంద్రాల నుంచైనా వారికి కావల్సిన యంత్రాలను బాడుగపై పొందడానికి వైఎస్సార్ యంత్ర సేవా యాప్‌ను అభివృద్ధి చేశారు. ఈ యాప్ ద్వారా రైతులు ఆన్‌లైన్లో 15 రోజుల ముందుగానే మండలం పరిధిలోని యంత్ర సేవా కేంద్రాల నుండి వారికి కావలసిన యంత్ర పరికరాలను బుక్ చేసుకొని, సమకూర్చుకొనేలా ఏర్పాటు చేశారు. అంతే కాదు ఈ యాప్ ద్వారా రైతు సంఘాల బ్యాంకు రుణాల చెల్లింపును కూడా పర్యవేక్షిస్తున్నారు. మరొకవైపు పెట్టుబడులను తగ్గించడమే లక్ష్యంగా ఆర్బీకే స్థాయిలో వ్యవసాయ డ్రోన్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తొలి విడతగా 2000 గ్రామాల్లో యంత్ర సేవా కేంద్రాల ద్వారా 40 శాతం రాయితీతో (రూ.80 కోట్లు) డ్రోన్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం రాయితీపై స్ప్రేయర్లు, టార్పాలిన్లు కూడా అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

ఈనాడు ఆరోపణలు సత్యదూరం

ఈ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయ యాంత్రీకరణ పథకం నిలిపివేసారంటూ ఈనాడు పత్రిక సత్యదూరమైన ఆరోపణలు చేయడం సరికాదని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ ఓ ప్రకటనలో ఖండించారు. ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అన్ని ప్రాంతాల్లోని అందరు రైతులకు అందుబాటులో ఉంచిందని చెప్పారు. రైతులకు లబ్ధి చేకూరే విధంగా ప్రతిష్టాత్మకంగా, పారదర్శకంగా అమలు చేస్తోందని తెలిపారు.

బాబు బంగ్లాకే ముడుపులు.. మళ్లీ ఆ ముగ్గురే

▶ మొదటి పేజీ తరువాయి

షెల్ కంపెనీల ద్వారా తరలించడంలో పాత్రధారులు మాత్రం వారే. ఆ అక్రమార్జన అంతా చివరకు చేరింది సూత్రధారి చంద్రబాబు చెంతకే అన్నది స్పష్టమవుతోంది. టీడీపీ హయాంలో భవన నిర్మాణ ప్రాజెక్టుల కాంట్రాక్టులను కట్టబెట్టడంలో అక్రమార్జనకు సంబంధించి చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసుల ప్రకంపనలు కొనసాగుతున్నాయి. ఆ కుంభకోణంలో పాత్రధారులుగా ఉన్న మనోజ్ వాసుదేవ్ పార్థసాని, చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, యోగేశ్ గుప్తా ఏపీఎస్ఎస్‌డీసీ అవినీతి బాగోతంలోనూ కీలకంగా వ్యవహరించారని వెల్లడైంది. ఇప్పటికే ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం కేసు దర్యాప్తులో కీలక ప్రగతి సాధించిన సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజా పరిణామాలతో తక్షణం రంగంలోకి దిగింది. ముడుపుల తరలింపులో సూత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ వాసుదేవ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్‌లను విచారించాలని నిర్ణయించింది. ఈమేరకు వారికి నోటీసులిచ్చి దర్యాప్తును వేగవంతం చేసేందుకు సిద్ధమైంది.

బాబు అవినీతి 'స్కిల్'...

టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన సూత్రధారిగా ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం జరిగినట్లు 'సిట్' ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించింది. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి ఏమాత్రం తెలియకుండా ఆ కంపెనీ పేరుతో ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా మోసగించి ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్లు ఆధారాలతో సహా నిరూపించింది. రూ.3,300 కోట్ల ప్రాజెక్టును కాగితాలపై చూపించి సీమెన్స్ కంపెనీ 90 శాతం నిధులు సమకూరుస్తుందని బుకాయించి రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను కేటాయించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. సీమెన్స్ కంపెనీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే ప్రభుత్వ వాటా 10 శాతం కింద జీఎస్టీతో కలిపి మొత్తం రూ.371 కోట్లను అడ్డగోలుగా చెల్లించేశారు. అలా నిధులు చెల్లించడం నిబంధనలకు విరుద్ధమని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావుతోపాటు మరో ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులు వారించినా సీఎంగా ఉన్న చంద్రబాబు ఖాతరు చేయలేదు. ఏకపక్షంగా రూ.371 కోట్లను సీమెన్స్ భాగస్వామ కంపెనీగా ఒప్పందంలో చూపించిన డిజైన్ టెక్ కంపెనీకి విడుదల చేశారు. అందులో రూ.241 కోట్లను పలు షెల్ కంపెనీలను సృష్టించి హవాలా మార్గంలో టీడీపీ ప్రభుత్వంలో ముఖ్య నేత కొల్లగొట్టారు. ఈ కేసులో సిట్ అధికారులు 8 మందిని అరెస్టు చేశారు. హవాలా మార్గంలో నల్లధనాన్ని చలామణిలోకి తెచ్చినందున కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ కూడా రంగంలోకి దిగింది. మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని నిర్ధారించి ఈ కేసులో నలుగురిని అరెస్టు చేయడంతోపాటు డిజైన్ టెక్ కంపెనీకి చెందిన రూ.31.20 కోట్లను అటాచ్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

షెల్ కంపెనీలు.. బోగస్ ఇన్వాయిస్‌లు

టీడీపీ ప్రభుత్వంలో అమరావతిలో తాత్కాలిక నిర్మాణాల కాంట్రాక్టులను కట్టబెట్టిన కుంభకోణంలో పాత్రధారులుగా ఉన్నవారే ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలోనూ కీలక పాత్ర పోషించారని సిట్ గుర్తించింది. షాపూర్జీ– పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా, చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్.. ఈ ముగ్గురూ అమరావతి భవన నిర్మాణాల కాంట్రాక్టు అవినీతి సొమ్మును చంద్రబాబుకు చేర్చడంలో కీలకంగా వ్యవహరించారన్నది ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. రూ.8 వేల కోట్ల విలువైన నిర్మాణాల కాంట్రాక్టుల్లో భారీ అవినీతికి పాల్పడి ఆ నల్లధనాన్ని మనోజ్ వాసుదేవ్ పార్థసాని షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు చేర్చారు. అందుకోసం షెల్ కంపెనీలను సృష్టించడంలో యోగేశ్ గుప్తా కీలక పాత్ర పోషించారు. ఆయన నివాసంలో ఐటీ శాఖ అధికారులు సోదాలు కూడా నిర్వహించారు. ఆ షెల్ కంపెనీల పేరుతో మళ్లించిన నిధులను డ్రా చేసి మనోజ్ వాసుదేవ్ పార్థసాని నగదు రూపంలో చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో అందించారు.అలా బాబుకు చేరిన అక్రమార్జనలో రూ.118 కోట్లకు సంబంధించి లెక్కలు చెప్పాలని ఐటీ శాఖ నోటీసులివ్వడం జాతీయస్థాయిలో చర్చనీయాంశమైంది.

ఆ ముగ్గురికీ సిట్ నోటీసులు

ఏపీఎస్ఎస్‌డీసీ నిధులను కొల్లగొట్టడంలో పాత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్‌లకు సిట్ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేశారు. విజయవాడలో సిట్ అధికారుల ఎదుట వచ్చే సోమవారం విచారణకు హాజరు కావాలని యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసానికి నోటీసులిచ్చారు. చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ ఈనెల 14న విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు.

బాబుకు ముడుపులు చేరాయిలా..

అమరావతిలో తాత్కాలిక నిర్మాణ కాంట్రాక్టుల అవినీతి దందాలో సూత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్ ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో ప్రధాన భూమిక పోషించిన తీరు ఇదీ..

- ఏపీఎస్ఎస్‌డీసీ నిధులను కొల్లగొట్టేందుకు యోగేశ్ గుప్తా పలు షెల్ కంపెనీలను సృష్టించాడు. ముంబై, పుణే కేంద్రాలుగా సృష్టించిన షెల్ కంపెనీల పేరిట నకిలీ ఇన్వాయిస్‌లను సమర్పించారు. ఆ ఇన్వాయిస్‌ల ఆధారంగా షెల్ కంపెనీలకు ఏపీఎస్ఎస్‌డీసీ రూ.371 కోట్లను విడుదల చేసింది. దీనిపై ఆధారాలు సేకరించిన అనంతరం సిట్ అధికారులు ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం కేసులో యోగేశ్ గుప్తా ఏ–22గా కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు.
- నకిలీ ఇన్వాయిస్‌ల ఆధారంగా షెల్ కంపెనీలకు చేరిన రూ.371 కోట్లను యోగేశ్ గుప్తా డ్రా చేసి మనోజ్ పార్థసానికి అందించాడు. ఆయన అందులో రూ.241 కోట్లను ముంబై నుంచి హైదరాబాద్‌కు తరలించాడు. రూ.241 కోట్ల నగదు మొత్తాన్ని హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించాడు. ఆ రూ.241 కోట్ల నగదు మొత్తం పెండ్యాల శ్రీనివాస్ ద్వారా చివరకు హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసానికి చేరినట్లు స్పష్టమవుతోంది.

ఒక తప్పును గుర్తుపెట్టుకోవడమంటే,
అది మనను మీద బరువును మోయడం లాంటిది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 6 సెప్టెంబర్ 2023

ఆదిత్య హృదయం

రెండు వారాల్లో రెండు ప్రయోగాలు! ఒకటి చంద్రుడి పైకి... మరొకటి సూర్యుడి గురించి! భారత శాస్త్రవేత్తలు మన అంతరిక్ష ఆకాంక్షలను మరింత ఉన్నత కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఆగస్ట్ 23న చంద్రయాన్–3 ప్రయోగంతో ఇప్పటిదాకా పరిశోధనల్లో అసూర్యంపశ్యగా మిగిలిపోయిన చంద్రుడి దక్షిణ ధ్రువప్రాంతంపైకి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఉపగ్రహాన్ని పంపడం, రోబోటిక్ ల్యాండర్ విక్రమ్– రోవర్ ప్రజ్ఞాన్‌లు చంద్రునిపై సుతిమెత్తగా దిగడం, వాటిలో పరికరాలు పంపుతున్న అపూర్వడేటా దేశ కీర్తిప్రతిష్ఠల్ని పెంచాయి. ఆ విజయ పరంపర సాగుతుండగానే, భూమికి అతి సమీప నక్షత్రం సూర్యుడి అధ్యయనానికి భారత్ తొలిసారి ఉపగ్రహాన్ని పంపడం విశేషం.

చంద్రయాన్–3తో పోలిస్తే, 'ఆదిత్య– ఎల్1' ప్రయోగంలో నాటకీయత తక్కువే. కానీ, సెప్టెంబర్ 2న నక్సెసైన ఈ సౌరశోధనా ఉపగ్రహ ప్రయోగం మరో 4 నెలల్లో కీలకమైన భూమ– సౌర లాగ్రేంజ్ పాయింట్1 (ఎల్1)కు సురక్షితంగా చేరగలిగితే, ఎన్నో సౌర రహస్యాలు బయటకొస్తాయి. ఇప్పటికే చంద్రునిపై ఆక్సిజన్ జాడ సహా అనేకం కనుగొని, చంద్ర మండలం ఊహిస్తున్న దాని కన్నా ఎక్కువగానే ఆవాసయోగ్యమని మనం తేల్చాం. రేపటి శోధనలో ఆదిత్య హృదయం ఏం వెల్లడిస్తుందో ఆసక్తికరమే. దేశంలోని మరో ఆరు సంస్థల భాగస్వామ్యంతో ఇస్రో చేస్తున్న ఈ రోదసీ గవేషణతో సౌర వర్తన, అంతరిక్ష వాతావరణం, వైపరీత్యాల నుంచి మన అంతరిక్ష ఆస్తుల సంరక్షణ వగైరాలపై లోతైన అవగాహన కలగవచ్చు. అంతరిక్ష పరిశోధనలో అంతకంతకూ భారత్ ముందడుగులు వేస్తున్నదనడానికి ఇది మరో కొండగుర్తు.

అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా', అలాగే యూరోపియన్ అంతరిక్ష పరిశోధనా సంస్థ 'ఈసా'లు సూర్యుడి గురించి ఇప్పటికే 20కి పైగా శాస్త్రీయ అంతరిక్ష ప్రయోగాలు జరిపాయి. అమెరికా, యూకేల సాయంతో జపాన్ సైతం తన పరిశోధక ఉపగ్రహాన్ని 2006లో ప్రయోగించింది. అయితే, మన ఇస్రో మాత్రం 'చంద్రయాన్' లాగానే ఈ సూర్య మండల గవేషణలోనూ తనవైన ప్రత్యేక ఆవిష్కరణలు చేయాలని నడుం బిగించింది. ముఖ్యంగా సూర్య గోళానికి వెలుపల విస్తరించి ఉండే కాంతివలయమూ, సౌర వాతావరణానికి పైభాగమైన (కరోనా); సూర్యునిలో భాగమైన వెలుగులు విరజిమ్మే ప్రకాశమండలం (ఫోటోస్ఫియర్); ఆ చుట్టూ వ్యాపించే, సౌర వాతావరణానికి దిగువ ప్రాంతమైన వర్ణమండలం (క్రోమోస్ఫియర్); సౌర పవనాలు – వీటన్నిటిపైనా దృష్టి సారించాలని రంగంలోకి దిగింది. 'ఆదిత్య ఎల్1'లోని శాస్త్రీయ పరికరాల ద్వారా సౌర విద్యుదయస్కాంత క్షేత్రాలనూ, వెలువడే కణ ఉద్గారాలనూ లెక్కించాలని ప్రణాళిక వేసుకుంది. తద్వారా సూర్యుడి ప్రవర్తన గురించి కొత్త అంశాలను వెలికి తీసుకురావాలనేది ప్రధాన లక్ష్యం.

చంద్రయాన్ ద్వారా చంద్రుడు, వెంటనే ఆదిత్య–ఎల్1 ద్వారా సూర్యుడు, ఆ వెంటనే శుక్రుడు, అటు పైన మానవ సహిత వ్యోమనౌకతో అంతరిక్ష యానమైన 'గగన్‌యాన్'... ఇలా వరుసగా అనేక బృహత్ యజ్ఞాలను ఇస్రో చేపడుతోంది. బుధుడి తర్వాత మనకు అత్యంత సమీపంలో ఉన్న శుక్ర గ్రహపు మేకనాన్నీ, అక్కడి వాతావరణాన్నీ అధ్యయనం చేయడం ఒక ప్రాజెక్ట్ ఆలోచనైతే, ముగ్గురు భారత వ్యోమగాముల్ని అంతరిక్షంలోకి పంపి, మళ్ళీ వారిని సురక్షితంగా భూమి మీదకు తీసుకు రావడం మరో ప్రాజెక్ట్ లక్ష్యం. ఇప్పటి వరకు ప్రపంచంలో 3 దేశాలు (అమెరికా, రష్యా, చైనా) మాత్రమే ఇలా మనుషుల్ని అంతరిక్షంలోకి పంపాయన్నది గమనార్హం. ఈ ప్రాజెక్టులన్నిటిలో ఇస్రో ఎంచుకున్న మార్గం ఒక్కటే – వీలైనంత తక్కువ ఖర్చులో ఉన్నత సాంకేతిక నవకల్పన!

తాజా సౌరశోధననే చూస్తే- భూమి నుంచి 15 కోట్ల కి.మీ.ల దూరంలో సూర్యుడుంటాడు. మన ఆదిత్య–ఎల్1 వెళ్ళేది అందులో 15 లక్షల కి.మీ.ల దూరమే. అంటే, భూమి కన్నా ఒక్క శాతం మాత్రమే సూర్యునికి దగ్గరగా వెళుతుంది. అయితేనేం, సూర్య, భూమి రెంటి గురుత్వాకర్షణ శక్తి సమానంగా ఉండి, అందుకు తగ్గట్టు వ్యోమనౌక తిరిగేందుకు కావాల్సిన కేంద్రోన్ముఖ బలాన్ని అందించే పరివేష కక్ష్య (హేలో ఆర్బిట్)లోని కీలకమైన లాగ్రేంజ్ పాయింట్1 (ఎల్1)లో ఈ ఆదిత్య ఉపగ్రహాన్ని ప్రవేశపెడతారు. దీనివల్ల ఎక్కువగా ఇంధనం ఖర్చు కాకుండానే మన ఉపగ్రహం సౌర మండలాన్ని నిరంతరాయంగా పరిశీలించవచ్చు. భూమి నుంచి 9.9 కోట్ల కి.మీ.ల దగ్గరున్నప్పుడు కుజుడి అధ్యయనానికి గతంలో మంగళ్‌యాన్ చేసిన మన అనుభవమూ ఆదిత్యకు పనికొచ్చింది.

ఎల్1 వైపు సాగుతున్న ప్రయాణంలో ఆదిత్య ఉపగ్రహ కక్ష్యను ఇప్పటికి రెండుసార్లు విజయవంతంగా పెంచగలిగాం. సెప్టెంబర్ 10న మూడోసారి కక్ష్య పెంపు ఉండనుంది. వెరసి, ప్రయోగం నాటి నుంచి 125 రోజులకు, అంటే సుమారు నాలుగు నెలలకు పరివేష కక్ష్యలో ఎల్1 వద్ద మన ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టే ప్రక్రియ పూర్తవుతుంది. వచ్చే అయిదేళ్ళ పాటు ఈ ఉపగ్రహం సూర్యుడికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి, పంపనుంది. అంతా బాగుంటే, ఆ తర్వాత కూడా మరో పదేళ్ళ పైగానే అది పనిచేసే అవకాశం కూడా ఉందట. జ్ఞానమే సమున్నత అధికారమైన ఆధునిక సమాజంలో, దానిపై ఆధారపడ్డ ఆర్థిక వ్యవస్థలో అగ్రరాజ్యాలతో మనం దీటుగా నిలబడేందుకు అంతకు మించి ఇంకేం కావాలి! అనేక దేశాల వల్ల కాని సూర్యచంద్ర శోధనను మనం సాధించగలగడం మన శాస్త్రవేత్తల నిర్విరామ కృషికి నిదర్శనమే! 2020 నుంచి ప్రైవేటీకరణ బాట పట్టిన భారత అంతరిక్ష విధానంతో, 360 బిలియన్ డాలర్ల ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన వాటా దక్కించుకోవడానికీ ఇలాంటి శోధనలు, విజయసాధనలు మరింత అవసరమే!

ఎవరి మాటా వినని తాలిబన్లు

విశ్లేషణ



వివేక్ కాట్జూ

అఫ్గానిస్తాన్‌ను తాలిబన్లు తిరిగి ఆక్రమించి మొన్న ఆగస్టు 15 నాటికి రెండేళ్లు పూర్తయ్యాయి. 2020లో అమెరికాతో దోహాలో చేసుకున్న ఒప్పందానికి తాలిబన్లు కట్టుబడలేదు. ఉగ్రవాదుల అడ్డాగా మార్చకపోవడం, లింగ వివక్ష అంశాలతో పాటు, అఫ్గాన్ రిపబ్లిక్‌తో అధికారం పంచుకోవడంపైనా తాలిబన్లు చర్చలు జరిపారు. ఈ క్రమంలో అక్కడ కొత్త రాజ్యాంగం పురుడు పోసుకుంటుందన్న అంచనా తీరా తారుమారైంది. పాశ్చాత్య దేశాలు తమను కూలదోయలేవని తాలిబన్లకు తెలుసు. మొక్కుబడిగా కొన్ని డిమాండ్లు చేయడం, లేదంటే ఆంక్షలు విధిస్తామని హెచ్చరిస్తే అంతే చాలన్నట్టుగా అంతర్జాతీయ సమాజం ఉంది. తాలిబన్లతో సంబంధాల విషయంలో భారత్ కూడా ఆచితూచి వ్యవహరిస్తోంది.

అఫ్గానిస్తాన్‌ను తాలిబన్లు దాదాపు రెండు దశాబ్దాల తర్వాత తిరిగి ఆక్రమించి మొన్న ఆగస్టు 15 నాటికి రెండేళ్లు పూర్తయ్యాయి. అదే రోజు అప్పటి అధ్యక్షుడు అశరఫ్ గనీ దేశం వదిలి పారిపోయారు. తాలిబన్లు తమ ఆయుధ బలం మొత్తాన్ని ఉపయోగించి, అఫ్గానిస్తాన్ ఆద్యంతం అఫ్గాన్ ఎమిరేట్‌ను పునఃస్థాపించారు. అమెరికాపై ఉగ్రదాడికి ప్రతిగా ఆ దేశ మిలిటరీ దళాలు అఫ్గానిస్తాన్ మీద 2001 నవంబరులో యుద్ధం ప్రకటించడంతోనే ఈ అఫ్గాన్ ఎమిరేట్ పతనమైన సంగతి తెలిసిందే. తాలిబన్లు మళ్లీ దేశాన్ని వశం చేసుకోవడానికి ముందు, అమెరికాతో దోహాలో 2020లో చేసుకున్న ఒప్పందానికి కట్టుబడలేదు. మిలిటరీ బలగాలను వెనక్కు తీసుకున్నందుకు ప్రతిగా తాలిబన్లు అఫ్గన్ ప్రాంతాన్ని ఉగ్రవాదులకు అడ్డాగా మార్చరాదని దోహా ఒప్పందం షరతు విధించింది. దీనితో పాటు, అఫ్గాన్ రిపబ్లిక్‌తో అధికారం పంచుకోవడంపై చర్చలు జరిపేందుకూ తాలిబన్లు అంగీకరించారు. ఈ క్రమంలో అక్కడ కొత్త రాజ్యాంగం పురుడు పోసుకుంటుందని వేసుకున్న అంచనా తారుమారైంది. తాలిబన్లు అఫ్గాన్ నేషనల్ ఆర్మీపై వేగంగా పైచేయి సాధించడంతో అధికారం పంచుకోవడం అన్న మాట పక్కకెళ్లిపోయింది. ఒకవైపు ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఖురాసాన్‌తో తాలిబన్లు పోరాడుతూనే ఉన్నారు. మరోవైపు ఉగ్రవాద సంస్థ అల్-ఖైదాతో వారి అనుబంధం పెరుగుతూనే ఉంది. అల్-ఖైదా నేత అయమాన్ అల్–జవాహిరిని 2022 జూలైలో అమెరికా ఒక డ్రోన్ దాడిలో హతం చేసినప్పుడు, ఈ సంబంధం కొనసాగుతున్నట్లు అర్థమైంది.

అఫ్గానిస్తాన్‌లో అమెరికా, నాటోకు గట్టి దెబ్బ తగిలింది. తమ మిలిటరీ దళాలను వెనక్కు తీసుకునే ప్రక్రియను కూడా అవి సాఫీగా నిర్వహించలేకపోయాయి. గడచిన రెండేళ్లుగా, అమెరికా, దాని భాగస్వాములు, అంతర్జాతీయ సమాజ సభ్యదేశాలు తాలిబన్ ప్రభుత్వం మానవ హక్కులు, మరీ ముఖ్యంగా లింగ వివక్షకు సంబంధించిన అంశాల్లో అందరినీ కలుపుకొని పోవాలని డిమాండ్ చేస్తున్నాయి. తాలిబన్ ప్రభుత్వం తాను అన్ని తెగలకు ప్రాతినిధ్యం కల్పించామని చెబుతోంది. అయితే లింగ వివక్షకు సంబంధించిన విషయాల్లో మాత్రం వాళ్లు ఇప్పటికీ షరియా చట్టాల అమలుకే మొగ్గు చూపుతున్నట్లుగా కనిపిస్తుంది. కాకపోతే 1990ల నాటి క్రూరత్వం కొంత తగ్గిందని చెప్పాలి. అంతర్జాతీయ సమాజపు డిమాండ్ల విషయంలో తాలిబన్లు వెనక్కి తగ్గలేదన్నది సుస్పష్టం. ప్రస్తుత అమీర్ (పాలకుడు) అయిన హిబతుల్లాహ్ అఖుంద్‌జాదా చేతుల్లో అధికారం ఉన్నంత వరకూ ఇది అసాధ్యమని కూడా చెప్పు కోవాలి.

తాలిబన్లు ప్రధానంగా పష్తూన్లు. అదే సమయంలో ఇస్లామ్‌ను అనుసరిస్తారు. యాభై ఏళ్ల సంక్షోభం, యుద్ధాల ఫలితంగా అక్కడ సామాజిక మార్పులు చోటు చేసుకుని పష్తూన్ల సంప్రదాయ బలం తగ్గింది. ఈ నేపథ్యంలో తాలిబన్ అగ్రనేతకు అమీర్ అల్–ముమినీన్



హోదా కల్పించడంతో ఆయన మాట మీరడం ఎవరికైనా దుర్లభం. దేశ ఆగ్నేయ ప్రాంతంలో మంచి పట్టున్న అంతర్గత వ్యవహారాల తాత్కాలిక మంత్రి సిరాజుద్దీన్ హక్కానీ, తాలిబన్ల వ్యవస్థాపకుడైన ముల్లా ఒమర్ కుమారుడిగా అదనపు అనుకూలత ఉన్న రక్షణ శాఖ మధ్యంతర మంత్రి ముల్లా యాకూబ్ లాంటి యువ నేతలు మార్పునకు సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది. అయితే, లింగ అంశాల మీద ప్రపంచాన్ని ధిక్కరిస్తున్న హిబతుల్లాహ్, ఆయన వర్గమైన సంప్రదాయ ముల్లాలకు వ్యతిరేకంగా వారు నిలబడ లేకపోతున్నారు.

గత ఏడాది ఫిబ్రవరిలో రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధం మొదలైన తరువాత అంతర్జాతీయ సమాజం, అగ్రరాజ్యాల ధ్యాస మొత్తం అటువైపు మళ్లింది. యూరోపియన్ దేశాలపై, అమెరికా–చైనా మధ్య కొనసాగుతున్న పోటీ విషయంలోనూ యుద్ధం ప్రభావం చాలా ఎక్కువే. పైగా ఈ యుద్ధం వల్ల భూ దక్షిణార్ధ గోళంలో చేపట్టిన సంక్షేమ కార్యకలాపాలపై కూడా ప్రతికూల ప్రభావం పడింది. వీటన్నింటి కారణంగా అఫ్గానిస్తాన్ అంశం ఏడాదిన్నర కాలంగా కనుమరుగైంది. అప్పుడప్పుడూ మొక్కుబడిగా కొన్ని డిమాండ్లు చేయడం, ఆంక్షలు విధిస్తామని హెచ్చరిస్తే అంతే చాలన్నట్టుగా అంతర్జాతీయ సమాజం ఉంది. ఇదిలా ఉండగానే, అఫ్గానిస్తాన్ ఆర్థిక పరిస్థితి మరీ దిగజారి, శరణార్థులు ఇతర దేశాలకు వెల్లువెత్త కుండా మానవతా సాయం కొంతవరకూ కాపాడుతోంది. అయితే విదేశాలకు వెళ్లగలిగిన స్థోమత ఉన్నవారు ఇప్పటికీ వెళుతూనే ఉండటం గమనార్హం.

అఫ్గానిస్తాన్ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఇప్పుడు అంతర్జాతీయ సమాజం అనాసక్తంగా ఉంది. ఆఖరికి అక్కడినుంచి పెరిగిపోతున్న మాదకద్రవ్యాల సరఫరా విషయాన్నీ పట్టించుకోవడం లేదు. మరోవైపు, ఏ అగ్రరాజ్యమైనా అక్కడ ఏం చేయగలదు? క్షేత్రస్థాయిలో అక్కడ ఎవరూ లేరు. ఉగ్రవాదుల గుంపు కార్యకలాపాలపై టెక్నాలజీ లేదా మానవ నిఘా ద్వారా ఎంత వరకూ పరిశీలించవచ్చు? అయితే అప్పుడప్పుడూ ఇవి కూడా ప్రభావవంతంగా ఉంటాయనడానికి అల్–జవాహిరిని మట్టుబెట్టడం నిదర్శనం.

పాశ్చాత్య దేశాలు తలుచుకుంటే వాయుమార్గం ద్వారా తమను ఎప్పుడైనా దెబ్బతీయగలవనీ, అయినప్పటికీ తమ ప్రభుత్వాన్ని మాత్రం అవి కూల్చలేవనీ తాలిబన్లకు తెలుసు. ఇలా జరగాలంటే దేశంలో అసంతృప్తి పెరగాలి. కానీ అలాంటి పరిస్థితి ఏదీ కనిపించడం లేదు. ప్రజాగ్రహం లేదా విదేశాల్లో స్థిరపడ్డ ప్రతిపక్ష పార్టీల చర్యలు మచ్చుకైనా లేవు. అంతేకాకుండా అమెరికా, యూరప్, రష్యా, చైనా ప్రయోజనాలేవీ దెబ్బతినకుండా తాలిబన్లు జాగ్రత్త పడుతున్నారు.

అమెరికన్లు, యూరోపియన్ల విషయంలో తాలిబన్లు కొంత సానుకూలంగా వ్యవహరిస్తున్నా పాకిస్తాన్‌తో మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నారు. తెహరీక్–ఎ–తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ), అఫ్గాన్ తాలిబన్ల సంబంధాలు మతపరమైనవి, వ్యక్తిగతమైనవి, తెగలకు కూడా సంబంధించినవి. టీటీపీ కూడా 'అమీర్'కు విధేయులుగా ఉంటామని ఇప్పటికే ప్రకటించింది. అది ఇరు పక్షాలకూ పవిత్ర సంబంధం లాంటిది.

టీటీపీ నియంత్రణలో తాలిబన్ల సహకారం ఏమాత్రం అందకపోవడంతో పాకిస్తాన్ సైన్యం, నిఘా వర్గాలు చాలా నిస్పృహలో ఉన్నాయి. ఇది కాస్తా ఘర్షణకు దారితీస్తోంది. ఇరువైపులా బాహాటంగా వ్యతిరేకత వెల్లడవుతోంది. ఆగస్టు 14వ తేదీన కాకుల్‌లో పాకిస్తాన్ మిలిటరీ అకాడమీ ప్రారంభోత్సవం సందర్భంగా, పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ మాట్లాడుతూ, "అఫ్గాన్ సోదరులను గౌరవిస్తూనే ఈ మాట. వారిని బాగా ఆదరిస్తున్న దేశం పాక్. వారు కూడా ఈ గౌరవ మన్ననలకు తగ్గట్టుగా వ్యవహరించాల్సిన అవసరముంది. కనీసం మాకు వ్యతిరేకంగా పనిచేసే వారికి ఆశ్రయమైనా కల్పించకుండా ఉండాల్సింది" అని వ్యాఖ్యానించారు.

ఈ ఆరోపణలను తాలిబన్ అధికార ప్రతినిధి తిరస్కరించడం గమనార్హం. అయినా ఎట్టి పరిస్థితుల్లోనూ తాలిబన్లు టీటీపీని వదులుకోరు. అంతర్జాతీయ సంబంధాల్లో ఉదారత అనేది ఇచ్చిపుచ్చుకునే వ్యవహారం కాదని గ్రహించిన తొలి దేశం పాకిస్తాన్ ఏమీ కాదు.

తాలిబన్లతో సంబంధాల విషయంలో భారత్ కొంచెం ఆచితూచి వ్యవహరిస్తోంది. ఏడాది కాలంగా అఫ్గానిస్తాన్‌లో మన 'టెక్నికల్ టీమ్' ఒకటి పనిచేస్తోంది. భారత్ నుంచి మానవతా సాయం కూడా ఈ పొరుగు దేశానికి అందుతోంది. అయితే అఫ్గాన్ల పరిస్థితిని వాస్తవిక దృక్పథంతో అర్థం చేసుకుని ఆచరణ సాధ్యమైన ఆలోచనలను అమల్లో పెట్టడం మేలు. భద్రతా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుంటూనే వీసాల జారీని కొంత సులువు చేయడం అవసరం. ఈ చర్య ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా ఉన్న సంబంధాలను మరి కొంచెం దృఢతరం చేయగలదు.

వ్యాసకర్త విదేశీ వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గర్వం కలిగించేలా...



పేరు మనలో గర్వభావం కలిగించేదిగా ఉండాలని నేను నమ్ముతాను. మనం భారతీయులం. ఇండియా అనే పేరు పెట్టింది బ్రిటిష్‌వాళ్లు. మన అసలు పేరైన 'భారత్'ను అధికారికంగా వెనక్కి తెచ్చుకోవడం ఎప్పుడో చేయాల్సింది. ప్రపంచ కప్‌లో మన ఆటగాళ్లు తమ ఛాతీ మీద భారత్'ను ధరించాలని బీసీసీఐని కోరుతున్నా.

– వీరేంద్ర సెహ్వాగ్, క్రికెటర్

పచ్చి అబద్ధం



ఇండియా పేరును బ్రిటిష్‌వాళ్లు పెట్టారనడం అబద్ధం. అది 2,400 ఏళ్ల పాతది. సింధు (ఇండస్) నది మీదుగా వచ్చింది. క్రీ.పూ. 5వ శతాబ్దం నుంచి వాడుకలో ఉంది. హెరొడొటస్ (గ్రీకు చరిత్రకారుడు) హిస్టరీస్'లో తొలిసారి దీని ప్రస్తావన కనబడుతుంది.

– అద్వైద్, హిస్టారియన్

బ్రాండ్‌వ్యాల్యూ



ఇండియాను 'భారత్' అని పిలవడానికి రాజ్యాంగ అభ్యంతరం ఏమీ లేనప్పటికీ – దేశ అధికారిక రెండు పేర్లలో అదీ ఒకటి – శతాబ్దాలుగా నిర్మాణమైన అమితమైన 'ఇండియా' బ్రాండ్ వ్యాల్యూను ప్రభుత్వం పిచ్చి మూర్ఖత్వంతో అసలు లేకుండా చేయదని ఆశిస్తున్నాను.

– శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ

ఎన్నికల కోసమా?



రాజ్యాంగం ప్రకారం, ఇండియా ఇప్పటికే భారత్ అయినప్పుడు, దాన్ని మళ్లీ భారత్ అని ఎలా మార్చుతారు? వాళ్లు ఇండియా అనే పేరును లేకుండా చేయాలని చూస్తున్నారు. ఇదంతా ప్రతిపక్ష పార్టీలు తమ కూటమి పేరును 'ఇండియా' అన్నందుకేనా?

– సుమంత్ రామన్, జర్నలిస్ట్

మాటను బట్టి...



దేశం పేరు ఇంగ్లిష్, తమిళంలాంటి వాటిల్లో ఇండియాగా; హిందీ, మరాఠీ, ఇంకా ఎన్నో భాషల్లో భారత్‌గా; ఉర్దూ, కశ్మీరీలో హిందోస్తాన్‌గా వాడుకలో ఉంది. మాట్లాడే భాషను బట్టి ఈ పేర్లు మారుతాయి.

– సిద్ధార్థ్ వరదరాజన్, ఎడిటర్

చెత్తపలుకులతో ఎవర్ని మోసగిస్తారు!

అభిప్రాయం




కొమ్మినేని శ్రీనివాసరావు

టీడీపీ అధినేత చంద్రబాబును ప్రధాని మోదీ నమ్మడం లేదట. వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్‌ను మోదీ నమ్ముతున్నారట. అదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలతో కూడా జగన్ టచ్‌లో ఉండి, లోక్‌సభ ఎన్నికల తర్వాత మద్దతు ఇస్తానని అన్నారట. ఇది నిత్యం తెలుగుదేశం కోసం బట్టలూడదీసుకుని తిరిగే ఓ పత్రిక తాజా పలుకు. ఎలాగోలా ఆంధ్ర వరకైనా జనసేనతో పాటు బీజేపీనీ, టీడీపీతో కలపడానికి ఇలా దిగజారి అపోహలు సృష్టించడానికి కొత్తపలుకో, చెత్తపలుకో ఆ పత్రిక యజమాని రాశాడని అర్థమవుతూనే ఉంది. అంతేకాక జగన్ సోదరి షర్మిలకు ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించడం లేదని తెగ బాధపడ్డారు.

నిజానికి ఈ వారం అతి ముఖ్యమైన అంశం ఏమిటి? చంద్రబాబు నాయుడుకు ఆదాయపన్ను శాఖ 118 కోట్ల రూపాయల బ్లాక్ మనీకి సంబంధించి నోటీసు ఇవ్వడం. ఎవరెవరి ద్వారా ఆ డబ్బు జమ అయిందీ వంటి వివరాలు వెలుగులోకి రావడం. అంటే అదంతా ముడుపుల రూపేణా తీసుకున్న డబ్బేనన్న భావన సహజంగానే ఏర్పడుతుంది కదా? చంద్రబాబు దీనిపై స్పందించాలని వైసీపీ నేతలు డిమాండ్ చేస్తున్నా ఆయన స్పష్టత ఇవ్వడం లేదు.

జగన్ సోదరి షర్మిల తెలంగాణలో రాజకీయ పార్టీ పెట్టుకుని నడుపుతున్నారు. ఆమెతో ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్టానం టచ్‌లోకి వెళ్లింది. పార్టీ విలీనం, తదితర అంశాలపై ఆమె సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, తదితరులను కలిసి వచ్చారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన కొన్ని విషయాలకు వక్రభాష్యం చెబుతూ ఈయన 'కాంగ్రెస్‌ను కమ్మిన జగన్మాయ' అని కథ అల్లేశారు. అందులో తనకు జగన్ పైన ఉన్న విద్వేషాగ్ని అంతటినీ మరోసారి కక్కారు.

ఇంత ద్వేషంలో కూడా ఆయనకు తెలియకుండానే ఒక విషయం అంగీకరించారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ వచ్చే ఎన్నికల తర్వాత కూడా పవర్ ఫుల్ గానే ఉంటారనీ, ఒకవేళ కేంద్రంలో ఎవరికి మెజార్టీ రాని పక్షంలో జగన్ సాధించే లోక్ సభ సీట్లు కీలకం అవుతాయని చెప్పకనే చెప్పినట్లయింది. జగన్ తన కేసుల కోసమో, వివేకా హత్య కేసు విషయం గురించో ప్రధాని మోదీ తదితరులతో సన్నిహితంగా ఉంటున్నారని ఆయన చెబుతున్నారు. అదే నిజమైతే వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్ రెడ్డి తండ్రి ఎందుకు జైలులో ఉండవలసి వస్తుంది? జగన్ తనపై ఉన్న కేసులను



ఎందుకు కొట్టివేయించుకోలేకపోయారు? చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని పేరుతో సాగించిన వ్యవహారాలలో అవినీతి జరిగిందా, లేదా? సబ్ కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేశారా, లేదా? ఆదాయపన్ను శాఖ ఇచ్చిన నోటీసు వాస్తవమా, కాదా? అందులో ఉన్న విషయాలతో ఆయన ఏకీభవిస్తారా, లేదా? వీటి గురించి ఒక్క ముక్క రాయని ఈయన వైసీపీ వారి ఒత్తిడి వల్ల ఆదాయపన్ను శాఖ మళ్లీ నోటీసు ఇచ్చిందని నిస్సిగ్గుగా కథనాన్ని ఇవ్వడం సమర్థనీయమేనా? 'ఎన్టీఆర్ నాణెం' పేరుతో చేసిన రాజకీయం ఈ ఆదాయపన్ను కేసు గురించా, కాదా?

జగన్ పట్ల కాంగ్రెస్ మెతక వైఖరికి రావడం వల్ల తెలంగాణలో సెటిలర్లు కాంగ్రెస్‌కు ఓట్లు వేయకపోవచ్చని ఆ పత్రిక యజమాని ప్రచారం. ఎవరైనా తెలంగాణ రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా కాకుండా ఏపీ వ్యవహారాలపై ఆధారపడి ఎందుకు ఓట్లు వేస్తారు? రాహుల్ గాంధీని షర్మిల కలిసినప్పుడు అన్నాచెల్లెళ్ల మధ్య తగాదా పెట్టామన్న పేరు రావడం తనకు ఇష్టం లేదనీ తెలుగేతర ప్రాంతాల్లో ఆమె ప్రచార సేవలు వాడుకుంటామనీ అన్నారట. అది ఈయనకు నచ్చలేదు. అదీకాక ఆంధ్రలో తాను రాజకీయాలు చేయననీ, తను పుట్టింది, పెరిగింది, తన అత్తగారి ప్రాంతం అంతా తెలంగాణే కాబట్టి తన కార్యకలాపాలు తెలంగాణలోనేనని షర్మిల పలుమార్లు చెప్పారు. అయితే పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వంటివారికి షర్మిల తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలలో ఉండడం ఇష్టం లేదు. షర్మిలను చేర్చుకుంటే పోటీ పవర్ సెంటర్ అవుతారనో, లేక బీఆర్ఎస్ నేతలు ఎక్కడ ఆంధ్ర సెంటిమెంట్ తెస్తారోనన్న భయం ఉండి ఉండవచ్చు. రేవంత్ రెడ్డికి కూడా సన్నిహితుడైన ఈ పత్రిక యజమాని ఆయనకు ఎక్కడ నష్టం వస్తుందోనని తలచి ఇలాంటి కథలు అల్లుతున్నారు.

వైఎస్ మరణం తర్వాత జగన్ కాంగ్రెస్‌ను నానా ఇబ్బందులకు గురి చేశారని, అలాంటి వ్యక్తితో కాంగ్రెస్ ఎలా రాజీ పడుతుందని కూడా ఆ పేపర్ ఓనర్ చిత్రమైన లాజిక్ తెచ్చారు. జగన్ కాంగ్రెస్‌లో నుంచి వెళ్లేటట్లు చేసి, ఆయన సొంత పార్టీ పెట్టుకుంటే కేసులు పెట్టి వేధించిన సంగతిని పక్కనబెట్టి కాంగ్రెస్‌నే జగన్ వేధించారని రాయడం అంటే పిచ్చిరాతలకు పరాకాష్టే అని చెప్పాలి. చంద్రబాబును మోదీ నమ్మడం లేదు కనుక జగన్‌ను కూడా నమ్మకుండా చేయాలంటే ఇలా కాంగ్రెస్‌తో అంటగట్టాలన్న తాపత్రయం ఆయన అక్షరాలలో అడుగడుగునా కనిపిస్తుంది. చంద్ర బాబు తరఫున కేంద్రంలో బీజేపీ పెద్దలను మాయ చేయాలని అతడు ఇలాంటి దుష్టపలుకులు రాస్తున్నారన్న సంగతి ఎవరికి అర్థం కాదు?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

కులాన్ని నిలబెట్టడానికేనా?!

తూర్పు తీరం



కె.ఎన్. మల్లీశ్వరి

చేతితో కుట్టిన చెప్పులలోని కళాత్మకత గురించి మనం మాట్లాడేపుడు వాటి తయారీ వెనుక ఉన్న నిర్బంధం, అమానవీయ చాకిరీ కూడా గుర్తుకు రావాలి. ఊరిలోని పశు కళేబరాల కాళ్ళకి తాళ్ళు కట్టి, తలకిందులుగా వేలాడదీసి కర్రల సాయంలో ఊరి చివరకు మోసుకెళ్ళిన మనుషులు గుర్తుకు రావాలి. ఆ కళేబరం తోలు వలిచి, దానిని అనేక విడతలుగా శుద్ధి చేసి, ముక్కలు చేసి, అతుకులు వేసి నైపుణ్యంగా కుట్టిన కళాకారుని చేయి గుర్తుకు రావాలి. చాలామంది గుర్తు రావాలి, చాలా విషయాలు గుర్తు రావాలి. పంటి బిగువన మైల బట్టలు ఉతికినవారు గుర్తు రావాలి, మలాన్ని దోసిళ్లతో ఎత్తి పోసేవారు, కణకణ మండే నిప్పుల కొలిమిలో దేహాన్ని పనిముట్లుగా వంచినవారు, వేళ్ళు మెలికెలు తిరుగుతూ ఉండడమే వాటి సహజ లక్షణమా అన్నంతగా బుట్టలు, తట్టలు అల్లిన వారు, భళ్ళున పగిలే కుండల వంటి జీవితాల వారు గుర్తుకు రావాలి. పనికీ పాటకీ సరే పనికీ కులానికి ఉన్న సంబంధం గుర్తు రావాలి. చేతివృత్తులన్నీ కులవృత్తులేనన్న స్పృహ కలిగి నపుడు వాటిని ప్రభుత్వాలు ఎలా చూస్తున్నాయన్న ఆసక్తి సహజం.

గత నెల జాతీయ పండుగ సందర్భంలో మన ప్రధానమంత్రి కొన్ని పథకాలను ప్రకటించారు. వాటిలో 'విశ్వకర్మ యోజన' ఒకటి. దేశంలో 18 రకాల చేతివృత్తులను గుర్తించి రాబోయే అయిదేళ్ళ కాలంలో ముప్పై లక్షల కుటుంబాలు లబ్ధిదారులుగా, 1,300 కోట్ల రూపాయిలు ఈ పథకానికి కేటాయించారు. నైపుణ్యాన్ని పెంచుకునే కాలంలో రోజుకి అయిదు వందలు స్టయిపెండ్ ఇస్తారు. ఆధునిక పరికరాల కొనుగోలుకి పదిహేను వేలు ఇస్తారు. మిగతాది అయిదు శాతం వడ్డీకి ఇచ్చే ఋణ సదుపాయం మాత్రమే. పేద ప్రజల సంక్షేమం కోసమని చెప్పి ప్రభుత్వాలు అనేక పథకాలు ఎన్నికల ముందు ప్రకటించడం ఎప్పటి నుంచో ఉన్నదే. వీటి రూపకల్పనకి ముందు చాలా కసరత్తు జరుగుతుంది. పిల్లలు, వృద్ధులు, మహిళలు, పేదలు, నిరుద్యోగులు, వికలాంగులు – ఇలా చేయూత ఇవ్వాల్సినవారిని గుర్తించడంలో అంతో ఇంతో సమానత్వం వైపు నడిపే పురోగామి దృష్టి ఉంటుంది. మరి విశ్వకర్మ యోజన పథకంలో అటువంటి దృష్టి ఏముంది?

లబ్ధిదారులుగా చేతివృత్తులు, వ్యవసాయ అనుబంధ వృత్తులను పరిగణనలోకి తీసుకోవడం ముందడుగు అవుతుందా? యంత్రం మనుగడ



లోకి వచ్చిందంటేనే ఎక్కువ చాకిరి, తక్కువ ప్రతిఫలం వచ్చే ఫ్యూడల్ దశనుంచి కాస్త ముందుకు జరిగినట్లు. ఇటువంటి సమయంలో చెప్పులు కుట్టుకోవడానికి, కుండలు తయారు చేయడానికి, వడ్రంగి, మగ్గం, జాలరి, క్షురక, కంసాలి తదితర సాంప్రదాయక చేతివృత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పథకాలు ప్రకటించడం ఆశ్చర్యకరం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలను ప్రోత్సహించడం లక్ష్యంగా చెప్పిన ఈ ప్రకటన వెనుక కూడా రాజకీయ వ్యూహమే కనపడుతుంది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నడిపే మెజారిటీ శ్రామికులకి చేయూతనివ్వాలనీ, సంప్రదాయక నైపుణ్యాలకి అంతర్జాతీయ మార్కెట్టుని సృష్టించి పెట్టాలనీ, ఆనువంశికంగా చేతివృత్తులను నిలబెట్టుకుంటూ వచ్చే కుటుంబాలను ప్రోత్సహించాలనీ, ఇంకా గురు– శిష్య పరంపరగా చేతివృత్తులను ముందుకు తీసుకు పోవడానికి కృషి చేయనున్నట్లు పథకాన్ని ప్రకటిస్తూ చెప్పారు. ఈ లెక్కన చేతివృత్తులను పునరుద్ధరించడం ద్వారా కుల వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి కేంద్రం పూనుకుంటున్నదా?!

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇపుడు కుండలు అక్కర్లేదు, నాగలి అక్కర్లేదు, చేతితో కుట్టే చెప్పులు అక్కర్లేదు. ఇంకా చాలా అక్కర్లేదు. అక్కరలేక అంచులకి నెట్టబడినవారు కూటికోసం కోటి విద్యలు వెతుక్కోవడానికి పట్టణాలు, నగరాలు చేరుకున్నారు. పల్లెల పాత యూనిట్ అతుక్కోలేనంత చెల్లాచెదురైంది. ఇది అనివార్యమైన మార్పు. ఇంచుమించు యాభై ఏళ్లకి పైగా కులవృత్తులను వదిలి దొరికిన, మెరుగైన చదువు, ఉద్యోగాలలోకి ప్రవేశించడం కోసం, తినో తినకో కడుపుగట్టుకుని తమబిడ్డలను చదివించుకుంటున్నారు. ఇపుడొచ్చి పదీ పరకా ఆశ చూపి సమాజాన్ని మళ్ళీ వర్ణవ్యవస్థ వైపు నడిపే పథకాలు ప్రమాదకరం. కులవృత్తులను 'హస్తకళల' పేరిట గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునాదులుగా అనుసంధానించే ప్రయత్నం చేయడమంటే ఫ్యూడల్ సమాజాన్ని రారమ్మని పిలుస్తున్నట్లు. విశ్వకర్మ యోజనకి ఉద్దేశించిన లబ్ధిదారులకు ఈ కొద్ది ఆర్థిక ఊరట కలగడాన్ని వ్యతిరేకిస్తామా, అంటే ఆర్థికంగా దిగువ స్థాయిలో ఉన్న ప్రజలందరి శ్రమకి తగిన ప్రతిఫలం లభించేలా చూడడానికే ప్రభుత్వం ఉన్నది. ఈ కేటాయించిన సొమ్ము అదే వర్గాలకి విద్యా ఉద్యోగ రంగాల్లో పురోగామి అవకాశాల ద్వారా అందేట్లు చూడాలి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మతం సహకారంతో గ్రామీణ భారతంలో మళ్ళీ కుల వ్యవస్థను సడలనివ్వకుండా పటిష్టపరిచే ఇటువంటి ప్రయత్నాలు ఫాసిస్ట్ రాజ్య స్థాపనకి సేతువు కట్టడమే.

వ్యాసకర్త జాతీయ కార్యదర్శి, ప్రరవే
malleswari.kn2008@gmail.com

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.సప్తమి రా.8.07 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** కృత్తిక ప.2.44 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.11.34 నుండి 12.24 వరకు, **అమృతఘడియలు:** ప.12.20 నుండి 1.54 వరకు, స్మార్త శ్రీకృష్ణాష్టమి ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.08.

● అధికారంలో ఉండగా రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకున్న ఆర్థిక నేరగాళ్లు బాబు అండ్‌కో బృందాన్ని వెంటనే అరెస్ట్ చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం లో బహుజన పరిరక్షణ సమితి రిలే నిరాహార దీక్షలు మంగళవారం కొనసాగాయి.

'గోవింద కోటి' రాసిన వారికి శ్రీవారి బ్రేక్ దర్శనం

- రూ.600 కోట్లతో అచ్యుతం, శ్రీపథం వసతి సముదాయాలు
- సనాతన ధర్మం అనేది మతం కాదు..అదొక జీవనయానం
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

విద్యార్థులకు కోటి భగవద్గీత పుస్తకాల పంపిణీ


టీటీడీ బోర్డు సభ్యులతో చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుమల: యువతలో హైందవ సనాతన ధర్మ వ్యాప్తి కోసం శ్రీవారి ఆలయం నుంచే తొలి అడుగు వేస్తున్నామని, ఇందులో భాగంగా రామకోటి తరహాలో గోవింద కోటి రాసిన 25 ఏళ్ల లోపు వారికి వారి కుటుంబ సభ్యులతో కలిసి ఒకసారి తిరుమల స్వామివారి బ్రేక్ దర్శనం కల్పిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పారు. 10 లక్షల 1,116 సార్లు గోవింద నామం రాసిన వారికి దర్శన సౌభాగ్యం కల్పిస్తామన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం ధర్మకర్తల మండలి తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ మీడియాకు వివరించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా 20 పేజీల్లో భగవద్గీత సారాంశాన్ని పుస్తక ప్రసాదంగా కోటి పుస్తకాలు ముద్రించి పంపిణీ చేస్తామని చెప్పారు. ఇటీవల చిరుత దాడిలో మృతి చెందిన చిన్నారి లక్షిత కుటుంబానికి టీటీడీ ద్వారా గతంలో ప్రకటించిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ముంబైలోని బాంద్రాలో రూ.1.65 కోట్లతో శ్రీవారి రెండో ఆలయం, రూ.5.35 కోట్లతో సమాచార కేంద్రాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని టీటీడీ బోర్డు సభ్యులు విరాళంగా అందిస్తారన్నారు. రూ.33 కోట్లతో వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాల కోసం కేటాయించిన స్థలంలో రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని, ఈ మొత్తాన్ని ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారన్నారు. రూ.600 కోట్లతో తిరుపతి రైల్వేస్టేషన్ వెనుక వైపు ఉన్న 2,3 సత్రాల స్థానంలో అచ్యుతం, శ్రీపథం వసతి సముదాయాలను నిర్మించనున్నట్లు తెలిపారు. టీటీడీ ఆలయాల్లో 413 పోస్టులు మంజూరు కోసం ప్రభుత్వానికి విన్నవించనున్నట్లు చెప్పారు. తిరుపతిలో నిర్మాణం కానున్న శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో 300 మందిని నియమించనున్నట్లు చెప్పారు. టీటీడీ ఆధ్వర్యంలోని ధర్మగిరి, కీసరగుట్ట, విజయనగరం, ఐ.భీమవరం, కోటప్పకొండ, తెలంగాణలోని నల్గొండ వేద విజ్ఞాన పీఠాలకు సంబంధించి అదనంగా 47 అధ్యాపక పోస్టులను మంజూరు చేసినట్లు చెప్పారు.

టీటీడీ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేయాలి

శ్రీవారిని క్షణ కాలం దర్శించుకుంటే జీవితకాల ఆనందం సొంతమవుతుందని, అలాంటిది బోర్డు సభ్యులుగా అవకాశం రావడం మహద్భాగ్యమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని టీటీడీ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయాలని భూమన అన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో నూతన బోర్డు తొలి సమావేశం ప్రారంభంలో సభ్యులకు చైర్మన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ..హైందవ ధర్మవ్యాప్తికి, సనాతన సంప్రదాయాలను కాపాడడానికి, సంస్కృతిని పరిరక్షించడానికి టీటీడీ ఎంతగానో కృషి చేస్తోందన్నారు.

ఉదయనిధి మాటలను ఖండిస్తున్నాం

సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన విమర్శలను భూమన ఖండించారు. సనాతన ధర్మం మతం కాదని, అదొక జీవన యానమని చెప్పారు. ఈ విషయం తెలియక సనాతన ధర్మానికి కులాలను ఆపాదించి విమర్శలు చేస్తే సమాజంలో అలజడి చెలరేగే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది విమర్శకులకు కూడా మంచిది కాదన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న షారుక్ ఖాన్



తిరుమల: తిరుమల శ్రీవారిని బాలీవుడ్ ప్రముఖ సినీ నటుడు షారుక్ ఖాన్ మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

దివ్యాంగ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

బతికి ఉన్నంత వరకు జైల్లో పెట్టాలని విజయవాడ పోక్సో కోర్టు తీర్పు



విజయవాడ స్పోర్ట్స్: దివ్యాంగ బాలిక(13)పై లైంగి క దాడికి పాల్పడిన వ్యక్తికి మరణించే వరకు (జీ వి త ఖైదు) జైలు శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజిని మంగళవారం తీర్పు చెప్పారు. విజయవాడ సీవీఆర్ ఫ్లై ఓవర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళకు పిల్లలు లేకపోవడంతో తన అక్క కుమార్తెను దత్తత తీసుకుంది. ఆ బాలికను ఈ ఏడాది జనవరి 17వ తేదీన తా ను పని చేసే కంపెనీ వద్దకు ఆమె తీసుకువెళ్లింది. ఆమె పని చేస్తుండగా, కొద్దిసేపటి తర్వాత బాలిక కనిపించలేదు. కంపెనీ సెక్యూరిటీ సహాయంతో చు ట్టుపక్కల వెదుకుతుండగా, సమీపంలోనే ఓ షాపు వెనుక ముళ్లపొదల వద్ద ఆ బాలికపై ఒక వ్యక్తి లైంగికదాడికి పాల్పడుతుండటంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. దీంతో అఘాయిత్యానికి పాల్పడుతున్న వ్యక్తి పారిపోయాడు. బాలిక సైగల ద్వారా ఇచ్చిన సమాచారం మేరకు లైంగిక దాడికి పాల్పడి నది డ్రైవర్ రమేష్ అని గుర్తించి ఆమె కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కర్నూలు జిల్లా పాములపాడుకు చెందిన రమేష్ విజయవాడ వన్‌టౌన్ మిల్క్ ప్రాజెక్ట్ సమీపంలో నివాసం ఉంటూ బొలెరో వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నట్లు పోలీ సు విచారణలో తేలింది. దిశా ఏసీపీ వీవీ నాయు డు ఈ కేసు విచారణ అధికారిగా వ్యవహరించారు. దిశా, సీఎంఎస్ అధికారుల సమక్షంలో 25 మంది సాక్షులను న్యాయమూర్తి విచారించారు. బాధితు రాలి తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుజ్జుల నాగిరెడ్డి వాదనలు వినిపించారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు రమేష్‌కు మరణించే వరకు జైలు శిక్షతోపాటు రూ.30 వేలను జరిమానాగా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుడు చెల్లించిన జరిమా నా రూ.30వేలు, మరో రూ. 50వేలను బాధితురాలికి నష్టపరిహారంగా చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థను న్యాయ మూర్తి ఆదేశించారు. ఈ ఘటన జరిగిన ఎనిమిది నెలల్లోనే న్యాయస్థానం తీర్పు వెలువరించేలా ట్రయిల్ నిర్వహించిన పోలీసులను సీపీ టీకే రాణా అభినందించారు.

విజయవాడకు ఐజీబీసీ ప్లాటినం రేటింగ్



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ స్టేషన్‌కు ప్రతిష్టాత్మక ఐజీబీసీ (ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్) ప్లాటినం రేటింగ్ వరించింది. పర్యావరణ పరిరక్షణ, ప్రయాణికులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించినందుకు గాను విజయవాడ స్టేషన్‌కు ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఉద్యోగులను విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో అవలంభిస్తున్న పర్యావరణ అనుకూల సేవలపై 2019లో గోల్డ్ స్టాండర్డ్ రేటింగ్ సాధించినట్లు తెలిపారు. తాజాగా ప్లాటినం రేటింగ్ రావటం డివిజన్‌కే గర్వకారణం అన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో ప్లాటినం రేటింగ్ సాధించిన స్టేషన్‌గా సికింద్రాబాద్ తర్వాత స్థానం విజయవాడకు వచ్చిందని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, ఆరోగ్యం, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, శక్తి వినియోగం, నీటి సామర్థ్యం, స్మార్ట్ అండ్ గ్రీన్ పద్ధతుల అభివృద్ధి తదితర విషయాలపై ప్లాటినం రేటింగ్ వచ్చినట్లు వివరించారు.

రెండోదశ రీ సర్వే గ్రామాల్లో 2.69 లక్షల మ్యుటేషన్లు



- 4.4 లక్షల సబ్ డివిజన్లు చేసిన రెవెన్యూ, సర్వే యంత్రాంగం
- రెండు దశల్లో 4 వేల గ్రామాల్లో 4.69 లక్షల మ్యుటేషన్లు, 8.7 లక్షల సబ్ డివిజన్లు
- రెవెన్యూ చరిత్రలో ఇన్ని మ్యుటేషన్లు, సబ్ డివిజన్లు ఇప్పుడే

సాక్షి, అమరావతి: భూముల రీ సర్వే జరుగుతున్న క్రమంలో క్లిష్టతరమైన అంశాలు కూడా తేలిగ్గా పరిష్కారమవుతున్నాయి. రెవెన్యూ వ్యవస్థలో తమ భూములకు సంబంధించి మ్యుటేషన్లు, సబ్ డివిజన్లు చేయించుకోవడం ఎంత కష్టమైన వ్యవహారమో అందరికీ తెలిసిందే. వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ పనుల్ని చాలా సులభతరంగా మార్చింది. రీ సర్వేలో రైతులు అడగకుండానే అవసరమైతే మ్యుటేషన్, సబ్ డివిజన్ చేస్తున్నారు. అలా ఇప్పటివరకు రెండేళ్లలో లక్షల సంఖ్యలో మ్యుటేషన్లు, సబ్ డివిజన్లు జరిగాయి. ప్రస్తుతం రెండో దశగా రెండువేల గ్రామాల్లో రీ సర్వే జరుగుతున్న క్రమంలో 2.69 లక్షల మ్యుటేషన్లు, 4.4 లక్షల సబ్ డివిజన్లు చేశారు. తొలిదశ రీ సర్వే పూర్తయిన రెండువేల గ్రామాల్లో గతంలోనే రెండులక్షల మ్యుటేషన్లు, 4.3 లక్షల సబ్ డివిజన్లు చేశారు. మొత్తం ఈ నాలుగువేల గ్రామాల్లో ఇప్పటివరకు 4.69 లక్షల మ్యుటేషన్లు, 8.7 లక్షల సబ్ డివిజన్లు చేయడం గమనార్హం.

అదే రైతులు చేయించుకుంటే రూ.80 కోట్లు కట్టాలి

మామూలుగా అయితే పట్టా సబ్ డివిజన్, మ్యుటేషన్ కోసం రైతులు దరఖాస్తు చేసుకుని ఫీజు కట్టాలి. సబ్ డివిజన్‌కి రూ.600, మ్యుటేషన్‌కి రూ.100 చెల్లించాలి. దానికి గతంలో ఎక్కువ సమయం పట్టేది. దాంతోపాటు అనేక సమస్యలు. తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సివచ్చేది. మధ్యలో లంచావతారులు. ఇప్పుడు రీ సర్వేలో ఇవేమీ లేకుండానే ప్రభుత్వం రైతుల భూమిని కొలిచి వారికి యాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వడం, డిజిటల్ రికార్డులు రూపొందించడంతోపాటు అవసరమైతే సొంత ఖర్చులతో మ్యుటేషన్, సబ్ డివిజన్లు కూడా చేసేస్తోంది. నాలుగువేల గ్రామాల్లో చేసిన మ్యుటేషన్లు, సబ్ డివిజన్లకు రైతులు ఫీజు చెల్లిస్తే.. రూ.80 కోట్లకుపైనే కట్టాలి. కానీ ప్రభుత్వమే ఉచితంగా చేసి రైతులకు వాటిని బహుమానంగా ఇస్తోంది. అది కూడా రికార్డు సమయంలో లక్షల మ్యుటేషన్లు, సబ్ డివిజన్లు పూర్తిచేస్తోంది. రెండేళ్లలో ఇన్ని లక్షల మ్యుటేషన్లు జరగడం సాధారణ విషయం కాదని నిపుణులు సైతం చెబుతున్నారు.

తమిళనాడు, పుదుచ్చేరి టీటీడీ ఎల్‌ఏసీ చైర్మన్‌గా శేఖర్‌రెడ్డి



తిరుమల: తమిళనాడు, పాండిచ్చేరి టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ (ఎల్‌ఏసీ) చైర్మన్‌గా ఏజే శేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఆయన చేతుల మీదుగా ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డిని చైర్మన్ భూమన అభినందించారు.

కడప సెంట్రల్ జైలుకు టీడీపీ నేత చల్లా బాబు

పుంగనూరు విధ్వంసం కేసులో 67 మందికి రిమాండ్ విధించిన కోర్టు


కడప సెంట్రల్ జైల్లోకి వెళ్తున్న చల్లా బాబు

పుంగనూరు(చిత్తూరు జిల్లా): పుంగనూరు విధ్వంసం కేసులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి (చల్లా బాబు) సహా అతని అనుచరులు 67 మందిని పోలీసులు మంగళవారం కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఆగస్ట్ 4న టీడీపీ నాయకులు, మూకలు పుంగనూరులో రాళ్ల, కట్టెలు, బాటిళ్లతో దాడి చేసి పోలీసులను తీవ్రంగా గాయపరిచారు. ఈ విధ్వంసానికి సంబంధించి పోలీసులు 7 కేసులు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు చల్లా బాబుతో పాటు దాదాపు 270 మంది నిందితులను గుర్తించిన పోలీసులు.. పలువురిని ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం చల్లా బాబు సహా 67 మంది పోలీసులకు లొంగిపోగా.. పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాత్రి వారిని పుంగనూరు కోర్టుకు తరలించారు. న్యాయమూర్తి సింధు నిందితులందరినీ రిమాండ్‌కు ఆదేశించగా.. చల్లా బాబుతో పాటు మరో ముగ్గురు అనారోగ్యంతో ఉన్నారని నిందితుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ రామకృష్ణ స్పందిస్తూ.. అనారోగ్యం అనే కుంటిసాకుతో నిందితులు తప్పించుకోవాలని చూస్తున్నారని వివరించారు. మంగళవారం ఉదయం వరకు సుదీర్ఘ వాదనలు జరిగాయి. ప్రాసిక్యూషన్ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి సింధు.. చల్లా బాబుకు ఈనెల 18 వరకు రిమాండ్ విధిస్తూ కడప సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించారు. వీరితో కలిపి మొత్తం 187 మంది నిందితులు రిమాండ్‌లో ఉన్నారు.

చురుగ్గా వక్ఫ్ బోర్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియ

- ముస్లిం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ఓట్ల జాబితా విడుదల
- అభ్యంతరాల స్వీకరణకు ఏడు రోజుల గడువు
- ఎన్నికల అధికారి ఏఎండీ ఇంతియాజ్


సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు శాసన సభ, శాసన మండలి నుంచి ఇద్దరు సభ్యులు ఎన్నిక కానున్నారు. ఇందు కోసం రాష్ట్ర శాసన సభ, శాసన మండలిలో ముస్లిం సభ్యుల ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి ఏఎండీ ఇంతియాజ్ మంగళవారం ప్రకటించారు. ఆ జాబితాలో ముస్లిం ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా షేక్(గుంటూరు తూర్పు), అంజాద్ బాషా షేక్ బెపారి(కడప), అబ్దుల్ హఫీజ్ ఖాన్(కర్నూలు), ఎం.నవాజ్ బాషా(మదనపల్లె), ఎమ్మెల్సీలు షాబ్జీ షేక్, మహ్మద్ రుహుల్లా, షేక్ మహ్మద్ ఇస్సాక్ బాషా, షేక్ మహ్మద్ ఇక్బాల్, ఎం. జఖియా ఖానం ఓటర్లుగా ఉన్నారు. వీరిలో ఇద్దరు రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు సభ్యులుగా ఎన్నిక కానున్నారు. కాగా, ఈ ఓటర్ల జాబితాను తెలుగు, ఇంగ్లిషు, ఉర్దూ భాషల్లో ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) విజయవాడ కార్యాలయం, అన్ని జిల్లాల మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ల కార్యాలయాల వద్ద ప్రదర్శించాలని సూచించారు. ఓటర్ల జాబితాపై చేర్పులు, మార్పులు, అభ్యంతరాలను ఏడు రోజుల్లోగా తెలియజేయాలని ఇంతియాజ్ పేర్కొన్నారు.

ముతవల్లీ కోటాలో ముగిసిన వక్ఫ్‌బోర్డు సభ్యుడి ఎన్నిక నామినేషన్లు:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు ముతవల్లీ కోటాలో సభ్యుని ఎన్నికకు నామినేషన్ల గడువు మంగళవారంతో ముగిసింది. రాష్ట్రంలో ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. 9వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విజయవాడ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న షా జాహూర్ ముసాఫిర్‌ఖానాలో ఎన్నికలు నిర్వహిస్తారు. అక్కడే సాయంత్రం 5 గంటలకు ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు.

సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు చేయూత

- రూ.10 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం
- 6 శాతమే వడ్డీ.. రాష్ట్రంలో 7,500 యూనిట్ల ఏర్పాటు
- ఆర్థిక సహకారానికి ముందుకొచ్చిన ఎస్‌బీఐ
- ఏపీఎఫ్‌పీఎస్‌తో అవగాహన ఒప్పందం


అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న శ్రీధర్‌రెడ్డి, హేమ, చిత్రంలో చిరంజీవి చౌదరి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆహార శుద్ధి పరిశ్రమలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి, పారిశ్రామిక అభివృద్ధి సాధించడంతోపాటు అటు రైతులను ఆర్థికంగా నిలదొక్కుకొనేలా చేయడం, ఇటు యువతకు ఉపాధి కల్పించాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పం. రాష్ట్ర ప్రగతికి తోడ్పడే ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది. 35 శాతం సబ్సిడీతోపాటు కేవలం 6 శాతం వడ్డీకే రుణాలు లభించేలా ఏర్పాట్లు చేసింది. ఈ యూనిట్లకు రుణాలిచ్చేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ముందుకొచ్చింది. ఈమేరకు మంగళవారం సచివాలయంలో ఎస్‌బీఐతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి సమక్షంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) సీఈవో ఎల్.శ్రీధర్‌రెడ్డి, ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) వి.హేమ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.

రూ. 10 లక్షల వరకు పూచీకత్తు లేకుండా రుణాలు

ఈ ప్రాజెక్టు కింద రూ.10లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా 35 శాతం సబ్సిడీపై ఎస్‌బీఐ రుణం మంజూరు చేస్తుంది. రూ.10 లక్షల నుంచి రూ.కోటి అంచనా వ్యయంతో పెట్టే యూనిట్లకు మాత్రం పూచీకత్తుతో రుణాలు మంజూరు చేస్తారు. సబ్సిడీ 35 శాతం లేదా గరిష్టంగా రూ.10 లక్షలుగా నిర్ణయించారు. తాజా ఒప్పందం ద్వారా కనీసం 7,500 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఆధునికీకరణ, స్థాపనకు చేయూతనివ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. కుల, మత, లింగ భేదాల్లేకుండా 18 ఏళ్లు పైబడిన వారెవరైనా వ్యక్తిగత యూనిట్లు పెట్టుకోవచ్చు. యూనిట్ వ్యయంలో లబ్ధిదారులు 10 శాతం వాటాగా భరిస్తే తొలుత 90 శాతం రుణంగా ఎస్‌బీఐ మంజూరు చేస్తుంది. రుణ ప్రక్రియ పూర్తి కాగానే ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం ప్రభుత్వం సబ్సిడీ జమ చేస్తుంది. 9 శాతం వడ్డీతో మంజూరు చేసే ఈ రుణాలపై అగ్రి ఇన్‌ఫ్రా ఫండ్ (ఏఐఎఫ్) కింద అదనంగా 3 శాతం వడ్డీ రాయితీ లభిస్తుంది. అంటే 6 శాతం వడ్డీకే ఈ రుణాలు లభిస్తాయి. అంతేకాదు యూనిట్ ప్రారంభ దశలో 3 నెలలపాటు మారటోరియం వ్యవధి ఉంటుంది. ఈ ప్రాజెక్టు కింద వ్యక్తిగతంగానే కాకుండా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా కూడా సూక్ష్మ ఆహార శుద్ధి ప్రాజెక్టుల విస్తరణకు చేయూతనివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఒప్పందం ద్వారా అనకాపల్లి బెల్లం, గువ్వలచెరువు పాలకోవా, మాడుగుల హల్వా వంటి సంప్రదాయ ఆహార క్లస్టర్లలోని మైక్రో ప్రాసెసింగ్ యూనిట్లను అత్యాధునిక యంత్రాలతో అప్‌గ్రేడ్ చేయవచ్చు. గతేడాది రూ.8 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటైన 500 యూనిట్లకు 55 శాతం సబ్సిడీపై ఎస్‌బీఐ ఆర్థిక చేయూతనిచ్చింది.

ఆహారశుద్ధి పరిశ్రమల విస్తరణ మరింత వేగం: చిరంజీవి చౌదరి

రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమాభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని చిరంజీవి చౌదరి చెప్పారు. ఇటీవలే సోలార్ డీ హైడ్రేషన్ యూనిట్లకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు బ్యాంక్ ఆఫ్ బరోడాతో ఒప్పందం చేసుకున్నామని, ఇప్పుడు సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు ఎస్‌బీఐతో కలిసి ముందుకెళ్తున్నామని తెలిపారు. ఇది రాష్ట్రంలో పరిశ్రమల విస్తరణకు సానుకూల ప్రభావం చూపుతుందన్నారు. సొసైటీ సీఈవో ఎల్. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం 500 యూనిట్లకు రుణాలిచ్చిన ఎస్‌బీఐ.. ఇప్పుడు పెద్ద ఎత్తున యూనిట్ల విస్తరణకు ప్రధాన రుణభాగస్వామిగా ఉద్భవించడం శుభపరిణామమన్నారు. పూచీకత్తు లేకుండా రూ.10లక్షల వరకు రుణాలిస్తామని ఎస్‌బీఐ డీజీఎం హేమ చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సహకారంతో ఏర్పాటయ్యే యూనిట్లకు మద్దతు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డిప్యూటీ సీఈవో ఈ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

భారత్ మాతాకీ జై

'ఎక్స్'లో షేర్ చేసిన అమితాబ్ బచ్చన్

ముంబై: దేశం మార్పు అంశంపై ఒకవైపు రగడ కొనసాగుతుండగా, మరోవైపు బాలీవుడ్ ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో 'భారత్ మాతాకీ జై' అని షేర్ చేయడం చర్చనీయాంశంగా మారింది. జాతీయ జెండాను పోలిన మూడు రంగుల ఎమోజీని సైతం ఆయన షేర్ చేశారు. దేశం పేరును మార్చడానికి అమితాబ్ మద్దతు ప్రకటించారని నెటిజన్లు కొందరు అభిప్రాయపడుతున్నారు.

జిల్ బైడెన్‌కు కరోనా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భార్య, దేశ ప్రథమ పౌరురాలు జిల్ బైడెన్ కోవిడ్ బారినపడ్డారు. సోమవారం ఆమెకు పరీక్షలు నిర్వహించగా, కరోనా పాజిటివ్‌గా తేలినట్లు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ చెప్పారు. జిల్ బైడెన్‌కు స్వల్ప లక్షణాలే ఉన్నాయని తెలిపారు. అధ్యక్షుడు బైడెన్‌కు మాత్రం కరోనా నెగటివ్‌గా నిర్ధారణ అయినట్లు వెల్లడించారు. జిల్ బైడెన్ ప్రస్తుతం డెలావెర్‌లోని ఇంట్లోనే గడుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో మరో రెండు రోజుల్లో ఢిల్లీలో జరుగనున్న జీ20 శిఖరాగ్ర సదస్సుకు బైడెన్ హాజరవుతారని శ్వేతసౌధం ప్రకటించింది. గురువారం బైడెన్ భారత్‌కు బయల్దేరి వెళ్తారు.

రాహుల్ సభ్యత్వ పునరుద్ధరణ నోటిఫికేషన్ రద్దు చేయండి

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ ఆగస్టు 7న జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. లక్నోకు చెందిన అడ్వొకేట్ అశోక్ పాండే మంగళవారం ఈ పిటిషన్ దాఖలు చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం -1951లోని ఆర్టికల్ 102కు చెందిన సెక్షన్ 8(3) ప్రకారం రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడం చెల్లదని పేర్కొన్నారు. కోర్టులో ఆయన అప్పీల్‌పై విచారణ పూర్తయ్యే దాకా లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించలేరని స్పష్టం చేశారు. ఇందులో లోక్‌సభ స్పీకర్, కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంతో పాటు రాహుల్ గాంధీని ప్రతివాదులుగా చేర్చారు. వయనాడ్ లోక్‌సభ స్థానం ఖాళీగా ఉన్నట్లు ప్రకటించాలని, అక్కడ మళ్లీ ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని పిటిషనర్ అశోక్ పాండే కోరారు. మోదీ ఇంటి పేరుపై వ్యాఖ్యల నేపథ్యంలో పరువు నష్టం కేసులో రాహుల్‌పై అనర్హత వేటు పడడం, లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోవడం, సుప్రీంకోర్టు ఇచ్చిన స్టేతో మళ్లీ దక్కించుకోవడం తెలిసిందే.

ఇది దేనికి సంకేతం? తెరపైకి భారత్..!

అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్న మోదీ సర్కారు అతి త్వరలో మన దేశం పేరును కూడా భారత్‌గా మార్చే ఆలోచనలో ఉందా? జీ 20 దేశాధినేతలకు తాజాగా కేంద్రం లాంఛనంగా పంపిన విందు ఆహ్వానంలో రాష్ట్రపతి హోదాను ఇంగ్లిష్‌లో ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా అని కాకుండా ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అని పేర్కొనడం ఇప్పుడు సర్వత్రా ఆసక్తి రేపుతోంది. దేశం పేరు మార్పు దిశగా కేంద్రం నుంచి త్వరలో రానున్న ప్రకటనకు ఇది కచ్చితమైన ముందస్తు సంకేతమేనని అనుమానిస్తున్నారు. – నేషనల్ డెస్క్, సాక్షి

త్వరలో సార్వత్రిక ఎన్నికలు

- మెజారిటీ ఓటర్లను ఆకట్టుకోవడం..
- విపక్ష 'ఇండియా' కూటమిని పేరు మార్పుతో దెబ్బ కొట్టడం...
- ఒక్క నిర్ణయంతో రెండు లక్ష్యాల సాధనే ఆంతర్యం?



జీ 20 దేశాధినేతలకు పంపిన విందు ఆహ్వానంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అని కేంద్రం పేర్కొనడం రాజకీయంగా పెను దుమారమే రేపుతోంది. కానీ మన దేశం పేరును ఇండియా నుంచి భారత్ గా మార్చాలన్న చర్చ నిజానికి చాలాకాలంగా జరుగుతున్నదే...

➡ కేంద్రంలో మోదీ సారథ్యంలోని – బీజేపీ సర్కారు కూడా దీన్ని ఎన్నోసార్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా సమర్థిస్తూనే వచ్చింది, వస్తోంది. బ్రిటిష్ వలస వాసనలను సమూలంగా వదిలించుకోవాల్సిందేనని పదేపదే చెబుతోంది. ఆ దిశగా ఎన్నో చర్యలు చేపడుతోంది.

➡ 150 ఏళ్లకు పైగా అమల్లో ఉన్న ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్ వంటి బ్రిటిష్ జమానా నాటి పేర్లకు భారత్ పేరు చేరుస్తూ తీసుకున్న తాజా నిర్ణయం అలాంటిదే.

➡ ఇటీవల ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఈ మేరకు బిల్లులు ప్రవేశపెడుతూ కేంద్రం అనూహ్య నిర్ణయం తీసుకోవడం తెలిసిందే.

➡ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ నెగ్గి హ్యాట్రిక్ కొట్టాలని పట్టుదలగా ఉన్న మోదీ సర్కారు, మెజారిటీ ఓటర్ల భావోద్వేగాలతో ముడిపడ్డ ఇలాంటి మరిన్ని నిర్ణయాలు తీసుకోవడం ఖాయమని పరిశీలకులు అప్పుడే అభిప్రాయపడ్డారు. ఆ అంచనాలు సత్య దూరం కాదనేందుకు తాజా 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' ఆహ్వానాలే నిదర్శనమని భావిస్తున్నారు.

ఒకటో అధికరణాన్నే మార్చేయాలి!

ఈ నేపథ్యంలో దేశం పేరు మార్పుకు సంబంధించి రాజ్యాంగ నిబంధనలు ఏం చెబుతున్నాయి, సుప్రీంకోర్టు ఏం చెప్పింది అన్నది ఆసక్తికరంగా మారింది.

➡ రాజ్యాంగంలోని తొలి అధికరణే మన దేశాన్ని 'ఇండియా. అంటే భారత్, రాష్ట్రాల సమాఖ్య' అని స్పష్టంగా పేర్కొంటోంది.

➡ అంటే, ఇండియా, భారత్ రెండింటినీ మన దేశ అధికారిక నామాలుగా ఒకటో అధికరణే గుర్తిస్తోందన్నది ఇక్కడ ఆసక్తికర అంశం.

➡ ఇప్పుడు వాటిలోంచి ఇండియాను తొలగిస్తూ, భారత్‌ను మాత్రమే ఏకైక అధికారిక నామంగా గుర్తించాలని కేంద్రం భావిస్తోందా అన్నది ఇక్కడ కీలకమైన అంశం.

➡ అలా జరగాలంటే ఆ మేరకు ఒకటో అధికరణాన్ని సవరించాల్సి ఉంటుంది.

నచ్చిన పేరుతో పిలుచుకోవచ్చు

'భారతా? ఇండియానా? మన దేశాన్ని భారత్ అని పిలుచుకుంటారా? భేషుగ్గా పిలుచుకోండి. అదే సమయంలో ఎవరన్నా ఇండియా అని పిలవాలని అనుకుంటే అలాగే పిలవనివ్వండి'

– 2016లో నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఠాకూర్ వ్యాఖ్య

గట్టిగా వ్యతిరేకించిన సుప్రీంకోర్టు

➡ మన దేశం పేరును ఇండియా నుంచి భారత్ గా మార్చాలన్న యోచనను సుప్రీంకోర్టు గట్టిగా వ్యతిరేకించడం విశేషం. ఈ మేరకు కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ 2016లో దాఖలైన పిల్‌ను నాటి సీజేఐ జస్టిస్ టీఎస్ ఠాకూర్ సారథ్యంలోని ధర్మాసనం కొట్టేసింది. ఇలాంటి పిటిషన్లను ప్రోత్సహించే సమస్యే లేదని కుండబద్దలు కొట్టింది.

➡ 2020లో కూడా ఇలాంటి మరో పిల్‌ను తిరస్కరించింది. దాన్ని విజ్ఞాపనగా మార్చి సరైన నిర్ణయం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపాలని నాటి సీజేఐ జస్టిస్ ఎస్ ఏ బొబ్డే సూచించారు.

జంబూ ద్వీపం నుంచి ఇండియా దాకా..

అతి ప్రాచీనమని భావించే జంబూ ద్వీపం మొదలుకుని భారత్, హిందూస్తాన్ నుంచి ఇండియా దాకా. ఎన్నో, మరెన్నో పేర్లు. మన దేశానికి ఉన్నన్ని పేర్లు ప్రపంచంలో మరే దేశానికీ లేవేమో!

- ఇంగ్లీష్ వాడకంలో మన దేశాన్ని ఇండియా అని, స్థానికులు భారత్ అని అంటారు. పాలక వర్గం ఇండియా అని, పాలిత (సామాన్య) వర్గం భారత్ అని అంటారు.

జంబూ ద్వీపం

పురాణాలు, ప్రాచీన గ్రంథాలలో మన దేశాన్ని జంబూ ద్వీపం అన్నారు. జంబూ అంటే నేరేడు పండు. అప్పట్లో మన దేశంలో ఆ చెట్లు విస్తారంగా ఉండేవి గనుక ఆ పేరు వచ్చిందని అంటారు. నాటి మన సువిశాల దేశపు ఆకృతి కూడా నేరేడు ఫలం మాదిరే ఉండేదని, అందుకే ఆ పేరు వచ్చిందని కూడా అంటారు. చైనా యాత్రికుడు ఫాహియాన్ కూడా మన దేశాన్ని అదే పేరుతో ప్రస్తావించడం విశేషం. 'జంబూ ద్వీపం ఉత్తరాన విశాలంగా, దక్షిణాన సన్నగా ఉంటుంది. అక్కడి ప్రజల ముఖాలు అలాగే ఉంటాయి' అని తన యాత్రా చరిత్రలో రాసుకొచ్చాడు.

హిందూస్తాన్, ఇండియా

బ్రిటిష్ వలస పాలన దాకా మనకు హిందూస్తాన్ అనే పేరు వాడుకలో ఉండేది. తర్వాత బ్రిటిష్‌వారు మన దేశం పేరును ఇండియాగా మార్చారు. ఈ రెండు పేర్లూ సింధు నది నుంచి వచ్చినట్టు చెబుతారు. నాటి భారత ఉప ఖండానికి సింధు నది సరిహద్దుగా ఉండేది. దానికి ఈవలి వైపున ఉన్న దేశం అనే అర్థంలో తొలుత తురుష్కులు ముఖ్యంగా పర్షియన్లు మనను హిందూస్తాన్ అని పిలిచారు. సింధులో 'స' అక్షరాన్ని వాళ్లు 'హ'గా పలుకుతారు గనుక అలా పేరు పెట్టారు. అలా సనాతన ధర్మం పేరు హిందూ మతంగా మారింది.

భారత్

భరతుడనే పౌరాణిక చక్రవర్తి పేరిట మన దేశానికి భారత్ అని పేరు వచ్చినట్టు ఐతిహ్యం. విశ్వామిత్రుడు, మేనక సంతానంగా పుట్టి ముని కన్యగా పెరిగిన శకుంతలకు, మహారాజు దుష్యంతునికి పుట్టినవాడే భరతుడు.

న్యూఢిల్లీ: భారతదేశం, హిందూస్తాన్, ఇండియా.. ఇవన్నీ ఒకే దేశం పేర్లు. భారతదేశం ప్రపంచ దేశాలకు 'ఇండియా'గానే తెలుసు. అధికారికంగా అమల్లో ఉన్న పేర్లలో 'ఇండియా' కూడా ఒకటి. అయితే, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్'గా సంబోధిస్తూ ముద్రించిన ఆహ్వాన పత్రికలను ఆమె తరఫున జీ20 దేశాల అధినేతలకు రాష్ట్రపతి భవన్ పంపించడం తీవ్ర వివాదానికి దారి తీసింది. దేశం పేరును మార్చడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు మండి పడుతున్నాయి. జీ20 శిఖరాగ్ర సదస్సు వేదిక అయిన 'భారత్ మండపం'లో ఈ నెల 9న రాత్రి జరిగే విందుకు హాజరు కావాలని కోరుతూ 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' తరఫున రాష్ట్రపతి భవన్ ఆహ్వానాలు పంపించింది. ఈ ఆహ్వాన పత్రికను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం 'ఎక్స్'లో షేర్ చేశారు. 'జనగణమన అధినాయక జయహే, భారత భాగ్య విధాత' అనే వ్యాఖ్యను సైతం జోడించారు. జయహో అంటూ ముక్తాయించారు. ఈ పత్రిక సోషల్ మీడియాలో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దేశం పేరును 'భారత్'గా మార్చడానికి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసిందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నెల 18 నుంచి మొదలయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉన్నట్లు ప్రచారం మొదలైంది. తమ కూటమి పేరు 'ఇండియా'ను చూసి మోదీ సర్కారు భయపడుతోందని, అందుకే దేశం పేరును మార్చేసే కుతంత్రానికి పాల్పడుతోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. భారత్ అని రాజ్యాంగంలో స్పష్టంగా ఉందని, అదే పేరును ఉపయోగిస్తే తప్పేమిటని అధికార బీజేపీ నాయకులు ఎదురు దాడికి దిగారు.



ఆహ్వాన పత్రిక

పేరు మార్చే హక్కు ఎవరికీ లేదు: పవార్

మనకు ఇండియా అంటే భారత్, ప్రపంచదేశాలకు మన దేశం కేవలం ఇండియాగానే తెలుసని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి అధినేత మమతా బెనర్జీ పేర్కొన్నాను. కేవలం భారత్ అనే పేరును వాడాల్సిన అవసరం ఇప్పటికిప్పుడు ఏమొచ్చిందని ప్రశ్నించారు. బీజేపీయేతర పార్టీల కూటమికి ఇండియా అనే పేరుపెట్టడం బీజేపీకి మింగుడు పడడం లేదని, అందుకే దేశం పేరును భారత్ మార్చాలని కోరుకుంటోందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆక్షేపించారు. ఇండియాను మార్చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన బీజేపీ తొమ్మిదేళ్ల తర్వాత చేస్తున్నది కేవలం పేరు మార్చడమేనని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని 'ఇండియా' ఓడిస్తుందన్నారు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమి తమ పేరును 'భారత్'గా మార్చుకుంటే, ఆ పేరును కూడా బీజేపీ మార్చేస్తుందా? ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్నించారు. దేశం పేరు మార్చే హక్కు ఎవరికీ లేదని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ తేల్చిచెప్పారు. ''భారత్.. అంటే ఇండియా. రాష్ట్రాల సమాహారమే ఇండియా అని రాజ్యాగంలోని ఆర్టికల్ 1 చెబుతోంది. అలాంటి రాష్ట్రాల సమాహారంపై మోదీ ప్రభుత్వం దాడి చేస్తోంది. డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, న్యూ ఇండియా అనే పేర్లను బీజేపీ ప్రభుత్వమే తీసుకొచ్చింది. ఇండియా షైనింగ్ అంటూ గతంలో బీజేపీ ఎన్నికలకు వెళ్లింది. ప్రధాని మోదీ చరిత్రను వక్రీకరిస్తున్నారు. దేశం పేరును మార్చాలనుకుంటే అడ్డుకుంటాం' కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ హెచ్చరించారు. 'ఇండియా' పేరుకు లెక్కగట్టలేనంత బ్రాండ్ విలువ ఉందని, దేశం పేరును మార్చే పిచ్చి పనిని బీజేపీ చేయదని తాను భావిస్తున్నానని మరో నేత శశి థరూర్ చెప్పారు.

భారత్ కాకుండా ఇంకెలా పిలవాలి?: రాజీవ్ చంద్రశేఖర్

మన దేశం పేరు భారత్ అయినప్పుడు 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్'అని పేర్కొంటే తప్పేమిటని కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ నిలదీశారు. ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. భారత్‌ను భారత్ అని కాకుండా ఇంకేలా పిలవాలని ప్రశ్నించారు. ప్రాచీన కాలం నుంచి భారత్ అనే పేరు వాడుకలో ఉందని బీజేపీ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ గుర్తు చేశారు. భారతమాత, వందేమాతరం మన రక్తంలోనే ఉన్నాయని చెప్పారు. భారత్ అనే పేరును తుడిచిపెట్టేయడానికి కొత్త ఖిల్జీలు, కొత్త మొఘల్ రాజులు పుట్టుకొచ్చారని ప్రతిపక్షాలపై ధ్వజమెత్తారు. మన దేశం 'రిపబ్లిక్ ఆఫ్ భారత్' అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఉద్ఘాటించారు. మన నాగరికత అమృతకాలం వైపు సాగుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. 'భారత్'ను ఓడించడానికే ప్రతిపక్ష కూటమి 'ఇండియా'అనే పేరు పెట్టుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి భారత్ అంటే నచ్చదని చెప్పారు.

దేశం పేరు మారితే ఆ వెబ్‌సైట్లకు కష్టాలు

తమ పేరులో .ఇన్ కలిపి ఉన్న వెబ్‌సైట్లకు ఎదురుకానున్న ఐడెంటిటీ సమస్యలు



ఇండియా పేరు భారత్‌గా మారితే దేశంలోని వేలాది వెబ్‌సైట్లకు కష్టాలు మొదలుకానున్నాయి. ఎందుకంటే చాలా వెబ్‌సైట్లు తమ పేర్లలో .ఇన్ అనే డొమైన్‌ను వాడుతున్నాయి. ఇన్నాళ్లూ ఇండియా పేరు ఉంది కాబట్టే ఇండియా స్పెల్లింగ్‌లోని తొలి రెండు అక్షరాలు అయిన ఐఎన్‌లను ఆయా వెబ్‌సైట్ల పేరు చివరన పెట్టుకున్నాయి. .ఇన్ డొమైన్‌ను కంట్రీ కోడ్ టాప్ లేయర్ డొమైన్(టీఎల్‌డీ) అంటారు. దేశం పేరు ఇండియా నుంచి భారత్‌కు మారితే .ఇన్ అనే డొమైన్ భారత్ అనే కొత్త పేరును ప్రతిబింబించదు. అప్పుడు భారత్ అనగానే తక్కున స్ఫురించేలా కొత్త టీఎల్‌డీ(డొమైన్)కు మారితే బాగుంటుంది. భారత్ ఇంగ్లిష్ స్పెల్లింగ్‌లోని బీహెచ్ లేదా బీఆర్ ఇంగ్లిష్ అక్షరాలతో కొత్త డొమైన్‌ను వాడాలి. అంటే .బీహెచ్ లేదా .బీఆర్ అని ఉంటే సబబుగా ఉంటుంది. కానీ ఈ రెండు డొమైన్‌లను ఇప్పటికే వేరే దేశాలకు కేటాయించారు. దీంతో వెబ్‌సైట్ పేరు చూడగానే ఇది భారత్‌దే అని గుర్తుపట్టేలా ఉండే కొత్త డొమైన్ మనకిప్పుడు అందుబాటులో లేదు. అదే ఇప్పుడు అసలు సమస్య. ఎన్ఐఎక్సై వారు ఇన్‌రిజిస్ట్రీ సంస్థ ద్వారా .ఇన్ డొమైన్‌ను రిజిస్టర్ చేశారు. ప్రత్యేకమైన అవసరాల కోసం ఇందులోనే సబ్‌డొమైన్‌లను సృష్టించి కొన్ని సంస్థలకు కేటాయించారు. ఉదాహరణకు జీఓవీ.ఇన్ అనే డొమైన్‌ను భారత ప్రభుత్వ రంగ సంస్థలు వాడుకుంటున్నాయి. ఎంఐఎల్.ఇన్ అనే డొమైన్‌ను దేశ సైన్యం వినియోగిస్తోంది. ఒక్కో డొమైన్ ఒక్కో దేశాన్ని వెంటనే స్ఫురణకు తెచ్చేలా ప్రాచుర్యం పొందాయి. ఉదాహరణకు .సీఎన్ అనగానే చైనా వెబ్‌సైట్లు, .యూఎస్ అనగానే అమెరికా వెబ్‌సైట్లు, .యూకే అనగానే బ్రిటన్ వెబ్‌సైట్లు గుర్తొస్తాయి. భారత్‌లోని చాలా ప్రముఖమైన వెబ్‌సైట్లు సైతం తమ ఐడెంటిటీ(గుర్తింపు)ను నిలబెట్టుకున్నాయి. మార్కెట్లో ప్రాచుర్యం పొందాయి. ఇప్పుడు ఒక్కసారిగా డొమైన్ మారిపోతే కొత్త డొమైన్‌తో ఆయా వెబ్‌సైట్లకు మళ్లీ అంతటి గుర్తింపు రావడం చాలా కష్టం.

.బీహెచ్, .బీఆర్ మనకు రావేమో!.బీహెచ్, .బీఆర్ అనే భారత్‌కు సరిగ్గా సరిపోతాయి. కానీ ఇప్పటికే .బీహెచ్‌ను బహ్రెయిన్ దేశానికి, .బీఆర్‌ను బ్రెజిల్ దేశానికి, .బీటీను భూటాన్‌కు కేటాయించారు. దీనికి మరో పరిష్కారం ఉంది. డొమైన్‌లోని అక్షరాలను పెంచుకుని .BHARAT, లేదా .BHRT అనే కొత్త డొమైన్‌కు తరలిపోవడమే. కొత్త డొమైన్‌కు మారినాసరే ఆయా వెబ్‌సైట్లు పాత డొమైన్‌లనూ కొనసాగించవచ్చు. వీటి నిర్వహణలో వచ్చే ఇబ్బందేమీ లేదు. అయితే ఆయా సంస్థల అసలు వెబ్‌సైట్ ఏది అనేది గుర్తించడం కష్టమవుతుంది. నకిలీ వెబ్‌సైట్ల బెడద ఒక్కసారిగా పెరిగిపోతుంది. బ్యాంకింగ్ రంగంలో ఇలాంటి సమస్య తలెత్తితే ఇక అంతే సంగతులు. కొత్త డొమైన్ ప్రాచుర్యం పొందాక పాత డొమైన్‌లకు.. ఇవి ఏ దేశానికి చెందినవబ్బా ? అనే కొత్త అనుమానం నెటిజన్లకు కలిగే అవకాశం ఉంది. ప్రస్తుతానికైతే డొమైన్ పేరు సమస్య ఒక్కటే పొంచి ఉంది. నిజంగానే దేశం పేరు మారితే ఇలాంటి కొత్త రకం సమస్యలు ఏమేం వస్తాయో ఇప్పుడే చెప్పలేం. చూద్దాం.. ఈ డొమైన్‌ల కథ ఏ మలుపు తిరుగుతుందో!

– సాక్షి, నేషనల్ డెస్క్

పార్లమెంట్‌లో 'మోదీ చాలీసా' వద్దు

ప్రజల సమస్యలను లేవనెత్తుతాం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మోదీ చాలీసాను తాము కోరుకోవడం లేదని, ప్రజా సమస్యలను లేవనెత్తుతామని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు స్పష్టం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత సోనియా గాంధీ నేతృత్వంలో మంగళవారం కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ కమిటీ సమావేశమైంది. పార్టీ ఎంపీలు హాజరయ్యారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ప్రత్యేక సమావేశాల అజెండాపై ప్రతిపక్షాలతో ప్రభుత్వం చర్చించడం ఆనవాయితీగా వస్తోందని, ఈసారి ప్రభుత్వం ఆ పని చేయలేదని, విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదని కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆక్షేపించారు.

రిజర్వేషన్లపై 50% పరిమితి తొలగించాలి: పవార్


జల్‌గావ్: దేశంలో ప్రస్తుతం రిజర్వేషన్లపై అమల్లో 50 శాతం పరిమితిని తొలగించాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ కోటాను ఇంకా 15 నుంచి 16 శాతం పెంచాలని అన్నారు. ఆయన మంగళవారం మహారాష్ట్రలోని జల్‌గావ్‌లో మీడియాతో మాట్లాడారు. దేశంలో మరికొన్న ఇతర వెనుకబడిన కులాలకు(ఓబీసీ) రిజర్వేషన్లు కల్పించానికి వీలుగా కోటాను పెంచాల్సిందేనని అన్నారు. ఓబీసీ కోటాలో మరికొన్ని కులాలకు రిజర్వేషన్లు ఇస్తే ఇదే ఓబీసీల్లోని పేదలకు అన్యాయం జరుగుతుందని చాలామంది చెబుతున్నారని, ఈ అంశాన్ని విస్మరించవద్దని సూచించారు. మరికొన్ని కులాలను చేర్చడం వల్ల ఓబీసీల్లోని పేదలకు అన్యాయం జరగకుండా ఉండాలంటే రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించి, కోటాను మరో 15-16 పెంచడమే పరిష్కార మార్గమని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్‌తో తాము మద్దతు ఇస్తామని శరద్ పవార్ ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో తమకు రిజర్వేషన్లు కల్పించాలని మహారాష్ట్రలో మరాఠా సామాజికవర్గం ప్రజలు పోరాడుతున్నారు.

ఆదిత్య ఎల్1 కక్ష్య దూరం మరోసారి పెంపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సూర్యుడి సంబంధ పరిశోధనల కోసం ఇస్రో ఇటీవల ప్రయోగించిన ఆదిత్య ఎల్1 ఉపగ్రహానికి రెండో సారి కక్ష్య దూరం పెంపు ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశారు. ఉపగ్రహంలో ఇంధనాన్ని మండించి కక్ష్య దూరాన్ని పెంచడంతో ఈ ప్రక్రియ విజయవంతమైంది. బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ నుంచి ఈ ప్రక్రియను చేపట్టారు. మారిషస్, బెంగళూరు, పోర్టుబ్లెయిర్‌లలోని గ్రౌండ్‌స్టేషన్ల నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ప్రక్రియను నిశితంగా గమనించారు. రెండోసారి కక్ష్య దూరం పెంపుదలతో ఉపగ్రహం భూమికి దగ్గరగా 282 కిలోమీటర్లు, భూమికి దూరంగా 40,225 కిలోమీటర్ల కక్ష్యలోకి చేరుకుంది. అంటే ప్రస్తుతం 282 x40,225 కిలోమీటర్ల దీర్ఘవృత్తాకార కక్ష్యలో అది తిరుగుతోంది. మొదటి విడతలో 245x22,459 కి.మీ.ల కక్ష్యలోకి ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టిన విషయం తెల్సిందే. రెండో విడతలో ఉపగ్రహాన్ని 282x40,225 కి.మీ.ల కక్ష్యలోకి తీసుకొచ్చారు. ఈనెల 10వ తేదీన మరోసారి కక్ష్య పెంచుతారు.

ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోలు మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అటవీప్రాంతంలో మరోసారి పోలీసులు, మావోల మధ్య కాల్పుల ఘటన జరిగింది. సుక్మా జిల్లా చింతగుఫా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. సీఆర్‌పీఎఫ్ 223 బెటాలియన్ జవాన్లు, జిల్లా రిజర్వ్ గార్డ్, పోలీసుల బృందం తాడిమెట్ల– దులేడ్ అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం కూంబింగ్ మొదలుపెట్టింది. ఆరు గంటల ప్రాంతంలో జవాన్ల బృందంపై మావోలు మెరుపుదాడి చేశారు. దీంతో జవాన్లు ఎదురుదాడికి దిగారు. ఈ క్రమంలో మావోయిస్టులు అడవిలోకి పారిపోయారు. అనంతరం కాల్పులు జరిగిన ఘటనాస్థలిలో జవాన్లు గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా సిబ్బంది గుర్తించారు. వీరిని సోధి దేవా, రవా దేవాగా గుర్తించారు. వీరిద్దరిపై తలో రూ.లక్ష చొప్పున రివార్డు ఉంది.



చంద్రయాన్-3 మిషన్‌లో భాగంగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై క్షేమంగా దిగిన ల్యాండర్ విక్రమ్ 3డీ చిత్రమిది. ఆనాగ్రిఫ్ టెక్నిక్‌ను ఉపయోగించి ఇస్రో ఈ చిత్రాన్ని రూపొందించింది.

ఉదయనిధి తల తెస్తే రూ.10 కోట్లిస్తా

సరిపోదంటే ఇంకా ఇస్తా: అయోధ్య స్వామీజీ పరమహంస ఆచార్య ప్రకటన

న్యూఢిల్లీ: సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్‌పై విమర్శలు, బెదిరింపులు ఎక్కువయ్యాయి. అయోధ్యకు చెందిన స్వామీజీ పరమహంస ఆచార్య ఒక అడుగు ముందుకేసి ఉదయనిధి తలకు వెలకట్టారు. ఆయన తల నరికి తెస్తే రూ.10 కోట్లు ఇస్తానని ప్రకటించారు. 'రూ.10 కోట్లు సరిపోదంటే చెప్పండి. ఇంకా ఇస్తా. సనాతన ధర్మాన్ని దారుణంగా కించపరిచే వాళ్లను వదిలే ప్రసక్తే లేదు. దేశంలో కనిపిస్తున్న అభివృద్ధి అంతా సనాతన ధర్మం వల్లే సాధ్యమైంది. భారత్‌లోని 100 కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసిన తమిళనాడు రాష్ట్ర మంత్రి బేషరతు క్షమాపణ చెప్పాల్సిందే' అని స్వామీజీ ఆగ్రహంగా మాట్లాడారు. స్వామీజీ వ్యాఖ్యలపై తమిళనాడులోని వెల్లూర్‌లో డీఎంకే నేతలు నిరసన వ్యక్తంచేశారు. స్వామీజీ దిష్టిబొమ్మను దగ్ధంచేశారు.

ఉదయనిధిపై బెంగళూరులో కేసు

సాక్షి బెంగళూరు: సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి, డీఎంకే నేత ఉదయనిధిపై బెంగళూరులోని బనశంకరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బెంగళూరు దక్షిణ బీజేపీ విభాగం అధ్యక్షుడు ఎన్ఆర్ రమేశ్ ఈ కేసు దాఖలు చేశారు. 'వంద కోట్లకుపైగా జనాభా ఆచరించే సనాతన ధర్మాన్ని నాశనం చేయాలని పిలుపునిచ్చిన ఉదయనిధిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఉదయనిధి తన వ్యాఖ్యల ద్వారా రాజ్యాంగ ఆశయాలకు తూట్లు పొడిచారు. ఇలాంటి ప్రమాదకర వ్యాఖ్యల ద్వారా ప్రేరేపితులైన డీఎంకే కార్యకర్తలు సనాతన ధర్మం ఆచరించే ప్రజలపై దాడులకే తెగబడే ప్రమాదం ఉంది. అందుకే ఉదయనిధిపై చర్యలు తీసుకోండి' అని రమేశ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పుతిన్‌తో త్వరలో కిమ్ జోంగ్ ఉన్ భేటీ!

ఉత్తర కొరియా నుంచి ఆయుధాలు కొనుగోలు చేయనున్న రష్యా



సియోల్: ఉత్తర కొరియా పాలకుడు కిమ్ జోంగ్ ఉన్ రష్యా అధినేత పుతిన్‌తో సమావేశం కాబోతున్నారా? ఇందు కోసం త్వరలోనే రష్యాకు బయలుదేరి వెళ్తారా? నిజమేనని అమెరికా అధికార వర్గాలు చెబుతున్నాయి. అమెరికాకు బద్ధ వ్యతిరేకి అయిన కిమ్ జోంగ్ ఉన్ ఇటీవలి కాలంలో పుతిన్‌కు స్నేహ హస్తం అందిస్తున్నారు. ఇద్దరు నేతలు ముఖాముఖి భేటీ అవుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగిస్తున్న రష్యా వద్ద ఆయుధ నిల్వలు వేగంగా నిండుకుంటున్నాయి. అందుకే ఉత్తర కొరియా నుంచి ఆయుధాలు కొనుగోలు చేయాలని రష్యా నిర్ణయించినట్లు సమాచారం. పుతిన్, కిమ్ సమావేశంలో ఇదే అంశంపై చర్చించే అవకాశం ఉంది. రష్యాకు అందించే సహాయానికి బదులుగా ఆహారం, అత్యాధునిక ఆయుధ టెక్నాలజీని తమకు అందజేయాలని పుతిన్ నుంచి కిమ్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇరువురు నేతలు చివరిసారిగా 2019 ఏప్రిల్‌లో కలుసుకున్నారు.

సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోండి

సీజేఐకు ప్రముఖుల లేఖ

న్యూఢిల్లీ: సనాతన ధర్మంపై తమిళనాడు రాష్ట్ర మంత్రి, డీఎంకే సీనియర్ నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు భిన్న వర్గాల నుంచి నిరసన సెగలకు కారణమవుతున్నాయి. తాజాగా మాజీ న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు సైతం ఉదయనిధిపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. 14 మంది మాజీ జడ్జీలు, 130 మంది ఉన్నతాధికారులు, 118 మంది మాజీ సైన్యాధికారులుసహా 262 మంది సీజేఐకు లేఖ రాశారు. ' ఉదయనిధి వ్యాఖ్యలు దేశంలోని అత్యధిక జనాభాకు వ్యతిరేకంగా చేసిన విద్వేష ప్రసంగంతో సమానం. ఈ ప్రసంగం భారత రాజ్యాంగం మౌలిక స్వరూపంపై దాడిలా తోస్తోంది. దేశ లౌకిక భావనను కాపాడేందుకు తక్షణం ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి చర్యలకు ఉపక్రమించాలి. రాష్ట్ర ప్రభుత్వ పాలనలో తీవ్ర జాప్యం ఒక రకంగా కోర్టు ధిక్కారమే. ఆయనపై చర్యలు తీసుకునేందుకు తమిళనాట డీఎంకే సర్కార్ నిరాకరించడమూ కోర్టు ధిక్కారమే. ఇది శాంతి భద్రతల అంశాన్ని అపహాస్యం చేయడమే అవుతుంది. తమిళనాడు ప్రభుత్వ నిర్లిప్త వైఖరిని కోర్టు ధిక్కారంగా భావించి ఈ అంశంలో డీఎంకే సర్కార్‌ను జవాబుదారీని చేయండి. శాంతిభద్రతల కోసం, విద్వేష ప్రసంగాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోండి' అని ప్రముఖులు ఆ లేఖలో పేర్కొన్నారు.

తూలిపడ్డ నితీశ్




పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మంగళవారం పట్నా యూనివర్సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో వేదికపై తూలి కిందపడిపోయారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పట్నా వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో శిలాఫలకం వద్దకు వెళుతుండగా కాలు మడతపడి కింద పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆయనను పైకి లేపారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



రేపు కృష్ణాష్టమి వేడుకలు
గంపలగూడెంలోని నెమలి శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఏసీ వరప్రసాదరావు తెలిపారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 524.00 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 3,822 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఎక్స్‌పోలో విద్యార్థుల ప్రతిభ
ఆటోమేషన్ ఎక్స్‌పోలో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి తృతీయ బహుమతి గెలుచుకున్నారు.

న్యూస్‌రీల్

కృష్ణా డీఆర్వో వెంకటేశ్వర్లు బదిలీ



చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు బదిలీ అయ్యారు. ఆయనను ఏలూరు జిల్లా డీఆర్వోగా బదిలీ చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్థానంలో అనకాపల్లి డీఆర్వోగా పనిచేస్తున్న పి. వెంకటరమణను కృష్ణాజిల్లా డీఆర్వోగా బదిలీ చేశారు. ఇప్పటి వరకు డీఆర్వోగా పనిచేసిన వెంకటేశ్వర్లు 2020 ఆగస్టు 20వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఆయన సమర్థంగా విధులు నిర్వర్తించారు. కరోనా సమయంలో జిల్లా ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులను సమన్వయం చేయటంలో కీలక పాత్ర పోషించారు.

జూపూడిలో కేరళ బృందం పర్యటన



ఇబ్రహీంపట్నం(మైలవరం): జూపూడి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కేరళ బృందం మంగళవారం సందర్శించింది. కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కిలా) నుంచి ఐఎస్ఓ జిల్లా కోఆర్డినేటర్లు కె.శ్రీరిషి, ఎంఎం రషీద్, ఈశ్వరన్ నంబూద్రి, రాష్ట్ర ఐటీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ సి.బాలాజీ బృందం సందర్శించి.. పంచాయతీ విధానాలు, సదుపాయాలు, రికార్డుల నిర్వహణ, సభలు, సమావేశాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలు తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రికార్డుల మెయింటెనెన్స్, విద్య, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర వ్యవహారాలు సక్రమంగా జరిగితే ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసి ఐఎస్ఓ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఈ బృందం సిఫార్సు చేయనుంది. ఎంపీడీవో రామకృష్ణనాయక్, ఈవోపీఆర్డీ మనోజ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.మునేశ్వరరావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ పూర్తయ్యింది. జిల్లాలో మొత్తం 2,30,662 మంది పెన్షనర్లకు గాను 2,27,605 మంది పెన్షన్ కానుక అందుకున్నారు. దీంతో మొత్తం 98.67 శాతం పూర్తయ్యింది. జిల్లాలో అత్యధికంగా ఇబ్రహీంపట్నంలో 99.22 శాతం, వీరులపాడులో 99.15, పెనుగంచిప్రోలులో 99.12, జి. కొండూరు మండలంలో 99.11, చందర్లపాడులో 98.98 పంపిణీ పూర్తి చేశారు.

చిత్రకారుడు బొండాకు సర్దార్ పటేల్ ఎక్సలెన్స్ అవార్డ్



భవానీపురం(విజయవాడపశ్చిమ): సామాజిక అంశాలపై చిత్రాలను గీసే విజయవాడ భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీకి చెందిన గిరిజన గీత శిల్పి డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావుకు ప్రతిష్టాత్మక సర్దార్ పటేల్ ఎక్సలెన్స్ అవార్డ్–2023 లభించింది. మధ్యప్రదేశ్ భోపాల్‌కు చెందిన టీజీహెచ్‌ఆర్ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రకళ పోటీల్లో ఆయనకు ఈ అవార్డ్ దక్కింది. మంగళవారం కొరియర్ ద్వారా అవార్డ్‌ను అందుకున్న బొండా జగన్మోహన్‌రావును పలువురు చిత్రకారులు, ప్రముఖులు అభినందించారు. గిరిజనుల జీవన శైలిని నాగరిక సమాజానికి పరిచయం చేస్తూ వారి జీవితాలపై వందలాది చిత్రాలను చిత్రించిన ఆయన అనేక సమకాలీన, సామాజిక అంశాలపైకూడా చిత్రాలను అక్రలిక్ ఆయిల్ పెయింట్స్‌తో గీశారు. ఈ సందర్భంగా డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ గిరిజనులకు కూడా విద్య, వైద్యం, సమాజంలో తగిన గౌరవం దక్కాలనే ఆశయంతో తాను ట్రైబల్ లైఫ్‌కు సంబంధించిన చిత్రాలను గీస్తున్నానని తెలిపారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సులకు స్పాట్ కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు మంగళవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మిదేవి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న, చేయని విద్యార్థులను కూడా స్పాట్ కౌన్సెలింగ్‌కు అనుమతించామన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామారావు పాల్గొన్నారు.

పవిత్ర వృత్తి.. సమాజ సృష్టి

- గురువులను గౌరవించడం అందరి బాధ్యత
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



రెడ్డిగూడెం మండలం మద్దులపర్వలోని ఏపీఎంఎస్ ప్రిన్సిపాల్ ఎ. వీర్రాజుకు సన్మానం చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డీఈఓ రేణుక తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజ భవిష్యత్‌ను నిర్దేశించే శక్తి గురువులకు మాత్రమే ఉంటుందని, అటువంటి గురువులను సత్కరించి, గౌరవించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు సత్కార కార్యక్రమం నగరంలోని మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎంపికైన ఉత్తమ గురువులను కలెక్టర్ ఢిల్లీరావు ఇతర ప్రజాప్రతినిధులు అధికారుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. తొలుత కలెక్టర్ ఢిల్లీరావు, శాసనసభ్యులు మల్లాది విష్ణు తదితరులు భారత పూర్వ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణంలో గురువులు మూల స్తంభాలు లాంటివారన్నారు. అజ్ఞాన చీకటిని తొలగించి జ్ఞాన జ్యోతిని ప్రసాదిస్తూ విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను సత్కరించాలని సర్వేపల్లి రాధాకృష్ణన్ సూచించారన్నారు. ఆయన సూచనలు గౌరవిస్తూ ప్రభుత్వం ఏటా సెప్టెంబర్ ఐదో తేదీన గురుపూజోత్సవం నిర్వహిస్తున్నారన్నారు.

అత్యధిక నిధులు కేటాయించిన ప్రభుత్వం ఇదే

1947 నుంచి ఇప్పటివరకు విద్యారంగానికి ఏ ప్రభుత్వం చేయని కేటాయింపులు, పెద్ద మొత్తంలో కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చి వేస్తున్నామన్నారు. పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులు విద్యార్థులకు అందిస్తున్న ఆర్థిక సాయం వల్ల ప్రభుత్వ పాఠశాలలో డ్రాప్ అవుట్ల సంఖ్య తగ్గించగలిగామన్నారు.



పిల్లలపై ప్రభావం అధికం

శాసనసభ్యులు మల్లాది విష్ణువర్ధన్ మాట్లాడుతూ తల్లిదండ్రుల కన్నా ఉపాధ్యాయుల ప్రభావమే పిల్లలపై అధికంగా ఉంటుందన్నారు. భాషపైన సబ్జెక్టుల పైన ఉపాధ్యాయులకు పట్టు ఉండాలన్నారు. బోధనలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు కొత్తదనాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రతి పాఠశాలను అగ్రగామిగా నిలిపి జిల్లాను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నారు. తొలుత 48 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సర్టిఫికెట్లు, మెమెంటో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగరమేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు అవుతు శైలజారెడ్డి, బెల్లం దుర్గ కార్పొరేషన్ చైర్మన్లు పి. గౌతమ్‌రెడ్డి, అడపా శేషగిరి, షేక్ ఆసిఫ్, తాలేటి శ్రీకాంత్, మనోజ్ కొఠారి, గౌస్‌మొహిద్దీన్, విద్యాశాఖ సహాయ సంచాలకుడు కేవీఎన్ కుమార్, డెప్యూటీ డీఈవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

'ఏటీఎం మోడల్'తో రైతులకు నిరంతర ఆదాయం



ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రైతులు ఒకే పంట విధానంపై ఆధారపడకుండా, క్రమం తప్పకుండా ఆదాయాన్నిచ్చే రకరకాల పంటల సాగు చేపట్టాలని ప్రకృతి వ్యవసాయ విభాగం రీజనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రకాష్‌రావు అన్నారు. బాపులపాడు మండలం శేరీనరసన్నపాలెంలో 'ఏటీఎం మోడల్' ద్వారా ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్లో కూరగాయల సాగు చేపట్టిన రైతుల పంట పొలాలను అధికారులు సందర్శించారు. గ్రామానికి చెందిన పూర్ణచంద్రరావు, చందన రామప్రసాద్ పొలాలను ప్రకృతి వ్యవసాయ విభాగం రీజనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రకాష్‌రావుతో పాటుగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.పార్థసారథి, రాష్ట్ర కార్యాలయ అధికారి ప్రవీణ్ సందర్శించి, ఏటీఎం మోడల్ సాగుపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతు తమ పంట పొలంలో ప్రధాన పంటతో పాటుగా కొంత భాగంలో కూరగాయల వంటి ఇతర పంటల సాగు చేపట్టాలని చెప్పారు. దీని వల్ల వ్యవసాయంలో ఒడుదొడుకులను తట్టుకునేందుకు ఆస్కారం ఉంటుందని వివరించారు. కనీసంగా ఎకరానికి 20 సెంట్ల చొప్పున ఏటీఎం మోడల్ సాగు చేపట్టాలని చెప్పారు. వివిధ రకాల కూరగాయల సాగు చేయటం ద్వారా రైతులకు ప్రతిరోజు ఎంతో కొంత ఆదాయం సమకూరుతుందన్నారు. డెప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ నాగమల్లేశ్వరి, యూనిట్ ఇన్‌చార్జి నాగలక్ష్మి, ఐసీఆర్పీ లీల రంగమ్మ పాల్గొన్నారు.

పథకాల అమలుకు పక్కా కార్యాచరణ

వీడియో కాన్ఫరెన్స్‌లో కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు పక్కాగా ఉండాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం క్షేత్రస్థాయి అధికారులతో క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, విద్య, వైద్యం, గృహనిర్మాణం, జగనన్నకు చెబుదాం, వైఎస్సార్ ప్రతిభా పురస్కారాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 17వ తేదీన విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రకటించనున్నారని 18 రకాల చేతివృత్తిదారులను ఎంపిక చేసే కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. వైఎస్సార్ చేయూత నాల్గో విడత కార్యక్రమానికి సంబంధించి సంక్షేమ కార్యదర్శుల లాగిన్‌లో వివరాలు పొందుపరచటం పెండింగ్‌లో ఉందని, వెంటనే సంబంధిత ఎంపీడీవోలు, ఏపీఎంలు చొరవ చూపి నిధులు మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రసవాలు జరిగేలా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. కీటకాలు, కలుషిత నీరు వల్ల గాని కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గృహనిర్మాణంలో రెండో విడత 5 లక్షల గృహాల లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో ఫారం–6, 7, 8 దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం ఇకపై ప్రతి బుధ, శుక్రవారాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా పరిశ్రమల అధికారి వెంకట్రావు, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, డీఈవో తాహెరాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషతో మనో వికాసం

- సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- వేడుకగా గిడుగు, సర్వేపల్లి జయంతి వేడుకలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడ కల్చరల్: మాతృభాషతో మనో వికాసం కలుగుతుందని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సినీ గేయకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో విజయవాడ గాంధీనగర్‌లోని శ్రీరామా ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వ్యవహారిక భాషా ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంత్యుత్సవం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మాతృభాషా మహాసభను నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు పాల్గొన్న కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విష్ణు మాట్లాడుతూ ప్రతి తెలుగువాడు భాషా వికాసానికి కృషి చేయాల్సిన అవసరముందన్నారు. భవిష్యత్ అవసరాల కోసం ఇతర భాషలను కూడా నేర్చుకోవాలన్నారు. ప్రభుత్వం బాల బాలికల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్యాబోధన చేస్తోందని తెలిపారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి..

కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాష అమలు కోసం తల్లి దండ్రులతోపాటు గురువులు కూడా చిత్తశుద్ధితో పని చేయాలని, అందుకు రాజకీయాలకు అతీతంగా కలసి రావాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ తెలుగు భాషతో పాటు ఆంగ్లంలో చదువుకుంటేనే భవితకు పునాది బాగుంటుందన్నారు. ప్రవాసాంధ్ర తెలుగు ప్రముఖుడు తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ అమెరికాలో ఉన్న మన తెలుగు వారు తమ మూలాలు చెడకుండా తెలుగుభాషా దినోత్సవాలు ఘనంగా నిర్వహించి, ఇక్కడ నుంచి మన తెలుగు వారిని పెద్ద సంఖ్యలో ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు మండలి బుద్ధప్రసాద్, దుర్గేష్, పద్యకవి వామరాజు సత్యమూర్తి, డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, లెనిన్ సెంటర్‌లోని విశ్వనాథ సత్యనారాయణ విగ్రహం వద్ద నుంచి కవులు, పండితులు, వివిధ పార్టీల ప్రతినిధులు శోభాయాత్రను కనుల పండువగా జరిపారు.

అర్హత సాధించేందుకు ఎస్ఐ అభ్యర్థులు పోటీ



అభ్యర్థుల ఛాతీ కొలతలు చూస్తున్న అధికారులు

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఎస్ఐ పురుష అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షలు మంగళవారం కొనసాగాయి. రేంజ్ ఐజీ జి.పాలరాజు, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ పరిశీలించారు. అభ్యర్థులకు సంబంధించి ఒరిజినల్ ధ్రువీకరణ/నకళ్ల పత్రాలను పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతల వివరాలు నమోదు చేసుకున్నారు. 1,600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించగా, ఆయా పోటీల్లో ఉత్తీర్ణత సాధించేందుకు ఎస్ఐ అభ్యర్థులు పోటీపడ్డారు. 662 మంది అభ్యర్థులకు 323 మంది అర్హత సాధించారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా ఒరిజినల్ మార్కుల జాబితా, ఒక సెట్ నకలుతో హాజరవ్వాలని మరోసారి కోరారు. ఒరిజినల్ మార్కుల జాబితాలను లామినేషన్ చేయించినట్లయితే, దాన్ని తొలగించుకుని రావాలని, తద్వారా కంప్యూటర్‌లో ధ్రువీకరణ పత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.సుప్రజ(గుంటూరు), డీఎస్పీలు చంద్రశేఖర్‌రావు(గుంటూరు ఏఆర్), రవిచంద్ర (పల్నాడు జిల్లా దిశ పీఎస్), ఐజీ కార్యాలయ సీఐ సుధాకర్ పాల్గొన్నారు.

20న దేహదారుఢ్య పరీక్షలు

గుంటూరు రేంజ్ పరిధిలో ఈనెల 4 పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వర్షం కారణంగా వాయిదాపడిన ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను ఈనెల 20న నిర్వహించనున్నట్లు, అభ్యర్థులు గమనించాలని గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ఫార్మసిస్టు ఉద్యోగాలు ఎనిమిది, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలు రెండు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు నాలుగు, ఎల్‌జీఎస్ ఉద్యోగాలు తొమ్మిది భర్తీ చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు పూర్తి వివరాల కోసం గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను సదరు వెబ్‌సైట్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. అలాగే కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్ పోస్టు ఒకటి భర్తీ చేసేందుకు ఈనెల 8న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆహోరం అద్భుతః

రుచి, శుచి, నాణ్యతతో టిఫిన్, భోజనం



నందిగామలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటిన్

- ఆడపడుచుల స్వయం ఉపాధికి ఊతం
- ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన ఆహా క్యాంటీన్లు
- స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులతో ఏర్పాటు
- తక్కువ ధరకే పలు రకాల ఆహార పదార్థాలు
- మంచి రాబడి వస్తుండటంతో ముందుకు వస్తున్న మహిళలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పట్టణాల్లో ఓ మాదిరి హోటల్ ఏర్పాటు చేయాలంటే అద్దెలు, అడ్వాన్స్‌ల రూపంలో వేలు, లక్షలు పెట్టుబడిగా పెట్టాల్సి వస్తోంది. ఏదైనా రోడ్డు పక్క స్థలంలో ఏర్పాటు చేయాలంటే అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆహా క్యాంటీన్లకు ప్రభుత్వమే అనువైన స్థలం ఎంపిక చేసి, అక్కడ ఏర్పాటు చేసేందుకు కావాల్సిన సరంజామా సమకూరుస్తోంది. దీంతో మహిళా సంఘాల్లోని ఔత్సాహికులు ముందుకు వస్తున్నారు. ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు.

మహిళా స్వావలంబన దిశగా..

స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ప్రభుత్వం ఊతమిస్తోంది. వారికి ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆహా పేరిట క్యాంటీన్లు ప్రారంభించింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మెప్మా క్యాంటీన్ల ఏర్పాటుకు కావాల్సిన కియోస్క్‌లను అందించింది. నిర్వహణ బాధ్యతను సంస్థే చూస్తోంది. హోటల్ ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందాలని భావించే స్వయం సహాయక సంఘాల సభ్యులను గుర్తించి ఒక్కో క్యాంటీన్ ఏర్పాటుకు వారికి రూ. 13వేల రుణ సదుపాయం కల్పించింది. ఆ రుణంతో ఆహా క్యాంటీన్ ఏర్పాటుకు అవసరమైన కియోస్క్‌ను సమకూర్చింది.

అతి తక్కువ ధరలకే..

పట్టణంలో ఓ మాదిరి హోటల్‌లో కనీసం రూ.100 వెచ్చిస్తే తప్ప భోజనం దొరకని పరిస్థితి. అయితే ఆహా క్యాంటీన్లలో అతి తక్కువ ధరలకే నాణ్యమైన, రుచి శుచికరమైన భోజనం లభిస్తోంది. ఉదయం పూట టిఫిన్ అందిస్తున్నారు. ఇంటి తరహా భోజనం అందిస్తుండటంతో ఆహా క్యాంటీన్లకు జనాలు క్యూ కడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 8 ఆహా క్యాంటీన్లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 10 క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని మెప్మా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. విజయవాడలో 3, నందిగామ, తిరువూరు, జగ్గయ్యపేటలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 5 క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, పెడన, గుడివాడ, ఉయ్యూరు మున్సిపాలిటీల్లో ఒక్కొక్కటి చొప్పున నాలుగు ఏర్పాటు చేయాల్సి ఉండగా గుడివాడ, ఉయ్యూరులో క్యాంటీన్లు అందుబాటులోకి వచ్చాయి. మరో రెండు కొద్ది రోజుల్లో అందుబాటులోకి రానున్నాయి. విజయవాడ నగరంలో కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్, అజిత్‌సింగ్‌నగర్‌లోని అమెరికన్ హాస్పిటల్, ఆటోనగర్ వద్ద క్యాంటీన్లు ఏర్పాటు చేశారు.

గిట్టుబాటు అవుతోంది



ఆహా క్యాంటీన్ ఏర్పాటుకు ప్రభుత్వం రుణం మంజూరు చేసింది. అజిత్‌సింగ్‌నగర్ అమెరికన్ హాస్పిటల్ వద్ద క్యాంటీన్ ఏర్పాటు చేశాం. నలుగురు సభ్యులు కలిసి హోటల్ నిర్వహిస్తున్నాం. బాగానే నడుస్తోంది. నలుగురికీ కూలి గిట్టుబాటవుతుంది. ఆహా క్యాంటీన్‌కు ఇప్పుడిప్పుడే ప్రజలు ఆకర్షితులవుతున్నారు.

– మధు, క్యాంటీన్ నిర్వాహకురాలు

చాలా బాగుంది



మార్కెట్‌లో క్యాంటీన్ ఓపెన్ చేసిన దగ్గర నుంచి ఇక్కడే టిఫిన్ చేస్తున్నాం. అందుబాటులో ఉంది. తక్కువ ధరకే టిఫిన్ లభిస్తోంది. ప్యాక్ చేసి వేడిగా, రుచిగా అందిస్తున్నారు. ఇంకా నా తోటి వారికి కూడా దీని గురించి వివరిస్తున్నా.

– ఆనందరావు, కూలీ, పండ్ల మార్కెట్

మెనూ.. ధరలు ఇలా..

ఆహా క్యాంటీన్లలో వటంకాలను నిర్వాహకులు ఇంటివద్దే సిద్ధం చేస్తారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల వద్ద విక్రయిస్తారు. తయారు చేసిన ఆహారాన్ని ఫాయిల్ ప్యాక్‌లో చక్కగా ప్యాక్ చేసి అందిస్తున్నారు. దీంతో ఆహారం వేడిగాను తాజాగాను లభిస్తోంది. పప్పు, చట్నీ, సాంబారు, పెరుగుతో చక్కటి భోజనం, వెజిటబుల్ బిర్యానీ, జీరా రైస్, టమాటా రైస్, పులిహోరా, దద్దోజనం, పలు రకాల టిఫిన్లు మెనూలో ఉంచారు. రైస్ ఐటమ్స్ ఏవైనా గరిష్టంగా రూ. 40కే విక్రయిస్తున్నారు. అలాగే పులిహోర, దద్దోజనం వంటివి రూ. 30, గారెలు(3), పూర్ణం బూరెలు(3), ఇడ్లీ(4), పునుగు(4) ఒక్కో ప్లేట్ రూ.20కు విక్రయిస్తున్నారు. సాదా దోసెలు రూ.15కే అమ్ముతున్నారు. బయట వాటితో పోలిస్తే ఆహా క్యాంటీన్లలో ధరలు తక్కువగా ఉండడంతో ఇక్కడ ఆహారం తినేందుకు ముందుకు వస్తున్నారు. రోజుల వ్యవధిలోనే క్యాంటీన్ల వద్ద అమ్మకాలు ఊపందుకున్నాయి.

యార్డులో 38,258 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 36,310 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 38,258 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 25,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.22,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 24,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,495 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజ, డీఈవో రేణుక, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతం రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న మల్కాపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.వి. నాగేశ్వరరావు



జి.శివపార్వతి | షేక్ ఉమర్ అలీ | జి.పుష్పలత | కె.ప్రేమ్‌సాగర్ | వి.భూపాల్ రెడ్డి | కె.రూన్సీలక్ష్మి | ఎస్ఏలు: జీబీటీ రాజశేఖర్ | మామిడి శ్రీనివాసరావు | లంక దుర్గాప్రసాద్ | బి.కిరణ్ కుమార్ | షేక్ మొహమ్మద్ అలీ



టి.కృష్ణారావు | బి రమాదేవి | అనసూయ | ఖాజావలి | తహేరా బేగం | ఆర్వీఎస్ రామకృష్ణ | ఎస్.రామకుమార్ | కె.గోపాలకృష్ణ | శ్రీపతి రవి | టి.విజయకుమార్ | ఆర్.సీసర్‌రెడ్డి

ఉత్తమ సేవలకు పురస్కారం

చదువు చెప్పాలనే ఆరాటంతో విద్యార్థుల ఉజ్వల భవితకు బంగారు బాట వేస్తున్న ఉపాధ్యాయులు వారు చేస్తున్న సేవలకు సత్కారం అందుకున్నారు. మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఎంబీవీ కేంద్రంలో గురు పూజోత్సవం నిర్వహించారు. విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 'సెంట్రల్' ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కలెక్టర్ ఢిల్లీరావు, డీఈఓ రేణుక, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజ, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు.. ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఎం. శ్రీనివాసరావు | ఎస్ .సాంబశివరావు | ఎం.రాజ్‌కుమార్ | కె .మారతమ్మ | ఎం. రుత్తమ్మ | గుడివాడ అరుణకుమారి | కె .విజయలక్ష్మి | మల్లెల తేజోమయి



జయశంకర్ దేశు | ఎన్. ఆర్. పి .ఎస్ .రెడ్డి | ఎస్జీటీలు: సెట్టిపోగు రాము | ఎస్.కె. జీనాతమ్మ | జి.జాన్ రవి | రెహనా సుల్తానా | అల్లావుద్దీన్‌ఖాన్ | ఎండీ ఇక్బాల్ పాషా | షేక్ ముజాహిద్దీన్ | ఎండి హుస్సేన్ | కె. నెప్రూ | ఎ.వినీష్ వాణి | అస్మా తబస్సుమ్ | బి. సురేష్ బాబు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు



ప్రమాదస్థలంలో బస్సు, లారీ

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): జాతీయ రహదారిపై నక్కపల్లి సమీపంలో ఆగి ఉన్న లారీని సోమవారం అర్ధరాత్రి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. 14 మందికి తీవ్రగాయాలయ్యాయి. డ్రైవరు అతి వేగంగా బస్సును నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్వతీపురం నుంచి గుంటూరు వెళ్తున్న సాయికృష్ణ ప్రైవేటు ట్రావెల్ బస్సులో సుమారు 40 మంది ప్రయాణిస్తున్నారు. వీరంతా వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లిలలో బస్సు ఎక్కారు. బస్సు అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో నక్కపల్లి దాటిన తర్వాత కిలోమీటరు దూరంలో మనబానవానిపాలెం రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. అనకాపల్లిలో జరిగిన వివాహానికి హాజరై తిరిగి వెళ్తున్న విజయవాడ సమీపంలో గొల్లపూడి గ్రామానికి చెందిన బైపాన రమేష్ (35) బస్సులోనే చిక్కుకుని అక్కడికక్కడే మరణించాడు. ఆయన భార్య బైపాన కుమారి, కుమారుడు మోక్షిత్ (ఆరు నెలలు)తోపాటు 14 మంది గాయపడ్డారు. బస్సు ముందు భాగంలో కూర్చున్న రమేష్ సీట్లో ఇరుక్కుని అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్వల్పంగా గాయపడిన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం వారి ప్రాంతాలకు పంపించారు. ఆరు నెలల మోక్షిత్ తలకు బలమైన గాయాలయ్యాయి. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. ఘటన స్థలాన్ని నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా, నక్కపల్లి సీఐ అప్పన్న పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి నుంచి వివరాలు సేకరించారు. మృతుడి భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు నెమలిలో కృష్ణాష్టమి వేడుకలు

నెమలి(గంపలగూడెం): ఉమ్మడి కృష్ణా జిల్లాలో విశిష్ట ఆలయంగా విరాజిల్లుతున్న గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున 5 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం 12.30 గంటలకు తొమ్మిది రకాల విశేష ప్రసాదాలతో ప్రత్యేక నైవేద్యం సమర్పిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం 5గంటలకు నవనీత కృష్ణుని ఉట్టి ఉత్సవం, గ్రామోత్సవాలు జరుగుతాయని ఆయన తెలిపారు.

మాయమాటలతో రూ.40 వేలు కాజేసిన ఇద్దరిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యూట్యూబ్‌చానల్ సబ్ స్రైబ్ చేసుకుంటే రోజువారి ఆదాయం వస్తుందని మాయ మాటలు చెప్పి ఓ వ్యక్తి నుంచి రూ. 40వేలు కాజేసిన ఘటన భవానీపురంలో జరిగింది. భవానీపురానికి చెందిన లక్ష్మీదీపక్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, వర్క్‌ఫ్రం హోం చేస్తున్నాడు. జూలై 24న అతని మొబైల్ నంబరుకు ఓ వ్యక్తి కొన్ని చానల్స్ సబ్ స్రైబ్ చేసుకోమంటూ లింక్ వాట్సాప్ చేశాడు. సబ్‌స్రైబ్ చేస్తే రోజుకు రూ.1500 నుంచి రూ.4వేల వరకు సంపాదించవచ్చని నమ్మబలికారు. దీంతో లక్ష్మీదీపక్ చానల్స్ సబ్ స్రైబ్ చేసుకున్నాడు. ఒక్కో చానల్‌కు రూ. 50 చొప్పున అన్ని చానల్స్‌కు కలిపి రూ. 3020 నగదు యూపీఐ ద్వారా పంపారు. టెలీగ్రామ్ గ్రూప్‌లో జాయిన్ చేసి రూ. 5వేలు పెట్టుబడి పెట్టాలని నమ్మబలికారు. అతను రూ. 5వేలు ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఖాతాలనుంచి విష్ణుప్రసాద్ అనే వ్యక్తికి పంపాడు. తర్వాత మరో రూ. 35వేలు పంపాలని, ఇదే చివరి టాస్క్ అని చెప్పారు. తన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఖాతా నుంచి రూ. 35 వేలు రంజిత్ అనే వ్యక్తి బ్యాంకు ఖాతాకు పంపాడు. మళ్లీ రూ.75వేలు పంపాలని లేకపోతే ఇప్పటికే చెల్లించిన రూ. 40వేలు తిరిగిరావని చెప్పారు. అతనికి అనుమానం వచ్చి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈవీఎం, వీవీ ప్యాట్స్ యంత్రాలకు పటిష్ట భద్రత కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి మంగళవారం గొల్లపూడి వ్యవసాయ మార్కెట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఈవీఎం, ప్యాట్స్ గోడౌన్‌ను కలెక్టర్ ఢిల్లీరావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 8న బెంగళూరు నుంచి జిల్లాకు 15 వేల వీవీ ప్యాట్స్, కంట్రోల్ యూనిట్లు జిల్లాకు వస్తాయని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈవీఎం, వీవీ ప్యాట్స్ యంత్రాలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించాలని చెప్పారు. ప్రతి యంత్రం కోడ్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో పరిశీలించి కట్టుదిట్టమైన భద్రతతో గోదాములో భద్రపరచాలని ఆదేశించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో వాటిని గోదాముల్లో ఉంచాలని అధికారులకు సూచించారు. గోడౌన్ పరిశీలనలో డీఆర్వో కె.మోహన్‌కుమార్, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎం.దివాకర్ బాబు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, మార్కెట్ యార్డ్ ఈఈ వై. శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఈఈ వీఎస్ఆర్‌కే ప్రసాద్ ఉన్నారు.

ఆటోమేషన్ ఎక్స్‌పోలో విద్యార్థుల ప్రతిభ



ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న వీఆర్ విద్యార్థులు

పెనమలూరు: ఆటోమేషన్ ఎక్స్‌పోలో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి బహుమతి గెలిచారు. గత నెల 23 నుంచి 26వ తేదీ వరకు ముంబైలో జరిగిన జాతీయ స్థాయి ఆటోమేషన్ ఎక్స్‌పో -2023లో వీఆర్ సిద్ధార్థ కాలేజీకి చెందిన మెకానికల్ విభాగం విద్యార్థులు కాసింమౌల, దివ్యసింగి, ఆషిత, సురేంద్రబాబు పాల్గొని ప్రోగ్రామబుల్ లాజికల్ కంట్రోలర్ (పీఎల్‌సీ)ని ఉపయోగించి ఆటోమేటెడ్ స్పాట్ వెల్డింగ్ మెషిన్ అనే మోడల్‌ను ప్రదర్శించారు. 100కు పైగా పాల్గొన్న ఎక్స్‌పోలో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ విద్యార్థులు వారు ప్రదర్శించిన మోడల్‌కు తృతీయస్థానం పొంది బహుమతిని గెలుచుకున్నారు. మెకానికల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఢిల్లీబాబు మార్గదర్శిగా వ్యవహరించారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో బహుమతి గెలవడంతో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, విభాగాధిపతి ఎస్.విజయసాయి విద్యార్థులను అభినందించారు.

ఆలయ విరాళాల దుర్వినియోగంపై కేసు

పెనమలూరు: పెనమలూరులో శ్రీసీతారామలక్ష్మణస్వామి (చిన్నిగుడి) ఆలయ నిర్మాణానికి భక్తులు ఇచ్చిన విరాళాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఐ.సత్యవతి దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరులోని సీతారామలక్ష్మణస్వామి ఆలయం పునర్నిర్మాణానికి గ్రామస్తులు ఏడాదిన్నర క్రితం ముందుకు వచ్చారు. గుడి నిర్మాణానికి రూ.36 లక్షలు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. వీటిలో రూ.12 లక్షలను గ్రామస్తులు విరాళంగా ఇవ్వడానికి ముందుకు వచ్చారు. గుడి నిర్మాణానికి భక్తుల నుంచి మొత్తం రూ. 99,44,568 విరాళాలు వసూలు చేశారని గ్రామస్తుడు ముప్పాళ్ల బద్రినారాయణ ఎండోమెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. భక్తులు ఇచ్చిన విరాళాలు రూ 99,44,568లో గుడి నిర్మాణం అంచనాలో చూపిన భక్తుల విరాళం రూ.12 లక్షలు పోనూ విరాళాల కింద వసూలు చేసిన మిగతా రూ. 87,44,568కి లెక్క చూపలేదని ఫిర్యాదుదారుడు పేర్కొన్నాడు. విరాళాలు ఇచ్చిన భక్తులకు రశీదులు ఇవ్వలేదని, సరైన రికార్డు లేదని ఫిర్యాదు చేయడంతో దీనిపై ఎండోమెంట్ కమిషనర్ విచారణ చేశారు. నిధుల దుర్వినియోగంపై ఎస్పీకి ఆగస్టు 29వ తేదీన ఎండోమెంట్ కమిషనర్ ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో పెనమలూరు పోలీసులు పూర్వ ఈవో, ప్రస్తుతం పామర్రు ఉండ్రపూడి గ్రామంలోని శ్రీవీరాంజనేయ స్వామి గుడికి ఈవోగా చేస్తున్న సత్యవతిపై కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ ప్రాధాన్య భవనాలను పూర్తి చేయండి

అధికారులతో సమీక్షలో కలెక్టర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణాలను గడువులో పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ప్రాధాన్య భవన నిర్మాణాల పురోగతిని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్య భవనాలైన 268 గ్రామ సచివాలయాలు, 260 రైతు భరోసా కేంద్రాలు, 239 వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ల పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు పూర్తైన భవనాలను సంబంధిత శాఖల అధికారులకు అప్పగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సవాల్‌గా స్వీకరించి సమన్వయంతో నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. పనుల పురోగతిపై సంబంధిత కాంట్రాక్టర్లతో సంప్రదించి స్టేజ్ కన్వర్షన్ పూర్తి చేయాలన్నారు. తుది దశలో ఉన్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అప్పగించాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ ఎ.వెంకటేశ్వరావు, ఈఈలు, డీఈఈలు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



మృతుడు గోపాలకృష్ణారెడ్డి

జయంతి(వీరులపాడు): అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జయంతి గ్రామానికి చెందిన పింగల గోపాలకృష్ణారెడ్డి (31) కూలీ పనులు చేస్తుంటాడు. ఈ నెల రెండో తేదీ తన స్నేహితులతో కలిసి ఊరెల్లి తిరిగి వస్తున్నాడు. అతని భార్య.. రేచర్లలోని పుట్టింటికి వెళ్లింది. ఆమెకు వద్దకు వెళ్తానని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి గ్రామ శివారులోని చెరువు వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న గోపాలకృష్ణారెడ్డిని గమనించిన గ్రామస్తులు నంది గామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. అప్పులున్నాయని మానసిక వేదనతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని తల్లి వెంకాయమ్మ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

37 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రమేష్ ఆసుపత్రి రోడ్డులో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో మంగళవారం జాబ్ మేళా జరిగింది. దీనికి ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 153 మంది మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారికి ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 37 మందిని ఉద్యోగాలకు ఎంపికలు చేశారు. ప్రాంతీయ ఉపాధి అధికారి ఎస్.రామమోహన్‌రెడ్డి జాబ్‌మేళాను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



పెనమలూరు: పోరంకి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ఆస్పత్రిలో మరణించారు. పోరంకి సచివాలయం వీఆర్వో అబ్దుల్ అలీం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం పోరంకి క్యాపిటల్ ఆస్పత్రి సమీపంలో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పై వెళ్తున్న గుర్తు తెలియని మహిళ (50)ను ఆటో ఢీకొట్టింది. ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడటంతో 108 వాహనంలో విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ అదేరోజు రాత్రి మరణించింది. మృతురాలి వివరాలు తెలిసిన వారు వెంటనే పెనమలూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

చీటింగ్ కేసులో రెండేళ్ల జైలు

గన్నవరం: చీటింగ్ కేసులో ఓ వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధిస్తూ గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు మంగళవారం తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపిన సమాచారం ప్రకారం.. మండలంలోని బుద్ధవరం పరిధిలోని.. డీఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఆయన సోదరి విజయశ్రీకి చెందిన 50 సెంట్లు, కారంపూడి సరస్వతికి చెందిన 50 సెంట్ల భూమిని 2015లో గన్నవరానికి చెందిన ద్రోణవల్లి ప్రదీప్ కొనుగోలు చేశాడు. విమానాశ్రయ విస్తరణలోని ఆ భూములను ల్యాండ్ పూలింగ్ పర్మిషన్ ప్రకారం 30 రోజుల్లో రిజిస్ట్రీ చేసుకునే కండిషన్‌పై ప్రదీప్ కొన్నారు. సదరు ఎకరం భూమిని విజయవాడకు చెందిన చెరుకూరి కృష్ణ రూ. 1.05 కోట్లుకు కొనుగోలు చేసేందుకు ప్రదీప్‌తో అగ్రిమెంట్ చేసుకుని రూ. 30 లక్షలు అడ్వాన్స్ చెల్లించారు. ప్రదీప్, మురళీకృష్ణ, విజయశ్రీ కుమ్మక్కై కృష్ణకు తెలియకుండా అమెరికాలో ఉంటున్న ప్రదీప్ సోదరి కాజ జయలక్ష్మి పేరున ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై కృష్ణ కోర్టును ఆశ్రయించడంతో జడ్జి ఆదేశాల మేరకు గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో ప్రదీప్‌కు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ 12వ ఏఎంఎం కోర్టు జడ్జి తీర్పుఇచ్చారు. జరిమానా చెల్లించకపోతే మరో మూడు నెలల జైలు శిక్షను పొడిగించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ఇబ్రహీంపట్నం: కులాంతర వివాహం చేసుకున్న ప్రేమజంట కుటుంబ పెద్దల నుంచి రక్షణ కల్పించాలని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆశ్రయించారు. మండలంలోని తుమ్మలపాలెంకు చెందిన యువకుడు స్వర్ణరఘునాథ్, కొండపల్లికి చెందిన యువతి మధుశ్రీ దివ్య కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నారు. కులాలు వేరుకావడంతో కుటుంబ పెద్దలకు చెప్ప కుండా ఇబ్రహీంపట్నం ఆంజనేయస్వామి ఆలయంలో దండలు మార్చుకుని వివాహం చేసుకున్నారు. పెళ్లి కుటుంబ పెద్దలు ఒప్పుకోరని భావించి పోలీసులను ఆశ్రయించి రక్షణ కల్పించాలని కోరారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు



విజయవాడస్పోర్ట్స్: నగరంలోని బందరు రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ సిబ్బందిని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశించారు. బెంజిసర్కిల్, పటమట ఎన్టీఆర్ సర్కిల్, ఆటోనగర్ గేట్ ప్రాంతాల్లో సీపీ రాణా మంగళవారం పర్యటించారు. బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ బస్టాండ్ వరకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలను అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందికి వివరించారు. సీపీ వెంట డీసీపీ ఎం.రవీంద్రబాబు, ఏడీసీపీ డి.ప్రసాద్, ఏసీపీలు పి.భాస్కరరావు, జె.వెంకటనారాయణ, డాక్టర్ బి.రవికిరణ్ ఉన్నారు.

నేడు, రేపు కృష్ణాష్టమి వేడుకలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారి తోట, 18వ డివిజన్‌లో వారధి వెంబడి మలేరియా కార్యాలయం ఆవరణలోని శ్రీ కృష్ణుని విగ్రహం వద్ద బుధవారం, గురువారం రెండు రోజుల పాటు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా బుధవారం శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. గురువారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం జరుగుతుందన్నారు. వేడుకల్లో ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు పాల్గొంటారని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందని పర్యావరణ ప్రేమికుడు, మధుమేహ వైద్య నిపుణుడు డాక్టర్ కొండా వేణుగోపాలరెడ్డి అన్నారు. మంగళగిరిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నాటేందుకు (వంద మామిడి, వంద ఉసిరి) 200ల మొక్కలను మంగళవారం అందచేశారు. ఈ ఏడాది రెడ్‌క్రాస్ సొసైటీకి వెయ్యి మొక్కలు అందజేశామని, ఇంకా పంపిణీకి వెయ్యి మామిడి మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మామిడి మొక్కలు పెంచేందుకు ఆసక్తి ఉన్న వారు 92476 62158 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి, వారికి సరైన వైద్యం అందేలా వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంత వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా (డీఫార్మిటీ, డెఫిషియన్సీ, చైల్డ్‌హుడ్ డీసీజెస్, డిలే) వైకల్యం, లోపం, బాల్యవ్యాధులు, ఆలస్యం-4డీల సామర్థ్య పెంపు పునశ్చరణ శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అజిత్‌సింగ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో 360 మంది వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ పిల్లలకు వచ్చే వ్యాధులు, లోపాలు సత్వరమే గుర్తించడం ద్వారా వారిని జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రానికి పంపించి చికిత్స అందించి ఆరోగ్యం మెరుగుపరచవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవి, రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్, కుటుంబ డాక్టర్ కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ మోతీబాబు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రొఫెసర్‌గా ఎండీ రియాజుద్దీన్



విజయవాడరూరల్: హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ ఎండీ రియాజుద్దీన్‌కు ఉత్తమ ప్రొఫెసర్ అవార్డు లభించింది. సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్(సొలిట్) సంస్థ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఉత్తమ అధ్యాపకులకు అవార్డులను ప్రకటించింది. ఈ సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు అవార్డును ప్రధానం చేశారు. రియాజుద్దీన్‌ను పలువురు అభినందించారు.

సమాజంలో గురువుల పాత్ర విశిష్టమైనది

- ఘనంగా టీచర్స్ డే వేడుకలు
- ఉపాధ్యాయులకు సత్కారం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మనిషి జీవితంలో గురువుల పాత్ర చాలా విశిష్టమైనదని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) విజయవాడ బ్రాంచ్ జాయింట్ డైరెక్టర్ పి.రత్నాకర్ చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయం ఆవరణలో టీచర్స్ డే వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పి.రత్నాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గురువు తరగతి గదిలోని పాఠాలకే పరిమితం కాదని విద్యార్థుల వ్యక్తిత్వంపైన కూడా గురువు ముద్ర ఉంటుందన్నారు. అందువల్ల సమాజంలో గురువులకు ఎప్పటికీ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని చెప్పారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎన్.విద్యాకన్నా మాట్లాడుతూ గురువు అనే వాళ్లు కేవలం పాఠ్య పుస్తకాల్లోని పాఠాలే కాకుండా జీవితంలో ఎదురయ్యే సమస్యలను సైతం ధైర్యంగా ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ మాట్లాడుతూ డాక్టర్ సర్వపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. జనశిక్షణ సంస్థాన్‌లో రిసోర్స్ పర్సన్లు పి.వరలక్ష్మి, బి.రామసీత, బి.వెంకట రమణ, పి.నాగలక్ష్మి, ఎల్వీ కృష్ణారావులను సత్కరించారు. జనశిక్షణ సంస్థాన్ సిబ్బంది, శిక్షణార్థులు పాల్గొన్నారు.

జ్ఞానార్జనకు గురువుల పాత్ర కీలకం..

గుణదల(విజయవాడతూర్పు): మనిషి మానసిక వికాసానికి , జ్ఞానార్జనకు గురువులు కీలక పాత్ర పోషిస్తారని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సునీత అన్నారు. గుణదలలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో టీచర్స్ డే వేడుకలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. మన దైనందిన జీవితంలో గురువుల పాత్ర అత్యంత ప్రాధాన్యమైనదన్నారు. సాధారణ వ్యక్తిని అసాధారణ శక్తిగా మార్చగలిగే ప్రక్రియ గురువుకే ఉంటుందని తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్, ప్రిన్సిపాల్ రామభారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గురునానక్ నగర్‌లోని సిటిజన్స్ పబ్లిక్ స్కూల్‌లో గురు పూజోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి.లక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంత ఉన్నత స్థాయికి చేరినా ఆ గొప్పతనం గురువులదేనన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో అభివృద్ధికి గురువులదే కీలక పాత్ర అన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

లయోల కళాశాలలో..

విద్యార్థులను నైతిక విలువలు గల పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని లయోల కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి శ్రీకుమార్ అన్నారు. ఆంధ్ర లయోల ఇంజినీరింగ్ కళాశాలలో టీచర్స్ డే వేడుకలు జరిగాయి. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ ఓ మహేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, అవినాష్, నిర్వాహకులు

బిషప్ అజరయ్య స్కూల్‌లో..

లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబిలీ హరిత ఆధ్వర్యంలో బిషప్ అజరయ్య పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ జేఎస్ శంకరగుప్తా, జోనల్ చైర్మన్ ఎస్ నిరంజన్, క్లబ్ ఫాస్ట్ జోనల్ చైర్మన్ వై.శ్రీనివాసరావు, కార్యదర్శి కె.ఫణీంద్రబాబు, కోశాధికారి కావేటి వెంకటేశ్వరరావు, క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్, యోగా గురువు అంకాల సత్యనారాయణ, సర్వీస్ యాక్టివిటీస్ ఆర్గనైజర్ బెల్లంకొండ శ్రీనివాసప్రసాద్, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఐవీ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయురాలు కృష్ణవేణికి కుట్టు మిషన్‌ను అందించారు.

ఉపాధ్యాయులు మార్గదర్శకంగా ఉండాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులను తీర్చిదిద్ది, వారిని విజ్ఞాన మార్గంలో విజయపథంలో నడిపించడంలో ఉపాధ్యాయులు మార్గదర్శకంగా నిలవాలని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు డి.ప్రభాకర్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఎంజీ రోడ్డులోని సెయింట్‌జాన్స్ స్కూల్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డి.ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, స్కూల్ ప్రెసిడెంట్ మోనికా సుమన్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుమన్ త్యాగరాజ్‌లు పాల్గొని ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుమన్ త్యాగరాజ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల త్యాగం, సహనం వంటి సద్గుణాలతో విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించి, వారికి చక్కని క్రమశిక్షణ అలవరిచి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రిన్సిపాల్ సీహెచ్ భారతి, వైస్ ప్రిన్సిపాల్ వై.నీరజ పాల్గొన్నారు.

నలందలో వేడుకలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గాయత్రీనగర్‌లోని నలంద విద్యానికేతన్ సెకండరీ విభాగంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ దేశానికి కావాల్సిన శక్తివంతమైన భావిభారత పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని, గురువును దైవం కంటే మిన్నగా ఆరాధించే సంస్కృతి మనదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వీసీఎల్ అండ్ టీపీ ఆధ్వర్యంలో..

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):పేదలకూ నాణ్యమైన విద్యను అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం రాత్రి మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్ అండ్ ట్యూటోరియల్స్ అసోసియేషన్ (వీసీఎస్ అండ్‌టీఏ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలంపల్లి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ముఖ్య అతిథులుగా హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెలంపల్లి, అవినాష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని సౌకర్యాలను నాడు-నేడు పథకం ద్వారా అందిస్తున్నామని చెప్పారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. సభ అనంతరం రాయల్ హైస్కూల్ అధినేత ఆజాద్, సిద్ధార్థ క్రియేటివ్ స్కూల్ అధినేత వాసా ఆదినారాయణ దంపతులను అతిథులు సత్కరించారు. వీసీఎస్ అండ్ టీపీ అధ్యక్షురాలు వెనిగళ్ల అమ్మాజీ, కార్పొరేటర్ వై.చలపతిరావు, వీసీఎస్ అండ్ టీపీ గౌరవాధ్యక్షుడు దేవినేని కిషోర్ కుమార్, అసోసియేషన్ సభ్యులు సాంబశివరావు, షేక్ షరీఫున్నీసా, అనుమాటి చెన్నయ్య, బాడిష ఉషారాణి, సాయి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా గురు పూజోత్సవం

పటమట(విజయవాడతూర్పు): మేరీస్ స్టెల్లా కళాశాలలో గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్ మాట్లాడుతూ.. అధ్యాపకులు విద్యార్థులకు విద్యతో పాటు విలువలు కూడా నేర్పించాలన్నారు. కోవిడ్ సమయంలో కూడా ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించి విద్యార్థుల జీవితంలో అభ్యాసాలకు ఆటంకం లేకుండా బోధన చేశారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ స్టీవా, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో..

పటమట ఎన్నారై స్ప్రింగ్స్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం, కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల్లో ప్రతిభను తొలుత గుర్తించేది ఉపాధ్యాయులేనని పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య అన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో కీలకమైన పాత్ర ఉపాధ్యాయులపై ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు అన్నారు. అనంతరం బుధవారం కృష్ణాష్టమి సందర్భంగా పాఠశాల విద్యార్థులతో బృందగానం, నృత్యం, కృష్ణ, గోపికల వేషధారణ, ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదర్ థెరీసా ట్రస్ట్ ఆధ్వర్యంలో..

ఆటోనగర్(విజయవాడతూర్పు): మదర్ థెరీసా మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఆటోనగర్ 100 అడుగుల రోడ్డులోని ఫస్ట్ క్రాస్ రోడ్డులో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముగ్గురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ గోగినేని ధనశేఖర్ భారత రత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు సెకం వెంకటేశ్వరరావు, మారుబోయిన మాధవరావు, కె.రంగారావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తుమాటి ప్రేమ్‌నాథ్, కేవీపీ బసవేశ్వర రావు, శ్రీరాం, కె.కోటయ్య పాల్గొన్నారు.

లిటిల్ బ్రెయిన్స్ స్కూల్‌లో..

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక సిద్ధార్థనగర్‌లోని లిటిల్ బ్రెయిన్స్ స్కూల్ ఆవరణలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఫణి ప్రసాద్ ముక్తేవి, ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జనశిక్షణ సంస్థాన్‌లో రిసోర్స్ పర్సన్లను సత్కరిస్తున్న నిర్వాహకులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



మేరీస్ స్టెల్లా కళాశాలలో..



నలందలో వేడుకలు

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది గురువులే..

విజయవాడకల్చరల్: భావిభారత భవిష్యత్‌ను నిర్ణయించేది, బాల బాలికలను ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దేది గురువులేనని మాతా శివానంద సరస్వతి అన్నారు. స్పృహాప్తి చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో పటమటలోని జీడీఈటీ మున్సిపల్ స్కూల్‌లో మంగళవారం గురుపూజోత్సవ వేడుకలు, ఉత్తమ ప్రతిభ కనపరచిన గురువులకు విద్యా శిఖర పురస్కారాల సభను నిర్వహించారు. సంస్థ చైర్మన్ వీరంకి భారతీదేవి మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సూచించారు. వైస్ చైర్మన్ వీరంకి లేపాక్షి, కార్యదర్శి పద్మ, కోశాధికారి తిరుమలశెట్టి మాధవి పాల్గొన్నారు. నిర్వాహకులు 15 మంది గురువులకు విద్యా శిఖర పురస్కారాలు ప్రదానం చేశారు.



లిటిల్ బ్రెయిన్స్ స్కూల్‌లో..



బిషప్ అజరయ్య స్కూల్‌లో ఉపాధ్యాయులకు సత్కారం



గురువులతో మాతా శివానంద సరస్వతి, నిర్వాహకులు



సెయింట్‌జాన్స్ స్కూల్‌లో..

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. 7వ డివిజన్ పరిధిలోని సీఎస్ఐ చర్చి కొండ ప్రాంతంలో మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులతో కలిసి అవినాష్ మంగళవారం పర్యటించారు. స్థానిక సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో జరుగుతున్న మెట్లు, ర్యాంపులు, రోడ్ల నిర్మాణ పనులను అవినాష్ స్వయంగా పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి లోపాలు లేకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవినాష్ మాట్లాడుతూ.. గత టీడీపీ పాలనంతా అవినీతిమయమన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులు ప్రజల సంపదను విచ్చలవిడిగా దోచుకున్నారని చెప్పారు. డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ శాఖాధికారులతో మాట్లాడతానని అవినాష్ హామీ ఇచ్చారు. కార్పొరేటర్ ఎం.మాధురి, నాయకులు కుటుంబరావు, తాళ్లూరి ఉదయ్, రవి, రాజ్‌కమల్, సంపత్, సాయి, శంకర్, దాసు, లెనిన్, చంద్రిక, శ్రీదేవి, సుజాత, జీసస్, రాజు, దుర్గాప్రసాద్, సురేంద్ర పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

తోపుడు బండ్లు అందజేత

గతంలో 7వ డివిజన్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా అవినాష్ పర్యటించినప్పుడు తమకు జీవనోపాధి నిమిత్తం సహాయం చేయాలని పలువురు కోరారు. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గూడపాటి సత్యనారాయణకు తోపుడు బండి, టి.రిబ్కాకు టిఫిన్ బండిని అవినాష్ మంగళవారం అందజేశారు.

రాత్రి 10 తర్వాతే ఈట్ స్ట్రీట్ ప్రారంభించాలి

పటమట(విజయవాడతూర్పు): ఇందిరాగాంధీ స్టేడియం వద్ద విజయవాడ నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్‌ను రాత్రి 10 -12 గంటల వరకు మాత్రమే నిర్వహించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఎస్టేట్ అధికారి శ్రీనివాస్‌ను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆయన ఈ ప్రాంతాన్ని సందర్శించి ఈట్ స్ట్రీట్‌లో స్టాల్స్ కేటాయించిన వారంతా సాయంత్రం 6 గంటలకే స్టాల్స్ ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహించటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. 10 గంటలకు ముందు ఎవరైనా స్టాల్స్ పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతి స్టాల్ వద్ద డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలన్నారు.

విద్యార్థులకు సృజనాత్మకత పోటీలు


పటమ(విజయవాడతూర్పు): స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రజలందరూ సహకరించాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి కోరారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నాలుగో అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి, నీలి ఆకాశం దినోత్సవం సందర్భంగా నగరంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు మంగళవారం డ్రాయింగ్ పోటీలు, సైన్స్ ఫెయిర్, సృజనాత్మకత పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఏసీ మాట్లాడుతూ.. బాల్యం నుంచే ప్రకృతి, పర్యావరణంపై అవగాహన కల్పించాలన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నిరోధించేందుకు విద్యార్థుల్లో కాలుష్యాన్ని తగ్గించే సృజనాత్మకమైన ఆలోచనలను రేకెత్తించాలని చెప్పారు. వాయు కాలుష్యం ప్రభావం అనే అంశంపై మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



విద్యార్థుల ప్రయోగాలను తిలకిస్తున్న వీఎంసీ అదనపు కమిషనర్ సత్యవతి

కేఎల్‌యూ విద్యార్థికి జపాన్ ఐటీ కంపెనీలో ఉద్యోగం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్‌యూ డీమ్డ్ యూనివర్సిటీలో ఈసీఈ చదువుతున్న ముల్లా అబ్దుల్ ఖాదిర్ అనే విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగం సాధించినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సారధివర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ఉద్యోగాల కల్పనలో భాగంగా క్యాడ్ వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్‌లను అభివృద్ధి పరిచే సిస్టమ్ మ్యాట్రిక్స్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో రూ.26 లక్షల వార్షిక జీతంతో పాటు వసతి, ప్రయాణ ఖర్చులు వంటి పలు రకాల అలవెన్సులను కంపెనీ కల్పిస్తుందన్నారు. విజయవాడకు చెందిన ముల్లా అబ్దుల్ ఖాదిర్ తల్లిదండ్రుల సొంతూరు విజయవాడ అయినప్పటికీ ప్రస్తుతం వారు విదేశాలలో ఉంటున్నారని తెలిపారు. భాషా సమస్య లేకుండా ఉండటం కోసం వర్సిటీలో ఉన్న విదేశీ భాషల విభాగం ఆధ్వర్యంలో విద్యార్థి ఖాదిర్‌కు జపాన్ భాషపై ప్రత్యేక శిక్షణనిస్తున్నట్లు తెలిపారు.



ముల్లా అబ్దుల్ ఖాదిర్

రౌడీషీటర్లు తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా పటమట, కృష్ణాజిల్లా పెనమలూరు పోలీస్‌స్టేషన్ల సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలను వేధింపులకు గురిచేస్తున్న రౌడీషీటర్లు తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సిటీ పోలీస్ కమిషనర్ టీకే రాణా హెచ్చరించారు. పటమట ప్రాంతంలో కొంతమంది యువకులు కలిసి రోడ్డుపై మద్యం సేవించి ఘర్షణ పడుతున్నారని స్థానికులు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలంలో ఉన్న పటమట పోలీసులు రౌడీషీటర్ పండు, రెహమాన్, కోనేరు రాజా, కవి ప్రవీణ్ వారి అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. అసాంఘిక పనులకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని సీపీ వారిని హెచ్చరించారు. పొలిటికల్ సపోర్టుతో రెచ్చిపోతే ఉపేక్షించేది లేదన్నారు.

వేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేద బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనములో వైసీపీ కార్పొరేటర్ శర్వాణీ మూర్తితో కలిసి క్రెడిట్ సొసైటీ రుణమేళా బ్రోచర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యాన సత్యనారాయణపురంలోని గాయత్రీ కల్యాణం మండపం ఆవరణలో ఈనెల 10వ తేదీన జరగనున్న రుణమేళాను నిరుపేద బ్రాహ్మణులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొసైటీ సీనియర్ బ్రాంచి మేనేజర్ జి.శ్రీనివాస్, నాయకులు చల్లా సుధాకర్, శనగవరపు శ్రీనివాస్, లంకా బాబు, చాంద్ శర్మ, మద్దాలి ప్రకాష్, కోలవెన్ను కొండా పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): జిల్లాలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఎన్టీఆర్ జిల్లా విద్యారంగా అభివృద్ధికై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపడుతున్న సంఘర్షణ సైకిల్ యాత్ర వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. పాఠశాలల విలీనంతో గ్రామీణ ప్రాంతాల్లో డ్రాప్ ఔట్స్ పెరిగాయన్నారు. ప్రభుత్వం విలీన ప్రక్రియ వెంటనే ఆపాలన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు ఎం.సోమేశ్వరరావు, మన్మథ, కుమారస్వామి, రాజు, రిజ్వాన్ పాల్గొన్నారు.

11న వాహనాల వేలం

పటమట(విజయవాడతూర్పు): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విజయవాడ ఈస్ట్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 11వ తేదీ వేలం నిర్వహిస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ నిక్సన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్విచక్ర వాహనాలకు రూ.5 వేలు, కార్లకు రూ.10 వేలు(రిఫండబుల్) ధరవత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వేలం 11వ తేదీ ఉదయం 11 గంటలకు గురునానక్ కాలనీలోని స్టేషన్‌లో జరుగుతుందన్నారు. 94409 02454, 99598 41282 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా...

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

- ఢిల్లీలో రాష్ట్రపతి ప్రదానం
- ఏపీ నుంచి ముగ్గురు ఎంపిక



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న మేకల భాస్కరరావు, సెట్టెం ఆంజనేయులు, మురహరరావు ఉమాగాంధీ

సాక్షి, న్యూఢిల్లీ : దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 75 మంది ఉపాధ్యాయులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2023 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లు ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు, తెలంగాణ నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్నారు. ప్రాథమిక విద్యాశాఖ విభాగం కేటగిరీలో ఏపీ నుంచి నెల్లూరుకు చెందిన మేకల భాస్కర్ రావు, విశాఖపట్నం శివాజీపాలేనికి చెందిన మురహరరావు ఉమాగాంధీ, రాయచోటికి చెందిన సెట్టెం ఆంజనేయులు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో టీచర్ల పాత్ర ప్రశంసనీయం

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా టీచర్లందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. 'భవిష్యత్ తరాలను సమున్నతంగా తీర్చిదిద్దడంలో టీచర్లు నిర్వహిస్తున్న పాత్ర ప్రశంసనీయమైనది. విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులను అమలు చేస్తూ.. ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనేలా మన పేదింటి పిల్లలను సుశిక్షితులుగా తయారు చేయడంలో దృఢ సంకల్పంతో కృషి చేస్తున్న టీచర్లందరికీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు. ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శంగా నిలిచిన ఆచార్యులు, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతి సందర్భంగా నివాళులు' అని సీఎం జగన్ మంగళవారం ట్వీట్ చేశారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో వర్షాల వల్ల విద్యుత్ డిమాండ్ కొంత వరకూ తగ్గినందున పరిశ్రమలకు విద్యుత్ వినియోగంపై పరిమితులు అమలు చేయాల్సిన అవసరం లేదని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ)కి ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు మంగళవారం నివేదించాయి. విద్యుత్ డిమాండ్, సరఫరా మధ్య అంతరం ఏర్పడిన నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ వరకూ పరిశ్రమలకు వినియోగంపై కొంత పరిమితి పెట్టి దానిని ప్రాధాన్యత రంగాలైన వ్యవసాయ, గృహావసరాలకు కోత లేకుండా సరఫరా చేసేందుకు అనుమతించాలని ఈ నెల ఒకటో తేదీన ఏపీఈఆర్సీకి డిస్కంలు లేఖ రాశాయి. అయితే వాతావరణం కొంత అనుకూలించిన నేపథ్యంలో డిమాండ్ తగ్గిందని, రానున్న రెండు వారాలపాటు డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా చేయొచ్చని అధికారులు భావించారు. దీంతో పరిశ్రమలకు ఎలాంటి షరతుల్లేకుండా గతంలో లాగే పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా చేస్తామని డిస్కంలు ఏపీఈఆర్సీకి రాసిన లేఖలో పేర్కొన్నాయి.

జీఎస్ఎల్‌లో మరో 14 పీజీ సీట్లకు నకిలీ అనుమతులు

సాక్షి, అమరావతి: రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ వైద్యకళాశాలలో ఎండీ-రేడియో డయాగ్నోసిస్ కోర్సులో 14 పీజీ సీట్లు పెంపునకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) పేరిట నకిలీ అనుమతులు వెలువడ్డాయి. ఈ అంశాన్ని ధ్రువీకరిస్తూ ఎన్ఎంసీ మంగళవారం ప్రకటన చేసింది. 2023-24 విద్యాసంవత్సరానికి పీజీ సీట్లను 10 నుంచి 24కు పెంచుతూ ఫేక్ లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్ఓపీ) వెలువడినట్లు తమ దృష్టికి వచ్చిందని ఎన్ఎంసీ తెలిపింది. పీజీ సీట్ల పెంపునకు సంబంధించి కళాశాల నుంచి తమకు దరఖాస్తు అందలేదని, అదేవిధంగా మెడికల్ అసెస్‌మెంట్, రేటింగ్ బోర్డ్(ఎంఏఆర్‌బీ) నుంచి ఎటువంటి సమాచారం కళాశాలకు వెళ్లలేదని స్పష్టం చేసింది.

రేపు ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన సదస్సులు

నగరంపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన పెంపొందించేందుకు సన్నద్ధమైంది. ఈ క్రమంలో ఏపీ క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) ఆధ్వర్యంలో 'ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ సాధికారిత-వారిపై జరిగే దాడులను ఏ విధంగా నివారించాలి' అనే అంశంపై పెద్ద ఎత్తున సదస్సులు నిర్వహించనున్నారు. ఈ నెల ఏడో తేదీన సీఐడీ ప్రాంతీయ కార్యాలయాల పరిధిలోని గుంటూరు, విశాఖపట్నం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, తిరుపతి, రాజమండ్రి, కర్నూలు, విజయవాడలో సదస్సులు నిర్వహిస్తారు.

విద్యపై ఖర్చు రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడి

- విద్యాశాఖ మంత్రి బొత్స
- విశాఖలో ఘనంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం

సాక్షి, విశాఖపట్నం: విద్యపై చేస్తున్న ఖర్చు మన రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడి అని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ కుటుంబ సభ్యులేననీ, ప్రతి ఉద్యోగి ప్రభుత్వంలో అంతర్భాగమేనని వారిపై పనిఒత్తిడి తగ్గించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ ఆలోచిస్తుంటారని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి మంత్రులు బొత్స, బూడి ముత్యాల నాయుడు, గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ విద్యాలయాల్లో ఉత్తమ బోధన అందిస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ ఏమన్నారంటే..

విశ్వవిద్యాలయాల్లో 3,200 పోస్టుల భర్తీ

రాష్ట్రంలో టీచర్లకు జీతాలు ఇంకా వేయలేదని కొందరు విమర్శిస్తున్నారు. ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వకుండా ఏ ప్రభుత్వమైనా ఉంటుందా? కేవలం సాంకేతిక కారణాలతోనే జీతాలు ఆలస్యమయ్యాయి. 7 లేదా 8 తేదీల్లో జీతాలు జమచేస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నడూలేని విధంగా ఇప్పుడు 'నో అడ్మిషన్' బోర్డులు పెడుతున్నాం. అదేవిధంగా.. ఇటీవల టెన్త్ ఫలితాల్లో ఎక్కువ స్టేట్ ర్యాంకులు గవర్నమెంట్ స్కూల్స్‌లో చదివే విద్యార్థులే దక్కించుకున్నారు. వీటన్నింటికీ కారణం ప్రభుత్వ ఉపాధ్యాయులే. ఇక విద్య మీద ఖర్చుచేసే ప్రతి రూపాయి రాష్ట్రం మీద పెట్టుబడిగా ప్రభుత్వం భావిస్తోంది. గత 15 ఏళ్లుగా యూనివర్సిటీల్లో నియామకాల్లేవు. సీఎం జగన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం 3,200 పోస్టులు భర్తీని డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తిచేస్తాం.

ఉపాధ్యాయులందరికీ న్యాయం జరుగుతుంది..

మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ 'మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు విశాఖకు విడదీయలేని అనుబంధం ఉంది. సీఎం జగన్ న్యాయం చేయలేకపోతే ఉపాధ్యాయులకు మరెవ్వరూ మేలు చేయలేరు. ఒక రోజు అటు ఇటుగా అందరికీ న్యాయం జరుగుతుంది' అని అన్నారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ 'విద్యావ్యవస్థలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చి పాఠశాలలను మెరుగుపరచేందుకు అనేక సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది' అన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో మంత్రి బొత్స, రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు

'ప్రపంచ జ్ఞానం నేర్పే గురువులకు కృతజ్ఞతాభివందనాలు'

'బిడ్డ గొప్పగా ఎదిగితే.. ఆ బిడ్డ తల్లిదండ్రుల ఆనందం.. ఆకాశాన్నంటుతుంది. వందలు.. వేల పిల్లల జీవితాల్ని తీర్చిదిద్దే ప్రతి టీచర్‌కు లభించే సంతోషం, సంతృప్తి ఇంకెంత గొప్పదో మాటల్లో చెప్పలేం. శిక్షణ, క్రమశిక్షణ.. పాఠాలు, జీవిత పాఠాలు.. అక్షరజ్ఞానం, ఆలోచనలు.. ప్రపంచ జ్ఞానం అన్నీ నేర్పే గురుబ్రహ్మలకు, మేధోశక్తులకు ఆదర్శప్రాయులైన మంచి టీచర్లకు, రాష్ట్రం తరఫున కృతజ్ఞతాభివందనాలు.

(విదేశీ పర్యటనలో ఉన్న సీఎం వైఎస్ జగన్ సందేశాన్ని సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు చదివి వినిపించారు.)

రాష్ట్రపతి, ప్రధాని సందేశాలు

ఇక గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపతిముర్ము సందేశాన్ని ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి... ప్రధాని మోదీ సందేశాన్ని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ చదివి వినిపించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 11 కేటగిరీల్లో 196 మందికి ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అవార్డులందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీ డా.బీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్. సురేష్ కుమార్, ఏయూ వీసీ ప్రొఫెసర్ ప్రసాద రెడ్డి, విశాఖ మేయర్ జీహెచ్‌వీ కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమవరంలో మరో పుంగనూరు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై టీడీపీ మూకల దాష్టీకం • అడ్డుకోబోయిన పోలీసులపైనా దాడి • తీవ్రంగా గాయపడ్డ కానిస్టేబుళ్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



భీమవరంలో వైఎస్సార్‌సీపీ జెండాను తగలబెడుతున్న తెలుగుదేశం కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై రాళ్లు విసురుతున్న టీడీపీ గ్యాంగ్



పాదయాత్రలో అలజడి సృష్టిస్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి, భీమవరం / భీమవరం (ప్రకాశంచౌక్):

నిన్న రాయలసీమ.. నేడు పచ్చని సీమ! అక్కడ చల్లా బాబు.. ఇక్కడ చింతమనేని..!!

యువగళం పాదయాత్రలో టీడీపీ రౌడీమూకలు మరోసారి రెచ్చిపోయాయి. పుంగనూరులో చంద్రబాబు కనుసన్నల్లో దౌర్జన్యాలకు తెగబడగా... భీమవరంలో లోకేశ్ ప్రోద్బలంతో పేట్రేగిపోయాయి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రకాశం చౌక్‌లో మంగళవారం రాత్రి బహిరంగ సభ అనంతరం గునుపూడి శివారులో టీడీపీ శ్రేణులు రాళ్లు, కర్రలతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు బరి తెగించాయి. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వారి నుంచి తప్పించుకొని స్థానికంగా ఉన్న ఇళ్లలో తలదాచుకున్నా వదలకుండా వెంటాడారు. మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తూ దారుణంగా కొట్టారు. టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్ నేరుగా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపైకి వెళ్లి దాడులకు పురిగొల్పారు. ఆ ప్రాంతంలో అధిక సంఖ్యలో దళితులు నివసిస్తుండటం గమనార్హం. యువగళంలో ఒక టీమ్ ఆ ప్రాంతాన్ని డ్రోన్‌తో చిత్రీకరిస్తూ దూరంగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తల గురించి టీడీపీ శ్రేణులకు సమాచారాన్ని చేరవేసింది. దీంతో రౌడీమూకలు అక్కడకు చేరుకుని దాడులకు తెగించాయి.

రెచ్చగొట్టి.. రచ్చ చేసి

లోకేశ్ పాదయాత్రలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభ వద్ద టీడీపీ కార్యకర్తలు వ్యూహాత్మకంగా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారు. గతంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీపై వాటర్ బాటిళ్లు, రాళ్లు రువ్వడంతో పాటు ఫ్లెక్సీని తొలగించడానికి ప్రయత్నించారు. వివేకానందరెడ్డిని చంపింది ఎవరంటూ ఫ్లెక్సీలను ప్రదర్శించి రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఫ్లెక్సీలను పట్టుకుని నినాదాలు చేస్తూ ఉద్రిక్తత సృష్టించారు. వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను, ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తమ సిబ్బందితో వారిని వారించగా తోసుకుంటూ వెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు సహనంతో వారిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. కాగా, బహిరంగ సభ కోసం టీడీపీ నాయకులు మహిళలకు రూ.300, పురుషులకు రూ.500 చొప్పున ఇచ్చి జనాన్ని తరలించారు. భీమవరంతో పాటు పాలకోడేరు, కుముదవల్లి, శృంగవృక్షం, వీరవాసరం తదితర ప్రాంతాల నుంచి ఆటోలు ఏర్పాటు చేసి వృద్ధులను సైతం డబ్బు ఆశ చూపి లోకేశ్ సభకు తీసుకొచ్చారు. లోకేశ్ ప్రసంగం ప్రారంభించగానే వారంతా వెనుదిరిగారు.



బహిరంగ సభలో లోకేశ్ మాట్లాడుతుండగా వెనుదిరిగి వెళ్లిపోతున్న జనం



టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడిన కానిస్టేబుల్ రమేష్

ముగ్గురు పోలీసుల తలలకు తీవ్ర గాయాలు

తమను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులను టీడీపీ రౌడీ మూకలు తీవ్రంగా గాయపరిచాయి. రాళ్లు, కర్రలతో పోలీసులపై దాడికి దిగడంతో వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, టూటౌన్ కానిస్టేబుల్ రమేష్‌తో పాటు మరో కానిస్టేబుల్ తలకు బలమైన గాయాలయ్యాయి. ఇతర పోలీస్ సిబ్బంది కూడా గాయపడ్డారు. వీరికి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పాదయాత్రలో తనతో పాటు రౌడీ గ్యాంగ్‌ను వెంటేసుకుని తిరుగుతున్న లోకేశ్ తీరును ప్రశాంతతకు నిలయమైన భీమవరం ప్రజలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా లోకేశ్ నిర్వహిస్తున్న పాదయాత్ర ఎవరి కోసమని మండిపడుతున్నారు.

కానిస్టేబుళ్లు, కార్యకర్తలకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పరామర్శ

టీడీపీ రౌడీ గ్యాంగ్ దాడిలో తీవ్రంగా గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుళ్లు, కార్యకర్తలను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పరామర్శించారు. లోకేశ్ పాదయాత్రకు బందోబస్తుగా ఉన్న పోలీసులపై సైతం దాడి చేసి తీవ్రంగా గాయపరచటాన్ని తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి టీడీపీ మూకలు అరాచకం సృష్టించాయన్నారు. కవ్వింపు చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సమస్యలు సృష్టిస్తుంటే యాత్రకు అనుమతులు రద్దుచేయండి

ఏపీ హైకోర్టు

- యాత్ర సందర్భంగా లోకేశ్ టీడీపీ కార్యకర్తలను ఉసిగొల్పుతున్నారు
- మందలపర్రులో చర్చివైపు చూపించడంతో టీడీపీ కార్యకర్తలు వెళ్లి ప్రార్థనలు చేస్తున్న వారిని చావగొట్టారు..
- ప్రతి సమావేశంలోను ఇలాగే వ్యవహరిస్తున్నారు
- అందుకే టీడీపీ నేతలకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని ఆ రోజు మొత్తుకున్నాం
- ప్రభుత్వం తరఫున హైకోర్టు దృష్టికి తీసుకొచ్చిన ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి
- సుప్రీంకోర్టులో పిటిషన్ల నేపథ్యంలో విచారణ 15కి వాయిదా

సాక్షి, అమరావతి: సమస్యలు సృష్టిస్తున్నారనుకుంటే యువగళం యాత్రకు అనుమతులు రద్దుచేయండని హైకోర్టు పేర్కొంది. యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను రెచ్చగొడుతూ ప్రజలపై దాడులు చేయిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మంగళవారం హైకోర్టు దృష్టికి తీసుకొచ్చిన సందర్భంగా న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద జరిగిన ఘటనపై ముదివేడు పోలీసులు తమపై నమోదు చేసిన కేసుల్లో, అలాగే పుంగనూరు ఘటనలో పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ టీడీపీ నేతలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఏఏజీ వాదనలు వినిపిస్తూ.. పశ్చిమ గోదావరి జిల్లా యువగళం యాత్రలో భాగంగా మందలపర్రు గ్రామంలో లోకేశ్ చర్చి వైపు వేలు చూపిస్తూ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టారని, దీంతో ఆ పార్టీ కార్యకర్తలు వెళ్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న వారిపై విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచారని చెప్పారు. లోకేశ్ బహిరంగంగానే టీడీపీ శ్రేణులను దాడులకు ఉసిగొల్పుతున్నారని తెలిపారు. కనీసం 12 నుంచి 20 కేసులున్న కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు ఇప్పించే బాధ్యత తనదంటూ లోకేశ్ ప్రతి సభలోను బహిరంగంగా చెబుతున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అందుకు సంబంధించిన వీడియోను సైతం చూడవచ్చన్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరులోను చంద్రబాబునాయుడు ఇదే రీతిలో టీడీపీ కార్యకర్తలను ఉసిగొల్పి పోలీసులపై దాడులు చేయించి తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. అందుకే పుంగనూరు ఘటనలో ముందస్తు బెయిల్ కోసం టీడీపీ నేతలు పెట్టుకున్న పిటిషన్లను తీవ్రంగా వ్యతిరేకించామని, ముందస్తు బెయిల్ ఇస్తే ఇలాంటి ఘటనలు పునరావృత్తం చేస్తూ ఉంటారని ఆ రోజు మొత్తుకున్నామని చెప్పారు. ఆ రోజున తాము వ్యక్తం చేసిన ఆందోళన ఈ రోజు నిజమైందన్నారు. పౌరుల భద్రతను దృష్టిలో పెట్టుకునే ఆ రోజున టీడీపీ నేతల అరాచకాలు ఎలా ఉంటాయో స్పష్టంగా వివరించామని తెలిపారు. కేసులు పెడితే వెంటనే హైకోర్టుకు వస్తున్నారన్నారు. అదే వారి ధైర్యమని చెప్పారు. ఈ సమయంలో న్యాయస్థానం స్పందిస్తూ.. సమస్యలు సృష్టిస్తున్నారనుకుంటే యువగళం యాత్రకు అనుమతులు రద్దుచేయండని స్పష్టం చేసింది. 'మీరు (ప్రభుత్వం) ఇచ్చిన అనుమతితోనే కదా యాత్ర చేస్తున్నది. అలాంటప్పుడు మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? అనుమతులు రద్దుచేయవచ్చు కదా?' అని ఏఏజీని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. లోకేశ్ పాదయాత్ర గురించి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతున్నప్పుడు టీడీపీ తరఫు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. పెద్దగా అరుస్తూ.. ప్రస్తుత కేసులతో లోకేశ్ పాదయాత్రకు ఎలాంటి సంబంధం లేదని, యువగళం ప్రస్తావన తీసుకురావాల్సిన అవసరం లేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులే టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని తెలిపారు. టీడీపీ న్యాయవాదులు గొంతు పెద్దదిగా చేసి మాట్లాడుతుండటంతో న్యాయస్థానం వారిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇదేమన్నా చేపల మార్కెట్ అనుకుంటున్నారా? లేక కోర్టు అనుకుంటున్నారా? అంటూ వారిని మందలించింది. ఏఏజీ వాదనలు వినిపిస్తున్నప్పుడు మధ్యలో ఇలా మాట్లాడటం ఏమిటని ప్రశ్నించింది. ఆయన వాదనలకు సమాధానం ఇచ్చేందుకు మీకు అవకాశం వచ్చినప్పుడు అన్నీ చెప్పుకోవాలే తప్ప ఇలా చేపల మార్కెట్‌లో అరిచినట్లు అరవడం ఏమిటంటూ అసహనం వ్యక్తం చేసింది.

ఏ రకమైన ఉత్తర్వులు ఇవ్వడం సాధ్యం కాదు

గతంలో ఇతర నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో ఇచ్చిన ఉత్తర్వులను తాజా వ్యాజ్యాల్లోనూ ఇస్తూ ఆ వ్యాజ్యాలను పరిష్కరించాలని టీడీపీ న్యాయవాదులు గింజుపల్లి సుబ్బారావు, ఎం.లక్ష్మీనారాయణ, పుల్లగూర నాగరాజు తదితరులు కోరారు. సుప్రీంకోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు అలా చేయడం సరికాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. కనీసం కఠిన చర్యలేవీ తీసుకోకుండా పోలీసులను ఆదేశించాలని వారు అభ్యర్థించారు. అలాంటి ఉత్తర్వులేవీ ఇవ్వడం సాధ్యం కాదని న్యాయస్థానం తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టులో ప్రభుత్వం పిటిషన్లు దాఖలు చేసిన నేపథ్యంలో విచారణను ఈ నెల 15కి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.



వేర్వేరు పిటిషన్లు వేసిన టీడీపీ నేతలు

అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద జరిగిన ఘటనపై ముదివేడు పోలీసులు తమపై నమోదు చేసిన కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ టీడీపీ నేతలు భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, గంటా నరహరి, షాజహాన్ బాషా, దొమ్మలపాటి రమేష్, శ్రీరామ్ చినబాబు, ఎం.రాంప్రసాద్‌రెడ్డి తదితరులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే చిత్తూరు జిల్లా పుంగనూరు ఘటనలో పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ టీడీపీ నేతలు వి.చంద్రశేఖర్, ఎం .రాం ప్రసాద్‌రెడ్డివేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది.

సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండగా విచారణ సబబు కాదు

అంగళ్లు, పుంగనూరు ఘటనల్లో టీడీపీ నేతలు దేవినేని ఉమా, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, పులివర్తి నాని, చల్లా బాబు తదితరులకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఇదే కోర్టు ఇచ్చిన ఆదేశాలను తాము సుప్రీం కోర్టులో సవాలు చేశామని సుధాకర్‌రెడ్డి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కోర్టు జారీచేసిన ఉత్తర్వుల్లోని పలు అంశాలను తాము సుప్రీం కోర్టు ముందు లేవనెత్తామన్నారు. టీడీపీ నేతల తీరుపై ఆందోళనతోనే వారికిచ్చిన ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టులో సవాలు చేసినట్లు చెప్పారు. తమ పిటిషన్లకు సుప్రీం కోర్టులో డైరీ నంబర్ కూడా జారీ అయిందని, అయితే ఎప్పుడు విచారణకు వస్తాయో నిర్దిష్టంగా చెప్పలేమని తెలిపారు. సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన నేపథ్యంలో ఇప్పుడు కొందరు టీడీపీ నేతలు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణను వాయిదా వేయడం సబబుగా ఉంటుందని కోర్టు భావిస్తే, అలాగే వాయిదా వేయచ్చన్నారు. న్యాయస్థానం స్పందిస్తూ.. సుప్రీంకోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు అదే అంశంపై దాఖలైన వ్యాజ్యాలపై తాము విచారించడం సబబుగా ఉండదని అభిప్రాయపడింది.

బాబూ.. ఐటీ నోటీసులపై నోరు మెదపవేం?

బాబు అవినీతిని చెప్పని పచ్చ మీడియాకు విశ్వసనీయత ఏమిటి?

బాబు స్కామ్‌ల గురించి కేంద్రం నీ చెవిలో చెప్పలేదా పవన్?

అమరావతి పేరుతో రూ.2 వేల కోట్లు దోచుకున్న బాబు

మంత్రులు కారుమూరి, రాజా, సురేశ్, మాజీ మంత్రి కొడాలి నాని

సాక్షి, భీమవరం/తుని రూరల్/ఒంగోలు/తిరుమల: అవినీతికి పాల్పడిన చంద్రబాబు ఐటీ నోటీసులపై ఎందుకు స్పందించడంలేదని మంత్రులు, మాజీ మంత్రి ప్రశ్నించారు. స్టేలతో దుర్భర జీవితం గడుపుతున్న చంద్రబాబు.. ఈ నోటీసులతో ఢిల్లీలో పెద్దల కాళ్లు పట్టుకుని దేబిరిస్తున్నారని ఎద్దేవా చేశారు. దర్యాప్తు సంస్థలు ప్రత్యేకదృష్టి సారించి చంద్రబాబు అక్రమాలను వెలికితీయాలని కోరారు. ఎన్నో పాపాలు చేసిన ఆయన దేవుడి దగ్గర నుంచి మాత్రం తప్పించుకోలేరని చెప్పారు. అవినీతి, అక్రమాల కేసుల్లో చంద్రబాబు, లోకేశ్ జైలుకెళతారన్నారు. చంద్రబాబు అవినీతిపై ప్రజలకు చెప్పని ఎల్లో మీడియా విశ్వసనీయత ఏమిటని ప్రశ్నించారు. మంత్రులు కారుమూరి వెంకటనాగేశ్వరరావు, దాడిశెట్టి రాజా, ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి కొడాలి నాని మంగళవారం వేర్వేరు ప్రాంతాల్లో మాట్లాడారు.

తేలుకుట్టిన దొంగలా చంద్రబాబు

• మంత్రి కారుమూరి



భారీ స్కామ్‌లో కూరుకుపోయిన చంద్రబాబు నాయుడు ఐటీ శాఖ నోటీసులపై ఎందుకు మాట్లాడటంలేదని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారులశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రశ్నించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నోటీసులు అందుకున్న బాబు తేలుకుట్టిన దొంగలా ప్రవర్తిస్తున్నాడన్నారు. చంద్రబాబు అక్రమాలపై ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 ఎందుకు నోరువిప్పడం లేదని ప్రశ్నించారు. పవన్‌కళ్యాణ్.. బాబు అవినీతిపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. వలంటీర్ల వ్యవస్థ గురించి కేంద్ర నిఘావర్గాలు చెవిలో చెప్పాయని ప్రచారం చేసుకున్న పవన్‌కు చంద్రబాబు స్కామ్‌ల గురించి చెప్పలేదా అని ఎద్దేవా చేశారు.

బాబూ నువ్వు రావద్దు..

• మంత్రి దాడిశెట్టి రాజా



చంద్రబాబూ నువ్వు రావద్దు.. మా భవిష్యత్ పాడు చేయవద్దు.. అని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా చెప్పారు. కాకినాడ జిల్లా తుని మండలం మర్లపాడులో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అమరావతి పేరుతో రూ.2 వేల కోట్లు దోచుకున్నాడని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్.. పీఏ ద్వారా దోచుకున్న రూ.118 కోట్లకు ఐటీ శాఖ నోటీసులు ఇస్తే సమాధానం చెప్పడంలేదని విమర్శించారు. దీనిపై ఎల్లో మీడియా వార్తలు రాయడం లేదేమని ప్రశ్నించారు. సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

బాబు అవినీతిని దర్యాప్తు సంస్థలు వెలికితీయాలి

• మంత్రి ఆదిమూలపు సురేశ్



అవినీతి, అక్రమాల కేసుల్లో చంద్రబాబు, లోకేశ్ కచ్చితంగా జైలుకెళతారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేశ్ చెప్పారు. ఒంగోలులో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ప్రస్తుతం దొరికిన దొంగ అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అక్రమాలకు వేదిక అని తాము గతంలో చెప్పిన అంశం ఈ ఐటీ నోటీసులతో నిజమేనని తేలిందని చెప్పారు. దర్యాప్తు సంస్థలు ఆయన అవినీతిని వెలికి తీయాలని కోరారు. అమరావతి ముసుగులో అస్మదీయులకు కాంట్రాక్టులు కట్టబెట్టి వేలకోట్లు దోచుకున్నారన్నారు. దీనిపై చంద్రబాబు మౌనం వీడాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు దేవుడి నుంచి తప్పించుకోలేరు

• మాజీ మంత్రి కొడాలి నాని



ఎన్నో పాపాలు చేసి తప్పించుకున్న చంద్రబాబునాయుడు దేవుడి దగ్గర నుంచి మాత్రం తప్పించుకోలేరని మాజీ మంత్రి కొడాలి నాని చెప్పారు. ఆయన తిరుమలలో మీడియాతో మాట్లాడుతూ అందరూ బాగుండాలని, 2024 ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం కల్పించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు చెప్పారు. చంద్రబాబుకు ఐటీ నోటీసులు ఇవ్వడం ఆయన చిన్న విషయంగా చెబుతున్నారన్నారు. ఎన్ని పాపాలు చేసి ఎక్కడ నుంచైనా తప్పించుకోగలంగానీ.. ఆ పైన ఉన్న దేవుడి దగ్గర నుంచి, ఎన్నికల్లో తీర్పునిచ్చే ప్రజల నుంచి మాత్రం తప్పించుకోలేరని పేర్కొన్నారు.

తండ్రీకొడుకులు ఇద్దరూ స్కామ్‌స్టర్‌లే

- చంద్రబాబు, లోకేశ్‌లపై మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం
- ఐటీ నోటీసులు.. సీమన్స్, అమరావతి కుంభకోణాల దారులన్నీ ఒకే చోటుకు
- ఐటీ నోటీసుల్లో పేర్కొన్న వ్యక్తులే.. సీఐడీ తేల్చిన స్కామ్‌లలో నిందితులు
- ఈ కుంభకోణాల మూలాలన్నీ చంద్రబాబు, లోకేశ్‌ల వద్దే
- ప్రజల్ని తాకట్టు పెట్టి అమరావతి బాండ్ల పేరుతో తెచ్చిన సొమ్ము సొంత జేబుల్లోకి
- డొల్ల కంపెనీల ద్వారా జేబులు నింపుకొన్న తండ్రీకొడుకులు
- స్కీమ్‌ల పేరుతో స్కామ్‌లు చేసి వేలకోట్లు దోచుకుని దాచుకున్న చంద్రబాబు



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసులు ఇచ్చిన స్కామ్.. సీమన్స్, అమరావతి భూకుంభకోణాల దారులన్నీ ఒకే చోటుకు చేరుతున్నాయని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) చెప్పారు. ఐటీ శాఖ చంద్రబాబుకు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్న వ్యక్తులే.. సీమన్స్, అమరావతి అసైన్డ్ భూకుంభకోణాల్లో ప్రధానపాత్ర పోషించారని సీఐడీ తేల్చిందని గుర్తుచేశారు. ఈ కుంభకోణాల మూలాలు చంద్రబాబు, ఆయన కొడుకు లోకేశ్‌ల వద్దే ఉన్నాయని చెప్పారు. తండ్రీకొడుకులు ఇద్దరూ స్కామ్‌స్టర్‌లేనన్నారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజధానిలో ఎస్సీ, ఎస్టీ అసైన్డ్ భూములు చేతులు మార్చే క్రమంలో పెద్ద స్కామ్ జరిగిందని గతంలోనే సీఐడీ తేల్చిందని గుర్తుచేశారు. అమరావతి పేరుతో జరిగిన స్కామ్‌లన్నింటిలో డొల్ల కంపెనీలు పెట్టి, వాటిద్వారా తండ్రీకొడుకులు ముడుపులు పుచ్చుకున్న విషయాలు ఇప్పటికే సీఐడీ విచారణలో రట్టయిందని ఎత్తిచూపారు. డొల్ల కంపెనీలతో డబ్బును జేబులో వేసుకోవడం.. హవాలా ద్వారా తండ్రీకొడుకులకు చేరవేయడంలో ఈ మధ్య కూడా మరో స్కామ్ బయటకొచ్చిందని చెప్పారు. అమరావతిలో రాజధాని కడతానని, ప్రతి ఇటుకకు డబ్బులివ్వండని.. మనల్ని అందర్నీ తాకట్టు పెట్టి బాండ్స్ ఇష్యూచేసి చంద్రబాబు తెచ్చిన డబ్బులు ఆయా కంపెనీలకు ఇచ్చారని తెలిపారు. ఆ కంపెనీల ద్వారా నిధులు డొల్ల కంపెనీలకు మళ్లించారని, ఐటీ శాఖ నోటీసులు చూస్తే.. చంద్రబాబు మొత్తం రూ.160 కోట్ల రూపాయలు కొట్టేశారని తేలిందని చెప్పారు. లోకేశ్ మిత్రుడు రాజేశ్, చంద్రబాబు పీఏ శ్రీనివాస్ ద్వారా అమరావతి పేరుతో జనం సొమ్మును కొట్టేశారన్నారు. ఐటీ శాఖ నోటీసుల్లో పేర్కొన్న తరహాలోనే.. ఇప్పటికే సీఐడీ విచారణలో తేలిన స్కిల్ స్కాం, అమరావతి అసైన్డ్ భూముల కుంభకోణం, కాంట్రాక్ట్ పనుల్లో అక్రమాలు, ఫైబర్‌నెట్ స్కామ్‌లలోను ఈ వ్యక్తుల ద్వారా ఇదే విధమైన రూటింగ్ జరిగిందని చెప్పారు. ఎంవీపీ, పీఏ శ్రీనివాస్, రాజేశ్ తదితరులు ఆ కుంభకోణాల్లోను ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఐదేళ్లలో రకరకాల స్కీమ్‌ల పేరుతో స్కామ్‌లు చేసిన చంద్రబాబు వేలకోట్ల రూపాయలు దోచుకుని హైదరాబాద్‌లో దాచుకున్నారని మండిపడ్డారు. ఇప్పుడు అవన్నీ ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయన్నారు. ప్రజాధనాన్ని దోచేసిన తండ్రీకొడుకులను వలేసి భలే పట్టుకున్నారని ఐటీ శాఖను ప్రశంసించాల్సింది పోయి విమర్శించడం సిగ్గుచేటని చెప్పారు. తండ్రీకొడుకులు ఏయే పాపాలు చేశారని నాలుగేళ్లుగా చెబుతున్నామో అవన్నీ ఒక్కొక్కటిగా ఆధారాలతో దొరుకుతున్నాయని తెలిపారు. కచ్చితంగా చంద్రబాబు పాపం పండే రోజు వచ్చింది.. అవినీతి బట్ట బయలైంది.. పరిహారం చెల్లించాల్సిన రోజు వస్తుంది.. అని పేర్ని నాని చెప్పారు.

అధికారమిస్తే అన్నీ చేస్తా!

టీడీపీ అధినేత చంద్రబాబు



రాయదుర్గం: తనకు మళ్లీ అధికారం ఇస్తే అన్నీ చేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. కర్ణాటకలోని బళ్లారిలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఆవిష్కరించిన తర్వాత అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలో పర్యటించారు. బాదనహాళ్ హగరి వద్ద నిర్మించిన వంతెనపైకి చేరుకుని సెల్ఫీ దిగారు. దీన్ని తానే నిర్మించానని చెప్పుకున్నారు. పల్లేపల్లి వద్ద వేరుశనగ పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం రాయదుర్గం తేరు బజారు వద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసిన అనుభవం ఉన్న ఏకైక వ్యక్తిని తానేనని గొప్పలు చెప్పుకున్నారు. వైఎస్ జగన్ పాలన పోతేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. విద్యుత్ చార్జీలు మొదలు అన్ని ధరలూ పెంచారని ఆరోపించారు. అందుకే రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత తాను తీసుకున్నానన్నారు. నారీశక్తి ద్వారా గొప్ప పథకాలకు శ్రీకారం చుట్టానన్నారు. వీటి ద్వారా మహిళల బతుకులు బాగు చేస్తానన్నారు. అధికారంలోకి రాగానే యువతకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఈసారి తనను నమ్మాలని వేడుకున్నారు. మూడు రాజధానుల పేరుతో మభ్యపెట్టింది వైఎస్ జగన్ కాదా అని ప్రశ్నించారు. ఏపీకి రాజధాని లేకుండా చేశారన్నారు. జమిలి ఎన్నికలొచ్చినా.. ముందస్తు వచ్చినా సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాయదుర్గం నియోజకవర్గంలోని బీటీపీకి, ఉంతకల్లు రిజర్వాయర్లకు నీరిస్తామన్నారు. హెచ్‌ఎల్‌సీని అభివృద్ధి చేస్తామన్నారు. ఇన్సూరెన్స్ పాలసీలో మార్పులు తీసుకొస్తామని, రైతులకు పాత పద్ధతిలోనే సబ్సిడీలు అందిస్తామని చెప్పారు.

ఐటీ నోటీసులిస్తే మీకది వార్త కాదా?

- ఎల్లో మీడియాపై డిప్యూటీ సీఎం సత్యనారాయణ ధ్వజం
- చంద్రబాబు అవినీతిలో బయటపడింది ఆవగింజంతే
- సీబీఐ, ఈడీ వెంటనే అదుపులోకి తీసుకోవాలి



సాక్షి, అమరావతి: ఎల్లో మీడియాగా గుర్తింపు పొందిన కొన్ని సంస్థలు జర్నలిజంపై గౌరవాన్ని పూర్తిగా దిగజారుస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ విమర్శించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తికి ఐటీ శాఖ నోటీసులిస్తే ఆ పత్రికల్లో కనీసం వార్త కూడా ప్రచురించకపోవటానికి మించి దుర్మార్గం మరొకటి ఉంటుందా? అని ప్రశ్నించారు. ఎల్లో మీడియాలో మీకు నచ్చిందే రాస్తారా? అని నిలదీశారు. మంగళవారం సచివాలయం వద్ద మంత్రి సత్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. 'ఐటీ శాఖ నోటీసులపై చంద్రబాబు నోరు విప్పకపోవటాన్ని బట్టి ఆయన సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పటివరకు చాలాసార్లు తప్పించుకున్నారు. ఆయన అక్రమాల్లో ఐటీ శాఖ గుర్తించింది ఆవగింజంతే. సీబీఐ, ఈడీ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని తక్షణం అదుపులోకి తీసుకోవాలి. చంద్రబాబు వ్యవస్థలను ఎలా ప్రభావితం చేస్తారో అందరికీ తెలుసు. రాజధానిని అడ్డం పెట్టుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. రూ.ఐదు లక్షలు దాటిన పనులకు టెండర్లు నిర్వహించాల్సి ఉన్నా పోలవరంలో నామినేషన్‌పై రూ.వేల కోట్ల విలువైన పనులను కట్టబెట్టారు. సమాధానం చెప్పకుండా చంద్రబాబు ఎంతో కాలం తప్పించుకోలేరు. సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌లా జైలుకు వెళ్లక తప్పదు. ప్రశ్నించడానికే పార్టీ పెట్టాననే పవన్‌కళ్యాణ్ దీనిపై ఎందుకు స్పందించరు?' అని మంత్రి సత్య నారాయణ నిలదీశారు.

దుర్గ గుడి, శ్రీశైలంలో అభివృద్ధి పనులకు ఈ నెలలో సీఎం శంకుస్థాపన

విజయవాడ దుర్గ గుడి వద్ద భక్తులకు మెరుగైన సౌకర్యాల కోసం దాదాపు రూ.225 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఈ నెలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని మంత్రి సత్యనారాయణ వెల్లడించారు. శ్రీశైలం ఆలయం వద్ద మరో రూ.175 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు కూడా సీఎం శంకుస్థాపన చేస్తారని చెప్పారు. దుర్గ గుడి వద్ద ప్రసాదం పోటు, అన్నదానం భవనం, శివాలయం నిర్మాణ పనులు, రాక్ మిటిగేషన్ (కొండ చరియలు విరిగిపడకుండా), ఆటోమేషన్ పార్కింగ్ వసతి తదితర పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారు. ఇప్పుడున్న ఘాట్ రోడ్డు వాస్తుపరంగా అంత శుభప్రదం కాదని వాస్తు పండితులు పేర్కొంటున్నందున రాజగోపురం నుంచి భక్తులు వచ్చి వెళ్లేలా దుర్గానగర్‌లో ఎలివేటెడ్ క్యూలైన్ (ఫ్లై ఓవర్), క్యూ కాంపెక్స్ విస్తరణ చేపడుతున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆలయాల పక్కన రెండు అంతస్తులతో పూజా మండపాలు కడుతున్నామన్నారు. ఇక శ్రీశైలం ఆలయం వద్ద రూ.75 కోట్లతో క్యూ కాంప్లెక్స్, రూ.40 కోట్లతో సాల మండపాల నిర్మాణంతో పాటు ఇటీవల అటవీ శాఖ నుంచి ఆలయం స్వాధీనంలోకి వచ్చిన 4,600 ఎకరాలకు ఫెన్సింగ్ నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. అక్టోబరు నుంచి ధర్మ ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు.

- న్యూరోలాజికల్ సమస్యలకు ఇదే కారణం
- డిప్రెషన్, మతిమరుపు సమస్యలతోపాటు పార్కిన్సన్‌కు కారణమే
- అదుపులో ఉండని మధుమేహం



మెదడుకు కాలుష్య కాటు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): వ్యక్తిగత వాహనాల వినియోగం బాగా పెరిగింది. నగరాలు, పట్టణాల్లోని ఏ రోడ్లలో చూసినా వాహనాలు కిక్కిరిసి కనిపిస్తున్నాయి. అలాంటి రోడ్లపై నిత్యం ద్విచక్ర వాహనాలపై తిరిగే వారికి వాహన కాలుష్యం కారణంగా పలు మానసిక, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కాలుష్యం కారణంగా రసాయనాలు రక్తంలో చేరి, మెదడుపై ప్రభావం చూపుతున్నట్టు వెల్లడిస్తున్నారు. ఇవి దీర్ఘకాలంలో అనేక దుష్పరిణామాలకు దారి తీస్తున్నాయని చెబుతున్నారు.

తలెత్తుతున్న సమస్యలివీ..

- మెదడు కుచించుకుపోయి మతిమరుపు వస్తుంది.
- రక్తంలో కలిసిన రసాయనాలు మెదడులోని కీలక భాగాలపై ప్రభావం చూపుతాయి. ఫలితంగా నరాల సమస్యతో కాళ్లు, చేతులు పనిచేయవు. కొందరికి పక్షవాతం కూడా రావచ్చు.
- వాసన గ్రహించలేకపోతారు.
- పార్కిన్సన్ (వణుకుడు రోగం) వ్యాధి రావచ్చు.
- డిప్రెషన్‌కు గురవుతుంటారు.
- హార్మోన్స్ సక్రమంగా విడుదల కావు.
- పిల్లల్లో ఎదుగుదల సమస్య తలెత్తవచ్చు.
- ఫిట్స్, మైగ్రేన్, తలనొప్పి వంటివి రావచ్చు.
- జన్యుపరమైన లోపాలే కాకుండా సమతుల ఆహార విధానలేమి, క్రమలేని జీవన విధానాలు వంటి వాటితోపాటు పర్యావరణ సంబంధిత వాహన కాలుష్యాలు వంటివి కూడా మధుమేహ వ్యాధి సంక్రమించడానికి ముఖ్య భూమి పోషిస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి.
- కాలుష్య ప్రభావానికి గురయ్యే వ్యక్తుల్లో దీర్ఘకాలిక వ్యాధులు అదుపులో ఉండవు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు బాధితులు అప్రమత్తంగా ఉండాలి.
- వ్యాధులు అదుపులో లేకపోతే కీలక అవయవాలపై ప్రభావం పడుతుంది. గుండెపోటు, కిడ్నీ ఫెయిల్యూర్, రక్తప్రసరణ తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

మరేం చేయాలి

ప్రజలు కాలుష్యం బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వీలైనంత వరకూ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ (బస్సుల)ను వినియోగిస్తే కాలుష్యం బారిన పడకుండా కొంతవరకూ తగ్గించుకోవచ్చు. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్‌తోపాటు, సర్జికల్ మాస్క్‌లాంటిది పెట్టుకుంటే మంచిది. కాలం చెల్లిన వాహనాల వినియోగాన్ని నివారించాలి. ఎలక్ట్రిక్ వాహనాల వాడకంపై దృష్టి సారించాలి. రోడ్ల వెంట విరివిగా మొక్కలు నాటితే కాలుష్య ప్రభావాన్ని కొంతవరకు తగ్గిస్తాయి.

మెదడుపై ప్రభావం



కాలుష్యానికి ఫోకస్ అయ్యే వారిలో మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. బ్రెయిన్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. మెదడులోకి కీలక భాగాలపై కాలుష్యంలోని రసాయనాలు ప్రభావం చూపి న్యూరోలాజికల్ సమస్యలు తలెత్తవచ్చు. అంటే కాలు, చేయి పట్టు తప్పడం, బ్రెయిన్ స్ట్రోక్, వణుకుడు రోగం (పార్కిన్సన్) వంటివి రావచ్చు. కాలుష్యం బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. వీలైనంత వరకూ బస్సుల్లో ప్రయాణం చేయాలి.

– డాక్టర్ దారా వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్, న్యూరాలజీ, జీజీహెచ్, విజయవాడ

నైట్రోజన్ డయాక్సైడ్‌తో మధుమేహం



నైట్రోజన్ డయాక్సైడ్ అధికంగా ఉన్న గాలిని పీల్చేవారు మధుమేహం బారిన పడే అవకాశాలు ఎక్కువ. గాలిలో 2.5 మైక్రో మీటర్ల కన్నా తక్కువ పరిమాణం ఉన్న కాలుష్య పదార్థాలు ఊపిరితిత్తుల ద్వారా శరీరంలోకి చేరి ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను పెంచుతాయి. ఇన్‌ఫ్లమేషన్ ప్రక్రియను ప్రేరేపించడం ద్వారా ఇన్సులిన్ నిరోధకతకు కారణమై మధుమేహానికి దారి తీస్తాయి. వాహనాల శబ్ద కాలుష్యంతో నిద్రలేమి, తీవ్రమైన ఒత్తిడితో హార్మోన్లు, మెటబాలిజం అసమతుల్యతతో ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది. ఫలితంగా మధుమేహం రావచ్చు.

– డాక్టర్ ఎం.శ్రీకాంత్, మధుమేహ వైద్య నిపుణుడు

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి జోగి రమేష్, ఎంపీ బాలశౌరి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎంపీ బాలశౌరి, మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ప్రతి పేదవాని సంతోషంలోనూ ముఖ్యమంత్రి జగనన్నే ఉంటారని, పేదల సంతోషమే ధ్యేయంగా పాలన చేస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిడమర్రు సచివాలయం–2 పరిధిలోని ఒర్లగొందితిప్ప గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఎంపీ బాలశౌరి, మంత్రి జోగి రమేష్ గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ప్రజలకు ఇంకా కావాల్సిన సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు రావాలన్నా, ప్రస్తుత పథకాలు కొనసాగాలన్నా మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే రావాలని, దానికి మీరంతా ఆయనను ఆశీర్వదించాలని కోరారు.

ఏమ్మా..పాలన బాగుందా..

ఏమ్మా జగనన్న పాలన బాగుందా.. అందరూ సంతోషంగా ఉన్నారా అంటూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి ఒర్లగొందితిప్పలో మహిళలను పలుకరించిన తీరు ఆకట్టుకుంది. మీకు సంక్షేమ పథకాలు సక్రమంగా అంతున్నాయా, పింఛన్ ఇంటికే వచ్చి ఇస్తున్నారా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అంటూ ఎంపీ వారిని ఆరా తీశారు. జగనన్న పాలన బాగుందని, పథకాలు అందుతున్నాయని మహిళలు సమాధానమిచ్చి సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి జరగాలన్నా, మరింత మంచి పాలన రావాలన్నా జగనన్నను మళ్లీ తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు.

సచివాలయం ప్రారంభం..

నిడమర్రు పంచాయతీలో రూ. 40 లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న నిడమర్రు–2 సచివాలయ భవనాన్ని మంత్రి జోగి రమేష్, ఎంపీ బాలశౌరి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన అన్ని రకాల ప్రభుత్వ సేవలను సచివాలయం ద్వారా మన గ్రామంలోనే అందుతాయని తెలిపారు. ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, మండల కన్వీనర్ వెంకట్రాజు, కాపు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల డైరెక్టర్లు పి. మహేష్, జె. భూపతిరాజు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడి.. దుకాణం దహనం చేసి

- రెచ్చిపోయిన దొంగలు
- పెంపుడు కుక్క మాయం
- చిలుమూరులో ఘటన



దొంగలు దహనం చేసిన దుకాణాన్ని పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొల్లూరు: దుకాణంలో చోరీకి పాల్పడిన దొంగలు.. వస్తువులను దహనం చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం.. మండలంలోని చిలుమూరుకు చెందిన యండూరి బద్రినాథ్, పచారీ సామాన్లు, ఫ్యాన్సీ దుకాణం కలిపి నిర్వహిస్తున్నాడు. కుటుంబంతో కలసి విజయవాడలోని సోదరుడి ఇంటికి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున ఓ మహిళ దుకాణం నుంచి పొగలు వస్తుండటం గమనించింది. ఇంటివారిని అప్రమత్తం చేసేందుకు కేకలు వేసింది. ఇంట్లో నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో ఇంటి చుట్టుపక్కల వారిని లేపి విషయం తెలపడంతో స్థానికులు వచ్చి గమనించారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించడంతో పాటు, దొంగతనం చోటు చేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే విజయవాడ వెళ్లిన బాధిత కుటుంబానికి సమాచారం ఇవ్వడంతోపాటు, కొల్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తలుపు తాళం తొలగించి వచ్చిన దుండగులు ఇంట్లో నగదు, ఆభరణాల కోసం ఇంట్లో లభించిన బీరువా తాళాలు పోలిఉన్న తాళాలతో బీరువాను తెరిచేందుకు చేసిన ప్రయ త్నం విఫలమైనట్లు తెలుస్తోంది. పక్కనే ఉన్న దుస్తులు పెట్టుకునే అల్మారాలో ఉన్న పర్సులో, దుకాణంలోని గల్లా పెట్టెలో ఉన్న సుమారు రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు నగదు తీసుకెళ్లారు. దుకాణంలో ఉన్న సామగ్రికి నిప్పు పెట్టి ఉడాయించారు. సుమారు రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెంపుడు కుక్కను మాయం చేసి...


అదే గ్రామానికి చెందిన ధూళిపూడి రాధాకృష్ణమూర్తి నిద్రించే ముందు కుక్కను ఇంటి ఆవరణలో వదిలి ఇంటిలోపల నిద్రించారు. దొంగలు పెంపుడు కుక్కను మాయం చేశారు. ఇంటి తలుపు బయట గడియ పెట్టడంతోపాటు, మరో తలుపునకు బయటవైపు గడియ లేకపోవడంతో తలుపు తీసినా రాకుండా తలుపు హ్యాండిల్స్‌లో కర్ర పుల్లను అడ్డుగా ఉంచారు. అనంతరం కోళ్ల గూటిలో ఉన్న మూడు కోళ్లను తీసుకుని వెళ్లారు. ఘటనా ప్రాంతాలను మంగళవారం వేమూరు సీఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. బాధిత కుటుంబాలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు.

9,10 తేదీల్లో రాష్ట్ర స్థాయి జంప్ రోప్ టోర్నీ

తెనాలి: రాష్ట్ర స్థాయి బాలబాలికల జంప్ రోప్ పోటీలను తెనాలి స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను కమిటీ సభ్యులు మంగళవారం సాయంత్రం స్టేడియంలో ఆవిష్కరించారు. తెనాలి ప్రాంతంలో క్రీడాకారులకు ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రతినెల ఒక రాష్ట్ర స్థాయి క్రీడా టోర్నమెంటు, ఏడాది చివర్లో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు సత్కారం ఆశయంగా కమిటీ ఏర్పాటైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తొలిగా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు నిర్వహించారు. రెండో ఈవెంట్‌గా జంప్ రోప్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బ్రోచర్ ఆవిష్కరణలో స్టేడియం కోచ్ కె.నాగరాజు, మైత్రీ అకాడమీ అధ్యక్షుడు కౌశిక్, సునీల్, మార్కెట్ యార్డు డైరెక్టర్ అచ్యుత సాంబశివరావు, జంప్ రోప్ కోచ్ అనిల్, నాగరాజు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో.. బజరంగ్‌దళ్ శౌర్య జాగరణ యాత్ర

వీహెచ్‌పీ అఖిల భారత సెక్రటరీ జనరల్ మిలింద్ పరాండే



వీహెచ్‌పీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మిలింద్ పరాండే

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): యువతలో దేశ భక్తి, దైవ భక్తి పెంపొందించేలా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బజరంగదళ్ శౌర్య జాగరణ యాత్ర చేపట్టనున్నట్లు వీహెచ్‌పీ అఖిల భారత సెక్రటరీ జనరల్ మిలింద్ పరాండే పేర్కొన్నారు. మంగళవారం విజయవాడ సత్యనారాయణపురంలోని వీహెచ్‌పీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయోధ్యలో ఆలయ నిర్మాణం వేగంగా జరుగుతుందని, వచ్చే ఏడాది జనవరి 16 నుంచి 24 మధ్యలో విగ్రహ మూల విరాట్టుల ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. విశ్వ హిందూ పరిషత్‌ను స్థాపించి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా షష్ట్యాబ్ది ఉత్సవాలను సైతం దేశ వ్యాప్తంగా నిర్వహించబోతున్నామని తెలిపారు. తమిళనాడు రాష్ట్ర మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి కుమారుడు ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను వీహెచ్‌పీగా ఖండిస్తుందని, ఈ వ్యా ఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాలకు పూర్తి స్వయం ప్రతిపత్తి కల్పించే దిశగా దేవాలయాల నిర్వహణను ప్రభుత్వం పూర్తిగా హిందువులకే అప్పగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి నేతలు రాఘవులు, వెంకటేశ్వర్లు, రవి కుమార్, దుర్గాప్రసాద్ రాజు, సుబ్బరాజు, సానా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




నిదర్శన

నగర జీవనంలో ప్రతీదీ యూజ్ అండ్ త్రోగా మారుతోంది. 'ఈ కాంక్రీట్ వనంలో ప్రకృతి గురించి అర్థం చేసుకుంటున్నదెవరు' అని ప్రశ్నిస్తారు హైదరాబాద్ నల్లగండ్లలో ఉంటున్న నిదర్శన. అపార్ట్‌మెంట్ సంస్కృతిలో వ్యర్థాలను ఎలా వేరు చేయాలి, ప్లాస్టిక్ వాడకాన్ని ఎలా తగ్గించాలనే విషయాల మీద నెలకు ఒకసారి నాలుగేళ్లుగా అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ చేస్తోంది. కార్పోరేట్ కంపెనీలో మార్కెటింగ్ కమ్యూనికేషన్స్‌లో మేనేజర్‌గా వర్క్ చేసిన నిదర్శన సస్టెయినబుల్ లివింగ్ పట్ల ఆసక్తి పెరిగి, పర్యావరణ హిత వస్తువుల వాడకాన్ని ప్రోత్సహిస్తూ, హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. పర్యావరణానికి మేలు చేసే పని ఏ కొంచెమైనా ఎంతో సంతృప్తినిస్తుందని చెబుతోంది.

ప్రకృతి ప్రేమకు నిదర్శనం

''ఈ రోజుల్లో మనం ఏ పని చేసినా అది ప్రకృతికి మేలు చేసేదై ఉండాలి. ఈ ఆలోచన నాకు నాలుగేళ్ల క్రితం కలిగింది. దీనికి కారణం మన దగ్గర చేస్తున్న పెళ్లిళ్లు, పార్టీలు. ఫంక్షన్లకు వెళ్లినప్పుడు అక్కడ యూజ్ అండ్ త్రో ఏరియా చూస్తే మనసు వికలమయ్యేది. దీంతో చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి, సస్టైనబుల్ లివింగ్ మార్గం పట్టాను.


వాలంటీర్లతో...



■ ఈవెంట్స్‌కి స్టీల్ గిన్నెల రెంట్

మాటీ పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేశాను. నాలాగే ఆలోచించే మరో ముగ్గురు స్నేహితులతో కలిసి ఫంక్షన్లకు స్టీల్ పాత్రలు నామమాత్రపు రెంట్‌తో ఇచ్చే బ్యాంక్ ఏర్పాటు చేశాను. ఆ తర్వాత ఇదే థీమ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాను. ఎవరింట్లో పెళ్లి, పండగ, పుట్టిన రోజులు జరిగినా మా దగ్గర నుంచి స్టీల్ పాత్రలు రెంట్‌కు తీసుకోవచ్చు. అలాగే, అపార్ట్‌మెంట్స్ వర్క్ షాప్స్ కండక్ట్ చేస్తాను. ఈ వర్క్‌ షాప్స్‌లో కిచెన్ గార్డెనింగ్, కంపోస్ట్, ఎకో ఫ్రెండ్లీ గిఫ్ట్ థీమ్స్.. వంటివన్నీ అందుబాటులో ఉంటాయి.

■ హస్తకళాకారుల నుంచి..

నెలకు ఒకసారి గేటెడ్ కమ్యూనిటీ ఏరియాలను చూసుకొని పర్యావరణ స్పృహ కలిగించడానికి ఎకో ఫెస్ట్ ఏర్పాటు చేయడం మొదలుపెట్టాను. ఇందుకు ఇతర స్వచ్ఛంద సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీ సభ్యులు, ఐటీ ఉద్యోగులు తమ మద్దతును తెలియజేస్తున్నారు. నా టీమ్‌లో స్వచ్ఛందంగా పనిచేసే పది మంది బృందంగా ఉన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలలోని నగరాలలోనూ ఈ ఎకో ఫెస్ట్ ఏర్పాటు చేస్తాను. ఇందులో హస్తకళాకారులు తయారుచేసిన రకరకాల కళాకృతులు, జ్యువెలరీ బాక్సులు, ఇత్తిడి, రాగి వస్తువులు, జ్యూట్ కాటన్ పర్సులు, ఇంటీరియర్ వస్తువులు .. వంటివన్నీ ఉంటాయి. హస్తకళాకారులే నేరుగా వచ్చి తమ వస్తువులు అమ్ముకోవచ్చు. ఒక్కొక్క కళాకారుడి నుంచి సేకరించిన వస్తువులను కూడా ప్రదర్శనలో ఉంచుతాను. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆ కళాకారులకు అందజేస్తుంటాను. గ్రామీణ కళాకారులకు తమ హస్తకళలను ఎక్కడ అమ్మితే తగినంత ఆదాయం వస్తుందనే విషయంలో అంతగా అవగాహన ఉండదు. అందుకే, ఈ ఏర్పాట్లు చేస్తుంటాను. దీని ద్వారా కళకు, కొనుగోలుదారుకు ఇద్దరికీ తగిన న్యాయం చేయగలుగుతున్నాను అనే సంతృప్తి లభిస్తుంది. 'ది బాంటిక్ కంపెనీ(పేరుతో ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా కూడా హస్తకళాకృతులను అందుబాటులో ఉంచుతున్నాను.

■ ఎకో ఫ్రెండ్లీ గిఫ్టింగ్

కార్పోరేట్ కంపెనీలలో పండగల సందర్భాలలో ఇచ్చే కానుకలకు కన్‌స్టలెన్సీ వర్క్ కూడా చేస్తాను. ఇక్కడ కూడా ఎకో థీమ్‌తో కస్టమైజ్డ్ గిఫ్ట్ బాక్స్‌లు తయారుచేసి అందిస్తుంటాను. ఇక ఇళ్లలో జరిగే చిన్న చిన్న వేడుకలకూ ఎలాంటి కానుకలు కావాలో తెలుసుకొని, వాటిని తయారుచేయించి సప్లయ్ చేయిస్తుంటాను.

■ కార్పోరేట్ కంపెనీలలో వర్క్‌షాప్స్

కార్పోరేట్ కంపెనీలలో సస్టెయినబులిటీ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తాను. అక్కడ ఉద్యోగులు పర్యావరణ హిత వస్తువులతో తమ జీవన విధానాన్ని ఎలా అందంగా తీర్చిదిద్దుకోవచ్చో, ఆరోగ్యకరంగా మార్చుకోవచ్చో కార్యక్రమాల ద్వారా తెలియజేస్తుంటాను. అంతేకాదు, కిచెన్ వ్యర్థాలను ఎలా వేరు చేయాలి, కిచెన్ గార్డెన్‌ను తమకు తాముగా ఎలా డెవలప్ చేసుకోవచ్చు అనే విషయాల మీద వర్క్‌షాప్స్ ఉంటాయి. అంతేకాదు, రోజువారీ జీవన విధానంలో ప్రతీదీ పర్యావరణ హితంగా మార్చుకుంటే కలిగే లాభాలనే వివరిస్తుంటాను. ఇదేమంత కష్టమైన పని కాదని వారే స్వయంగా తెలుసుకోవడం, తాము ఆచరిస్తున్న పనులు గురించి ఆనందంగా తెలియజేస్తుంటారు. మంచి జీవనశైలిని నలుగురికి పంచడంలోనే కాదు ప్రకృతికి మేలు చేస్తున్నాన్న సంతృప్తి కలుగుతుంది. అదే విధంగా గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నానన్న ఆనందమూ కలుగుతుంది' అని తెలియజేస్తారు నిదర్శన.

– నిర్మలారెడ్డి
ఫొటోలు: మోహనాచారి

కిచెన్ టిప్స్

ఉల్లిని చూసుకుందాం.. భద్రంగా

వర్షాకాలంలో ఉల్లిపాయలు త్వరగా పాడవకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటిస్తే సరి. ఉల్లి ఎక్కువ రోజుల పాటు పాడవకుండా ఉంటుంది.



- ఇతర కూరగాయలు ఉన్న బుట్టలో ఉల్లిపాయలను ఉంచకూడదు. దుంపలు, పచ్చిమిర్చి, వెల్లుల్లి వంటి వాటితో కలిపి ఉల్లిపాయలు ఉంచడం వల్ల త్వరగా మొలకలు వస్తాయి. కూరగాయల్లో ఇథలిన్ ఉల్లిపాయలు త్వరగా మొలకెత్తడానికి దోహదపడుతుంది.
- ఉల్లిపాయలను నిల్వచేసేందుకు పేపర్ బ్యాగ్‌లనే వాడాలి. పేపర్ బ్యాగ్స్‌లో ఉల్లిపాయలు ఉంచడం వల్ల ఉల్లిపాయల్లో ఉత్పన్నమయ్యే తేమను పేపర్ పీల్చుకుంటుంది. తేమ లేకపోతే ఉల్లిపాయలు త్వరగా మొలకెత్తవు.
- రిఫ్రిజిరేటర్‌లో ఉల్లిపాయలను నిల్వచేయకూడదు. రిఫ్రిజిరేటర్‌లోని ఇతర కూరగాయల వల్ల, లోపలి తేమ వాతావరణం ఉల్లి త్వరగా మొలకెత్తేలా చేస్తాయి.
- ప్లాస్టిక్ సంచుల్లో ఉల్లిపాయలను ఎప్పుడూ నిల్వ చేయకూడదు. మార్కెట్ నుంచి తెచ్చిన ప్లాస్టిక్ సంచిలో నుంచి ఉల్లిపాయలు తీయడం మర్చిపోతుంటాము. ప్లాస్టిక్ బ్యాగ్‌లో వేడికి ఉల్లిపాయలు పాడవుతాయి.



తియ్యగా తగ్గించుకోండి

పంచదారకు బదులు అనేక స్వీట్ల తయారీలో కర్జూరాలను వాడుతుంటాము. స్వీట్‌గా ఉండే ఈ ఖర్జూరాల్లో అనేక ఆరోగ్య సుగుణాలు ఉన్నాయి. డేట్స్ తింటూ పొట్ట తగ్గించుకోవచ్చు. అది ఎలాగో చూద్దాం...

- బరువు తగ్గాలంటే ఉదయాన్నే పరగడుపున ఖర్జూరాలు తినాలి. ఉదయాన్నే క్యాలరీలు ఎక్కువగా ఉండే ఖర్జూరాలు తింటే రోజంతా ఆకలి లేకుండా యాక్టివ్‌గా ఉంటారు. రాత్రి సమయాల్లో ఖర్జూరాలు తినకూడదు. ఇవి అంత సులభంగా అరగవు. పరగడుపున ఖర్జూరాలు తినడం వల్ల శరీరానికి పోషకాలు చక్కగా అందుతాయి. దీనిలోని ఐరన్ హిమోగ్లోబిన్ స్థాయులను పెంచుతాయి.
- ఉదయాన్నే డేట్స్ తినడం వల్ల జీవక్రియలు సక్రమంగా జరిగి అధిక మొత్తంలో క్యాలరీలు ఖర్చవుతాయి. డేట్స్‌ను ఓట్స్‌తో కలిపి స్మూతీ, షేక్స్ చేసుకుని తాగితే కడుపు నిండుగా ఉండి ఆకలి వేయదు. ఫలితంగా ఇతర పదార్థాలు ఏమి తినలేం. ఫలితంగా తక్కువ క్యాలరీలతో శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.



బ్యూటిప్



టేబుల్ స్పూను పటిక పొడిలో తగినంత రోజ్ వాటర్‌ను వేసి పేస్టులా కలుపుకోవాలి. ఈ పేస్టుని ముఖానికి, మెడకు రాసుకుని మర్దన చేయాలి. పదిహేను నిమిషాలపాటు మర్దన చేసిన తరువాత నీటితో కడిగేయాలి. ముఖాన్ని తడిలేకుండా శుభ్రంగా తుడిచి, మాయిశ్చరైజర్ రాసుకోవాలి. వారానికి రెండుసార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖ సంబంధిత సమస్యలు తగ్గుముఖం పడతాయి.

విద్యార్థులే ఊపిరిగా..

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మందమతులేం కాదు, తెలివైన, చురుకైన వారు. విద్యార్థులే కాదు టీచర్లు కూడా నిరంతరం నేర్చుకుంటూనే ఉంటారు" అంటోంది నేషనల్ గుడ్ టీచర్ అవార్డు గ్రహీత మాలతీ టీచర్. దేశవ్యాప్తంగా యాభైమంది ఈ అవార్డు అందుకోగా అందులో మాలతీ టీచర్ ఒకరు.


మాలతీ టీచర్

తమిళనాడులోని సెంగోట్టైలో పుట్టి పెరిగిన మాలతి నల్లాసైతిరా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం పూర్తిచేసింది. మనస్తత్వ, రసాయన శాస్త్రాల్లో మాస్టర్స్ చేసింది. రసాయనశాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తూ టీచర్‌గా పనిచేస్తోంది. 2008లో తిరుపూర్ పెరుమతూర్ గవర్నమెంట్ హయ్యర్ సెకండరీ స్కూల్లో టీచర్‌గా చేరింది మాలతి. అక్కడ మూడేళ్ల పని చేశాక బదిలీ అవ్వడంతో తెన్కాసి గవర్నమెంట్ హయ్యర్ సెకండరీ స్కూల్లో టీచర్‌గా వెళ్లింది. ఇక్కడ ఏడాది పనిచేశాక ప్రమోషన్ రావడంతో వీరకేరళంబుదూర్ గవర్నమెంట్ హయ్యర్ సెకండరీ స్కూల్లో పోస్టుగ్రాడ్యుయేట్ సైన్స్ టీచర్‌గా చేరింది. గత పదేళ్లుగా ఇదే స్కూల్లో సైన్స్ టీచర్‌గా పనిచేస్తూ విద్యార్థులకు చక్కగా అర్థమయ్యేలా పాఠాలు చెబుతూ వారి మనసులో సుస్థిరస్థానాన్ని సంపాదించుకుంది.

నేర్చుకుంటూ.. నేర్పిస్తాను

''బోధనే నా శ్వాస, విద్యార్థులే నా ఊపిరి. డాక్టర్లు, టీచర్లకు రిటైర్మెంట్ ఉండదు. అధికారికంగా రిటైర్ అయినప్పటికీ ఆ తరువాత కూడా స్టూడెంట్స్ కోసం పనిచేస్తాను. నేను సైకాలజీ చదవడం వల్ల విద్యార్థుల్ని, వారి వైకల్యాలను అర్థం చేసుకుని పాఠాలు చెప్పగలుగుతున్నాను. ప్రతి ఒక్క టీచర్ సైకాలజీ చదివితే మరింత చక్కగా బోధించగలుగుతారు. నేషనల్ గుడ్ టీచర్ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. నేను నేర్చుకుంటూ, విద్యార్థులకు నేర్పించడమే నా జీవితాశయం'' అని మాలతీ టీచర్ చెబుతోంది.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న మాలతీ టీచర్


తరగతి గదిలో శిక్షణ

■ ఆటపాటలతో... పాఠాలు

విద్యార్థులు సైన్స్‌సబ్జెక్టుని ఇష్టపడాలని మాలతి కోరిక. అందుకే ఎంతో కష్టమైన చాప్టర్లను సైతం విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తోంది. విలువిద్య, తోలుబొమ్మలాట, పాటలు పాడడం, నృత్యం, కథలు చెప్పడం ద్వారా సైన్స్ పాఠాలను వివరిస్తోంది. కరోనా సమయంలో ఇళ్లకే పరిమితమైన విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతుల ద్వారా బోధించింది. గ్రామాల్లో మొబైల్ ఫోన్స్ లేని అంధవిద్యార్థులకు సైతం ఆడియో పాఠాలను అందించింది.

నూటపద్దెనిమిది మూలకాల పట్టికను సైతం కంఠస్థం చేయాలన్న ఆసక్తి ఉన్న వారికి చక్కగా నేర్చుకునేందుకు సాయపడుతోంది. మేధో వైకల్యాలున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వీరు కూడా మంచి ఉత్తీర్ణత సాధించేలా కృషిచేస్తోంది. ఈ విద్యార్థులకు ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించి వారి నైపుణ్యాలను మెరుగుపరుస్తోంది. ఇలా మాలతీ టీచర్ సాయంతో సైబుల్ ఇస్లాం అనే మేధోవైకల్య విద్యార్థి 25 సెకన్లలో 20 ద్రవాల పేర్లు టకటకా చెప్పి 'చోళన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నాడు. ఇస్లాంకు మాలతీ ఆరు నెలలపాటు శిక్షణ ఇచ్చింది. మహేశ్వరి, కరణ్, శక్తి ప్రభ వంటి విద్యార్థులు సైతం సెకన్ల వ్యవధిలో నూటపద్దెనిమిది మూలకాల పీరియాడిక్ టేబుల్‌ను అప్పచెప్పి చోళన్ వరల్డ్ రికార్డు బుక్‌లో చోటు దక్కించుకున్నారు. అరవైశాతం మేధో వైకల్యం కారణంగా సరిగా మాట్లాడలేని వారితో సైతం మూలకాల పేర్లను కంఠస్థం చేయించి, గడగడా చెప్పించడం విశేషం.

■ అవార్డులు రికార్డులు...

విద్యార్థులను రికార్డుల బుక్‌లో చోటుదక్కించుకునేలా తయారు చేయడమేగాక మాలతీ కూడా కరోనా సమయంలో ఐదువందల రోజులు ఉచితంగా ఆన్‌లైన్ తరగతులు చెప్పి చోళన్ వరల్డ్ రికార్డు బుక్ లో చోటు దక్కించుకుంది. మాలతి కృషిని గుర్తించిన తమిళనాడు ప్రభుత్వం 2020–2021 సంవత్సరానికిగాను డాక్టర్ రాధాకృష్ణన్ అవార్డుతో సత్కరించింది. 2022లో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఇరవై ఆరుగంటలపాటు నిరంతరాయంగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించి వరల్డ్ రికార్డు సృష్టించింది. ఆరోతరగతి నుంచి పై తరగతులకు పాఠాలు బోధించే మాలతీ తనకు వచ్చిన నగదు బహుమతితో విద్యార్థులకు రోబోటిక్స్ కిట్స్ కొని ఇచ్చింది.

■ గేమ్‌లకు బానిసలు కాకుండా...

స్మార్ట్‌ఫోన్లు వచ్చాక విద్యార్థులంతా మొబైల్ గేమ్స్‌కు అంకితమైపోతున్నారు. వీరిని ఆడుకోనిస్తూనే పాఠాలు నేర్పించడానికి మాలతి క్విజ్‌గేమ్ వాయిస్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను స్టూడెంట్స్‌తోనే తయారు చేయించడం విశేషం. దీనిలో పీరియాడిక్ టేబుల్ ఉంటుంది. ఈ టేబుల్‌లో విద్యార్థుల పేర్లు, ఇంగ్లిష్‌లోని కష్టమైన పదాలను వెతుకుతూ నేర్చుకోవచ్చు. విద్యార్థులకు నేర్పిస్తోన్న పాఠాలను వారి తల్లిదండ్రులు చూసేలా యూట్యూబ్‌లో పోస్టు చేస్తూ వారి ఉన్నతికి కృషిచేస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది మాలతి టీచర్.

యూత్ పల్స్

ఔరా... అవుట్ ఆఫ్ ది బాక్స్

రామ్‌గోపాల్‌వర్మ 'కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: అప్పల్రాజు' సినిమాలో రాఖీ డైలాగు... 'డైరెక్టర్ కావాలంటే ఊరకే కథలు మాత్రమే రాస్తే సరిపోదయ్యా' కట్ చేస్తే... సినీ కలల యువతరం ఇప్పుడు ఊరకే కథలు రాస్తూ, కలలు కంటూ మాత్రమే కూర్చోవడం లేదు. చిత్రరంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న సాంకేతికతను అధ్యయనం చేస్తోంది. ఇంటర్‌నెట్‌నే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌గా చేసుకొని 'స్క్రిప్ట్ బుక్' 'ఐవా' 'మాజిస్టో'లాంటి ఎన్నో ఏఐ టూల్స్‌పై అవగాహన పెంచుకొని వినూత్నంగా ఆలోచిస్తోంది...



పుణెకు చెందిన నైనా పాటిల్ పేరుకు ఇంజనీరింగ్ చదువుతుందిగానీ ఆమె కలలన్నీ చిత్రసీమ వైపే. ఇంట్లో చెబితే ఒప్పుకోరని తెలుసు. అయితే ఆ భయమేమీ తన కలలకు అడ్డుగోడ కావడం లేదు. తీరిక వేళల్లో అత్యాధునిక సినీ సాంకేతికతకు సంబంధించిన విషయాలు, విశేషాలు తెలుసుకోవడం తనకు ఇష్టం.

కోయంబత్తూరుకు చెందిన నిఖిల్ తేజను ఒక్కసారి కదిపి చూడండి. ఫిల్మ్ ఇండస్ట్రీకి సంబంధించి లేటెస్ట్, గ్రేటెస్ట్ విశేషాలను గుక్కతిప్పుకోకుండా చెబుతాడు. సినీ సాంకేతికతపై అతని పట్టు చూస్తే 'రాబోయే రోజుల్లో కాబోయే డైరెక్టర్' అని ఢంకా బజాయించి చెప్పవచ్చు.

ఒక సినిమా హిట్ కావాలంటే కథ బాగుండాలి. బాగున్న కథను బాగా చెప్పగలగాలి. బాగా చెప్పడానికి మాటల నైపుణ్యంతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ రూపంలో సాంకేతిక నైపుణ్యాన్ని కూడా తోడుగా తెచ్చుకుంటుంది సినిమా కలల యువతరం. ఏఐ టూల్స్ వల్ల కథ వినే వారికి గంటల కొద్ది సమయం వృథా కాకపోవడం ప్లస్ పాయింట్. సినిమాలకు సంబంధించి యువతరం ఆసక్తి చూపుతున్న కొన్ని ఏఐ టూల్స్...

పెద్దగా సాంకేతిక పరిజ్ఞానం లేకపోయినా ఏఐ టూల్ 'స్క్రిప్ట్ బుక్'ను సులభంగా ఉపయోగించవచ్చు. సినిమాలు, టీవీ షోలకు స్క్రిప్ట్ క్రియేట్ చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. క్యాస్టింగ్, జానర్, స్టోరీ స్ట్రక్చర్‌కు సంబంధించి విశ్లేషణ చేయవచ్చు. 'డెమోక్రటైజింగ్ స్టోరీటెల్లింగ్ త్రూ ది ఆర్ట్ ఆఫ్ ఏఐ' అంటూ తనను పరిచయం చేసుకుంటుంది స్క్రిప్ట్‌బుక్. ఇది సినిమా జయాపజయాలను కూడా అంచనా వేయగలదు అంటున్నారుగానీ ఎంతవరకు నిజమో తెలియదు. డిఫరెంట్ యూజర్లను దృష్టిలో పెట్టుకొని స్క్రిప్ట్‌బుక్‌లో రకరకాల ప్యాకేజీలు ఉన్నాయి. ఇండివిడ్యువల్ రైటర్‌లు, చిన్న ప్రొడక్షన్ హౌజ్‌ల కోసం ది బేసిక్ ప్యాకేజ్, మల్టిపుల్ ప్రాజెక్ట్‌లకు సంబంధించి స్క్రిప్ట్ ఎనాలసిస్ చేయడానికి ది స్టాండర్డ్ ప్యాకేజ్, ప్రముఖ ప్రొడక్షన్ హౌజ్‌లు, స్టూడియోల కోసం ది ప్రీమియం, నిర్దిష్టమైన అవసరాల కోసం ది ఎంటర్‌ప్రైజ్‌లాంటి ప్యాకేజీలు ఉన్నాయి.

స్టోరీ టెల్లింగ్ ఏఐ టూల్స్‌లో ప్లాట్‌గన్ ఒకటి. దీనితో యానిమేటెడ్ ఫిల్మ్ సులభంగా రూపొందించవచ్చు. యూజర్-ఫ్రెండ్లీ అడ్వాన్స్‌డ్ ఫీచర్లతో సినీ కథకులకు, కంటెంట్ క్రియేటర్‌లకు ప్లాట్‌గన్ దగ్గరైంది. 'ప్లాట్‌గన్'ను ఉపయోగించడానికి డ్రాయింగ్ స్కిల్క్స్ అవసరం లేదు. ఎన్నో క్యారెక్టర్‌లతో కూడిన లైబ్రరీ, ఎక్స్‌ప్రెసివ్ యానిమేషన్స్, టైమ్-సేవింగ్ యానిమేషన్, కస్టమ్ వాయిస్ వోవర్స్ అండ్ సౌండ్‌ట్రాక్స్... దీని ప్రత్యేకత.

ఏఐ ప్లాట్‌ఫామ్ 'అడోబ్ సెన్‌సే' వీడియో ఎడిటింగ్, ఆటోమేటెడ్ కలర్ కరక్షన్స్, ఆడియో ఎన్‌హాన్స్‌మెంట్ కు సంబంధించి రకరకాల టూల్స్‌ను అందిస్తోంది. 'ఎమోషన్ ఏఐ' టూల్స్‌తో ఫేషియల్ ఎక్స్‌ప్రెషన్స్, బాడీ లాంగ్వేజ్‌ను ఎనలైజ్ చేయవచ్చు. 'మాజిస్టో' అనేది ఎడిటింగ్ విధానాన్ని సరళం చేసే ఏఐ పవర్డ్ వీడియో ఎడిటింగ్ టూల్. ఫుటేజీలోని 'బెస్ట్ మూమెంట్స్' ఆటోమేటిక్‌గా ఈ టూల్ సెలెక్ట్ చేస్తుంది. మ్యూజిక్‌ను యాడ్ చేస్తుంది. విజువల్ క్వాలిటీ విషయంలో తనవంతు పాత్ర పోషిస్తుంది.

ఐవా (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వర్చువల్ ఆర్టిస్ట్) అనేది ఏఐ-పవర్డ్ మ్యూజిక్ కంపోజిషన్ టూల్. మోడ్రన్ సినిమాటిక్, ఎలక్ట్రానిక్, పాప్, రాక్, జాజ్... ఇలా రకరకాలుగా మ్యూజిక్ క్రియేట్ చేసుకోవచ్చు. స్టోరీలైన్స్, వీటితోపాటు ప్లాట్ ఐడియాలు జెనరేట్ చేయాలనుకునే వారికి ఉపయోగపడే ఏఐ టూల్స్ కూడా ఉన్నాయి.



'స్క్రిప్ట్‌బుక్' నుంచి 'ఐవా' వరకు సినిమాలకు సంబంధించి సకల సాంకేతిక విషయాలను తెలుసుకోవడానికి ఏ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లోనూ శిక్షణ అక్కర్లేదు. ఇంటర్నెట్ ఉంటే చాలు! ఏఐ జెనరేట్ సోరీలైన్‌లు, డైలాగులు, స్క్రిప్టులు త్వరలో మన ఫిల్మ్ ఇండస్ట్రీలోకి కూడా రావచ్చు. ఏఐ జెనరేట్ చేసిన స్టోరీలైన్స్, స్క్రిప్టులను నమ్ముకోవడమా, తమలోని క్రియేటివిటీని మాత్రమే నమ్ముకోవడమా.. అనే రెండు దారులు కనిపించవచ్చు.

'ఏఐ సాంకేతికత అందరికీ అందుబాటులోకి వచ్చాక ప్రత్యేకత అంటూ ఉండకపోవచ్చు. స్టోరీలైన్‌లను క్రియేట్ చేయడంలో సహజత్వం మిస్ కావచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సాంకేతికత కంటే సహజత్వానికే ప్రాధాన్యత ఇవ్వాలి. సాంకేతికతపై అవగాహన ఉండడం ముఖ్యమే కాని అది మాత్రమే ముఖ్యం కాదు. సమాజాన్ని అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే కొత్త కథలు పుడతాయి' అంటుంది ఢిల్లీకి చెందిన మాస్ కమ్యూనికేషన్ స్టూడెంట్ వర్షిణి.



అమితాబ్‌కు 'గోల్డెన్ టికెట్'

భారత్‌లో జరిగే వన్డే వరల్డ్ కప్‌నకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన 'గోల్డెన్ టికెట్'ను నట దిగ్గజం అమితాబ్ బచ్చన్‌కు బీసీసీఐ కార్యదర్శి జై షా అందజేశారు. ఈ టికెట్ ద్వారా ప్రత్యేక అతిథి హోదాలో అన్ని వేదికల్లో అన్ని మ్యాచ్‌లనూ చూసే అవకాశం ఉంటుంది. మహానటుడే కాకుండా క్రికెట్ వీరాభిమాని అయిన అమితాబ్‌కు 'గోల్డెన్ టికెట్' ఇవ్వడాన్ని గౌరవంగా భావిస్తున్నట్లు, ఎప్పటిలాగే టీమిండియాకు ఆయన మద్దతు కొనసాగాలని జై షా వ్యాఖ్యానించారు.

హిమా దాస్‌పై తాత్కాలిక నిషేధం



భారత స్టార్ అథ్లెట్ హిమా దాస్‌పై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) తాత్కాలిక నిషేధం విధించింది. గత ఏడాది కాలంలో డోపింగ్ పరీక్షల కోసం ఆమె తన ఆచూకీ వివరాలు 'నాడా'కు ఇవ్వకపోవడంతో ఈ చర్య తీసుకున్నారు. నిబంధనల ప్రకారం హిమా దాస్ రెండేళ్ల నిషేధం ఎదుర్కోవచ్చు. అస్సాంకు చెందిన 23 ఏళ్ల హిమ 2018 జకార్తా ఆసియా క్రీడల్లో 400 మీటర్ల విభాగంలో రజతం, మహిళల 4x400 మీటర్ల రిలేలో స్వర్ణం సాధించింది.



రోహిత్ శర్మ
వయసు: 36
ఆడిన వన్డేలు: 246
చేసిన పరుగులు: 9922
అత్యధిక స్కోరు: 264
సెంచరీలు: 30
అర్ధ సెంచరీలు: 49
తీసిన వికెట్లు: 8

హార్దిక్ పాండ్యా
వయసు: 29
ఆడిన వన్డేలు: 79
చేసిన పరుగులు: 1753
అత్యధిక స్కోరు: 92
అర్ధ సెంచరీలు: 11
తీసిన వికెట్లు: 74
బెస్ట్ బౌలింగ్: 4/24

విరాట్ కోహ్లి
వయసు: 34
ఆడిన వన్డేలు: 277
చేసిన పరుగులు: 12902
అత్యధిక స్కోరు: 183
సెంచరీలు: 46
అర్ధ సెంచరీలు: 65
తీసిన వికెట్లు: 4

రవీంద్ర జడేజా
వయసు: 34
ఆడిన వన్డేలు: 179
చేసిన పరుగులు: 2574
అత్యధిక స్కోరు: 87
అర్ధ సెంచరీలు: 13
తీసిన వికెట్లు: 197
బెస్ట్ బౌలింగ్: 5/36

బుమ్రా
వయసు: 29
ఆడిన వన్డేలు: 73
తీసిన వికెట్లు: 121
బెస్ట్ బౌలింగ్: 6/19
ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు: 2
చేసిన పరుగులు: 63
అత్యధిక స్కోరు: 16

సిరాజ్
వయసు: 29
ఆడిన వన్డేలు: 26
తీసిన వికెట్లు: 46
బెస్ట్ బౌలింగ్: 4/32
ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు: 2
చేసిన పరుగులు: 31
అత్యధిక స్కోరు: 9

ఇషాన్ కిషన్
వయసు: 25
ఆడిన వన్డేలు: 19
చేసిన పరుగులు: 776
అత్యధిక స్కోరు: 210
సెంచరీలు: 1
అర్ధ సెంచరీలు: 7
క్యాచ్‌లు/స్టంపింగ్: 11/2

కుల్దీప్ యాదవ్
వయసు: 28
ఆడిన వన్డేలు: 86
తీసిన వికెట్లు: 141
బెస్ట్ బౌలింగ్: 6/25
ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు: 1
చేసిన పరుగులు: 168
అత్యధిక స్కోరు: 19

శార్దుల్ ఠాకూర్
వయసు: 31
ఆడిన వన్డేలు: 40
తీసిన వికెట్లు: 59
ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు: 4
బెస్ట్ బౌలింగ్: 4/37
చేసిన పరుగులు: 318
అత్యధిక స్కోరు: 50

శ్రేయస్ అయ్యర్
వయసు: 28
ఆడిన వన్డేలు: 44
చేసిన పరుగులు: 1645
అత్యధిక స్కోరు: 113
సెంచరీలు: 2
అర్ధ సెంచరీలు: 14
క్యాచ్‌లు: 16

శుబ్‌మన్ గిల్
వయసు: 23
ఆడిన వన్డేలు: 29
చేసిన పరుగులు: 1514
అత్యధిక స్కోరు: 208
సెంచరీలు: 4
అర్ధ సెంచరీలు: 7
క్యాచ్‌లు: 18

షమీ
వయసు: 33
ఆడిన వన్డేలు: 91
తీసిన వికెట్లు: 163
బెస్ట్ బౌలింగ్: 5/69
ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు: 9
చేసిన పరుగులు: 204
అత్యధిక స్కోరు: 25

అక్షర్ పటేల్
వయసు: 29
ఆడిన వన్డేలు: 52
తీసిన వికెట్లు: 58
బెస్ట్ బౌలింగ్: 3/24
చేసిన పరుగులు: 413
అత్యధిక స్కోరు: 64 నాటౌట్
అర్ధ సెంచరీలు: 2

సూర్యకుమార్ యాదవ్
వయసు: 32
ఆడిన వన్డేలు: 26
చేసిన పరుగులు: 511
అత్యధిక స్కోరు: 64
అర్ధ సెంచరీలు: 2
క్యాచ్‌లు: 15

కేఎల్ రాహుల్
వయసు: 31
ఆడిన వన్డేలు: 54
పరుగులు: 1986
అత్యధిక స్కోరు: 112
సెంచరీలు: 5
అర్ధ సెంచరీలు: 13
క్యాచ్‌లు/స్టంపింగ్: 32/2

సమరానికి మన సైన్యమిదే

"జట్టు కోసం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు. ఈ క్రమంలో కొందరికి నిరాశ కలగడం సహజం. సమతూకం కోసమే శార్దుల్, అక్షర్‌లను తీసుకున్నాం. గత కొన్నేళ్లుగా లోయర్ ఆర్డర్‌లో బలహీన బ్యాటింగ్‌తో సమస్య ఎదుర్కొన్నాం. 8వ, 9వ స్థానాల్లో ఆడేవారు కూడా కొన్ని పరుగులు చేయడం అవసరం. వారికి ఆ విషయం స్పష్టంగా చెప్పాం కూడా. పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో హార్దిక్ ఆట చూస్తే అతను ఎంత కీలకమో అర్థమవుతుంది. ఫైనల్‌తో కలిపితే 11 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. టి20లతో పోలిస్తే వన్డేల్లో కోలుకునేందుకు, వ్యూహాలు రూపొందించుకునేందుకు తగినంత సమయం ఉంటుంది. అన్ని రకాలుగా ఈ టీమ్ అత్యుత్తమం అని మేం భావిస్తున్నాం. టీమ్ ప్రకటించేందుకు ముందు ఎంతో చర్చించి, ఎంతో ఆలోచింతాం. ఎంపికతో ఎంతో సంతృప్తిగా ఉన్నాం.

–రోహిత్ శర్మ, భారత కెప్టెన్



జట్టులో ఇప్పుడు ఎవరికీ ఫిట్‌నెస్ సమస్యలు లేవు. అందరూ పూర్తిగా కోలుకున్నారు. ఎన్‌సీఏలో జరిగిన క్యాంప్‌లో రాహుల్ 50 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి 50 ఓవర్లు కీపింగ్ కూడా చేశాడు. కాబట్టి అతని గురించి ఎలాంటి ఆందోళన లేదు. ఆఫ్‌స్పిన్నర్‌పై చర్చ జరిగింది. అయితే జడేజా, అక్షర్ ఎడంచేతి వాటం బ్యాటర్లకు సమర్థంగా బౌలింగ్ చేయగలరని నమ్ముతున్నాం. వీరిద్దరి బ్యాటింగ్ కూడా అవసరం కాబట్టి ఆఫ్‌స్పిన్నర్ ఆలోచనను పక్కన పెట్టాం.

–అజిత్ అగార్కర్, చీఫ్ సెలక్టర్

వన్డే ప్రపంచకప్‌కు భారత జట్టు ప్రకటన

- కేఎల్ రాహుల్‌కు టీమ్‌లో చోటు
- తిలక్ వర్మ, ప్రసిధ్‌లకు దక్కని చాన్స్
- సంజు సామ్సన్‌కూ లభించని స్థానం
- మార్పులకు 28 వరకు అవకాశం



అనూహ్య ఎంపికలు, సంచలనంలాంటివేమీ లేవు... అంచనాలకు తగినట్లుగానే సొంతగడ్డపై టీమిండియా బృందం సిద్ధమైంది... ఆసియా కప్ బరిలో నిలిచిన 17 మందిలో ఇద్దరిని తప్పించి వరల్డ్‌కప్ టీమ్‌ను ఎంపిక చేస్తామన్న సెలక్టర్లు దానికే కట్టుబడ్డారు. కొత్తగా మరో ఆటగాడిని తీసుకొని జట్టులోకి చేర్చే ప్రయత్నం చేయలేదు... గాయం నుంచి కోలుకోవడంలో రాహుల్ ఎంపిక ఖాయం కాగా, రిజర్వ్‌గా ఉన్న సంజూ సామ్సన్ పేరును పరిశీలించనే లేదు... ఊహించినట్లుగానే తిలక్ వర్మ, ప్రసిధ్ కృష్ణ తమ స్థానాలు కోల్పోయారు. సరిగ్గా పుష్కర కాలం తర్వాత భారత్ ఆతిథ్యమిస్తున్న ఈ వన్డే వరల్డ్ కప్‌లో 2011 తరహాలోనే మన బృందం మళ్లీ మ్యాజిక్ చేస్తుందా అనేది ఆసక్తికరం.

రోహిత్ తొలిసారి కెప్టెన్‌గా

2019 వన్డే వరల్డ్ కప్‌లో ఆడిన 8 మంది ఈసారి కూడా టీమ్‌లో ఉండటం విశేషం. 2011 వరల్డ్ కప్ టీమ్‌లో చోటు దక్కని రోహిత్ శర్మ తర్వాతి రెండు టోర్నీల్లో ఆడాడు. గత వరల్డ్ కప్‌లో ఏకంగా ఐదు సెంచరీలతో అదరగొట్టిన అతను ఈసారి సొంతగడ్డపై సారథిగా పెద్ద బాధ్యతతో బరిలోకి దిగుతున్నాడు. 2011 విజయంలో భాగమైన విరాట్ కోహ్లి ప్రస్తుత టీమ్‌లో వన్డే వరల్డ్ గెలిచిన ఒకే ఒక ఆటగాడు. గిల్, శ్రేయస్, సూర్య, కిషన్, అక్షర్, శార్దుల్, సిరాజ్‌లకు ఇదే తొలి ప్రపంచకప్. తొలి మ్యాచ్‌లో అక్టోబర్ 8న చెన్నైలో ఆస్ట్రేలియాను భారత్ ఎదుర్కొంటుంది.

పల్లెకెలె (శ్రీలంక): వన్డే క్రికెట్‌లో రెండు సార్లు జగజ్జేతగా నిలిచిన భారత జట్టు సొంతగడ్డపై మూడో టైటిల్ కోసం గురి పెట్టింది. టీమిండియాకు అలాంటి ఘనతను అందించే సత్తా ఉన్న 15 మందితో ఇప్పుడు జట్టు సిద్ధమైంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బీసీసీఐ సెలక్షన్ కమిటీ మంగళవారం పల్లెకెలెలో ఈ జాబితాను ప్రకటించింది. రోహిత్ శర్మ నాయకత్వంలోని ఈ బృందంలో ఐదుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు, ముగ్గురు స్పెషలిస్ట్ పేసర్లు, నలుగురు ఆల్‌రౌండర్లు, ఇద్దరు వికెట్ కీపర్ బ్యాటర్లు, ఒక స్పెషలిస్ట్ స్పిన్నర్ ఉన్నారు. ఆసియా కప్‌లో ప్రస్తుతం టీమ్‌లో ఉన్న హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ, పేసర్ ప్రసిధ్ కృష్ణ, రిజర్వ్‌గా ఉన్న సంజూ సామ్సన్‌లకు మాత్రం అవకాశం దక్కలేదు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వరల్డ్ కప్ కోసం జట్లను ప్రకటించేందుకు ఆఖరి తేదీగా ప్రకటించిన సెప్టెంబర్ 5నే అన్ని టీమ్‌లూ తమ బృందంతో సిద్ధమయ్యాయి. అయితే ఎవరికైనా గాయం లేదా ఇతర కారణాలతో జట్టులో మార్పులు చేయాల్సి ఉంటే సెప్టెంబర్ 28 వరకు కూడా అవకాశం ఉంది. ఆసియా కప్ తర్వాత వరల్డ్ కప్‌కు ముందు భారత్ ఆస్ట్రేలియాతో 3 వన్డేల సిరీస్ ఆడుతుంది.

ఎంపికకు కారణాలివీ...

టాపార్డర్‌లో రోహిత్, గిల్, కోహ్లిల విషయంలో మరో చర్చకు తావు లేదు. గాయాలపాలు కాక ముందు 4, 5 స్థానాల్లో శ్రేయస్, రాహుల్‌ల స్థానాలకు ఢోకా లేదు. కోచ్ రాహుల్ ద్రవిడ్ కూడా పదే పదే ఇదే చెబుతూ వచ్చాడు. అదే నమ్మకంతో కేఎల్ రాహుల్‌కు అవకాశం దక్కింది. మేలో ఐపీఎల్ తర్వాత మైదానంలోకి దిగకపోయినా, ఆసియా కప్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు దూరమైనా అతని స్థానానికి ఇబ్బంది లేకుండా పోయింది. వన్డేల్లో మిడిలార్డర్‌లో మంచి రికార్డు ఉండటం కూడా అందుకు ఒక కారణం. ఫిట్‌గా ఉంటే ప్రధాన వికెట్ కీపర్‌గా రాహుల్‌కే మొదటి అవకాశం దక్కుతుంది. వరుసగా నాలుగు వన్డేల్లో అర్ధసెంచరీలు సాధించి మరో కీపర్‌గా ఇషాన్ కిషన్ తన స్థానం నిలబెట్టుకున్నాడు. కొద్ది రోజుల వరకు కూడా సామ్సన్‌తో పోటీ పడినా... రేసులో కేరళ బ్యాటర్ వెనుకబడిపోయాడు. వన్డే ఫామ్ గొప్పగా లేకపోయినా కొన్ని బంతుల వ్యవధిలో ఆట దిశ మార్చగలడంటూ సెలక్టర్లు సూర్యకుమార్‌పై నమ్మకముంచారు. ఆల్‌రౌండర్‌గా హార్దిక్ విలువ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అదే తరహాలో కీలక సమయాల్లో ఆదుకోగల శార్దుల్‌కూ అవకాశం దక్కింది. ప్రధాన పేసర్లుగా బుమ్రా, షమీ, సిరాజ్ విషయంలో ఎలాంటి సందేహాలు లేవు. స్పిన్ ఆల్‌రౌండర్లుగా జడేజా, అక్షర్ జట్టులో ఉన్నారు. ఒకే తరహా శైలి గల వీరిద్దరికి ఒకేసారి తుది జట్టులో స్థానం సందేహమే. కొంత కాలంగా నిలకడగా రాణిస్తున్న కుల్దీప్ వరల్డ్ కప్ అవకాశం సొంతం చేసుకోగా... లెగ్‌స్పిన్నర్ యజువేంద్ర చహల్ మాత్రం వరల్డ్ కప్‌కు దూరమయ్యాడు. అంతా బాగున్నా మొత్తం జట్టులో ఒకే ఒక లోటు రెగ్యులర్ ఆఫ్‌స్పిన్నర్ లేకపోవడమే. భారత పిచ్‌లపై, ప్రత్యర్థి జట్లలో అగ్రశ్రేణి ఎడంచేతి వాటం బ్యాటర్లు ఎక్కువ మంది ఉండగా ఆఫ్‌స్పిన్నర్ బాగా ప్రభావం చూపగలిగేవాడు. సీనియర్ అశ్విన్ లేదంటే యువ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌ను పరిశీలించినా బాగుండేది.

సెమీస్‌లో కోకో గాఫ్



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో అమెరికా టీనేజ్ స్టార్, ఆరో సీడ్ కోకో గాఫ్ తొలిసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్లో కోకో గాఫ్ 67 నిమిషాల్లో 6-0, 6-2తో 20వ సీడ్ ఒస్టాపెంకో(లాత్వియా)పై గెలిచింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)ను బోల్తా కొట్టించిన 2017 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ ఒస్టాపెంకో క్వార్టర్ ఫైనల్లో మాత్రం చేతులెత్తేసింది. గాఫ్ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. ఒస్టాపెంకో 36 అనవసర తప్పిదాలు చేసింది. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్కరాజ్ (స్పెయిన్), 12వ సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

అయ్యో అఫ్గానిస్తాన్!

- 2 పరుగులతో అనూహ్య ఓటమి
- 'సూపర్-4' దశకు శ్రీలంక



లాహోర్: శ్రీలంకతో మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ విజయ లక్ష్యం 292 పరుగులు... అయితే 37.1 ఓవర్లలో దీనిని ఛేదిస్తేనే ఆ జట్టు 'సూపర్-4'కు చేరుతుంది. దీనిని సవాల్‌గా తీసుకొని బ్యాటర్లంతా విజృంభించారు. అందరూ దూకుడుగా ఆడి జట్టును విజయానికి చేరువగా తెచ్చారు. 37 ఓవర్లలో స్కోరు 289 పరుగులకు చేరింది. మరో బంతికి 3 పరుగులు తీస్తే గెలుపు సొంతమవుతుందనగా వికెట్ కోల్పోయింది. అయితే తర్వాతి 3 బంతుల్లో మరో 6 పరుగులు చేసినా విజయానికి లెక్క సరిపోయేది. కానీ అదీ సాధ్యం కాలేదు. చివరకు 2 పరుగులతో గెలిచిన శ్రీలంక 'సూపర్-4' దశకు అర్హత సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (92; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్. అనంతరం అఫ్గానిస్తాన్ 37.4 ఓవర్లలో 289 పరుగులకు ఆలౌటైంది. నబీ (32 బంతుల్లో 65; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), హష్మతుల్లా (59; 3 ఫోర్లు, 1 సిక్స్), రహమత్ షా (45; 5 ఫోర్లు, 1 సిక్స్), రషీద్ ఖాన్ (16 బంతుల్లో 27 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) నజీబుల్లా (బి) గుల్బదిన్ 41; కరుణరత్నే (సి) నబీ (బి) గుల్బదిన్ 32; కుశాల్ మెండిస్ (రనౌట్) 92; సమరవిక్రమ (సి) గుర్బాజ్ (బి) గుల్బదిన్ 3; అసలంక (సి అండ్ బి) రషీద్ ఖాన్ 36; ధనంజయ డిసిల్వా (బి) ముజీబ్ 14; షనక (బి) రషీద్ ఖాన్ 5; వెలలాగె (నాటౌట్) 33; తీక్షణ (బి) గుల్బదిన్ 28; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు)** 291. **వికెట్ల పతనం:** 1-63, 2-80, 3-86, 4-188, 5-221, 6-226, 7-227, 8-291. **బౌలింగ్:** ఫారూఖీ 7-1-52-0, ముజీబ్ 10-0-60-1, గుల్బదిన్ 10-0-60-4, నబీ 10-0-35-0, రషీద్ ఖాన్ 10-0-63-2, కరీమ్ జనత్ 3-0-20-0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) మెండిస్ (బి) రజిత 4; ఇబ్రహీమ్ (బి) రజిత 7; గుల్బదిన్ (ఎల్బీ) (బి) పతిరణ 22; రహ్మత్ (సి) పతిరణ (బి) రజిత 45; హష్మతుల్లా (సి) రజిత (బి) వెలలాగె 59; నబీ (సి) ధనంజయ (బి) తీక్షణ 65; కరీమ్ (సి) కరుణరత్నే (బి) వెలలాగె 22; నజీబుల్లా (సి) (సబ్) హేమంత (బి) రజిత 23; రషీద్ (నాటౌట్) 27; ముజీబ్ (సి) సమరవిక్రమ (బి) ధనంజయ 0; ఫారుఖీ (ఎల్బీ) (బి) ధనంజయ 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (37.4 ఓవర్లలో ఆలౌట్)** 289. **వికెట్ల పతనం:** 1-10, 2-27, 3-50, 4-121, 5-201, 6-234, 7-237, 8-276, 9-289, 10-289. **బౌలింగ్:** రజిత 10-0-79-4, తీక్షణ 10-0-62-1, వెలలాగె 4-0-36-2, పతిరణ 10-0-63-1, షనక 2-0-32-0, ధనంజయ 1.4-0-12-2.

ఆసియా కప్ 'సూపర్-4' వేదికల్లో మార్పు లేదు

ఆదివారం భారత్ X పాకిస్తాన్

కొలంబో: భారీ వర్షాల కారణంగా కొలంబోలో జరగాల్సిన ఆసియా కప్ 'సూపర్-4' మ్యాచ్‌లు, ఫైనల్ వేదికను మార్చవచ్చంటూ జరిగిన చర్చకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ఫుల్‌స్టాప్ పెట్టింది. ముందుగా నిర్ణయించిన ప్రకారమే ఒక మ్యాచ్ నేడు పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్ల మధ్య లాహోర్‌లో... ఫైనల్ సహా తర్వాతి 6 మ్యాచ్‌లు కొలంబోలోనే జరుగుతాయని ప్రకటించింది. మ్యాచ్‌లను హంబన్‌టోటాకు మార్చే విషయంపై ప్రసారకర్తల అభ్యంతరం సహా ఇతర సమస్యలు ఉండటంతో ఏసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. కొలంబోలో రాబోయే రోజుల్లో వర్షాలు తగ్గుముఖం పట్టవచ్చని నిర్వాహకులు ఆశిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం 'సూపర్-4' దశలో ఈ నెల 10న పాకిస్తాన్‌తో, 12న శ్రీలంకతో, 15న బంగ్లాదేశ్‌తో భారత్ తలపడుతుంది.

భారత షట్లర్లకు నిరాశ



చాంగ్జౌ: చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత క్రీడాకారులకు నిరాశ ఎదురైంది. సింగిల్స్‌లో బరిలోకి దిగిన ముగ్గురు క్రీడాకారులు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్ తొలి రౌండ్‌లోనే ఓడిపోగా, డబుల్స్‌లో పోటీపడిన రెండు జోడీలు పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ, ఎంఆర్ అర్జున్-ధ్రువ్ కపిల మొదటి రౌండ్‌ను దాటలేకపోయాయి. ప్రపంచ ఆరో ర్యాంకర్ ప్రణయ్ 12-21, 21-13, 18-21తో 22వ ర్యాంకర్ ఎన్జీ జె యోంగ్ (మలేసియా) చేతిలో ఓటమి పాలయ్యాడు. 12వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-23, 21-16, 9-21తో పదో ర్యాంకర్ ఆంటొన్సెన్ (డెన్మార్క్) చేతిలో... 28వ ర్యాంకర్ ప్రియాన్షు రజావత్ 13-21, 24-26తో 45వ ర్యాంకర్ రుస్తావిటో (ఇండోనేసియా) చేతిలో పరాజయం చవిచూశారు.

సినిమా

మురళీధరన్ అదే చేశాడు! - సచిన్ టెండూల్కర్



● జయసూర్య, సచిన్, ముత్తయ్య మురళీధరన్

''1993లో మురళీధరన్‌ని కలిశాను. అప్పట్నుంచి మా స్నేహం అలాగే ఉంది. ఎంతో సాధించినా సాధారణంగా ఉంటాడు. అతను ఏదైనా అడిగితే కుదరదని చెప్పడం కష్టం.. అందుకే పిలవగానే ఈ వేడుకకి వచ్చాను'' అన్నారు భారత క్రికెటర్ సచిన్ టెండూల్కర్. టెస్ట్ క్రికెట్ చరిత్రలో 800 వికెట్లు తీసిన ఆఫ్ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా రూపొందిన సినిమా '800'. మురళీధరన్ పాత్రలో మధుర్ మిట్టల్ నటించారు. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వం వహించారు. శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో వివేక్ రంగాచారి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ముంబైలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో '800' ట్రైలర్‌ని సచిన్ టెండూల్కర్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఆటలో గెలుపోటములు ఉంటాయి. మళ్లీ నిలబడి పోటీ ఇవ్వడమే నిజమైన ఆటగాడి లక్షణం. మురళీధరన్ అదే చేశాడు.. అతని జీవితం గురించి ప్రజలు తెలుసుకోవాలి'' అన్నారు. ముత్తయ్య మురళీధరన్ మాట్లాడుతూ– ''నేను సచిన్ ఫ్యాన్‌ని. మరో వందేళ్ల తర్వాత కూడా సచిన్ లాంటి క్రికెటర్, వ్యక్తి రాలేరు'' అన్నారు. ''ఈ సినిమాను విడుదల చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు శివలెంక కృష్ణప్రసాద్. ''800' మానవత్వంతో కూడిన కథ'' అన్నారు ఎంఎస్ శ్రీపతి. ''మురళీధరన్‌గారి పాత్ర చేయడం ఓ పెద్ద బాధ్యత'' అన్నారు మధుర్ మిట్టల్.

బాహుబలి కంటే ఎక్కువ యాక్షన్ సీన్స్ చేశాను - సత్యరాజ్



● వసంత్ రవి, సత్యరాజ్, తాన్యా హోప్

''వెపన్'లాంటి సినిమా తీయాలంటే డైరెక్టర్, ప్రొడ్యూసర్స్, సినిమాటోగ్రాఫర్, వీఎఫ్ఎక్స్.. ఇలా సాంకేతిక నిపుణులే కీలకం. వాళ్ల తర్వాత యాక్టర్స్‌కు ప్రాధాన్యత అని నా అభిప్రాయం. 'బాహుబలి' కంటే 'వెపన్'లో ఎక్కువ యాక్షన్ సీన్స్ చేశా. గుహన్ సరికొత్త విజన్‌తో తీశారు. త్వరలో ఈ సినిమా రిలీజ్ అవుతుంది'' అన్నారు సత్యరాజ్. గుహన్ సెన్నియప్పన్ దర్శకత్వంలో సత్యరాజ్, వసంత్ రవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'వెపన్'. మన్సూర్ నిర్మించిన ఈ సినిమా గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ''సరికొత్త సూపర్ హ్యూమన్ కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రూపొందింది'' అన్నారు వసంత్ రవి. ''మా బ్యానర్‌లో వస్తోన్న తొలి చిత్రమిది'' అన్నారు మన్సూర్. ''ఈ చిత్రంలో అద్భుతమైన యాక్షన్ సీక్వెన్సులున్నాయి'' అన్నారు గుహన్ సెన్నియప్పన్.

హర్ట్ చేసేలా మాట్లాడలేను - అనుష్క



ఐదేళ్ల తర్వాత అనుష్క వెండితెరపై కనిపించనున్నారు. 'ఇక కెరీర్‌లో ఇంత లాంగ్ గ్యాప్ ఎప్పుడూ తీసుకోను' అంటున్నారామె. మహేశ్‌బాబు పి. దర్శకత్వంలో అనుష్కా శెట్టి, నవీన్ పొలిశెట్టి ముఖ్య తారలుగా యూవీ క్రియేషన్స్ పై వంశీ, ప్రమోద్ నిర్మించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. రేపు (సెప్టెంబర్ 7) ఈ చిత్రం విడుదల కానుంది. 'భాగమతి' (2018) తర్వాత అనుష్క సిల్వర్ స్క్రీన్‌పై కనిపించనున్న చిత్రం ఇది. ఇక 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అనుష్క చెప్పిన విశేషాలు తెలుసుకుందాం.

● **'మిస్ శెట్టి..'లో చేసిన షెఫ్ అన్విత క్యారెక్టర్ గురించి...**

షెఫ్ క్యారెక్టర్ చేయడం నాకు ఇదే తొలిసారి. ఇది నా బెస్ట్ మూవీలా ఫీలవుతున్నాను. ఎందుకంటే ఐదున్నరేళ్ల థియేట్రికల్ రిలీజ్ తర్వాత ఒక కొత్త పాత్ర, సరికొత్త కథాంశం ఉన్న సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. ఈ చిత్రంలో మంచి భావోద్వేగాలు ఉన్నాయి.

● **ట్రైలర్‌లో కామెడీ, ఎమోషన్ కనిపించాయి. మీరీ సినిమా ఒప్పుకోవడానికి కారణం ఇవేనా?**

నేను కథకి ప్రాధాన్యత ఇస్తాను. నాకు, నిర్మాతలకు వినయ్‌గారు అని కామన్ ఫ్రెండ్ ఉన్నారు. మహేశ్ వద్ద ఒక స్టోరీ ఉంది వింటారా? అని అడిగారు.. అయితే సినిమా చేయమని కాదు. మహేశ్‌గారు కథ చెప్పాక అన్విత పాత్ర ఎవరు చేస్తున్నారు? అని అడిగాను. ఇంకా ఎవర్నీ అనుకోలేదని తను చెప్పగానే నేను చేస్తానన్నాను. మహేశ్ ఓ మంచి కథని కొత్తగా, క్లీన్ వేలో చూపించారు.

● **క్లీన్ వే అన్నారు. ట్రైలర్‌లో 'తల్లవ్వాలంటే గర్భవతి కావాలి కానీ పెళ్లక్కర్లేదు' అనే డైలాగ్ చెప్పారు..**

అలా ఎందుకు చెప్పాల్సి వచ్చిందనేది సినిమా చూస్తే అర్థం అవుతుంది. ట్రైలర్ అన్నది జస్ట్ గ్లింప్స్ మాత్రమే. లైఫ్‌లో ఎలా ఉంటాం? మన మైండ్ ఎలా మాట్లాడుతుంది? అనేది చెప్పాం.

● **మైండ్‌లో ఉన్నదాన్ని బయటకు చెబితే సమాజం ఒప్పుకోదు కదా?**

మన మైండ్ చాలా విషయాలు చెబుతుంది. కానీ, వాటిలోని సున్నితత్వాన్ని మనం అర్థం చేసుకొని మాట్లాడాలి. నా ఇష్టం వచ్చినది నేను చెబుతాను.. దాన్ని అర్థం చేసుకోకుంటే మీ సమస్య అనను. మనం ఏం చెప్పాలనుకుంటున్నామో దాన్ని సరైన విధానంలో చెప్పాలి. అంతేకానీ, ఎదుటి వారు హర్ట్ అయ్యేలా చెప్పడం సరికాదని నమ్ముతాను. మన మైండ్‌లో ఉన్నదాన్ని చెప్పే పద్ధతిలో చెప్పాలి.

ఈ మధ్య మీలో భక్తి భావం ఎక్కువయినట్టుంది.. పూజలు చేస్తున్నారు... ఆలయాలు సందర్శిస్తున్నారు..

ఇప్పుడనే కాదు.. నా చిన్నప్పటి నుంచి కూడా మా కుటుంబంలో గుడికి వెళ్లడం ఒక భాగం. ప్రతి సోమవారం, శుక్రవారం పూజలు చేస్తుంటాం. అయితే కంటిన్యూస్‌గా సినిమాలు చేయడంవల్ల ఆ మధ్య గుడికి వెళ్లడానికి కుదరలేదు. ఈ మధ్య వచ్చిన లాంగ్ గ్యాప్‌లో వెళ్లడానికి కుదిరింది.

పెళ్లి కాని అమ్మాయిలు పూజలు చేస్తే.. పెళ్లి కోసమే అనే చర్చ జరుగుతుంటుంది... మీ గురించి కూడా అలాంటి ఒక చర్చ ఉంది..

ఇప్పుడనే కాదు.. నేను గుడికి వెళ్లిన ప్రతిసారీ ఏదో ఒక చర్చ జరుగుతూనే ఉంది. ఒక మంచి విషయం ఏంటంటే.. నా కూతురి గురించి అందరూ ఇంత కేర్ తీసుకుంటారని మా అమ్మానాన్న ఆనందపడతారు (నవ్వుతూ).

మరి.. పెళ్లి కబురు ఎప్పుడు చెబుతారు?

ఇప్పుడు ప్లాన్స్ లేవు. పెళ్లనేది మంచి విషయం కాబట్టి కుదిరినప్పుడు హ్యాపీగా షేర్ చేసుకుంటా.

మీ కో–స్టార్స్‌కి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చినప్పుడు మీకు సంతోషం అనిపించడం సహజం... అలా పాన్ ఇండియా స్థాయి గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ గురించి...

ప్రభాస్‌గారు నాకు 2005 నుంచే తెలుసు. అప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడు ఈ స్థాయి గుర్తింపు వచ్చాక కూడా ప్రభాస్‌గారు అలానే ఉన్నారు. ఏ మార్పూ లేదు. తను నాకు 'వెరీ వెరీ డియర్ ఫ్రెండ్'. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. అలాగే రాజమౌళిగారి ఫ్యామిలీ కూడా నాకు క్లోజ్. భైరవ (కాలభైరవ)ని తన చిన్నప్పట్నుంచి చూస్తున్నాను. తనకు మంచి ('కొమురం భీముడో..'కి సింగర్‌గా నేషనల్ అవార్డు వచ్చిన విషయాన్ని ఉద్దేశించి) గుర్తింపు రావడం హ్యాపీగా ఉంది. మనకు క్లోజ్‌గా ఉన్నవాళ్లు ఎదుగుతుంటే చూడ్డానికి చాలా ఆనందంగా ఉంటుంది.

● **18 ఏళ్ల కెరీర్‌లో నటిగా మీ గ్రాఫ్ పెరిగింది. వ్యక్తిగతంగానూ పెద్దంత వివాదాలు లేకుండా సాగిన ఇన్నేళ్ల ప్రయాణాన్ని విశ్లేషించుకుంటే..**

యాక్చువల్లీ నేను కాంట్రవర్శీలను హ్యాండిల్ చేయలేను. ఎందుకంటే నేను చాలా సెన్సిటివ్. ఇలా నాలా సెన్సిటివ్‌గా ఉండేవాళ్లకు వేరేవాళ్ల ఎమోషన్స్ అర్థమవుతాయి. దాంతో హర్ట్ అయ్యేలా మాట్లాడలేం. నాకు ఇండస్ట్రీ, ప్రేక్షకుల నుంచి బోలెడంత ప్రేమ, గౌరవం దక్కాయి. అందుకే పెద్దగా వివాదాలు కూడా లేవు.

● **అరుంధతి, దేవసేన (బాహుబలి), భాగమతి.. ఇలాంటి రేర్ క్యారెక్టర్స్ దక్కడం మీకో బ్లెస్సింగ్ అనొచ్చా..**

కచ్చితంగా.. మనకి హార్డ్‌వర్క్ చేయాలని ఉన్నా రైట్ చాన్స్ కూడా రావాలంటాను. శ్యామ్‌గారు, కోడి రామకృష్ణగారు నన్ను 'అరుంధతి'గా విజువలైజ్ చేసి, నమ్మి తీసుకున్నారు. దర్శక–నిర్మాతలు నన్ను నమ్మారు కాబట్టి నాకు హార్డ్ వర్క్ చేయడానికి చాన్స్ దొరికింది. నిరూపించుకునే స్కోప్ దక్కింది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	152	65,780
నిఫ్టీ ▲	46	19,575

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శని రెండు శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	14,034	▲	2
డోజోన్స్	34,716	▼	122
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,438	▼	15
డాక్స్	15,772	▼	53
షాంఘై	3,154	▼	23
నికాయ్	33,037	▲	98

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	59,356
బంగారం (99.5 స్వచ్ఛత)	59,118
వెండి (కిలో)	72,231

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.03	83.70
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.84	90.96
€	యూరో	ఎస్‌బీఐ	102.85	106.28
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.61	57.34
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.16	54.46
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.09	62.01
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	22.81
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.25	12.32

పాత కారుకే ప్రాధాన్యత

- 70% కస్టమర్లు యూజ్డ్ కార్ల వైపు
- వ్యవస్థీకృతం అవుతున్న మార్కెట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పాత కారు.. పేరులో పాత ఉందని చిన్నచూపు చూడకండి. దేశంలో అమ్ముడవుతున్న పాత కార్ల సంఖ్య తెలిస్తే నోరెళ్లబెడతారు. 2022–23లో దేశవ్యాప్తంగా 15 శాతం వృద్ధితో 50 లక్షల యూనిట్ల యూజ్డ్ కార్లు చేతులు మారాయి. ఇందులో అవ్యవస్థీకృత రంగం వాటా 70 శాతం కాగా వ్యవస్థీకృత (ఆర్గనైజ్డ్) రంగం వాటా 30 శాతం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ 65 లక్షల యూనిట్లను తాకనుంది. ఈ రంగంలో దేశంలో ఎనిమిదవ స్థానంలో ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాటా 8 శాతంగా ఉంది. భారత్‌లో 2030 నాటికి పాత కార్ల పరిశ్రమ కొత్త వాటితో పోలిస్తే రెండింతలకు చేరుతుందన్న అంచనాలు ఉన్నాయి. తొలిసారిగా కారును సొంతం చేసుకుంటున్న కస్టమర్లలో 70 శాతం మంది పాత కారును కొనుగోలు చేస్తున్నారంటే ఆశ్చర్యం కలగకమానదు.

వ్యవస్థీకృత రంగమే..

యూజ్డ్ కార్ల మార్కెట్‌ను వ్యవస్థీకృత రంగమే నడిపిస్తోందని కార్స్‌24 కో–ఫౌండర్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ గజేంద్ర జంగిడ్ సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. 'పాత కార్ల రంగంలో అవ్యవస్థీకృత మార్కెట్ వార్షిక వృద్ధి 10 శాతమే. ఆర్గనైజ్డ్ మార్కెట్ ఏకంగా 30 శాతం వృద్ధి చెందుతోంది. కొత్త కార్ల విషయంలో 75 శాతం మందికి రుణం లభిస్తోంది. అదే పాత కార్లు అయితే ఈ సంఖ్య 15 శాతమే. యూజ్డ్ కార్లకు రుణం లభించడం అంత సులువు కాదు. ఇక కారు ఉండాలనుకోవడం ఒకప్పుడు ఆకాంక్ష. నేడు అవసరంగా భావిస్తున్నారు. అందుకే కొత్తదానితో పోలిస్తే సగం ధరలో దొరికే యూజ్డ్ కారు స్టీరింగ్ పట్టుకుంటున్నారు. ఇటీవలి కాలంలో సర్టిఫైడ్ కార్లకు డిమాండ్ పెరుగుతోంది. క్వాలిటీ చెక్స్, వారంటీ, రిటర్న్ పాలసీ, ఈజీ ఫైనాన్స్.. ఇన్ని సౌకర్యాలు ఉండడంతో సర్టిఫైడ్ కార్ల పట్ల వినియోగదార్లలో నమ్మకం ఏర్పడింది' అని ఆయన వివరించారు.



రెండు నగరాల్లోనే..

భారత్‌లో యూజ్డ్ కార్ల విక్రయ రంగంలో ఉన్న కంపెనీలు, విక్రేతలు వాహనాలను కొనుగోలు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. అదే హైదరాబాద్, బెంగళూరు మార్కెట్లలో మాత్రమే పార్కింగ్ విధానం ఉందని కార్స్24 చెబుతోంది. అంటే పాత కారు యజమానులు యూజ్డ్ కార్స్ విక్రయ కేంద్రాల్లో అద్దె చెల్లించి తమ వాహనాన్ని పార్క్ చేయవచ్చు. మంచి బేరం వస్తే యజమాని సమ్మతి మేరకు కారును విక్రయిస్తారు. కమీషన్ ఆధారంగానూ క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఇక 2015లో 100 కొత్త కార్లు రోడ్డెక్కితే అంతే స్థాయిలో పాత కార్లు చేతులు మారాయి. ఇప్పుడీ సంఖ్య 150 యూనిట్లకు చేరింది. యూఎస్, ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో 100 కొత్త కార్లకు 400 పాత కార్లు అమ్ముడవుతున్నాయి.

సగటు ధర రూ. 6 లక్షలు..

పాత కారు కొనుగోలు సగటు ధర రూ.6 లక్షలు ఉంటోంది. అమ్ముడవుతున్న మొత్తం పాత కార్లలో హ్యాచ్‌బ్యాక్ వాటా 60 శాతం కైవసం చేసుకుంది. ఈ విభాగం వృద్ధి నిలకడగా ఉంది. 20 శాతం వాటా ఉన్న సెడాన్స్ వృద్ధి రేటు తగ్గుతూ ప్రస్తుతం 20 శాతానికి వచ్చి చేరింది. ఎస్‌యూవీల వాటా క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం 20 శాతంగా ఉంది. అయితే వృద్ధి ఏకంగా 30 శాతానికి చేరింది. 2030 నాటికి ఎస్‌యూవీల వాటా పాత కార్ల కొనుగోళ్లలో 40 శాతానికి ఎగుస్తుందని పరిశ్రమ భావిస్తోందని సుధీర్‌కార్స్.కామ్ ఫౌండర్ బండి సుధీర్ రెడ్డి తెలిపారు. అదే కొత్త కార్ల విషయంలో ప్రస్తుతం ఎస్‌యూవీల వాటా 45 శాతం తాకిందన్నారు. హ్యాచ్‌బ్యాక్స్ వాటా 30 శాతముందని చెప్పారు. దేశవ్యాప్తంగా గత ఆర్థిక సంవత్సరంలో 38.9 లక్షల యూనిట్ల కొత్త కార్లు రోడ్డెక్కాయి. 2023–24లో ఈ సంఖ్య 40 లక్షల యూనిట్లు దాటుతుందన్న అంచనాలు ఉన్నాయి.

19,550 స్థాయి పైకి నిఫ్టీ

- అధిక వెయిటేజీ షేర్ల అండ
- మూడో రోజూ ముందుకే



ముంబై: అధిక వెయిటేజీ ఐటీసీ, రిలయన్స్, ఇన్ఫోసిస్ షేర్లు ఒక శాతం మేర రాణించడంతో స్టాక్ సూచీలు మూడోరోజూ ముందడుగేశాయి. ఇంట్రాడేలో 231 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 152 పాయింట్ల లాభంతో 65,780 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 19,526 – 19,587 శ్రేణిలో కదలాడింది. చివరికి 46 పాయింట్లు బలపడి 19,575 వద్ద నిలిచింది. ఫైనాన్స్, ఆటో, టెలికం మినహా అన్ని రంగాలకు చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ నెలకొంది. ఫలితంగా నిఫ్టీ మిడ్, స్మాల్ సూచీలు జీవితకాల గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,725 కోట్ల ఈక్విటీలను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,078 కోట్ల షేర్లను కొన్నారు. ''ప్రపంచ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు, క్రూడాయిల్ ధరల పెరుగుదల, దేశీయ సేవల రంగం ఆగస్టులో నెమ్మదించడం, ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి బలహీనత అంశాలు సూచీల లాభాలను పరిమితం చేశాయి'' అని స్టాక్ నిపుణులు తెలిపారు.

రూ.7 లక్షల కోట్ల సంపద సృష్టి

సెన్సెక్స్ 3 రోజుల్లో 949 పాయింట్లు ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.7 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవిత కాల గరిష్ట స్థాయి రూ.316.64 లక్షల కోట్లకు చేరింది.

విష్ణు ప్రకాశ్ ఆర్... లిస్టింగ్ హిట్

విష్ణు ప్రకాశ్ ఆర్ పుంగ్లియా షేరు లిస్టింగ్ రోజే 47% లాభాలు పంచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.99)తో పోలిస్తే 64% ప్రీమియంతో రూ.163 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 66% ర్యాలీ చేసి రూ.164 వద్ద గరిష్టాన్ని తాకింది. చివర్లో రూ.144 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ నుంచి జియో ఫిన్ ఔట్

ఎన్‌ఎస్‌ఈ నుంచి జియో ఫైనాన్షియల్ వైదొలగనుంది. గడిచిన రెండు ట్రేడింగ్ సెషన్లలో షేరు ప్రైస్ బాండ్‌ను అందుకోలేకపోయింది. దీంతో ఈ సెప్టెంబర్ 7 నుంచి ఎక్స్ఛేంజీలోని పలు సూచీల షేరు తొలగించాలని ఎన్‌ఎస్‌ఈ ఇండెక్సుల నిర్వహణ ఉప కమిటీ నిర్ణయం తీసుకుంది. జియో ఫైనాన్స్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.63% పెరిగి రూ.255.05 వద్ద స్థిరపడింది.

రూపాయి 33 పైసలు క్షీణత

డాలర్ మారకంలో రూపాయి విలువ 33 పైసలు క్షీణించి 83.04 స్థాయి వద్ద స్థిరపడింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడం, చైనా యువాన్ బలహీనపడటం, అమెరికా బాండ్లపై అధిక రాబడుల అంశాలు దేశీయ కరెన్సీ కోతకు కారణమయ్యాయి.

ఆగస్టులో 'సేవలు' అంతంతమాత్రమే!

న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) మెజారిటీ వాటా కలిగిన సేవల రంగం ఆగస్టులో నెమ్మదించింది. జూలైలో 62.3 వద్ద ఉన్న ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ ఆగస్టులో 60.1కి తగ్గింది. అయితే సూచీకి సంబంధించి ఆశావహ దృక్పథం, కొత్త ఆర్డర్లు కొనసాగుతున్నట్లు గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనామిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. నిజానికి సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ లోపునకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల రంగం సూచీ వరుసగా 25 నెలల నుంచీ వృద్ధి బాటన కొనసాగుతోంది.



సేవలు, తయారీ కూడా కిందకే..!

మరోవైపు సేవలు, తయారీ రంగం కలగలిపిన ఎస్‌అండ్ పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ జూలైలో 61.9 వద్ద ఉంటే, ఆగస్టులో 60.9కి తగ్గింది.

- యోనో యాప్‌పై ఆదాయం రూ.100 కోట్లు

ఎస్‌బీఐకి మొబైల్ యాప్ యోనో మంచి ఆదాయ వనరుగా మారింది. ఈ యాప్‌పై ఎస్‌బీఐ సబ్సిడరీ ఉత్పత్తులు విక్రయించడం ద్వారా ఫీజుల రూపంలో ప్రతి త్రైమాసికానికి రూ.100 కోట్ల ఆదాయం సమకూరుతున్నట్టు ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ ఖరా తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-9-2023	
విశాఖ	500–00
చిత్తూరు	468–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	495–00
5-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	450–00
వరంగల్	452–00

మెటాకు కీలక మార్కెట్‌గా భారత్

కంపెనీ ఇండియా హెడ్ సంధ్య దేవనాథన్



న్యూఢిల్లీ: స్థూలఆర్థిక వృద్ధి, డిజిటల్ మౌలిక సదుపాయాలు తదితర అంశాల్లో భారత్‌లో అపరిమిత అవకాశాలు ఉన్నాయని సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ ఇండియా హెడ్ సంధ్య దేవనాథన్ చెప్పారు. వీటితో పాటు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి తమ యాప్స్ గణనీయంగా ప్రాచుర్యం పొందుతున్న నేపథ్యంలో భారత్‌ను తాము కీలక మార్కెట్‌గా పరిగణిస్తున్నామని ఆమె వివరించారు. కేంద్రం కొత్తగా రూపొందించిన డిజిటల్ వ్యక్తిగత డేటా భద్రత చట్టంతో ఇటు యూజర్ల వివరాల గోప్యతను పాటించడం, అటు నూతన ఆవిష్కరణలు చేయడం మధ్య సమతౌల్యం పాటించడానికి సంబంధించి టెక్ కంపెనీలకు స్పష్టత లభించిందని సంధ్య తెలిపారు. తమ ప్లాట్‌ఫామ్‌పై తప్పుడు సమాచారాన్ని, విద్వేషపూరిత కంటెంట్‌ని క్రియాశీలకంగా కట్టడి చేసేందుకు కృత్రిమ మేధను తాము సమర్థంగా వినియోగించుకునేందుకు కృషి చేస్తున్నామని ఆమె చెప్పారు.

పెరుగుతున్న యూజర్లు..

కీలక మార్కెట్లలో టీనేజర్లు, యువతలో ఫేస్‌బుక్‌కు ఆదరణ తగ్గుతోందన్న అభిప్రాయం సరికాదని.. మెటాలో భాగమైన ఫేస్‌బుక్‌కు భారత్‌లో 40 కోట్ల మంది పైగా యూజర్లు ఉన్నారని వివరించారు. భారత్‌లో తాము వివిధ నవకల్పనలను పరీక్షించి, అంతర్జాతీయ మార్కెట్లో విడుదల చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. 2030 నాటికల్లా 1 లక్ష కోట్ల డాలర్ల డిజిటల్ ఎకానమీగా ఎదగాలన్న భారత్ విజన్ అనేది వ్యాపారాలకు గణనీయంగా ఊతమివ్వగలదని సంధ్య చెప్పారు.

జీఆర్‌టీ జ్యువెలర్స్‌కు ఏడోసారి అవార్డు

హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ వరుసగా ఏడోసారి ప్లాటినం గిల్డ్ ఇండియా నుంచి రెండు అవార్డులు దక్కించుకుంది. ప్రతిష్టాత్మక 'బెస్ట్ చెయిన్ సోర్స్ ప్లాటినం నేషనల్' అవార్డు సొంతం చేసుకుంది. అలాగే దక్షిణాది ప్రాంతానికి 'బెస్ట్ చెయిన్ సోర్స్ ప్లాటినం' అవార్డు గెలుపొందింది. పారదర్శకతకు నిరంతర కృషికి ఈ అవార్డులు నిదర్శమని కంపెనీ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. ఏడోసారి ఈ అవార్డులు గెలుపొందడం సంతోషాన్నిస్తోందని మరో ఎండీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

హిటాచీ యూపీఐ ఏటీఎం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పేమెంట్స్, కామర్స్ సొల్యూషన్స్ కంపెనీ హిటాచీ పేమెంట్స్ సర్వీసెస్ భారత్‌లో తొలిసారిగా యూపీఐ యాప్‌తో మాత్రమే పనిచేసే వైట్ లేబుల్ ఏటీఎంను అందుబాటులోకి తెచ్చింది. కార్డుతో పని లేకుండా ఈ ఏటీఎం నుంచి నగదును స్వీకరించవచ్చు. బ్యాంకింగేతర సంస్థలు సొంతంగా ఏర్పాటు చేసి, నిర్వహిస్తే వైట్ లేబుల్ ఏటీఎం అంటారు.

భవిత

జాబ్ పాయింట్

చిత్తూరు జిల్లాలో 42 పారా మెడికల్ పోస్టులు

చిత్తూరు జిల్లా ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 42
» **పోస్టుల వివరాలు:** ఫార్మసిస్ట్ గ్రేడ్2-10, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2-01, కౌన్సిలర్/ఎంఎస్‌డబ్ల్యూ గ్రేడ్2-01, థియేటర్ అసిస్టెంట్-09, ల్యాబ్ అటెండెంట్ -03, పోస్ట్‌మార్టమ్ అసిస్టెంట్-05, రికార్డ్ అసిస్టెంట్-01, జనరల్ డ్యూటీ అటెండెంట్-10, ఆఫీస్ సబార్డినేట్-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డీఎంఎల్‌టీ, డీఫార్మసీ, బీఫార్మసీ, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చిత్తూరులోని హాస్పిటల్ సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.09.2023.
» **వెబ్‌సైట్:** https://chittoor.ap.gov.in

ఎయిమ్స్, మంగళగిరిలో 70 గ్రూప్ బి, గ్రూప్ సి పోస్టులు

మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి గ్రూప్-బి, గ్రూప్-సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 70
» **పోస్టుల వివరాలు:** సీనియర్ నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్ నర్స్ గ్రేడ్1)-58, పీఏ టు ప్రిన్సిపాల్-01, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-01, మెడికల్ సోషల్ వర్కర్-01, అసిస్టెంట్(ఎన్‌ఎస్)-01, పర్సనల్ అసిస్టెంట్-01, లైబ్రేరియన్ గ్రేడ్3-01.
» **గ్రూప్-సి పోస్టులు:** ల్యాబ్ టెక్నీషియన్-02, అప్పర్ డివిజనల్ క్లర్క్-02, ల్యాబ్ అటెండెంట్ గ్రేడ్2-02.
» **అర్హత:** సంబంధిత విభాగంలో 10+2, డీఎంఎల్‌టీ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.09.2023.
» **వెబ్‌సైట్:** www.aiimsmangalagiri.edu.in

మేనేజ్‌మెంట్ పీజీకి.. గ్జాట్

ఇంజనీరింగ్, డిగ్రీ ఉత్తీర్ణులు ఎక్కువగా మొగ్గు చూపే కోర్సు.. ఎంబీఏ! మేనేజ్‌మెంట్ పీజీలో చేరాలనుకునే అభ్యర్థులకు అందుబాటులో ఉన్న మరో చక్కటి మార్గం.. గ్జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్ఏటీ-గ్జాట్)!! దీన్ని గ్జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎక్స్ఎల్ఆర్ఐ), జంషెడ్‌పూర్ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో మంచి స్కోరు సాధిస్తే.. దేశంలోని ప్రసిద్ధ బీస్కూల్స్‌లో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. తాజాగా గ్జాట్-2024 ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో.. గ్జాట్ పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» గ్జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ప్రకటన విడుదల
» గ్జాట్ స్కోర్‌తో టాప్ బీస్కూల్స్‌లో ప్రవేశాలు

అర్హత

ఏదైనా డిగ్రీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణత సాధించిన వారు ఈ పరీక్షకు దరఖాస్తుకు అర్హులు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వారూ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

అందిస్తున్న కోర్సులు

ఎక్స్ఎల్ఆర్ఐ అందిస్తున్న కోర్సులు.. పీజీడీఎం బిజినెస్ మేనేజ్‌మెంట్; పీజీడీఎం హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్. ఈ రెండు కోర్సుల కాల వ్యవధి: రెండేళ్లు. అలాగే మరో కోర్సు.. పీజీడీఎం-జనరల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్. దీని కాల వ్యవధి 15 నెలలు. దీంతోపాటు ఎఫ్‌పీఎం-నాలుగేళ్ల ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్‌లోనూ ప్రవేశం పొందొచ్చు.

ప్రవేశం కల్పిస్తున్న పలు ఇన్‌స్టిట్యూట్స్

గ్జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్, ముంబై; సెయింట్ ఫ్రాన్సిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్, ముంబై; అమృత స్కూల్ ఆఫ్ బిజినెస్; ఏషియా పసిఫిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, న్యూఢిల్లీ; ఏషియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, భువనేశ్వర్; బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ, గ్రేటర్ నోయిడా; బీఎంఎల్ ముంజల్ యూనివర్సిటీ, గుర్గావ్; సీఎంఎస్ బిజినెస్ స్కూల్; ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, పుణె తదితరాలు.

ఎంపిక విధానం

గ్జాట్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన వారికి ప్రవేశం లభిస్తుంది.

పరీక్ష విధానం

గ్జాట్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో జరుగుతుంది. వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ 26 ప్రశ్నలు-26 మార్కులు; డెసిషన్ మేకింగ్ 22 ప్రశ్నలు-22 మార్కులు; క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 28 ప్రశ్నలు-28 మార్కులు; జనరల్ నాలెడ్జ్ 25 ప్రశ్నలు-25 మార్కులకు ఉంటాయి. పరీక్షలో మొత్తం 101 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటల 30 నిమిషాలు.

ప్రిపరేషన్ ఇలా

అభ్యర్థులు ముందుగా గ్జాట్ పరీక్ష ప్యాట్రన్, సిలబస్ గురించి తెలుసుకోవాలి. ఆ తర్వాత ప్రామాణిక పుస్తకాలు, మెటీరియల్‌ను సేకరించాలి. విభాగాల వారీగా ప్రిపేరవ్వాలి. డెసిషన్ మేకింగ్ విభాగంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి.

వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్

ఈ విభాగంలో మంచి మార్కులు సాధించాలంటే.. లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ తప్పనిసరి. ఈ దిశగా అభ్యర్థులు పత్రికల్లో వచ్చే సైకాలజీ, టెక్నాలజీ, సోషియాలజీలకు సంబంధించిన వ్యాసాలను చదవడం లాభిస్తుంది. అలాగే వేగంగా చదవడంతో పాటు, కాంప్రహెన్షన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవాలి. రీడింగ్ కాంప్రహెన్షన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. గత ప్రశ్నపత్రాలను సాధించాలి. యాంటోనిమ్స్, సినానిమ్స్, ప్రిఫిక్స్, సఫిక్స్‌ల గురించి తెలుసుకోవాలి. వీటితోపాటు సాధ్యమైనన్ని మాక్ టెస్టులకు హాజరవ్వాలి.

క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఎంటర్‌ప్రిటేషన్

ఈ విభాగానికి సంబంధించి జామెట్రి, మెన్సురేషన్, క్యాల్కులేషన్స్‌తోపాటుడేటా ఇంటర్‌ప్రిటేషన్స్‌పై పట్టు సాధించాలి. క్యాల్కులేషన్, అప్రాక్సిమేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలి. లైన్ గ్రాఫ్స్, పైచార్ట్స్, టాబ్యులర్ గ్రాఫ్స్, ఫ్రాక్షన్ వ్యాల్యూస్‌ను ప్రాక్టీస్ చేయాలి. డేటా ఇంటర్‌ప్రిటేషన్ సెట్స్‌ను సాధన చేయాలి. మ్యాథమెటికల్ థింకింగ్‌ను పెంపొందించుకోవాలి. పేపర్‌లెస్ క్యాల్కులేషన్స్ చేయాలి. జామెట్రి, ప్రాఫిట్ అండ్ లాస్, టైమ్ అండ్ డిస్టెన్స్, పర్సంటేజెస్, రేషియో అండ్ ప్రపోర్షన్స్‌పై అధిక దృష్టిపెట్టాలి. ప్రతి వారం రెండు లేదా మూడు మాక్ టెస్టులకు హాజరవ్వాలి.



డెసిషన్ మేకింగ్ అండ్ అనలిటికల్ స్కిల్స్

ఇది పరీక్షలోనే అత్యంత క్లిష్టమైన విభాగం. ఇందులో ఎక్కువ మార్కులు సాధించాలంటే.. గరిష్ట ప్రాక్టీస్ అవసరం. ఇందులో ప్రశ్నలను సాధించే సమయంలో వివక్షకు తావులేని, విలువలతో కూడిన నిర్ణయాలు తీసుకునే తరహాలో వ్యవహరించాలి. ప్రాక్టీస్, విశ్లేషణలతోనే ఇది సాధ్యమవుతుంది.

జనరల్ అవేర్‌నెస్

చరిత్ర-ముఖ్య సంఘటనలను అధ్యయనం చేయాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై థియరిటికల్, ప్రాక్టికల్ అవగాహనను పెంపొందించుకోవాలి. పాలిటీ, భారత రాజ్యాంగం, సైన్స్ అండ్ టెక్నాలజీ, స్పోర్ట్స్, ప్రభుత్వ వ్యవస్థలకు సంబంధించిన అంశాలపై పట్టుసాధించాలి. ఆ దిశగా హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఎకనామిక్ టైమ్స్, బిజినెస్ స్టాండర్డ్, బిజినెస్ లైన్, లైవ్ మింట్ తదితర దినపత్రికలను చదవడం లాభిస్తుంది.

ముఖ్యసమాచారం

- **దరఖాసు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30, 2023
- **అడ్మిట్ కార్డులు జారీ ప్రారంభం:** డిసెంబరు 24, 2023
- **ఎక్స్ఏటీ నిర్వహణ తేదీ:** జనవరి 07, 2024
- **వెబ్‌సైట్:** https://xatonline.in

హెచ్‌పీసీఎల్.. 276 ఉద్యోగాలు

బీఈ, బీటెక్, పీజీ ఉత్తీర్ణులు అర్హులు

మహారత్న సంస్థ హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్).. 276 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంజనీరింగ్, సీఏ, లా ఆఫీసర్స్ తదితర విభాగాల్లో ఖాళీలున్నాయి. పోస్టును బట్టి బీఈ/బీటెక్, ఎంబీఏ, ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ), లా డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

మొత్తం పోస్టుల సంఖ్య: 276

మెకానికల్ ఇంజనీరింగ్-57, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-16, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్-36, సివిల్ ఇంజనీర్-18, కెమికల్ ఇంజనీర్-43, సీనియర్ ఆఫీసర్-సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ అండ్ మెయింటెనెన్స్-10, సీనియర్ ఆఫీసర్-ఎల్ఎన్‌జీ బిజినెస్-2, సీనియర్ ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్/అసిస్టెంట్ మేనేజర్ -బయోఫ్యూయల్ ప్లాంట్ ఆపరేషన్స్-1, సీనియర్ ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్-నాన్ ఫ్యూయల్ బిజినెస్-4, సీనియర్ ఆఫీసర్-ఈవీ ఛార్జింగ్ స్టేషన్ బిజినెస్-02, ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్-ముంబయి రిఫైనరీ-2, ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్-విశాఖ రిఫైనరీ-6, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్స్-9, చార్టర్డ్ అకౌంటెంట్స్-16, లా ఆఫీసర్స్-05, లా ఆఫీసర్స్-హెచ్ఆర్-2, మెడికల్ ఆఫీసర్-4, జనరల్ మేనేజర్-1, వెల్ఫేర్ ఆఫీసర్-1, ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన మొత్తం 10 పోస్టులున్నాయి.

వయసు

పోస్టులను అనుసరించి వయోపరిమితి నిబంధనలు వేర్వేరుగా ఉన్నాయి. ఇంజనీరింగ్ పోస్టులకు గరిష్ట వయసు 25 ఏళ్లు ఉండాలి. ఆఫీసర్ కేటగిరీ పోస్టులకు 26 నుంచి 29 ఏళ్లు, జనరల్ మేనేజర్ పోస్టుకు 50 ఏళ్లు, గరిష్ట వయసులో ఎస్సీ, ఎస్టీ, ఎక్స్-సర్వీస్‌మెన్‌కు 5 ఏళ్లు, ఓబీసీ(ఎన్‌సీఎల్)కి 3 ఏళ్లు సడలింపు లభిస్తుంది.

ఎంపిక విధానం

పోస్టులను అనుసరించి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. లా ఆఫీసర్స్, హెచ్ఆర్ విభాగంలో లా ఆఫీసర్ పోస్టుల ఎంపికకు సంబంధించి మూట్ కోర్ట్‌ను నిర్వహిస్తారు.

రాత పరీక్ష విధానం

- కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించే ఈ పరీక్ష రెండు పార్ట్‌లుగా ఉంటుంది.
- పార్ట్-1లో జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ అండ్ ఇంటలెక్చువల్ పొటెన్షియల్ టెస్ట్ (లాజికల్ రీజనింగ్ అండ్ డేటా ఇంటర్‌ప్రెటేషన్) నుంచి 85 ప్రశ్నలకు పరీక్ష ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు.
- పార్ట్-2లో టెక్నికల్/ప్రొఫెషనల్ నాలెడ్జ్‌కు సంబంధించి ఇంజనీరింగ్‌లో చదివిన సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఇందులోనూ 85 ప్రశ్నలకు ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. రెండు పార్ట్‌లకు కలిపి పరీక్ష సమయం 150 నిమిషాలు.

ప్రిపరేషన్ ఇలా

ప్రిపరేషన్ ప్రారంభించే ముందు పరీక్ష సిలబస్‌పై అవగాహన పెంచుకోవాలి. సిలబస్ కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి. గత ప్రశ్నపత్రాలను గమనించి దానికి అనుగుణంగా సన్నద్ధత ప్రారంభించాలి. జనరల్ ఆప్టిట్యూడ్ సంబంధించి బ్యాంక్, రైల్వేల ప్రశ్నపత్రాలను కూడా సాధన చేయొచ్చు. మాక్ టెస్టులు, ప్రాక్టీస్ టెస్టులు రాయాలి. దీనివల్ల తప్పులను సరిదిద్దుకోవడానికి అవకాశం ఉంటుంది.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 18.09.2023
- **వెబ్‌సైట్:** www.hindustanpetroleum.com/careers

క్లుప్తంగా...

22న ఎస్‌ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

కర్నూలు(టౌన్):కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలియన్‌లో మంగళవారం నిర్వహించాల్సి న రాయలసీమ జోన్ ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు భారీ వర్షం కారణంగా వాయిదా వేసినట్లు కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ తెలిపారు.వాయిదా పడిన పరీక్షలను ఈ నెల 22న నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పీజీ మెడికల్ సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరానికి పీజీ మెడికల్ అడ్మిషన్‌ల్లో భాగంగా కన్వీనర్ సర్వీస్ కోటా సీట్ల భర్తీకి తొలి దశ కౌన్సెలింగ్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ మంగళవారం విద్యార్థులకు సీట్లు కేటాయించింది. 553 సీట్లకు గాను 246 సీట్లు కేటాయించగా మిగిలిన సీట్లు ఖాళీగా ఉన్నాయి. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 9న మధ్యాహ్నం 3 గంటల్లోగా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. రద్దయిన పీజీ మెడికల్ కౌన్సెలింగ్‌లో సీట్ కేటాయింపు ధ్రువపత్రం పొందడానికి వర్సిటీకి చెల్లించిన ఫీజులను తిరిగి విద్యార్థులకు ఇవ్వడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో appgadmissions2021@gmail.com ఐడీకి విద్యార్థులు తమ పేరు, నీట్ పీజీ ర్యాంక్, రోల్ నెంబర్, లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి డబ్బు చెల్లించిన తేదీతో పాటు, అకౌంట్ నంబర్, బ్యాంక్ ఐఎఫ్ఎస్సీ కోడ్‌ను మెయిల్ చేయాలని సూచించారు.

రాజకీయ లబ్ధికోసమే బచ్చాగాళ్ల వ్యాఖ్యలు

ఉదయనిధి స్టాలిన్‌పై మండిపడ్డ ఎంపీ జీవీఎల్

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): రాజకీయ లబ్ధికోసమే బచ్చాగాళ్లు సనాతన ధర్మాన్ని అవమానిస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మండిపడ్డారు. తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు ఉదయనిధి స్టాలిన్ సనాతనధర్మాన్ని సాగనంపాలంటూ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం విశాఖ లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయనిధి స్టాలిన్ లాంటి బచ్చాగాళ్లు ప్రపంచ దేశాలు కీర్తిస్తున్న భారత సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియాతో పోల్చడం సిగ్గుచేటన్నారు. అవేమీ అనాలోచిత వ్యాఖ్యలు కాదని.. రాజకీయ దురుద్దేశంతోనే చేశారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణు కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

శశికళ, ఇళవరసికి నాన్ బెయిలబుల్ వారెంట్

లంచం ఇచ్చి..జైలులో విలాస జీవితం గడిపారనే ఆరోపణలు

సాక్షి బెంగళూరు: జైలు అధికారులకు లంచం ఇచ్చి అక్కడ విలాసవంతమైన సౌకర్యాలు పొందారనే ఆరోపణలపై దాఖలైన కేసులో దివంగత మాజీ సీఎం జయలలిత నెచ్చెలి వీకే శశికళ, ఇళవరసిలకు బెంగళూరులోని లోకాయుక్త ప్రత్యేక కోర్టు జామీను రహిత (నాన్ బెయిలబుల్) వారెంట్ జారీ చేసింది. అక్రమ ఆస్తుల కేసులో శశికళ, ఇళవరసిలు నాలుగేళ్ల పాటు జైలు శిక్ష అనుభవిస్తోన్న సమయంలో వీరు అధికారులకు లంచమిచ్చి బెంగళూరు పరప్పన అగ్రహార జైలులో ప్రత్యేక విలాసవంతమైన సౌకర్యాలు పొందినట్లు, అధికారులకు రూ.2 కోట్లు లంచం ఇచ్చి షాపింగ్‌కు ఈ ఇద్దరు జైలు నుంచి బయటకు వెళ్లినట్లు ఆరోపణలు వచ్చాయి. శశికళ, ఇళవరసి షాపింగ్‌కు వెళుతున్న ఫోటోలు, వీడియోలు అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ పరిణామాలపై లోకాయుక్త కోర్టులో కేసు నమోదైంది. ఈ కేసులో దర్యాప్తు జరిపిన లోకాయుక్త పోలీసులు కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. తమకు వ్యతిరేకంగా దాఖలైన ఈ కేసును రద్దు చేయాలని కోరుతూ శశికళ, ఇళవరసిలు లోకాయుక్త కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ఈ ఇద్దరు కోర్టుకు గైర్హాజరయ్యారు. దీంతో లోకాయుక్త కోర్టు వీరిద్దరికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ తదుపరి విచారణను అక్టోబర్ 5కు కోర్టు వాయిదా వేసింది.

విజయవాడ ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు

- బాంబు లేదని నిర్ధారణ...
- పోలీసుల అదుపులో ఫోన్ చేసిన వ్యక్తి

విమానాశ్రయం(గన్నవరం): 'విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)లో బాంబు ఉంది..' అంటూ ఓ వ్యక్తి పలుమార్లు ఫోన్ చేయడంతో కలకలం రేగింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ఫేక్ కాల్‌గా నిర్ధారించారు. విమానాశ్రయం డొమెస్టిక్ టెర్మినల్‌లోని ఎయిర్ ఇండియా కౌంటర్‌లో ఉన్న ల్యాండ్ ఫోన్‌కు సోమవారం రాత్రి 9.35 గంటలకు ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి ఎయిర్‌పోర్ట్‌లో బాంబు ఉందని చెప్పాడు. కొద్ది నిమిషాల వ్యవధిలోనే ఐదుసార్లు ఫోన్ చేసి బాంబు విషయమై హెచ్చరికలు చేశాడు. ఎయిర్‌పోర్ట్ అధికారులు, భద్రతాధికారులు అప్రమత్తమై బాంబ్, డాగ్‌స్క్వాడ్‌లతో టెర్మినల్‌లో విస్తృత తనిఖీలు చేశారు. అదే సమయంలో ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న 146 మంది ప్రయాణికులను కూడా సెక్యూరిటీ హోల్డ్ ఏరియాలో నిలిపివేశారు. గంటన్నర పాటు తనిఖీలు చేసి ఎటువంటి బాంబు లేదని నిర్ధారించుకున్నా రు. ఫోన్ చేసిన వ్యక్తి తణుకుకు చెందిన రంగరామన్‌గా గుర్తించి తణుకు వెళ్లి రంగరామన్‌తోపాటు కుమారుడు ఈశ్వర్‌ను అరెస్టు చేశారు.



ఆన్‌లైన్ + ఆఫ్‌లైన్



పండుగలకు 'హైబ్రిడ్ షాపింగ్'

- గతేడాది కంటే ఈసారి షాపింగ్ బడ్జెట్‌ను పెంచామన్న 84% మంది వినియోగదారులు
- అడ్వర్టైజ్‌మెంట్ సంస్థ 'ఇన్‌మోబీ'అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్

ప్రస్తుత పండుగల సీజన్‌లో... 'హైబ్రిడ్ షాపింగ్'నకు రోజురోజుకూ క్రేజ్ పెరుగుతోంది. 'రాఖీ బంధన్'తో మొదలై వచ్చే ఏడాది ప్రథమార్థం దాకా ఈ ఫెస్టివల్ సీజన్ సుదీర్ఘంగా సాగనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మొదలైన ఈ సీజన్‌లో హైబ్రిడ్ షాపింగ్‌నకే అధికశాతం మొగ్గుచూపుతున్నట్టు వివిధ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత వినియోగదారులు మరీ ముఖ్యంగా నవ, యువతరం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు డిజిటల్ టెక్నాలజీని విరివిగా ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో...ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ షాపింగ్‌కు కస్టమర్లు సిద్ధమవుతున్నారు. కోవిడ్ తెచ్చిన మార్పుచేర్పులతో... షాపింగ్, ఇతర విషయాల్లో కొత్త కొత్త విధానాలు, పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. గతేడాదితో పోల్చితే ఈసారి 84 శాతం వినియోగదారులు తమ షాపింగ్ బడ్జెట్‌ను గణనీయంగా పెంచినట్టు అడ్వర్టయిజ్‌మెంట్ యూనికార్న్ సంస్థ 'ఇన్‌మోబీ'తాజా నివేదికలో వెల్లడైంది.

పండుగల సీజన్‌లో.. ఎంతెంత ఖర్చు

- రూ.లక్షకు పైగా కొనుగోళ్లకు సిద్ధమైన వారు **9%**
- రూ.50 వేల నుంచి లక్ష దాకా వెచ్చించి కొనేందుకు మొగ్గు చూపిస్తున్న వారు **23%**
- రూ. 25-50 వేల మధ్య షాపింగ్ చేస్తామంటున్నవారు **33%**
- రూ.10 నుంచి 25 వేల లోపు కొనేందుకు సై అన్నవారు **26%**
- రూ.10 వేల లోపు కొనేందుకు సై అన్నవారు **7%**
- ఎటూ తేల్చుకోని ఒకశాతం మంది కస్టమర్లు

నివేదికలో ఏముందంటే...

చేతిలో ఇమిడిపోయే మొబైల్ ఫోన్లతోనే షాపింగ్ చేయడం, సంస్థల సైట్లను ఆన్‌లైన్‌లోనే వీక్షించి, సమీక్షించుకునే సౌలభ్యం ఉన్నందున పలువురు ఆన్‌లైన్ కొనుగోళ్లకు మొగ్గుచూపుతున్నారు. ఐతే...ఆన్‌లైన్‌తో పాటు స్వయంగా షాప్‌లకు వెళ్లి వివిధరకాల వస్తువులు, ఇతరత్రా సామగ్రి కొనేందుకు ఇష్టపడుతున్న వారి సంఖ్య గణనీయంగా ఉన్నట్టుగా... ఆ రెండింటిని సమ్మిళితం చేసి హైబ్రిడ్ షాపింగ్ చేసే వారు 54 శాతం ఉన్నట్టుగా ఈ నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా మొబైల్‌ఫోన్లను వినియోగించే వారి నుంచి వివిధ అంశాల వారీగా ఈ సంస్థ సమాచారాన్ని సేకరించింది.

ఆఫర్ల సమాచారం ఎలా తెలుసుకుంటున్నారు?

➤ మొబైల్‌లో సెర్చింగ్, ప్రకటనల ద్వారా..	46%
➤ బ్రాండ్ వెబ్‌సైట్లు/ వివిధ యాప్‌ల ద్వారా..	15%
➤ ప్రత్యక్షంగా షాపులకు వెళ్లి తెలుసుకునేవారు..	11%
➤ కుటుంబం, స్నేహితుల ద్వారా..	7%
➤ టీవీ ప్రకటనలు, ఇతర రూపాల్లో..	7%
➤ వార్తాపత్రికలు, మ్యాగజైన్ల ద్వారా..	6%
➤ ఈమెయిళ్లు, బ్రాండ్ల నుంచి న్యూస్‌లెటర్లతో..	4%
➤ వాట్సాప్‌లో బ్రాండ్ల ద్వారా వచ్చే సమాచారంతో..	3%



వసుత అగర్వాల్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్, కన్స్యూమర్ అడ్వర్టయిజింగ్ ప్లాట్‌ఫామ్, ఇన్‌మోబీ

తదనుగుణంగా మార్కెటింగ్ వ్యూహాలు...

'తమ స్మార్ట్‌ఫోన్ల ద్వారానే షాపింగ్ చేయాలని 78 శాతం మంది భావిస్తున్నారు. దీనికి తగ్గట్టుగా వివిధ కంపెనీలు, సంస్థలు కూడా తమ మార్కెటింగ్ వ్యూహాలను రూపొందించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా ప్రస్తుత పండుగల సీజన్‌లో కస్టమర్లను ఆకర్షించేందుకు, వారు కోరుకున్న విధంగా ఆయా వస్తువులను అందించేందుకు, వారితో నేరుగా కనెక్ట్ అయ్యేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నాము'



ఈ దారి.. వేల ఏళ్ల రహదారి..

ఈ రోడ్డును చూశారా.. స్ట్రెయిట్‌గా భలే ఉంది కదా! చూస్తుంటే ఇదేదో పాత రోడ్డు అని కూడా అనిపిస్తోంది కదా.. నిజమే ఈ రోడ్డుకు రెండు వేల ఏళ్లకుపైగా చరిత్ర ఉంది. క్రీస్తు పూర్వం 312లో ఈ రోడ్డును అప్పటి రోమన్ సామ్రాజ్య అధినేతలు నిర్మించారు. ఇటలీ ఆగ్నేయ ప్రాంతం బ్రిండిసీ నుంచి 400 మైళ్ల దూరంలోని ప్రధాన నగరం రోమ్‌ను కలుపుతూ నిర్మించిన రోడ్డు ఇది. అప్పియన్ వేగా పిలిచే ఈ రోడ్డును రాజనీతిజ్ఞుడు అప్పియస్ క్లాడియస్ సీజస్ పేరుపై నిర్మించారు. దక్షిణ ఇటలీని వశం చేసుకోవడం కోసం మిలిటరీని తరలించడానికి, అలాగే గ్రీస్, ఈజిప్టుకు నౌకాయానం కోసం అప్పటి రోమ్ పాలకులు దీనిని నిర్మించారని చరిత్రకారులు చెబుతున్నారు. దీనిని యూరప్ మొట్టమొదటి సూపర్ హైవేగా కూడా చెబుతారు. - సాక్షి, ఏపీ సెంట్రల్ డెస్క్.

పాపికొండల విహార యాత్రకు గ్రీన్ సిగ్నల్



గోదావరిలో పర్యాటక బోటుపై పాపికొండల అందాలను వీక్షించేందుకు పోశమ్మగండి నుంచి పాపికొండల విహారయాత్రకు అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నైరుతి రుతుపవనాల ఆరంభం నుంచి భారీ వర్షాలు, గోదావరి వరదలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆగస్టులో పాపికొండల విహార యాత్రను నిలిపివేశారు. ప్రస్తుతం గోదావరికి వరదలు లేకపోవడంతో నిబంధనలను అనుసరించి పర్యాటక బోట్లు విహరించేందుకు అనుమతించారు. బుధవారం ఒక పర్యాటక బోటులో ఉన్నతాధికారి పేరంటపల్లికి వెళ్లనున్నారు. -దేవీపట్నం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

'స్వచ్ఛ' తుంగభద్ర

తుంగభద్ర జలాలు కలుషితం కాకుండా ఏపీ సర్కారు చర్యలు

సాక్షి, అమరావతి: తుంగభద్ర నదీ జలాలను స్వచ్ఛంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఆ నదీ పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమలు వ్యర్థ జలాలను శుద్ధి చేశాకే నదిలోకి వదులుతున్నాయి. ఇప్పుడు కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో రోజూ వెలువడే సుమారు 35 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేశాకే నదిలో కలిపేలా రూ.83.50 కోట్లతో ఎస్టీపీ (సీవరేజ్ సెప్టిక్ ప్లాంట్) నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. యుద్ధప్రాతిపదికన ఎస్టీపీని పూర్తి చేసి రాష్ట్ర పరిధిలో తుంగభద్ర జలాలను స్వచ్ఛంగా మార్చే దిశగా అడుగులు వేస్తోంది.

కాలుష్య కాసారంగా మారి..

కర్ణాటక పరిధిలోని పశ్చిమ కనుమల్లో కుద్రేముఖ్ పర్వత శ్రేణుల్లో సముద్ర మట్టానికి 1,196 మీటర్ల ఎత్తులో ఒకవైపు తుంగ.. మరోవైపు భద్ర జన్మించాయి. 147 కి.మీ. పొడవున తుంగ, 171 కి.మీ పొడవున భద్ర ప్రయాణించి కూడలి వద్ద రెండు నదులు సంగమిస్తున్నాయి. ఈ రెండు నదులు ఒకటిగా 547 కి.మీ. పొడవున ప్రవహించి తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో అలంపూర్‌కు సమీపంలోని గొందిమల్ల వద్ద కృష్ణా నదిలో కలుస్తున్నాయి. కృష్ణాకు ప్రధాన ఉప నది అయిన తుంగభద్ర పురాణాల్లో స్వచ్ఛతకు పెట్టింది పేరు. అందుకే తుంగే పానే.. గంగే స్నానే (గంగా నదిలో స్నానం చేస్తే.. ఎంత పుణ్యం వస్తుందో తుంగభద్ర నీటిని తాగితే అంతే పుణ్యం వస్తుంది) అనే ఆర్యోక్తి బహుళ ప్రచారంలో ఉంది. కానీ.. గతేడాది నవంబర్‌లో తుంగభద్ర జలాల స్వచ్ఛతపై కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ నదిలోని నీరు కాలుష్య కాసారంగా మారినట్టు తేలింది. దాంతో రాష్ట్ర ప్రభుత్వం తుంగభద్ర జలాలను స్వచ్ఛంగా మార్చడానికి చర్యలు చేపట్టింది. ఇదే తరహాలో తుంగభద్ర జలాలను కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని కర్ణాటక సర్కార్‌ను సీపీసీబీ ఇటీవల ఆదేశించింది.

విశాఖ సీపీగా రవిశంకర్ అయ్యన్నార్

11 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నియమితులయ్యారు. రాష్ట్రంలో 11 మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం మంగళవారం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ అయిన అధికారుల వివరాలు

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
ఎ.రవిశంకర్ అయ్యన్నార్	అదనపు డీజీ, విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్	పోలీస్ కమిషనర్, విశాఖపట్నం
కుమార్ విశ్వజిత్	అదనపు డీజీ, రైల్వేస్	అదనపు డీజీ, విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్
సి.ఎం.త్రివిక్రమ్ వర్మ	పోలీస్ కమిషనర్, విశాఖపట్నం	ఐజీ, ఏపీఎస్పీ
సిద్ధార్థ్ కౌశల్	ఎస్పీ, ఆక్టోపస్	ఎస్పీ, వైఎస్సార్ జిల్లా
కేకేఎన్ అన్బురాజన్	ఎస్పీ, వైఎస్సార్ జిల్లా	ఎస్పీ, అనంతపురం జిల్లా
కె.శ్రీనివాసరావు	ఎస్పీ, అనంతపురం జిల్లా	డీసీపీ(శాంతి భద్రతలు), విశాఖపట్నం
వి.విద్యాసాగర్‌నాయుడు	డీసీపీ(శాంతి భద్రతలు), విశాఖపట్నం	ఎస్పీ, గ్రేహౌండ్స్
బొడ్డేపల్లి కృష్ణారావు	ఎస్పీ, ఏసీబీ	ఎస్పీ, అన్నమయ్య జిల్లా
ఆర్.గంగాధరరావు	ఎస్పీ, అన్నమయ్య జిల్లా	కమాండెంట్, 14వ బెటాలియన్
అద్నాన్ నయీమ్ అస్మీ	గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్	ఎస్పీ, ఏసీబీ
పి.జగదీశ్	కమాండెంట్, 14వ బెటాలియన్	ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

అభివృద్ధి అంటే పక్క రాష్ట్రాలతో పోలికా?

బాబు బండారం బయటపడుతుందనే పక్క రాష్ట్రంతో పోలిక

దేశం గర్వించతగ్గ రీతిలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం



సాక్షి, అమరావతి : నిజాలతో పనిలేదు. వాస్తవాలు అసలే పట్టవు. కేవలం బురద జల్లడమే లక్ష్యం. అధికారంలో ఉన్నది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాబట్టి... ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచేలా, ప్రజల్లో విష బీజాలు నాటేలా నిత్యం ఈనాడు పత్రికలో అబద్ధాలతో కథనాలు రాయడమే రామోజీరావు పనిగా పెట్టుకున్నారు. ఏ రంగంలోనైనా అభివృద్ధిని అంచనా వేయాలంటే గతంలో ఎలా ఉండేది, ఇప్పుడెలా ఉంది, ఏ మేరకు పురోగతి సాధించింది అని బేరీజు వేస్తారు. అలా చేస్తే గత సీఎం చంద్రబాబు బండారం బయటపడుతుంది. ఆయన రైతులకు చేసిన మోసాలు, అన్నదాతల పేరిట చేసిన అక్రమాలు బట్టబయలవుతాయి. ఇదే రామోజీ భయం. అందుకే పక్కనున్న తెలంగాణ రాష్ట్రంతో బేరీజు వేస్తూ ఓ కథనం ఇచ్చారు. తెలంగాణలో అమలవుతున్న రైతుబంధుతో ఏపీలో వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని పోలుస్తూ తలాతోక లేని ఓ పనికి మాలిన కథనాన్ని ప్రచురించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక విత్తు నుంచి పంట ఉత్పత్తుల అమ్మకం వరకు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. పలు పథకాలతో ఆర్థికంగ ఆదుకొంటూనే, సాగులో, పంట ఉత్పత్తుల అమ్మకాల వరకు పలు రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకంటే మిన్నగా సహాయం చేస్తున్నారు. వీటన్నింటినీ విస్మరించి రామోజీ ఓ నేలబారు కథనాన్ని అల్లి, ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించారు. అసలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు కలుగుతున్న మేలును తెలుసుకుందాం..

బాబుకంటే మిన్నగా పెట్టుబడి సాయం

చంద్రబాబు అంటేనే వంచన.. చంద్రబాబు అంటేనే వెన్నుపోటు.. పట్టెడన్నం పెట్టే రైతునూ ఆయన వంచించిన తీరు నభూతో నభవిష్యతి. పీఎం కిసాన్‌తో కలిపి అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.15 వేలు ఇస్తానని నమ్మబలికిన చంద్రబాబు.. 2018–19లో రెండు విడతల్లో రూ.4 వేల చొప్పున 46.76 లక్షల మందికి అందించిన సాయం రూ.2,440.29 కోట్లు. దాంట్లో అన్నదాత సుఖీభవ పథకం కింద బాబు ఇచ్చింది రూ.1,765 కోట్లు మాత్రమే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే నమ్మకం. అందరికీ ఓ భరోసా. ఏడాదికి రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో రూ.50 వేలు అర్హత ఉన్న ప్రతి రైతుకూ ఇస్తామని వైఎస్ జగన్ మేనిఫెస్టోలో హామీ ఇవ్వగా.. దానికంటే ఎక్కువగా ఏటా రూ.13,500 చొప్పున నాలుగేళ్లకు బదులు ఐదేళ్ల పాటు రూ. 67,500 అన్నదాతకు అందిస్తున్నారు. అంటే రూ.17,500 అదనంగా ఇస్తున్నారు. భూ యజమానులకే కాదు.. భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుపేద కౌలు రైతులతో పాటు అటవీ, దేవదాయ భూ సాగుదారులకు సైతం రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 2019–20 నుంచి ఇప్పటివరకు ఏటా సగటున 52.57 లక్షల రైతు కుటుంబాలకు రూ.31,005.04 కోట్ల లబ్ధి చేకూర్చారు. ఇది రైతుకు మేలు కాదా? ఈ పోలిక ఎందుకు తేలేదు రామోజీ? 2023–24లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం జొన్న, రాగి, సజ్జ, అపరాలు, నూనె గింజలకు ఎకరాకు అయ్యే కనీస పెట్టుబడి రూ.13,000 ఉంటుంది. ఇందులో రైతు భరోసా సాయం రూ.13,500 ప్రభుత్వమే అందిస్తోంది. ఇతర పంటలకు అయ్యే పెట్టుబడిలో 80 శాతం ప్రభుత్వమే అందిస్తోంది. మరో వైపు ఆర్బీకేల ద్వారా కనీస మద్దతు ధరకు కొనడమే కాకుండా గోతాలు, కూలీలు, రవాణా ఖర్చుల రూపంలో ఎకరాకు రూ.10 వేల వరకు ప్రభుత్వమే భరిస్తోంది. ఇదంతా రైతుకు ఆదా అయ్యేదే. మొక్కజొన్న ఎకరాకు రూ.30 వేల నుండి రూ.45 వేల వరకు పెట్టుబడి ఖర్చు అవుతుండగా, బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వమే మంచి ధర ఇప్పిస్తోంది.

ఆర్బీకేల ద్వారా రైతు ముంగిట సేవలు

రైతుకు మొక్కుబడిగా కొంత ఆర్థిక సహాయం అందించి గాలికి వదిలేయకుండా, వైఎస్ జగన్ ప్రభుత్వం రైతుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించి, ప్రతి అడుగులో వెన్నుదన్నుగా నిలవాలనే సంకల్పంతో గ్రామ సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) ఏర్పాటు చేసింది. 10,778 ఆర్బీకేల ద్వారా రైతాంగానికి వ్యవసాయ సాంకేతిక విజ్ఞానం, సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు రైతుల ముంగిట్లోనే అందిస్తోంది. విత్తనాలు, ఎరువుల సరఫరాలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచింది. 2019 నుండి ఇప్పటివరకు 41.46 లక్షల క్వింటాళ్ళ విత్తనాలను రూ.1,208.60 కోట్ల రాయితీపై 70.87 లక్షల మందికి సరఫరా చేసింది. గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాలను ప్రతి ఏటా అందిస్తోంది. నాణ్యమైన ఎరువులను కూడా రైతుల ముంగిట్లోకే అందించడం వల్ల ఒక బస్తాకి రూ.20 నుంచి రూ.30 వరకు హమాలీ, రవాణా ఖర్చును రైతులు ఆదా చేసుకోగలుగుతున్నారు. సన్న, చిన్నకారు రైతులకు పెట్టుబడి ఖర్చు, నిర్వహణ భారం లేకుండా తక్కువ అద్దెకే వారికి కావల్సిన యంత్ర పరికరాలను ప్రభుత్వం సమకూరుస్తోంది. ఇందుకోసం ఆర్బీకేలకు అనుసంధానంగా 10,936 గ్రామాల్లో రూ.1,052.42 కోట్ల విలువైన యంత్ర పరికరాలతో యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. యంత్ర పరికరాలకు 40 శాతం రాయితీగా రూ.366.25 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందించింది.

ధాన్యం సేకరణలో విప్లవాత్మక మార్పులు

ధాన్యం సేకరణలో దళారీ వ్యవస్థను, మిల్లర్ల జోక్యాన్ని ప్రభుత్వం పూర్తిగా నివారించింది. ప్రస్తుత ప్రభుత్వం 2019 నుంచి 2023 వరకు ఈ నాలుగేళ్లలోనే ఇప్పటివరకు 32,78,099 రైతుల నుంచి 3,10,69,061 టన్నుల ధాన్యాన్ని రూ.58,766 కోట్లు చెల్లించి కొనుగోలు చేసింది. రైతులకు చెల్లించాల్సిన నగదును నేరుగా వారి బ్యాంక్ ఖాతాలోనే జమ చేస్తోంది. ధాన్యం కొనుగోలు గతంలో సేకరణ కేంద్రాలకే పరిమితమయ్యేది. అవికూడా అరకొరగానే ఉండేవి. వీటి వరకు ధాన్యం తేవాల్సిన ఖర్చంతా రైతుదే. దీన్ని పూర్తిగా మారుస్తూ నేరుగా రైతు క్షేత్రం వద్దే ఆర్బీకేల పర్యవేక్షణలో రైతు భాగస్వామ్యంతో ధాన్యం కొనుగోలు చేస్తోంది. రైతులకు గోనె సంచులను సమకూర్చే పనిని గతంలో మిల్లర్లకు వదిలేసేవారు. సరిపడా సంచులు దొరక్క రైతులు ఇబ్బంది పడేవారు. ఈ ప్రభుత్వం వచ్చాక వాటికి చెక్ పెట్టింది. ఏపీఎస్‌సీఎస్‌సీఎల్, పీఏసీఎస్‌లు కొరత లేకుండా గోనె సంచులను రైతులకు సమకూరుస్తున్నాయి. గతంలో ఏ- గ్రేడ్, సాధారణ రకం అనే రెండు రకాలుగానే కొనే వారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. కానీ వైఎస్ జగన్ ప్రభుత్వం ధాన్యం రకాల ప్రకారం గ్రేడెడ్ ఎంఎస్‌పీ ఇచ్చి కొంటోంది. ఇది రైతులకు చాలా ప్రయోజనకరంగా ఉంది. గతంలో రైతులు మిల్లుల వద్దకు వెళ్లి అక్కడే ధాన్యం కొలవాల్సి వచ్చేది. వైఎస్ జగన్ ప్రభుత్వం రైతులకు ఈ ఇబ్బందిని పూర్తిగా తొలగించింది. రైతుల వద్దే తూకం సహా అన్ని రకాల కొలమానాలు పూర్తి చేసి అక్కడే రశీదు ఇస్తున్నారు. రశీదు వెనుక టోల్‌ఫ్రీ నంబర్ కూడా ఇస్తున్నారు. గతంలో రైతులకు జీఎల్‌టీ (గన్నీ బ్యాగులు, లేబర్, రవాణా) ఖర్చులు అందేవి కావు. ఈ ప్రభుత్వం తొలిసారిగా ఈ ఖర్చులను రైతులకు అందిస్తోంది. తద్వారా క్వింటాలుకు కనీస మద్దతు ధరకు అదనంగా రూ.252 వరకూ రైతులకు లభిస్తోంది.

దేశంలోనే వినూత్నం"ఈ-క్రాప్" బుకింగ్

దేశంలోనే తొలిసారి ఎలక్ట్రానిక్ క్రాపింగ్ (ఈ - క్రాప్) ద్వారా రైతుల కమతాలలో విత్తిన పంటలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేయడాన్ని 2019 రబీలో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ -క్రాప్‌లో వీఏఏ, వీహెచ్ఏ, వీఆర్ఏతో పాటు సాగు చేసే రైతుల వేలి ముద్రలు (ఈ కేవైసీ) నమోదు చేస్తున్నారు. ఇది పూర్తి కాగానే మొబైల్ ఫోన్లకు డిజిటల్ అక్నాలెడ్జ్‌మెంట్ పంపిస్తున్నారు. పంటల వివరాల జాబితాలను సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. ఈ క్రాప్ ప్రామాణికంగా రైతు సంక్షేమ పథకాలైన వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, కనీస మద్దతు ధరకు పంటల ఉత్పత్తుల కొనుగోలు వంటివి అమలు చేస్తున్నారు. నాణ్యత కలిగిన ఉత్పాదకాలను రైతులకు అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా 13 జిల్లా, 147 నియోజకవర్గ స్థాయి అగ్రి ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో రూ.115.57 కోట్లతో 127 నియోజకవర్గ ల్యాబ్‌లను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఏటా సగటున 20 వేల నమూనాలు పరీక్షించగా.. ప్రస్తుతం ఏటా 50 వేల చొప్పున రెండేళ్లలో లక్ష నమూనాలను పరీక్షించారు. వీటిలో 11 వేల నమూనాలు రైతులు తీసుకొచ్చినవే.

దేశానికే ఆదర్శంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా

వైఎస్ జగన్ ప్రభుత్వం రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం అమలు చేస్తోంది. నోటిఫై చేసిన పంటలకు యూనివర్సల్ కవరేజి ద్వారా బీమా రక్షణ కల్పిస్తోంది. రాష్ట్రాన్ని స్ఫూర్తిగా తీసుకొని మేఘాలయ, ఒడిశా, పుదుచ్చేరి, మహారాష్ట్ర రాష్ట్రాలు కూడా రూపాయి ప్రీమియంకే పంటల బీమా అమలు చేస్తున్నాయి. బాబు హయాంలో 30.85 లక్షల మందికి రూ.3,411.20 కోట్ల పంటల బీమా పరిహారం అందిస్తే.. ఈ నాలుగేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం 54.48 లక్షల మంది రైతులకు రూ.7,802 కోట్లు బీమా పరిహారం చెల్లించింది. చంద్రబాబు ప్రభుత్వం రైతులకు ఎగ్గొట్టిన రూ. 715.84 కోట్ల బకాయిలు కూడా ఈ ప్రభుత్వమే చెల్లించింది.

వైపరీత్యాల వేళ పంట నష్టపోయిన రైతులకు అదే పంట కాలం ముగిసేలోగా పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిటీ) అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. 22.85 లక్షల రైతులకు రూ.1,976.45 కోట్ల పంట నష్ట పరిహారం (పెట్టుబడి రాయితీ)ని అందించింది. అధిక, అకాల వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై సర్టిఫై చేసిన విత్తనాలను ఆర్బీకేల ద్వారా సరఫరా చేస్తోంది. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకం కింద రూ.లక్ష లోపు పంట రుణం తీసుకొని ఏడాదిలోపు తిరిగి చెల్లించిన రైతులకు పూర్తి స్థాయిలో వడ్డీ రాయితీని రైతుల ఖాతాలోనే జమ చేస్తోంది. చంద్రబాబు హయాంలో 40.60 లక్షల మంది రైతులకు రూ.685 కోట్ల వడ్డీ రాయితీనిస్తే, ఈ నాలుగేళ్లలో ఈ ప్రభుత్వం 73.88 లక్షల రైతులకు రూ.1,834.55 కోట్లు (గత ప్రభుత్వ బకాయిలతో కలిపి) వడ్డీ రాయితీని అందించింది.

బాబు హయాంలో సగటున 153.95 లక్షల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడులొస్తే.. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో 165.87 లక్షల టన్నుల దిగుబడులు వచ్చాయి. ఇలా అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుంటే.. రామోజీ మాత్రం పక్క రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతో పోలుస్తూ పొంతన లేని కథనాలు వండి వారుస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.